





## SREEMATH ANDHRA VALMIKI

# RAMAYANAMU



ANDHRA VALMIKI
**VASUDASA SWAMY**

## UTTARA KANDAMU

A LITERAL METRICAL TRANSLATION OF
VALMIKI'S SANSKRIT RAMAYANAM

*by*
VAVILICOLANU SUBBA ROW,
**alias VASUDASA SWAMY**
*late Telugu Pandit, Presidency College, Madras.*

AND THE AUTHOR OF

Sree Kumarabhyudayam, Sree Kausalya Parinayam
Bhagavad Gita (Dwipada), Sree Krishna Leelamritamu,
Krishnavatara Thathwamu, Subhadra Vijaya Natakamu,
&c., &c., &c.,

WITH AUTHOR'S OWN COMMENTARY

**CALLED**

## MANDARAM

PUBLISHED BY
Sree Kodanda Rama Sevaka Dharma Samajam,
ANGALAKUDURU - TENALI.

(ALL RIGHTS RESERVED)

1985 సంవత్సరము

ఏడవ కూర్పు 1000 కాపీలు

"This book is Printed with the financial assistance under the aid to 'authors' Scheme of the T. T. D. Tirupati"

విజయ ఆర్టు ప్రెస్ గాంధిచౌక్, తెనాలి.

శ్రీరస్తు

# శ్రీమదాంధ్రవాల్మీకిరామాయణ

## విషయసూచిక

### ఉత్తరకాండము


| సర్గసంఖ్య. | | పుటసంఖ్య. |
|---|---|---|
| ౧ | అగస్త్యాది మహర్షులు శ్రీరామదర్శనార్థులై వచ్చుట | ౪ |
| ,, | మునులు శ్రీరాముఁ బ్రశంసించుట | ౮ |
| ,, | శ్రీరాముఁడు మునుల నింద్రజిత్తు నాధిక్యమునకుఁ గారణ మడుగుట | ౧౨ |
| ౨ | అగస్త్యుండు శ్రీరామునకు రావణజన్మాది వృత్తాంతముఁ దెలుపుట | ౧౩ |
| ,, | తృణబిందుఁడు తనకూఁతుఁ బులస్త్యునకు నర్పించుట | ౧౮ |
| ౩ | విశ్రవసునకుఁ గుబేరుండు జన్మించుట | ౨౨ |
| ,, | బ్రహ్మ కుబేరు నుత్తరదిక్కున కధిపతిఁ జేయుట | ౨౪ |
| ౪ | శ్రీరాముఁ డగస్త్యునిఁ బూర్వరాక్షసుల వృత్తాంత మడుగుట | ౨౬ |
| ,, | యక్షరాక్షసుల యుత్పత్తి | ౨౭ |
| ౪౫ | సుకేశుని జన్మవృత్తాంతము | ౩౦ |
| ౫ | సుకేశునకు మాల్యవదాదులు జన్మించుట | ౩౩ |
| ,, | మాల్యవదాదులు లంకయందు జేరుట | ౩౫ |
| ,, | మాల్యవదాదులకు వెరచి సురలు శివుశరణముఁ జొచ్చుట | ౩౮ |
| ,, | దేవతలకు విష్ణు నభయం బిచ్చుట | ౪౧ |
| ౬ | మాల్యవంతుఁడు సురలపై దండెత్త నాలోచించుట | ౪౪ |
| ,, | మాల్యవంతుఁడు దేవతలమీఁదికి యుద్ధంబునకుఁ బోవుట | ౪౯ |
| ౬౭ | విష్ణువు దేవతలకుఁ దోడ్పడి రాక్షసులఁ బాఱఁదోలుట | ౫౧ |
| ౭ | విష్ణువు సుమాలితోఁ బోరుట | ౫౯ |
| ,, | విష్ణువు సుమాలిని వధించుట | ౬౧ |
| ,, | రాక్షససేన పలాయిత మగుట | ౬౩ |
| ౮ | మాల్యవంతుఁడు విష్ణుని నిష్ఠురము లాడుట | ౬౫ |
| ,, | రాక్షసులు పరాజితులై లంకఁ జొచ్చుట | ౬౮ |
| ,, | సుమాలి కూఁతుం దోడ్కొని భూలోకంబునకు వచ్చుట | ౭౨ |
| ,, | కైకసి విశ్రవసు నాశ్రమంబునకు వచ్చుట | ౭౪ |
| ,, | రావణ కుంభకర్ణ విభీషణ జననము | ౭౭ |
| ౧౦ | అగస్త్యుఁడు శ్రీరామునకు రావణాదుల తపోవిధముఁ జెప్పుట | ౮౦ |
| ,, | బ్రహ్మ రావణునకు వరములిచ్చుట | ౮౨ |

| సర్గసంఖ్య. | | పుటసంఖ్య. |
|---|---|---|
| ౧౦ | బ్రహ్మ విభీషణునకు వరంబులిచ్చుట | ౮౪ |
| ,, | బ్రహ్మ కుంభకర్ణునకు నిద్ర నిచ్చుట | ౮౫ |
| ౧౧ | సుమాలి రావణాదులఁ జూడ భూలోకంబునకు వచ్చుట | ౮౮ |
| ,, | ప్రహస్తుఁడు లంక గ్రహింప రావణునకు బోధించుట | ౮౯ |
| ,, | రావణుఁడు ప్రహస్తునిఁ గుబేరునొద్దకు బంపుట | ౯౧ |
| ,, | కుబేరుఁడు లంక విడిచిపోవ సమ్మతించుట | ,, |
| ,, | రావణుఁడు లంకాప్రవేశము సేయుట | ౯౪ |
| ౧౨ | రావణునకు మయుఁడు మండోదరీ వృత్తాంతముఁ జెప్పుట | ౯౫ |
| ,, | మయుఁడు రావణునకు మండోదరినిచ్చి వివాహముఁ జేయుట | ౯౮ |
| ,, | రావణుఁడు తన సోదరులకు వివాహములు చేయుట | ౯౯ |
| ౧౩ | రావణుఁడు లోకంబుల బాధించుట | ౧౦౦ |
| ,, | కుబేరుఁడు రావణునకు నీతిఁ దెలుప దూత నంపుట | ౧౦౨ |
| ,, | రావణుఁడు కుబేరు దూతను వధించుట | ౧౦౫ |
| ,, | రావణుఁడు కుబేరు జయింపఁ బోవుట | ౧౦౬ |
| ,, | యక్ష రాక్షస యుద్ధము | ౧౦౭ |
| ౧౫ | కుబేరుఁడు రావణు నిష్ఠురంబు లాడుట | ౧౧౩ |
| ,, | రావణ కుబేర యుద్ధము | ౧౧౬ |
| ,, | రావణుఁడు కుబేరు జయించుట పుష్పకంబుఁ గొనుట | ౧౧౮ |
| ౧౬ | కైలాస ప్రాంతంబునఁ బుష్పకంబు చనకుండుట | ౧౨౦ |
| ,, | నందీశ్వరుఁడు రావణు శపించుట | ౧౨౨ |
| ,, | రావణుఁడు కైలాసముఁ బెల్లగించుట | ౧౨౩ |
| ,, | శివుఁడు రావణునకు వరంబులిచ్చుట | ౧౨౫ |
| ౧౭ | రావణుఁడు వేదవతితో సంభాషించుట | ౧౨౮ |
| ,, | వేదవతి రావణునకుఁ దన వృత్తాంతముఁ దెలుపుట | ౧౨౯ |
| ,, | రావణుఁడు వేదవతిని దురుక్తులాడుట | ౧౩౧ |
| ,, | వేదవతి రావణు శపించి యగ్నిలోఁ జొచ్చుట | ౧౩౩ |
| ౧౮ | రావణుఁడు మరుత్తు యజ్ఞశాలకుఁ బోవుట | ౧౩౬ |
| ,, | సంవర్తుఁడు మరుత్తుని శాంతుఁ జేయుట | ౧౩౯ |
| ,, | ఇంద్రాదులు మయూరాదులకు వరములిచ్చుట | ౧౪౦ |
| ౧౯ | అనరణ్యుఁడు రావణుతో యుద్ధం బొనర్చుట | ౧౪౨ |
| ,, | అనరణ్యుఁడు రావణు శపించుట | ౧౪౫ |
| ౨౦ | నారదుఁడు రావణునకు మనుష్యవధ మాన బోధించుట | ౧౪౭ |
| ,, | నారదునితో రావణుఁడు తాను యముని జయింపఁ బోయెదననుట | ౧౪౯ |
| ,, | నారదుఁడు రావణుఁడెట్లు యముని జయించునని యోచించుట | ౧౫౧ |
| ౨౧ | రావణు నుద్దేశము నారదుఁడు యమునితోఁ జెప్పుట | ౧౫౨ |

| సర్గసంఖ్య. | | పుటసంఖ్య |
|---|---|---|
| ౨౧ | రావణుఁడు యమలోకంబున బాధింపఁబడు జీవులఁ జూచుట | ౧౫౩ |
| ,, | యమభటులు రావణుతోఁ బోరుట | ౧౫౬ |
| ,, | రావణుఁడు పాశుపతాస్త్రంబున యమకింకరుల దహించుట | ౧౬౦ |
| ౨౨ | యముఁడు రావణుతో యుద్ధమునకై వెడలుట | ,, |
| ,, | యమ రావణ యుద్ధము | ౧౬౨ |
| ,, | యముఁడు రావణుపై యమదండము వైవఁబూనుట | ౧౬౬ |
| ,, | దండము వైవవలదని బ్రహ్మ యముని నివారించుట | ౧౬౮ |
| ౨౩ | రావణుఁడు నివాతకవచులతో సంధి చేసికొనుట | ౧౭౦ |
| ,, | రావణుఁడు కాలకేయుల జయించుట | ౧౭౨ |
| ,, | రావణుఁడు వరుణ నగరముపైఁ బోవుట | ౧౭౩ |
| ,, | వరుణ తనయులు రావణునితో బోరి యోడిపోవుట | ౧౭౫ |
| ౨౪ | రావణుఁడు నానా స్త్రీలఁ జెఱపట్టుట | ౧౭౯ |
| ,, | చెఱఁబడిన స్త్రీలు విలపించుట | ౧౮౨ |
| ,, | చెఱఁబడిన స్త్రీలు రావణు శపించుట | ౧౮౯ |
| ,, | శూర్పణఖ రావణు నిష్ఠురంబు లాడుట | ౧౯౦ |
| ,, | రావణుఁడు శూర్పణఖ నూరార్చుట | ౧౯౨ |
| ౨౫ | రావణుఁ డింద్రజిత్తుం జూడ నికుంభిలకు బోవుట | ౧౯౩ |
| ,, | విభీషణుఁడు రావణుతో మధుఁడు కుంభీనసి నపహరించిన వార్తఁ దెల్పుట | ౧౯౬ |
| ,, | రావణుఁడు మధునిమీఁదికి దండయాత్రపోవుట | ౧౯౯ |
| ,, | కుంభీనసి మధుని గాపాడ రావణు వేఁడుకొనుట | ౨౦౦ |
| ౨౬ | రావణుఁడు మధునితోఁ గైలాసప్రాంతంబున విడియుట | ౨౦౨ |
| ,, | రావణుఁడు వెన్నెలకాఁకకు వేఁగుట | ౨౦౪ |
| ,, | రంభ కైసేసికొని రావణసేనా మధ్యంబునఁ జనుట | ౨౦౬ |
| ,, | రంభారావణ సంవాదము | ౨౦౮ |
| ,, | రావణుఁడు రంభను జెఱచి విడుచుట | ౨౧౪ |
| ,, | రంభ రావణు నకృత్యంబు నలకూబరుతోఁ దెల్పుట | ౨౧౫ |
| ,, | నలకూబరుఁడు రావణు శపించుట | ౨౧౭ |
| ౨౭ | రావణుఁ డింద్రపురిపై దాడిపెట్టుటవిని సురలుయుద్ధప్రయత్నులగుట | ౨౧౯ |
| ,, | ఇంద్రుఁడు విష్ణువుఁ జూడఁ బోవుట | ,, |
| ,, | విష్ణు వింద్రుతోఁ దాను యుద్ధమునకు రానని చెప్పుట | ౨౨౦ |
| ,, | దేవరాక్షస యుద్ధము | ౨౨౨ |
| ,, | జయంత మేఘనాదుల యుద్ధము | ౨౨౬ |
| ,, | ఇంద్రుఁడు యుద్ధమునకు వెడలుట | ౨౨౮ |
| ,, | కుంభకర్ణుఁడు దేవతలతోఁ బోరుట | ౨౩౦ |
| ,, | సుర సహాయుండై యింద్రుఁడు రాక్షసుల వధించుట | ౨౩౧ |

| సర్గసంఖ్య. | | పుటసంఖ్య. |
|---|---|---|
| ౨౯ | రావణుఁడు సురసేనా మధ్యంబునఁ జొచ్చి యుద్ధము సేయుట | ౨౩౩ |
| ,, | ఇంద్రుఁడు రావణుని బంధింపఁ బ్రయత్నించుట | ౨౩౪ |
| ,, | మేఘనాదుఁడు మాయచే నింద్రుని బంధించుట | ౨౩౬ |
| ,, | రావణుఁడు యుద్ధముఁ జాలించి మేఘనాదుని బ్రశంసించుట | ౨౩౮ |
| ౩౦ | బ్రహ్మ లంకకుఁబోయి రావణ మేఘనాదులఁ బ్రశంసించుట | ౨౪౦ |
| ,, | బ్రహ్మ మేఘనాదుఁడు కోరినవరమిచ్చి ఇంద్రుని విడిపించుకొనిపోవుట | ౨౪౨ |
| ౩౧ | బ్రహ్మ ఇంద్రునిలో నతఁడు బద్ధుఁడగుటకుఁ గారణముఁ జెప్పుట | ౨౪౩ |
| ,, | రావణుఁడు కార్తవీర్యార్జును గెలువఁ బోవుట | ౨౪౯ |
| ,, | కార్తవీర్యార్జునుఁడు నర్మదయందు స్త్రీలతోఁ గ్రీడించుట | ౨౫౧ |
| ,, | రావణుఁడు నర్మదాతీరమున విడియుట | ౨౫౨ |
| ,, | రావణుఁడు శివలింగ పూజ సేయుట | ౨౫౬ |
| ౩౨ | అర్జునుడు తన భుజములచే నర్మద నడ్డగించుట | ౨౫౭ |
| ,, | నర్మద యెదురొడ్డిపారి రావణ పూజాద్రవ్యంబుల ముంచుట | ౨౫౮ |
| ,, | శుకసారణులు నర్మద యెదురెక్కిపారుకారణము రావణుతోఁ జెప్పుట | ౨౫౯ |
| ,, | రావణుఁడు కార్తవీర్యార్జునునితోఁ బోరఁ జనుట | ౨౬౦ |
| ,, | అర్జున-రావణమంత్రుల యుద్ధము | ౨౬౨ |
| ,, | కార్తవీర్యార్జునుఁడు బ్రహ్మస్తునిఁ బడ నడఁచుట | ౨౬౩ |
| ,, | రావణ కార్తవీర్యార్జునుల గదాయుద్ధము | ౨౬౪ |
| ,, | కార్తవీర్యార్జునుఁడు రావణు బంధించి పురికిఁ గొనిపోవుట | ౨౬౫ |
| ౩౩ | పులస్త్యుఁడు రావణుని విడిపించుకొని పోవుట | ౨౬౭ |
| ౩౪ | రావణుఁడు వాలితో యుద్ధంబు సేయఁ గిష్కింధకుఁ బోవుట | ౨౭౧ |
| ,, | వాలి రావణుఁ జంక నిరికి సముద్రంబుల ముంచుట | ౨౭౫ |
| ,, | రావణుఁడు వాలితో స్నేహ మొనర్చుట | ౨౭౭ |
| ౩౫ | శ్రీరాముఁ డగస్త్యుని హనుమంతుఁ గూర్చి ప్రశ్నించుట | ౨౮౦ |
| ,, | ఆంజనేయోపాఖ్యానము | ౨౮౩ |
| ,, | వాయు నిరోధంబున లోకంబులు బాధపడుట | ౨౮౭ |
| ౩౬ | బ్రహ్మాదులు హనుమంతునకు వరంబు లిచ్చుట | ౨౯౦ |
| ,, | మునులు హనుమంతు శపించుట | ౨౯౪ |
| ౩౬,౩౭ | అగస్త్యాదులు శ్రీరాముచే ననుజ్ఞగొని పోవుట | ౨౯౮ |
| ౩౮ | శ్రీరాముఁడు జనకాది రాజుల వారివారి పురంబుల కనుచుట | ౩౦౪ |
| ,, | రావణయుద్ధమునఁ దనకుఁ దోడ్పడనూఁగిన రాజుల శ్రీరాముఁడు | ౩౦౬ |
| ,, | రాజులు శ్రీరాముఁ గొండాడి సెలవుగొని పోవుట[సత్కరించుట] | ౩౦౯ |
| ౩౯ | సకల రాజులు వారివారి రాజ్యంబులకుఁ బోవుట | ౩౧౦ |
| ,, | శ్రీరాముఁడు సుగ్రీవాంగద హనుమదాదుల బహూకరించుట | ౩౧౨ |

| వర్గసంఖ్య. | | పుటసంఖ్య |
|---|---|---|
| ౪౦ | శ్రీరాముఁడు సుగ్రీవాదులఁ గిష్కింధ కనుచుట | ౩౧౪ |
| ,, | శ్రీరాముఁడు విభీషణు లంక కనుచుట | ౩౧౫ |
| ,, | శ్రీరాముఁడు హనుమంతునకు వరములిచ్చుట | ౩౧౬ |
| ౪౧ | కుబేరునొద్దనుండి పుష్పకము శ్రీరాముఁ గొల్వవచ్చుట | ౩౨౦ |
| ,, | భరతుఁడు శ్రీరామునకుఁ బ్రజల సుఖస్థితిఁ దెలుపుట | ౩౨౧ |
| ౪౨ | శ్రీరాముఁ డశోకవనమున సీతాదేవితోఁ గ్రీడించుట | ౩౨౩ |
| ,, | సీతాదేవి ఋష్యాశ్రమములకుఁ బోవఁగోరుట | ౩౨౭ |
| ౪౩ | శ్రీరాముఁడు భద్రుని లోకవార్త లడుగుట | ౩౨౯ |
| ,, | భద్రుఁడు శ్రీరామునకు సీతావిషయక లోకాపవాదముం దెలుపుట | ౩౩౦ |
| ౪౪ | శ్రీరాముఁడు సోదరులఁ బిలిపించుట | ౩౩౨ |
| ౪౫ | శ్రీరాముఁడు భరతాదులకు లోకాపవాదవిధంబుఁ దెలుపుట | ౩౩౫ |
| ,, | శ్రీరాముఁడు సీతాదేవిని వాల్మీకి యాశ్రమంబుపొంత విడువ లక్ష్మణు నాజ్ఞాపించుట | ౩౩౮ |
| ౪౬ | లక్ష్మణుఁడు సీతాదేవిని ఋష్యాశ్రమంబులకని పిలుచుకొనిపోవుట | ౩౪౦ |
| ,, | సీతాదేవి యపశకునంబులఁ గని పరితపించుట | ౩౪౧ |
| ,, | సీతాదేవి లక్ష్మణుఁడు దుఃఖంప నూరార్చుట | ౩౪౩ |
| ౪౭ | లక్ష్మణుఁడు శ్రీరామాజ్ఞ చెప్పలేక యేడ్చుట | ౩౪౫ |
| ,, | లక్ష్మణుఁడు సీతాదేవికి శ్రీరామాజ్ఞ నెఱింగించుట | ౩౪౭ |
| ౪౮ | శ్రీరామాజ్ఞ విని సీతాదేవి విలపించుట | ౩౪౯ |
| ,, | సీత శ్రీరామాదులకుఁ గడవాక్యంబులు చెప్పి పంపుట | ౩౫౧ |
| ,, | లక్ష్మణుఁడు సీతాదేవిచే ననుజ్ఞఁగొని మరలి గంగ దాఁటుట | ౩౫౩ |
| ౪౯ | మునికుమారులు వాల్మీకికి సీతావృత్తాంతము దెలుపుట | ౩౫౫ |
| ,, | వాల్మీకి సీతాదేవి నూరార్చి యాశ్రమంబునకుఁ దోడ్కొని చనుట | ౩౫౬ |
| ,, | వాల్మీకి సీతాదేవిని మునిసతుల కప్పగించుట | ౩౫౮ |
| ౫౦ | లక్ష్మణుఁడు శ్రీరాముని గుఱించి సుమంత్రునితోఁ జెప్పి యేడ్చుట | ౩౫౯ |
| ,, | సుమంత్రుఁడు లక్ష్మణునకు మనస్తాపోపశమనంబు సేయుట | ౩౬౧ |
| ౫౧ | దశరథదుర్వాసులసంభాషణము సుమంత్రుఁడు లక్ష్మణునకుఁ దెలుపుట | ౩౬౨ |
| ,, | భృగుమహర్షి విష్ణువును శపించుట | ౩౬౩ |
| ,, | శ్రీరామవృత్తాంతము దుర్వాసుఁడు దశరథున కెఱింగించుట | ౩౬౫ |
| ౫౨ | లక్ష్మణుఁడు శ్రీరాము దర్శింపఁ బోవుట | ౩౬౭ |
| ,, | లక్ష్మణుఁడు సీతావృత్తాంతముఁ దెలిపి శ్రీరాము నూఱడించుట | ౩౬౮ |
| ౫౩ | శ్రీరాముఁడు లక్ష్మణునకు నృగచరిత్ర దెలుపుట | ౩౭౦ |
| ౫౪ | నృగోపాఖ్యాన శేషము | ౩౭౪ |
| ౫౫ | శ్రీరాముఁడు లక్ష్మణునకు నిమికథఁ దెలుపుట | ౩౭౬ |
| ౫౬ | వసిష్ఠుఁడు దేహము ధరించుట | ౩౭౮ |

| సర్గసంఖ్య. | | పుటసంఖ్య. |
|---|---|---|
| ౫౭ | వసిష్ఠుఁడు మైత్రావరుణుఁడయి జన్మించుట | ౩౮౧ |
| ,, | దేవతలు ఋషులు నిమికోరిన వర మిచ్చుట | ౩౮౩ |
| ౫౮ | శ్రీరాముఁడు లక్ష్మణునకు యయాతి చరిత్రముఁ దెలుపుట | ౩౮౪ |
| ౫౯ | యయాతి పూరునకు వార్ధకమిచ్చి యౌవనముఁ గొనుట | ౩౮౭ |
| ౬౦ | చ్యవనాదులు శ్రీరాము దర్శింప వచ్చుట | ౩౯౧ |
| ౬౧ | చ్యవనుఁడు లవణ వృత్తాంతము శ్రీరామునకు దెలుపుట | ౩౯౩ |
| ౬౨ | శ్రీరాముఁడు మౌనులను లవణునాచారాదుల నడుగుట | ౩౯౮ |
| ,, | శత్రుఘ్నుఁడు తాను లవణుఁ జంపఁ బోయెదననుట | ౩౯౯ |
| ,, | శ్రీరాముఁడు లవణుఁ జంపి మధురాపురినేల శత్రుఘ్ను నాజ్ఞాపించుట | ౪౦౦ |
| ౬౩ | పట్టాభిషేకం బొల్లక శత్రుఘ్నుఁడు పరితపించుట | ౪౦౧ |
| ,, | శ్రీరాముడు శత్రుఘ్నుని మధుర కభిషిక్తుని జేయుట | ౪౦౨ |
| ౬౩,౬౪ | శ్రీరాముఁడు శత్రుఘ్నునకు నారాయణాస్త్రం బొసంగి లవణుఁ జంపు నుపాయంబు దెల్పుట | ౪౦౩ |
| ౬౪ | శత్రుఘ్నుఁడు సేనల ముందుగనంపి తానొంటిగ లవణునిపై బోవుట | ౪౦౭ |
| ౫౫ | శత్రుఘ్నుఁడు వాల్మీకి యాశ్రమంబునఁ జేరుట | ౪౦౮ |
| ,, | వాల్మీకి శత్రుఘ్నునకు సౌదాసు చరిత్రముఁ దెలుపుట | ౪౦౯ |
| ,, | వసిష్ఠుఁడు సౌదాసుని శపించుట | ౪౧౧ |
| ౬౬ | సీతాదేవి కుమారులఁ గనుట | ౪౧౩ |
| ౬౭ | శత్రుఘ్నునకుఁ జ్యవనుండు లవణుచే మాంధాత మడిసిన విధంబుఁ దెల్పుట | ౪౧౫ |
| ,, | మాంధాత లవణుచే హతుఁడగుట | ౪౧౬ |
| ౬౮ | శత్రుఘ్నుఁడు లవణుఁ బురంబులోనికిఁ బోకుండ నిరోధించుట | ౪౧౮ |
| ౬౯ | లవణశత్రుఘ్నుల యుద్ధము | ౪౨౦ |
| ,, | శత్రుఘ్నుఁడు లవణు వధించుట | ౪౨౨ |
| ౭౦ | దేవతలు శత్రుఘ్నునకు వరమిచ్చుట | ౪౨౫ |
| ,, | శత్రుఘ్నుఁడు మధురాపురంబు నభివృద్ధి పఱుచుట | ౪౨౬ |
| ,, | శత్రుఘ్నుఁడు వాల్మీకి యాశ్రమంబున విడియుట | ౪౨౭ |
| ,, | శత్రుఘ్నుఁడు శ్రీరామాయణమును వినుట | ౪౨౯ |
| ౭౨ | శత్రుఘ్నుఁడు శ్రీరాము దర్శింప నయోధ్య కేగుట | ౪౩౦ |
| ,, | శ్రీరామ శత్రుఘ్నుల సంభాషణము [వాకిటవైచి యేడ్చుట] | ౪౩౨ |
| ౭౩ | బ్రాహ్మణుఁడు మృతబాలుని కళేబరమును శ్రీరాముని యింటి | ౪౩౩ |
| ౭౪ | నారదుఁడు శ్రీరామునకు బాలకుండు మృతుండైన కారణముఁ దెలుపుట | ౪౩౭ |
| ౭౫ | శ్రీరాముఁడు పుష్పకంబుపై నెక్కి శూద్రమునిని వెదకఁ నేగుట | ౪౪౩ |
| ౭౬ | శ్రీరాముఁడు శంబుకుని వధించుట | ౪౪౪ |
| ,, | శ్రీరాముఁ డగస్త్యుఁ జూడఁబోవుట | ౪౪౭ |
| ,, | అగస్త్యుడు శ్రీరామునకు దివ్యాభరణ మొసఁగఁబోవుట | ౪౪౮ |

| సర్గసంఖ్య | | పుటసంఖ్య |
|---|---|---|
| ౭౬ | దివ్యాభరణముఁ గొనవచ్చునని యగస్త్యుఁడు శ్రీరామునసమాధాన | ౪౪౯ |
| ౭౭ | శ్వేతోపాఖ్యానము [పలుకుట] | ౪౫౧ |
| ౭౮ | శ్వేతుఁడు తనవృత్తాంత మగస్త్యుతోఁ దెల్పుట | ౪౫౩ |
| ౭౯ | దండకారణ్య చరిత్ర మగస్త్యుఁడు శ్రీరామునకు దెలుపుట | ౪౫౭ |
| ౮౦ | దండుఁడు శుక్రు కూఁతు నరజను జెఱుచుట | ౪౫౯ |
| ౮౧ | శుక్రుఁడు దండుని దేశముపై మట్టివాన గురియ శపించుట | ౪౬౦ |
| ౮౨ | శ్రీరాముఁ డగస్త్యుచే నాజ్ఞగొని యయోధ్యకు మరలిచనుట | ౪౬౪ |
| ౮౩ | శ్రీరాముఁడు రాజసూయంబుఁ జేయఁదమ్ములతో యోజించుట | ౪౬౬ |
| ,, | భరతుఁడు రాజసూయ మర్హముగాదని నుడువుట | ౪౬౭ |
| ౮౪ | లక్ష్మణుఁడు వృత్రకథ శ్రీరామునితోఁ జెప్పుట | ౪౬౯ |
| ౮౫ | విష్ణువు వాసవుతో వృత్రుఁ జంప నుపాయంబుఁ దెలుపుట | ౪౭౧ |
| ,, | ఇంద్రునకు బ్రహ్మహత్య ప్రాప్తించుట | ౪౭౩ |
| ౮౬ | ఇంద్రుఁ డశ్వమేధ మొనర్చి బ్రహ్మహత్యఁ దొలగించుకొనుట | ౪౭౪ |
| ౮౭ | శ్రీరాముఁడు లక్ష్మణునకు నిలుని వృత్తాంతముఁ దెలుపుట | ౪౭౬ |
| ,, | ఇలుఁడు స్త్రీయై పార్వతీ పరమేశ్వరుల శరణు జొచ్చుట | ౪౭౮ |
| ,, | ఇలుఁ డొకనెలస్త్రీగను నొకనెలపురుషుఁడుగ నుండఁ బార్వతియను | ౪౭౯ |
| ౮౮ | ఇలుఁడు స్త్రీయై బుధుని యాశ్రమంబుఁ జేరుట [గ్రహించుట] | ౪౮౦ |
| ,, | బుధుఁ డిలాదేవిని జూచి మోహించుట | ౪౮౧ |
| ౮౯ | ఇలాదేవి బుధునితోఁ గలియుట | ౪౮౩ |
| ,, | ఇలాదేవి పురూరవుం గనుట | ౪౮౬ |
| ౯౦ | బుధుఁడిలునకు శాశ్వత పురుషత్వముఁ గలిగింపనశ్వమేధంబు సేయుట | ౪౮౭ |
| ,, | ఇలుఁ డెప్పటియట్ల పురుషత్వముం గనుట | ౫౮౯ |
| ౯౧ | శ్రీరాముఁడు పురోహితాదులఁబిలిపించి యశ్వమేధంబొనర్తునని | ౪౯౦ |
| ౯౨ | శ్రీరాము డశ్వమేధ యాగముసేయ నుపక్రమించుట [చెప్పుట] | ౪౯౨ |
| ౯౩ | వాల్మీకిమహర్షి కుశలవుల రామాయణముగానము సేయనియమించుట | ౪౯౫ |
| ౯౪ | కుశలవులు రామాయణము గానముసేయ శ్రీరాముఁడు వినుట | ౪౯౯ |
| ,, | కుశలవులయెడ శ్రీరాముని పోలికట్లు చూచి జనులువిస్మితులగుట | ౫౦౨ |
| ౯౫ | శ్రీరాముఁ డిచ్చిన కానుకలఁ గుశలవులు నిరాకరించుట | ౫౦౩ |
| ,, | రామాయణముఁగూర్చి శ్రీరాముఁడు కుశలవులఁ బ్రశ్నించుట | ౫౦౪ |
| ,, | కుశలవులు దన కొమరులని శ్రీరాముఁ డెఱింగి వాల్మీకి మహర్షి యొద్దకు [దూతలనంపుట] | ౫౦౬ |
| ,, | సీత శపథంబు సేయునని వాల్మీకిమహర్షి శ్రీరామునకుఁ జెప్పిపంపుట | ౫౦౭ |
| ౯౬ | సీతా శపథముఁ జూచుటకు లోకులు గుంపులు చేరుట | ౫౦౮ |
| ,, | సీతాదేవిని దోడ్కొని వాల్మీకిమహర్షి యజ్ఞశాలకు వచ్చుట | ౫౦౯ |
| ,, | సీతాదేవిపతివ్రతయనివాల్మీకిమహర్షి సత్యముచేసిచెప్పుట[శ్రీరాముఁడనుట | ౫౧౦ |
| ౯౭ | లోకాపవాదముఁ బాపుకొన సీతాదేవి శపథము సేయవలయునని | ౫౧౨ |

| సర్గసంఖ్య. | | పుటసంఖ్య |
|---|---|---|
| ౯౭ | సీతాదేవి శపథంబు సేయుట | ౫౧౪ |
| ,, | సీతాదేవి రసాతలంబునకు బోవుట | ౫౧౫ |
| ౯౮ | సీతావియోగంబునకు శ్రీరాముఁడు పరితపించుట | ౫౧౭ |
| ,, | శ్రీరాముఁడు భూదేవిపై గోపించుట | ౫౧౮ |
| ,, | బ్రహ్మ శ్రీరాముని శాంతుఁజేయుట | ౫౧౯ |
| ,, | రామాయణ శేషము వినుమని బ్రహ్మ శ్రీరాముని వేఁడుట | ౫౨౦ |
| ౯౯ | శ్రీరాముఁడుత్తర కాండ శేషమును వినుట | ౫౨౩ |
| ,, | శ్రీరాముఁడు కొడుకులతో నయోధ్యఁ బ్రవేశించుట | ,, |
| ,, | కౌసల్యా సుమిత్రా కైకేయులు మఱణించుట | ౫౨౫ |
| ౧౦౦ | యుధాజిత్తుండు గార్గ్యుని శ్రీరామునొద్దకుఁ బంపుట | ,, |
| ,, | గార్గ్యుఁడు యుధాజిత్తు సందేశమును శ్రీరామునితోఁ జెప్పుట | ౫౨౬ |
| ,, | శ్రీరాముఁడు సపుత్రు భరతుని గంధర్వుల జయింపఁ బంపుట | ౫౨౭ |
| ౧౦౧ | భరతుండు గంధర్వుల జయించుట | ౫౨౯ |
| ,, | భరతుండు తక్ష పుష్కలులకుఁ బట్టాభిషేకంబు సేయుట | ౫౩౦ |
| ౧౦౨ | శ్రీరాముఁడు లక్ష్మణకుమారులను గారుపథ చంద్రకాంతములకుఁ | ౫౩౧ |
| ౧౦౩ | శ్రీరాముని సందర్శింపఁ గాలుఁడు వచ్చుట [ప్రభువులఁ జేయుట] | ౫౩౪ |
| ౧౦౪ | బ్రహ్మసందేశమును గాలుండు శ్రీరామునకుఁ దెల్పుట | ౫౩౬ |
| ౧౦౫ | దుర్వాసుండు తనరాక శ్రీరామునికెఱిఁగింపుమని లక్ష్మణుతోఁ జెప్పుట | ౫౩౮ |
| ౧౦౬ | లక్ష్మణుఁడు శ్రీరామునితోఁ దన్ను వధించి సత్యము రక్షింపుమని చెప్పుట | ౫౪౧ |
| ,, | వసిష్ఠు వాక్యంబున శ్రీరాముఁడు లక్ష్మణుని విడనాడుట | ౫౪౩ |
| ,, | లక్ష్మణుఁడు మేనితో దివంబున కేగుట | ౫౪౪ |
| ౧౦౭ | శ్రీరాముండు మహాప్రస్థానంబేగ నిశ్చయించుట | ౫౪౫ |
| ,, | శ్రీరాముని వెంటఁబోవ వారు లనుజ్ఞ గోరుట | ౫౪౭ |
| ౧౦౮ | శత్రుఘ్నుఁడు కొడుకులకుఁ బట్టాభిషేక మొనర్చి యయోధ్యఁ జేరుట | ౫౪౮ |
| ,, | సుగ్రీవ విభీషణాదులు శ్రీరామునిఁ జూడవచ్చుట | ౫౫౦ |
| ,, | శ్రీరాముఁడు హనుమద్విభీషణాదులకు వరంబు లిచ్చుట | ౫౫౧ |
| ౧౦౯ | శ్రీరాముఁడు సకల ప్రాణులతో మహాప్రస్థానమేగుట | ౫౫౩ |
| ౧౧౦ | బ్రహ్మాదులు శ్రీరాము దర్శింప వచ్చుట | ౫౫౭ |
| ,, | శ్రీరాముఁడు సానుజుఁడై సశరీరుండై వైష్ణవ తేజంబుఁ జొచ్చుట | ౫౬౦ |
| ,, | బ్రహ్మ సమస్త జనంబుల నుత్తమలోకంబుల నుంచుట | ౫౬౧ |
| ౧౧౧ | శ్రీరామాయణ ఫలశ్రుతి | ౫౬౪ |
| ,, | ఆంధ్రకవికృత గ్రంథాంత నమస్కారము | ౫౭౧ |
| ,, | కవి యీగ్రంథము నొంటిమిట్ట శ్రీరాముల కర్పించుట | ౫౭౬ |
| ,, | ఉత్తరకాండాంత పద్యములు | ౫౭౯ |



శ్రీ

శ్రీ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః

శ్రీ హయగ్రీవప్రసన్న

శ్రీ శా ర దా యై న మః

శ్రీమతే రామానుజాయ నమః

# శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణము

## ఉ త్త ర కాం డ ము



శ ! నళికమల భవ ! నీ
తేశా ! దేవాధినాథ ! భృతధీరా ! గా
రీశేడ్యా ! యమిరాట్ప్రవర
నా ! శివకర ! యభవ ! మండనప్రియక నమః

### మం ద ర ము

సీ. ఆఱుకాండంబులు ♦ నాఱుసముద్రంబు, లాఱుప్రాకారంబు ♦ లాఱుదశలు
నాఱువికారంబు ♦ లత్యమోఘంబైన, భవదీయకరుణను ♦ బరమపురుష !
తరియింపఁగంటిని ♦ దారిని నలయక, త్వచ్చరిత్రాంబుధిఁ ♦ ద్రచ్చుచోట
నాదిని ప్రభవించె ♦ హాలహాలం బది యాఁతెఁ దావకకరుణ నీ ♦ శ్రీకళత్ర !

గీ. కామధేను చింతామణీ • కల్పవృక్ష, కౌస్తుభంబులు లక్ష్మియుఁ • గలిగె నింక
 నమృత మిద్దానఁ గలిగించి•యఖిలబుధుల, వందఁజేయు మమ ర్యత్వ•మాదిదేవ

శ్రీశ=లక్ష్మీదేవికి నియామకుఁడైన వాఁడా, నలకమలభవ = నమస్కరించు బ్రహ్మదేవునిఁ గలవాఁడా! సీతేశా=సీతావల్లభా, దేవాధినాథ=దేవతలకందఱకు నధిపతియైన వాఁడా,ధృతధీరా=మందర పర్వతమును ధరించినవాఁడా, గౌరీశేడ్యా=శివునిచేస్తోత్రము చేయఁబడినవాఁడా, యమిరాట్ శరణా=యోగీశ్వరులకు రక్షకుఁడైన వాఁడా. శివకర=మేలుచేయువాఁడా, అభవ=జన్మము లేనివాఁడా, మండన ప్రియక=అలంకార ప్రియుఁడా, 'అలంకార ప్రియోవిష్ణుః, అభిషేక ప్రియ శ్శివ' యని నమః=నమస్కారము.

ఈపద్యమునందుఁ బ్రథమాక్షరము, 'శ్రీ', తరువాత నైదవయక్షరము'మ' తరువాత నైదవ యక్షరము 'తే' తరువాత నైదవయక్షరము'నా'తరువాత నైదవ యక్షరము 'రా' తరువాత నైదవయక్షరము 'య' తరువాత నైదవ యక్షరము 'ణా', తరువాత నైదవ యక్షరము 'య', తరువాత నైదవ యక్షరము 'న' దానికైదవ యక్షరము 'మః',

ఈ యక్షరములు కలిపి చదివిన 'శ్రీమతే నారాయణాయ నమః' అని యేర్పడును.

శ్రీమద్రామాయణము ద్వయమంత్రార్థమును బోధించునది కావున నా మంత్రశ్లేషమున నుత్తరార్థము త్తరకాండమున మొదట సూచింపఁబడియె. పూర్వార్థము పూర్వరామాయణముతో ముగిసెను. ఈ ద్వయమంత్రార్థము కాండాంతమునఁ జెప్పఁబడును.

శ్రీరామపట్టాభిషేకమున కుత్తర చరిత్ర మిందుఁ జెప్పఁబడుటను, సాధుపరిత్రాణము దుష్టవినాశముజరిపిన పిమ్మట చేయఁబడిన ధర్మసంస్థాపన మిందుఁ జేర్కొనఁబడుటను, తక్కిన గుణములకంటెఁ బరత్వసూచకమగు మోక్ష ప్రదాన గుణ మిందు బోధింపఁబడుటను, ఈకారణములచేఁ దక్కిన కాండములకంటె నిది శ్రేష్ఠమైనది కావున నిది యుత్తరకాండ మనఁబడెను.

కొంద అనభిజ్ఞులు దీని నెవరో తరువాత నే కాలమందో వ్రాసి రామాయణమునఁ జేర్చిరనియు, నిది వాల్మీకికృతము గాదనియు నందురు.

౧. ఇది వాల్మీకికృతము గాదేని యిరువది నాలుగు గాయత్ర్యక్షరములకు నిరువదినాల్గువేల శ్లోకముల రచించె ననుట మిథ్య యగును.

౨. నారదోపదేశమందు 'నపుత్రమరణం కించి ద్ద్రక్ష్యంతి పురుషాః క్వచిత్' కావను పుత్రుల మరణము, 'బ్రహ్మలోకే మనుగుఁ బ్రథితగుణుఁడు "నాల్గువర్ణముల జనంబులఁ దమ తమ ధర్మమందు నిలుపు" అని చెప్పఁబడిన విషయమును గుఱించి వాల్మీకి యేమియుఁ జెప్పినవాఁడు గాకుండును.

3 'రామస్య చరితం సర్వం కురు త్వ మృషిసత్తమ వృత్తం కథయ వీరస్య యథాతే నారదాచ్ఛ్రుతమ్' ఋషీశ్వరా! నారదు వలన నీవు వినిన రామచరిత్ర మంతయుఁ గావ్యముగఁ జేయుము అనిన బ్రహ్మవాక్యము వ్యర్థమగుచున్నది.

౪. 'కృత్స్నం రామాయణం కావ్య మీదృశైః కరవా ణ్యహమ్' రామాయణము సర్వము నిట్టి వృత్తములతో రచించెదను అను సంకల్పము.

'స్వ రాష్ట్రరంజనంచైవ వైదేహ్యాశ్చ విసర్జనమ్
అనాగతంచ యత్కించి ద్రామస్య వసుధాతలే
త చ్చకారోత్తరే కావ్యే వాల్మీకి ర్భగవా నృషిః'

తన రాష్ట్రజనుల సంతోషింపఁ జేయుట, సీతను వదలుట, భూలోకమందు రాముని భవిష్యచ్చరిత్రము వాల్మీకి యుత్తరకావ్యముగ రచించెను.

'ప్రాప్త రాజ్యస్య రామస్య వాల్మీకి ర్భగవాన్ ఋషిః
చకార చరితం కృత్స్నం... కావ్యం రామాయణం
కృత్స్నం సీతాయాశ్చరితం మహత్......

రాముడు రాజ్యమేలుచుండఁగా వాల్మీకి రామాయణ మంతయు వ్రాసెను. సీతాదేవి మహాచరిత్రమును వ్రాసెను.

అను వాక్యములు మిథ్య లగుచున్నవి.

౫. రామాయణమును గానము చేసిన కుశలవు లెవరో లోకమునకుఁ దెలిసియే యుండదు.

౬. సీతాదేవివంటి మహాపతివ్రతా శిరోమణికి నిష్కారణనింద వచ్చుట సహింపక వాల్మీకి యామె నిందఁ బోఁగొట్టి రామాయణము వ్రాసెననుటపొసఁగి యున్నది. అటు గాదేని తన యాశ్రమమందుఁ దన రక్షణమం దున్నదాని విషయమై చెప్పక పూర్వరామాయణముమాత్రము చెప్పి విడిచె ననుట యసంభావితము.

౭. కృతజ్ఞులైన మునులు తమ్ము రాక్షసబాధనుండి రక్షించినవారిని ప్రశంసింప వచ్చుటయు, నా సందర్భమున రావణేంద్రజిత్తుల పరాక్రమము వర్ణించుటయు, వారి చరిత్రమును శ్రీరామచంద్రమూర్తి ప్రశంసించుటయు, వారు రావణాదుల పుట్టుపూర్వోత్తరములు చెప్పుటయు నసందర్భోచితములు గావు.

౮. లోకులు కాకు లన్నట్లు సీతాదేవిపై లోకులు నిందమోపుట స్వభావ విరుద్ధము గాదు. దానిపై నుత్తమనాయికానాయకు లెట్లు చరింపవలయునో యట్లు చరించుటయు నసంభావితము గాదు. ఆమె విషయమై వాల్మీకి పరితాపపడి గ్రంథము వ్రాసి రామచంద్రమూర్తి వినునట్లు చేయుటయు నాయన పరీక్ష గోరుటయు సీతాదేవి పరీక్షకుఁ బాలుపడుటయు విరుద్ధవిషయములు గావు. కారణ

కార్య సంవిధానమందు వాల్మీకి కల్పింపవలసిన దేదియు లేదు. తరువాత వారెట్లు ప్రవర్తించిరో చెప్పుటయు విరుద్ధము కాదు. రామచంద్రమూర్తి విష్ణ్వవతార మని పలుతావులఁ జెప్పిన వాల్మీకి యీయన పరత్వప్రకటన విషయము చెప్పుట సముచితమే.

౯. ఉత్తరకాండమందలి కథాసంవిధానము వాల్మీకికిఁ దప్ప మఱియొకనికి నట్లు కుదరఁజాలదని చెప్పుచు పూర్వరామాయణ శైలికి నుత్తరకాండ శైలికి భేద ముండుటచే గ్రంథకర్తలు భిన్నులని సంశయించుచున్నారు. శైలిపటుత్వము కథాసందర్భము ననుసరించి యుండును, పూర్వరామాయణమున నాయికానాయకులు ప్రధానపాత్రములు సీతారాములు, లక్ష్మణాంజనేయులు లోనైనవారు, ఉత్తరకాండమున రావణాది రాక్షసులు లోనైనవారిని గురించి ఇతరులు చెప్పినవారు, ఇట్టి సందర్భమునందు నాశైలి యిందు కన్పించిన నెట్లు రాఁగలదు? అట్లున్నను సీతారాముల చరిత్రము చెప్పుచోట నందు గనఁబఱుపఁబడిన గుణములే యిందును గనఁబఱుపఁబడినవి అందుఁ గొంచెమైనఁ దారతమ్యము గానరాదు. ఒక్క గ్రంథమునందే పూర్వభాగమున నుండు రసపోషణము, వాక్యచమత్కృతి యుత్తరభాగమున నుండదు. తిక్కన విరాటోద్యోగ పర్వము లెట్లున్నవో కడపటి పర్వము లెట్లున్నవో మనుచరిత్రమునందుఁ బూర్వభాగ మెట్లున్నదో కడపటి యాశ్వాసము లెట్లున్నవో చూచిన స్పష్టమగును.

౧౦. కొందఱు మతిమాలినవారు అధిక పాఠము లని, ప్రక్షిప్తసర్గము లని కొన్ని చిత్రకథలు చేర్చియున్నారు. పూర్వవ్యాఖ్యాత లవి యెల్ల నేర్పఱిచి యవి వాల్మీకికృతములు గావని త్రోసివైచియున్నారు. అట్టివి కొన్ని యుండుటచేఁ గాండ మంతయుఁ బ్రక్షిప్తమనుట యనాలోచితభాషణము.

## —* అగస్త్యాదిమహర్షులు శ్రీరామ దర్శనార్థులై వచ్చుట *—

ఆ. ప్రబలరాక్షసులను • భండనంబునఁ ద్రుంచి, ప్రాప్తరాజ్యుఁ డగుచు • రామవిభుఁడు
నలరుచుండఁ జూడ • వచ్చిరి రాఘవుఁ, స్తవ మొనర్పఁ బొంటె • సకలమునులు. ౨

అర్థములు. ప్రబల రాక్షసులన్=మిక్కిలి బలవంతులైన రాక్షసులను, భండనంబునన్=యుద్ధమందు, ప్రాప్తరాజ్యుఁడు=రాజ్యమును బొందినవాఁడు, రాజుగాఁ బట్టాభిషిక్తుఁడైన వాఁడు, రాఘవున్=(౧) రామచంద్రుని, (౨) లక్ష్మణుని, స్తవము=స్తోత్రము, పొంటెన్=కొఱకు, ఇందుఁ బ్రథమాక్షరము గాయత్రిలోని యిరువది యొకటవ యక్షరము.

### తాత్పర్యము

మిక్కిలి బలవంతులగు రాక్షసులను యుద్ధమందుఁ జంపి పట్టాభిషిక్తుఁడై రాజ్యభారమువహించిన రామచంద్రమూర్తిని స్తోత్రముచేయ మునీశ్వరులందఱు వచ్చిరి.

రావణునిఁ జంపుటకంటె నింద్రజిత్తును జంపుట కష్టకార్యముకావున లక్ష్మణుని స్తోత్రము చేయ మునులు వచ్చిరని కొందఱ యభిప్రాయము. కనుక నే యిచ్చట సర్వనామము ప్రయోగింపక రాఘవశబ్దము ప్రయోగింపఁబడెను.

తే. కౌశికుండు యవక్రీత•గార్గ్యకణ్వ మునివరులును మేధాతిథి•పుత్రకుండు
గాలవుండునులోనుగాఁ•గలమహర్షి, నగులు తూరుపుదెసవారు•భవ్యమతులు ౩

తాత్పర్యము

తూర్పుదిక్కున నుండు కౌశికుడు, యవక్రీతుఁడు, గార్గ్యుఁడు. కణ్వుఁడు మేధాతిథి పుత్రుఁడు, గాలవుఁడు మొదలుగాఁగల మునులు వచ్చిరి.

క. నముచియు స్వస్త్యాత్రేయుఁడుఁ, బ్రముచియు ఘటసంభవుండు•భగవంతుండా
సుముఖుండు నత్రివిముఖ, ప్రముఖులు దక్షిణదిశా ని•వాసులు వెల్లన్. ౪

తాత్పర్యము

దక్షిణ దిక్కున నుండువారు నముచి, స్వస్తికరుఁడైన యాత్రేయుఁడు (దుర్వాసుఁడు) ప్రముచి, అగస్త్యుఁడు, భగవంతుఁడు సుముఖుఁడు, అత్రి విముఖ ప్రముఖులు వచ్చిరి.

క. పడమటిదెస నుండెడి యా, జడదారులు కవష ధౌమ్య•సంయమివరులున్
గడుధన్యుఁడు రౌద్రేయుఁడు, జడజాప్తద్యుతిన్పృషద్గు•సత్యవచనుఁడున్. ౫

* అర్థములు. జడజాప్తద్యుతి=సూర్యుని కాంతిగల, జలజాప్త-డలయోరభేదః

తాత్పర్యము

పడమటిదిశ నుండువారు కవషుఁడు ధౌమ్యుఁడు, రౌద్రేయుఁడు సూర్య తేజస్సుగల నృషద్గుముని లోనగు జటాధరులు వచ్చిరి.

తే. ఉత్తరంబున నెప్పుడు•నుండువారు, కశ్యప వసిష్ఠ జమదగ్ని•గౌతమాత్రి
గాధితనయ భరద్వాజ•కలితనామ, కులు మునీశ్వరులేడ్వురు•కుతుకమునను. ౬

తాత్పర్యము

ఉత్తరదిశయందెప్పుడు నుండు మహర్షులు కశ్యప వసిష్ఠ జమదగ్ని గౌతములు అత్రి విశ్వామిత్రుఁడు భరద్వాజుఁడునను ఋషు లేడ్వురువచ్చిరి. వసిష్ఠుఁడు అయోధ్యయందే యుండి కార్యములు నిర్వహించుచుండఁగా నెందుండియో వచ్చినట్లు చెప్పుటెట్లు? ఈసప్తర్షులు నిచ్చటికి వచ్చిన కారణమున నాకాశమున సప్తర్షిమండలము కానరాక పోలేదు.

రామచంద్రమూర్తి అత్రి విశ్వామిత్ర భరద్వాజులను, అగస్త్యుని భూమియందుఁజూచెను గదా? ఈమహర్షులవార తపోవిభవముగలవారగుటచే సాధరి

వలెనెన్ని దేహము లయిన నెత్తఁగలరు. అధికారవశమున నాకాశమున మండలముననుండినను దపోవృద్ధికై భూమియందొక మూర్తి ధరించియుందురు. సత్రాజిత్తునొద్దకు, కుంతీదేవి యొద్దకు సూర్యుఁడు వచ్చినపు డాకాశమున సూర్యమండలము లేకుండెనా? అట్లే యిచ్చటను గ్రహించునది. జమదగ్ని కార్తవీర్యార్జునుని పుత్రులచేఁ జంపఁబడినను నిచ్చట దేహము పోయెనేకాని నక్షత్రమండలమందలి దేహము పోలేదు. కావుననే యిప్పుడు మరల రాఁగలిగెను.

ఉ. అందఱు వహ్నితేజులు మ • హాత్ములు వేద తదంగవిత్తముల్
దొందడిగాఁగ వచ్చి నృప • ధూర్జటిమోసల నిల్చి రంత న
య్యందఱిలో నగస్తి ప్రతి • హారుఁ గనుంగొని నీవు భూపసం
క్రందనుతోడ నీమునుల • రాక వచింపు మటంచుఁ బల్కినన్. ౭

అర్థములు. వహ్నితేజులు=అగ్నితేజస్సువంటి తేజస్సు గలవారు, వేద+తదంగ+విత్+తముల్=వేదములను వేదాంగములను దెలిసిన వారిలో శ్రేష్ఠులు, దొందడి=సందడి, నృపధూర్జటి=రాజశ్రేష్ఠుఁడు, మోసల=ముఖశాల=ముంగిలి, ప్రతిహారున్=ద్వారపాలకుని.

తాత్పర్యము

అగ్నితేజులు, మహాత్ములు, వేదవేదాంగములఁ దెలిసిన వారిలో శ్రేష్ఠులు నగు మునులందఱు గుంపుగా వచ్చి రామచంద్రు నగరివాకిట నిల్చిరి. అం దగస్త్య మహర్షి ద్వారపాలకునిఁ జూచి నీవు రామచంద్రమూర్తితో మునులందఱు వాకిట వచ్చి నిలిచియున్నారని చెప్పుము అని చెప్పఁగా.

క. ధీరుఁడు దక్షుఁడు విహితా, చారుండు నయేంగిత ప్ర • చారుండు ప్రతీ
హారుఁడు బిర బిర నని రా, కారాజసమానతేజుఁ • గాకుత్స్థమణిన్. ౮

అర్థములు. ధీరుఁడు=ధైర్యము గలవాఁడు. దక్షుఁడు=సమర్థుఁడు, విహితాచారుండు=యోగ్యమైన నడవడి గలవాఁడు నయ+ఇంగిత+ప్రచారుండు=నీతియు నింగితము దెలిసి వర్తించువాఁడు, రాకారాజ=పదునాఱు కళలు గల చంద్రునితోఁ గూడిన రాత్రియందలి చంద్రునితో, సమానతేజున్=సమానమైన కాంతి గలవానిని.

తాత్పర్యము

రాజు నెదుటికి దిగులుపడక పోఁగలవాఁడును, కార్యమునందు సమర్థుఁడును, ఎప్పు డెట్లు నడవ వలయునో యాయాచారము తెలిసినవాఁడును, నీతి యింగిత జ్ఞానము గలవాఁడును నగు ద్వారపాలుఁడు త్వరగాఁ బోయి పూర్ణచంద్రునివలెఁ బ్రసన్నమైన ముఖముగల రామచంద్రుని జూచి యిది చెప్పుసమయ మనిగ్రహించి రామచంద్రమూర్తిని,

ఉ. చేరి నమస్కరించి నృప•శేఖర! కుంభభవాదిమౌనిరా
డ్వారము మిమ్ముఁ జూచు తమి•ద్వారతలంబున నిల్చె నన్న నీ
తారమణుండు బాల రవి•ధాముల రాకకు మోద మంది పెం
పారఁగ దోడి తెమ్మనిన•నాతఁడు నట్ల యొనర్చె భక్తిమై.

అర్థములు. కుంభభవాది మౌనిరాడ్వారము=అగస్త్యుఁడు మొదలగు మునుల సమూహము, బాల రవి ధాముల=లేతసూర్యుని కాంతిగల వారియొక్క.

తా త్ప ర్య ము

సమీపించి నమస్కరించి రాజేంద్రా? యగస్త్యుఁడు లోనగు మునులు మిమ్ముఁ జూడఁగోరి గుంపుగా వచ్చి వాఁకిట నిలిచి యున్నారని చెప్పఁగా రామచంద్రమూర్తి సంతోషించి వారిని తోడుకొని రమ్మనఁగా వాఁడును భక్తితో నట్లే యొనర్చెను.

చ. ఋషితతి రాకఁ గాంచి యెదు•రేగి కృతాంజలి యౌచు భూమిభృ
ద్వృషభుఁడు పాద్య మర్ఘ్యమును•నింపు దలిర్పఁగ గోవు నిచ్చి క
ల్మషరహితంబులౌ కనక•మండిత చిత్రకుశాసనంబులన్
విషనిధిపాయిముఖ్యులకు•వేఁడుగ వేఁడుగ సంఘటించినన్. ౧౦

అర్థములు. భూమిభృత్+వృషభుఁడు, రాజశ్రేష్ఠుఁడు, అర్ఘ్యము=పూజకొఱకైనవి, అష్టార్ఘ్యములు=పెరుగు తేనె, నెయ్యి, అక్షతలు, గఱిక, నువ్వులు, దర్భ, పుష్పము, పాద్యము=కాళ్ళు కడుగుకొను నీళ్ళు, ఇది కంచుపాత్రతో నీయరాదు. కల్మషరహితంబులు=పరిశుద్ధములైనవి, దుమ్ము మొదలైనవి లేనివి, కనకమండిత=బంగారుచే నలంకరింపబడిన, చిత్రకుశాసనంబులన్=చిత్రాసనంబులను కుశాసనంబులను, విషనిధిపాయి=సముద్రము పానముచేసిన యగస్త్యుఁడు.

తా త్ప ర్య ము

ఋషి సమూహము వచ్చుట చూచి యెదురుగాఁ బోయి చేతులు జోడించి రాజశ్రేష్ఠుఁ డగు రామచంద్రమూర్తి యర్ఘ్యపాద్యములను ధేనువు నొసఁగి నిర్మలములై బంగారుచే నలంకరింపఁబడిన చిత్ర దర్భాసనములను నగస్త్యుండు మొదలగు ఋషీశ్వరుల కందఱకు వేఱువేఱుగా సమకూర్పగా.

క. వారెల్ల నిండుఁబ్రమదం, బారఁగఁ గూర్చున్నతఱి మ•హాత్మకులారా!
మీరెల్లసుఖులె? శిష్యుల, కారోగ్యమె? నిర్భయము లె•కా,వను లనుచున్. ౧౧

తా త్ప ర్య ము

వారందఱు సంతోషముగఁ గూర్చుండిన సమయుంబున మహాత్ములారా! మీకందఱకు సుఖమే కదా. శిష్యులారోగ్యవంతులే కదా. అడవులం దేవిధభయము లేదు కదా.

క. రాముఁడు కుశలప్రశ్నముఁ, బ్రేమంబునఁ జలుప వేద•వేదాంతవిదుల్
సామోదమనంబుల ను, శ్రీమహితుం జూచి యిటు వ•చించిరి రక్తిన్. ౧౨

అర్థములు. సామోదమనంబులన్=సంతోషముతోఁ గూడిన మనస్సులతో

తాత్పర్యము

శ్రీరామచంద్రప్రభువు ప్రేమతోఁ గుశలము నడుగఁగా వేద వేదాంత విదులయిన యగస్త్యాదు లానందము నంది శ్రీరామమూర్తినిఁ జూచి యనురాగముమీఱ నిట్లని పలికిరి.

## —* మౌనులు శ్రీరాముఁ బ్రశంసించుట *—

క. మాభాగ్యవశంబున నీ, తాభామారమణ! నిహత•దర్పితవైరిన్
శ్రీభద్రుని నినుఁ గంటిమి, మాభద్రంబులకుఁ గొఱఁత•మాటయు నున్నె? ౧౩

అర్థములు. నిహత,=చంపఁబడిన దర్పిత=గర్వించిన, వైరిన్=పగవానిని, శ్రీభద్రునిన్=సంపదచే మేలుపొందిన వానిని.

తాత్పర్యము

. సీతానాథా! మాభాగ్యము ఫలించుటచే గర్వించిన శత్రువులఁ జంపి రాజ్యలక్ష్మి ననుభవించి నిన్నుఁ జూడఁగంటిమి. ఇఁక మా శుభములకుఁ గొఱఁతయను మాటయు నుండునా?

క. నీవు ధను వందుకొన లో, కావళి హావళి భజించు•నన భువనాళీ
రావణు రావణుఁ గొడుకుల, తో వారల సుతులతోడఁ•ద్రుంచుట బరువే! ౧౪

అర్థములు. హావళి=ఆపద, భువనాళీరావణున్=ప్రపంచసమూహముల నేడిపించు వానిని.

తాత్పర్యము

నీవు విల్లు చేతికిఁ దీసికొనినంత మాత్రముననే భయపడి లోకము కీడుపాలగును. ఇట్టి నీవు లోకమును బీడించుచుండిన రావణునిఁ గొడుకులతో మనుమలతోఁ జంపుట కష్టకార్యమా?

శా. మాపుణ్యంబున మిమ్ముఁ గంటిమి మహా•శాస్త్రా! దుష్టచారిత్రు లౌ
నా పౌలస్త్యుల సంహరించి జయివై•యాశ్చర్యరిం ద్విష్నమ
స్యాపారంగతునిన్ హితాచరణునిన్• సౌమిత్రినిం గూడి యి
ట్లీ పైత్రం బగు లక్ష్మినొంది సుఖివై•యేపార భూపాలకా! ౧౫

అర్థములు. పౌలస్త్యులన్=పులస్త్య వంశమునఁ బుట్టిన రాక్షసులను, ఆత్మేశ్వరిన్=సీతాదేవిని, త్వత్+శుశ్రూషా+పారంగతునిన్ = నీశుశ్రూషయందు పూర్ణుఁడైన వానిని, హిత+ఆచరణునిన్=నీకు మేలు చేయువానిని, పైత్రము= తండ్రికి సంబంధించినది.

తాత్పర్యము

మహాత్మా! మాపుణ్యముచే చెడునడవడి గల రాక్షసులఁ జంపి జయము గొని ప్రియవల్లభ యగు సీతాదేవితోడను, నీకైంకర్యమునందుఁ గృతార్థుఁడై నీకు హితముసేయు లక్ష్మణునితోడను గూడి తండ్రి రాజ్యమును బొంది సుఖముగా రాజువై యుండఁగాఁ జూడఁ గంటిమి.

క. తల్లులతోఁ దమ్ములతో, నుల్లం బలరంగ నుండి•యుర్విం బ్రోవం
దల్లివలెఁ గంటి మక్షులు చల్లఁగ మా పూర్వపుణ్య•సంపత్తి నృపా! ౧౯

అర్థములు, అక్షులు=కన్నులు, తల్లివలె భూమిని పాలింపఁగా.

తాత్పర్యము

(రాజా! మీరు మీతల్లులతోఁ దమ్ములతో సంతోషముగానుండి తల్లివలె భూమినిఁ బాలించుచుండ మిమ్ము మాపూర్వపుణ్య సంపదచేఁ గన్నులుచల్లఁగాఁ జూడఁ గంటిమి.)

సీ. ఏవారి యాకార•మీక్షించి నంతనే, బ్రద్దలౌ గుండియల్•పగతురకును
నేక్రూరచారిత్రు•లెఱుఁగని శస్త్రాస్త్ర, బృంద మిం కెందును• వినఁగరాదు
ఏవారి రణములో•నెదిరించి మానంబు, దక్కించుకొనలేరు•ధాత్రి నెవ్వ
రట్టి కాలాంతక•యమతుల్యమత్తయు, ద్ధోన్మత్తుల నకంప•నోగ్రచరితు
తే. నట్టి దేవాంతకనరాంత•కాతికాయ, కుంభవికటప్రహస్తని•కుంభముఖుల
త్రిశిరమత్తవిరూపాక్ష•దివిజరిపుని, నలమహోదరు ధూమ్రాక్షు•యజ్ఞకోపు.

తాత్పర్యము

ఎవరి రూపమును జూచినంత మాత్రముననే శత్రువులకు గుండెలు పగులునో యే క్రూరు లెఱుఁగని శస్త్రాస్త్రము లెందును లేవో యెవ్వరిని యుద్ధమందు నెదిరించి భూమియం దెవ్వరైనను గౌరవము కాపాడుకొనలేరో ప్రళయ కాలమందు లోకము నాశము చేయు యమునివంటి వారైన, మత్తుని, యుద్ధోన్మత్తుని, అకంపనుని, దేవాంతక, నరాంతక, అతికాయ, కుంభ, వికట, ప్రహస్త, నికుంభ ముఖ్యులను త్రిశిరుని, మదించిన విరూపాక్షుని, మహోదరు, ధూమ్రాక్షు, యజ్ఞకోపుని,

చ. మడియఁగఁ జేసి తౌర! పరి•మాణమునన్ సరి చెప్పరాని యా
వెకిదపు రూపువాని సుర•భీకరశీలునిఁ గుంభకర్ణునిన్
బొడ వడఁగించి తో మనుజ•పుంగవ! మా సుకృతంబుచే, ననిన్
ముడిబొమ యైన లేని నిను•ముక్కున వ్రేలిడి చూచె లోకముల్. ౧౮

తాత్పర్యము

చంపితివి. ఏమి యాశ్చర్యము? దేహపరిమాణమందు నెవ్వనితో సమానుఁ డని మఱియొకనిఁ జెప్ప సాధ్యపడదో, యట్టి భయంకరమైన యాకారము గలిగి దేవతలకు దిగులు పుట్టించు నడవడిగల కుంభకర్ణుని మాపుణ్యము ఫలించుటచేతఁ జంపితివి. యుద్ధమునందుఁ గోపముచేఁ గనుబొమలు ముడివైనఁ బెట్టని నిన్నుఁ జూచి లోక మాశ్చర్యపడెను.

క. బంధుర మగు జవమున దశ, కంధరు సురదానవహ్నా•కంధరుఁ ద్రిజగ
త్సంధాహరు వధియించితి, సింధురవరనఖరతుల్య•శితకాండములన్. ౧౯

అర్థములు. బంధురము=అధికము- దశకంధరు=పది మెడలు గల రావణుని- సుర=దేవతలనెడి- దానవహ్నా=కాఱుచిచ్చునకు- కంధరున్=మేఘము వంటి వానిని- ప్రతాపమార్పుటయందు మాత్రమే యుపమానము- త్రిజగత్=మూఁడు లోకముల- సంధా=నియమమును- హరున్=హరించిన వానిని- పాడుచేసినవానిని- సింధురవర=ఏనుఁగులకు శత్రువగు సింహముయొక్క- నఖరతుల్య=గోళ్ళతో సమములైన- శిత=పదునైన- కాండములన్=బాణములచే.

తాత్పర్యము

దేవతల గర్వమణఁచి లోకముల మర్యాద చెఱిచిన రావణుని మిగులశీఘ్రముగ సింహము గోళ్ళవంటి బాణములచేఁ జంపితివి.

చ. అలఁతులఁ దీరుకార్య మొకొ•యాతనిఁ ద్రుంచుట దట్టు లుండనీ
కలనను వైరిజాల లయ•కాలు సురస్మయసంవిఘాతు ని
స్తులకపటైకశీలుఁ బెను•దొమ్మిదురమ్మున రావణాత్మజున్
బొలియఁగఁ జేయుటే పురుష•పుంగవ! యద్భుతకార్య మిన్నిటన్. ౨౦

అర్థములు. అలఁతులన్=అల్పులచే, తీరు=చక్కఁబడు, వైరిజాల లయకాలున్=శత్రు సమూహములకుఁ బ్రళయమందలి యమునివంటి వానిని. సురస్మయ సంవిఘాతున్=దేవతల గర్వము నాశము చేసినవానిని, నిస్తుల=అసమానమైన, కపటైక శీలున్=వంచనమే ప్రధానముగఁగల నడవడి గలవానిని, పెను=గొప్పదగు, దొమ్మిదురమ్మునన్=ద్వంద్వయుద్ధమందు.

### తాత్పర్యము

ఇది యల్పులు చేయు కార్యమా? కాదు. ఆ రావణాసురుని జంపుటయదట్టు లుండనీ కాని, యుద్ధమందు శత్రువులపాలి ప్రలయకాల యముఁడును దేవతల గర్వము నణఁచిన వాఁడును, మోసమే ముఖ్యవ్యాపారముగఁ గలవాఁడును నగు నింద్రజిత్తును ద్వంద్వయుద్ధమునఁ జంపుటే యన్నిటిలో మిక్కిలి యాశ్చర్యకర మైనపని.

క. అంతక నిభ ఫణిశరములు, దొంతరలై కురిసి మిమ్ముఁ•దూలింప ధరా
కాంత విడివడితి రౌరా!, యంతింతన వశమె మా మ•హాపుణ్యంబున్. ౨౧

అర్థములు. అంతకనిభ=మృత్యువుతో సమానములైన, ఫణిశరములు= నాగాస్త్రములు, దొంతరలై=రాసులై.

### తాత్పర్యము

మృత్యువు వంటి నాగాస్త్రములను కుప్పలు కుప్పలుగాఁ గురియించి మిమ్ము నేలఁబడఁద్రోయఁగా వానినుండి తప్పించుకొని లేచితిరి. ఆహా, యేమి మాపుణ్యము ఇంతంతని చెప్పసాధ్యమా.

మత్తకోకిలము. ఎన్ని మాయలయందొ ప్రౌఢయు•నెట్టివారి కజయ్యుఁడున్
గన్నదోయికిఁ గానరాఁ డని•కర్కశుండు సురేంద్రజి
త్తన్నిశాచరుఁ డాజిఁ గూలుట•యాలకించినయంత య
న్నన్న!మమ్ముఁ బ్రమోదమున్ బర•మాద్భుతంబును ద్రెక్కొనెన్

అర్థములు. కర్కశుండు=కఠినచిత్తుఁడు, త్రొక్కొనెన్=ముంచెను

### తాత్పర్యము

ఎన్ని మాయల యందో సమర్థుఁడు, ఎటువంటి వారికైనను జయింపసాధ్య పడనివాఁడు. యుద్ధమందుఁ గన్నులకుఁ గానరాఁడు, క్రూరుఁడు, అట్టివాఁడు ఇంద్రజిత్తు, అట్టివాఁడు యుద్ధమందుఁ జచ్చెననిన మాటవినగానే ఆహాహా! యేమి చెప్పుదుము, మేము, సంతోషమందు నాశ్చర్యమందు మునిఁగి పోయితిమి.

ఆ. కామరూపధరులఁ•గఠినవిగ్రహులను, రాక్షసులను క్రౌర్య•రతుల నీవు
హతులఁ జేసి మాకు•నభయదక్షిణ నిచ్చి, తిటులు మాయదృష్ట•మేమనంగ.

అర్థములు. కామరూపధరులన్=కోరినరూపము ధరింపఁ గలవారిని, కఠిన= గట్టియగు, విగ్రహులను=దేహములు గలవారిని.

### తాత్పర్యము

(కోరిన రూపముల ధరింపఁ గలిగినవారును, కఠిన దేహము గలవారును, క్రూరాత్ములు నగు రాక్షసులను సంహరించి మా కీ విధముగా నభయ దక్షిణ నొసంగితివి. మాపుణ్య మే మని పొగడఁ గలము?)

క. అను ఋషివరవచనంబుల, విని సీతానాయకుండు•విస్మయవార్ధిన్
మునుఁగుచుఁ బ్రాంజలి యగుచున్, వినుత తపోధనుల కిట్లు•విజ్ఞాపించెన్. ౨౮

అర్థములు, విస్మయవార్ధిన్=ఆశ్చర్య సముద్రమున, విజ్ఞాపించెన్=విన్నవించెను.

తాత్పర్యము

(అని పలుకుచున్న యగస్త్యుఁడు మున్నగు ఋషిశ్రేష్ఠుల మాటలను విని శ్రీరామచంద్రమూర్తి యాశ్చర్యసముద్రమున మునిఁగినవాఁడై యంజలిబద్ధుఁడై వారితో నిట్లని విన్నవించెను.)

**శ్రీరాముఁడు మునుల నింద్రజిత్తు నాధిక్యమునకుఁ గారణ మడుగుట.**

మ. అతిదుర్దాంతపరాక్రమాఢ్యుఁ డయి ర•క్షోధీశుఁ డౌ రావణుం
డతులామేయతనూబలుండు ఘటక•ర్ణాఖ్యుండు నీ రుండఁగా
నతికాయత్రిశిరఃప్రహస్తఖరధూ•మ్రాక్షోగ్రకుంభాదు లౌ
కృతకర్ముల్ రహిమించ రావణిని మీ•రేలా ప్రశంసింపఁగన్. ౨౯

అర్థములు. అతి=మిక్కిలి, దుర్దాంత=అణఁపరాని, పరాక్రమాఢ్యుఁడు=పరాక్రమ సంపత్తిగలవాఁడు, అతుల=అసమానమను, అమేయ=కొలఁత చెప్పరాని, తనూబలుండు=దేహబలము గలవాఁడు.

తాత్పర్యము

తపస్సుచే మిగుల నణఁపరాని పరాక్రమముగల రావణు డుండఁగా, సహజమైన దేహబలముగల కుంభకర్ణుఁ డుండఁగా అతికాయుఁడు త్రిశిరుఁడు ప్రహస్తుఁడు ఖరుఁడు ధూమ్రాక్షుఁడు కుంభుఁడు మొదలగు నాతితేజిన వారుండఁగా నింద్రజిత్తు నేల మీరు విశేషించి పొగడెదరు.

క. మత్తుని దేవాంతకు న, న్మత్తు మహోదరుని వికటు•మకరాక్షు ననిన్
మిత్తుల నెన్నక వాసవ, జిత్తును మీ రిటు ప్రశంస•సేయఁగ నేలా?

అర్థములు. మిత్తులన్=మృత్యువువంటి వారిని.

తాత్పర్యము.

(యుద్ధమున మృత్యుదేవతవంటి వారయిన, మత్తుఁడు, దేవాంతకుఁడు, ఉన్మత్తుఁడు, మహోదరుఁడు, వికటుఁడు, మకరాక్షుఁడు నుండగా, వారిని మాని యింద్రజిత్తు నింతగాఁ బొగడెద రేల?)

ఉ. వాని ప్రభావ మెట్టిదొకో? ♦ వాని పరాక్రమ మేకొలంది? య
వ్వానిబలం బదెంత ? దశ ♦ వక్త్రునికంటెను శౌర్యధైర్యముల్
వానికి నెట్లు లగ్గలము? ♦ పల్కుఁడు గోప్యము గాద యేని స
మ్మానిత శీలురార! విన ♦ మానస ముబ్బట లూఁగెడిం జుఁడీ. ౨౭

అర్థములు అగ్గలము=అధికము, గోప్యము=రహస్యము ఉబ్బట లూఁగెడిన్=మిక్కిలి కాంక్ష చేయుచున్నది.

తాత్పర్యము

(వాని ప్రభావ మెట్టిది? వాని పరాక్రమ మే మాత్రము? వాని బలమెంత? తండ్రియయిన రావణునికంటె వాఁడు శౌర్యమున ధైర్యమున నధికుఁడెట్లయ్యెను? ఇది రహస్యము గాదేని మునీశ్వరులారా! వినిపింపుఁడు. ఈ విషయము విన నా మనసు మిగుల నభిలాష కలిగియున్నది.)

క. వినఁగా నర్హుఁడ నేనియు, వినిపింపుఁడు వినయమునను ♦ వేడుకొనియెదన్
మునివర్యులార! యియ్యది గనఁబోకుండాజ్ఞ గాఁగఁ ♦ గరములు మోడ్తున్.

తాత్పర్యము

(మునీశ్వరులారా! దీనిని వినుటకు నే నర్హుఁడ నగుదునేని వినిపింపుఁడు. చేతులు మోడ్చి వినయముతోఁ బ్రార్థించెదను. ఇది యాజ్ఞగాఁ దలఁపకుఁడు)

క. ఏరీతి గెలిచె శక్రుని?, నేరీతి వరంబు లొందె? ♦ నెటు జనకునకున్
శూరుఁ డయి నెగడెఁ? దద్వ్యాపారంబు సమస్తమెఱుఁగ ♦ బలుకుఁడు మౌనుల్

అర్థములు. జనకునకున్=తండ్రికంటె, మౌనుల్=మునులారా.

తాత్పర్యము.

(మునులారా! వాఁ డేవిధముగా నింద్రుని గెలిచెను ? ఏ ప్రకారము వరములను బొందెను ? ఎట్లు తండ్రికంటె శూరుఁడయ్యెను. వాని వ్యాపార మంతయు నెఱిఁగింపుఁడు.)

## ౨వ సర్గము. అగస్త్యుఁడు శ్రీరామునకు రావణు జన్మాదివృత్తాంతముఁ దెలుపుట.

క. అను రామధరావరచంద్రునిఫణితుల నాలకించి ♦ తొలఁకాడుముదం
బునఁ గుంభభవుఁడు రామునిఁ, గనుఁగొని యిట్లనియె వాక్య ♦ కౌశల మెసఁగన్.

అర్థములు. ధరావరచంద్రునిన్=రాజశ్రేష్ఠుని, ఫణితులు=వాక్యములు.

తాత్పర్యము

(అని పలుకుచున్న శ్రీరామ విభుని మాటల నాలించి పరమానందమున నగస్త్యుఁడు రామచంద్రమూర్తినిఁ జూచి మాటల నేటు తేటపడ నిట్లనెను.)

ఉ. రామ! గుణాభిరామ! యల•రావణి తేజము తద్బలం బరి
స్తోమము గెల్చు పెంపు బల•సూదనగర్వహరత్వ ముగ్ర సం
గ్రామములం దజయ్యుఁ డయి•క్రాలిన హేతువు విన్మ చెప్పెదన్
నీమది సంతసిల్ల రజ•నీచరసాధునిశాబ్జ భాస్కరా! ౩౧

అర్థములు. అరిస్తోమమున్=శత్రుసమూహమును. బలసూదన గర్వహర త్వము=ఇంద్రుని పొగరణఁచుట, ఉగ్ర సంగ్రామములన్=భయంకర యుద్ధము లందు, రజనీచర=రాక్షసులనియెడి సాధు=భక్తులనియెడి. నిశా=రాత్రికి, అబ్జ= కమలములకు, భాస్కరా=సూర్యుఁడ వైనవాఁడా, సూర్యుఁడు రాక్షసులను రాత్రిని హరించి భక్తులను కమలముల వికసింపఁ జేయును, క్రమాలంకారము.

తా త్ప ర్య ము

రాక్షసుల వధించి సజ్జనుల మనస్సు సంతోషింపఁజేసిన రామచంద్రా! ఇంద్రజిత్తు తేజము, వానిబలము, శత్రువుల గెల్చుటయందు వాని గొప్పతనము, ఇంద్రుని గర్వము వాఁడు హరించిన విధము, భయంకర యుద్ధములం దెట్టి వారికి వాఁడు జయింపఁరానివాఁ డయిన కారణము నీవు సంతోషింప జెప్పెదవినుము.

క. రావణిచరితమునకు మును, రావణుకులజన్మములు వ•రప్రతిలబ్ధిన్
నే వివరించెద వినుమా, యావద్వృత్తంబుమూల • మై యది యునికిన్. ౩౨

అర్థములు. రావణి చరితమునకు=ఇంద్రజిత్తు నడవడి చెప్పుటకు మును ముందు.

తా త్ప ర్య ము

ఇంద్రజిత్తు చరిత్రము చెప్పుటకు ముందుగ రావణుఁ డే కులమువాఁడో వాఁ డెట్లు పుట్టెనో, వాఁ డెట్లు వరముల సంపాదించెనో, వారిచరిత్ర మంతయుఁ జెప్పెద వినుము. అదియెకదా సర్వమునకు మూలము.

సీ. పూర్వంబు కృతయుగం•బునఁ గంజలోచన!, పరమేష్ఠితనయుండు•వరగుణుండు
మాఱటబ్రహ్మయై•మలసెడి బ్రహ్మర్షి, పేరఁ బులస్త్యుండు•వినుతశీల
మహిమ ధర్మమున న•మ్మహనీయుఁ గీర్తింప వచ్చునే ధరనెట్టి•వారికైన
బ్రహ్మపుత్రుం డను•పలుకుమాత్రమె శక్య, మతఁ డజసుతుఁడై న•కతన జేసి
ఆ. విబుధకోటి కెల్ల•ప్రియుఁ డయి శుభగుణ పూగములను సకల•భువనములకు
నిష్టుఁ డగుచు ధర్మ•వృత్తంబు పీడక, హేమకుధరపార్శ్వ•సీమయందు. 33

అర్థములు. పరమేష్ఠితనయుండు = బ్రహ్మపుత్రుఁడు, మాఱటబ్రహ్మ= రెండవ బ్రహ్మ, శుభగుణ పూగములను=మంచిగుణ సమూహములను, హేమ కుధరపార్శ్వ సీమయందు=మేరుపర్వతముయొక్క ప్రక్కభాగమున.

### తాత్పర్యము

రామచంద్రా! పూర్వము కృతయుగంబున బ్రహ్మమానస పుత్రుఁడు ఉత్తమ గుణములు కలవాఁడు, రెండవ బ్రహ్మయై పులస్త్యుఁడను పేర నొక బ్రహ్మర్షి గలఁడు. బ్రహ్మపుత్రుఁ డగుటచే బ్రహ్మకొడుకని మాత్రము చెప్పవచ్చునే కాని మహిమయందు ధర్మమునందు నతఁ డింతవాఁడని చెప్పనెవ్వరికి సాధ్యపడదు. ఆయన దేవతలకెల్లఁ బ్రియుఁడై, సాధుగుణము లనేకములు గలవాఁడై, సమస్త ప్రపంచమునకు నిష్టుఁడై ధర్మప్రవర్తనము విడువక మేరుపర్వతము ప్రక్కన

క. వెలయు తృణబిందునాశ్రమ, తలమునఁ బుణ్యార్జనేచ్ఛ • దప మొనరించెన్
దొలిచదువులు చదువు చచం, చలమతి నియతేంద్రియుండు • సద్వ్రతుఁడగుచున్

అర్థములు. తొలిచదువులు=వేదములు, అచంచలమతిన్=చలింపని మనస్సుతో, నియతేంద్రియుండు=ఇంద్రియముల నియమించినవాఁడు, సద్వ్రతుండు=మంచి వ్రతములు గలవాఁడు.

### తాత్పర్యము

ఉండు. తృణబిందుఁడను రాజర్షి యేర్పఱచుకొనిన యాశ్రమమందు పుణ్యము సంపాదించు కోరికతో వేదాధ్యయనము చేయుచు స్థిరచిత్తుఁడై యింద్రియముల జయించి గొప్ప వ్రతములఁ బూని తపస్సు చేసెను.

ఉ. ఆఋషియాశ్రమోర్వి యన • యంబు సమస్త ఋతూపభోగ్యమై
హారిమరాళిసారసవి • హారమనోహరసారసాకరో
దారము నై సుకుడ్మల ల • తాంతఫల ప్రకరాభిరామభూ
మీరుహరాజితం బగుచు • మీఱు సుఖాశ్రయగంధవాహ మై. ౩౫

అర్థములు. అనయంబు=ఎల్లప్పుడు, సమస్త ఋతూపభోగ్యమై=అన్ని ఋతువులందు నుపయోగింపఁదగినదై, హారి=మనోహరమైన, మరాళి=హంసలయు, సారస=బెగ్గురులయు, విహార=సంచారముచే, మనోహర=అందమైన, సారసాకరోదారమునై=విస్తారముగఁ గొలఁకులు గలదై, సుకుడ్మల=మంచి మొగ్గల మొక్కలయు, లతాంత=పూల మొక్కలయు, ఫల=పండ్ల మొక్కలయు, ప్రకర=సమూహముచే, అభిరామ=అందమైన, భూమీరుహ=చెట్లచే, రాజితంబు=ప్రకాశించునది, సుఖాశ్రయ గంధవాహమై=సౌఖ్యమునకు స్థానమైన గాలి కలదై.

### తాత్పర్యము

ఎల్లప్పుడు నన్ని ఋతువులందు నుపయోగింపఁదగినదై హంసలు బెగ్గురులు సంచరించుటచే నింపైన కొలఁకులు, మొగ్గలు పూలు పండ్లుగల చెట్లు, సుఖకరమైన గాలి గలదై యా ఋషియాశ్రమ ముండెను.

ఉ. ఆ రమణీయ దేశమున • నాడుచుఁ బాడుచుఁ జిత్రచిత్రఖే
లారమమాణ లై మను వి • లాసముగాఁగ విపంచి మీటుచున్
సారెకు సారెకున్ విబుధ • సారసనేత్రలు భోగికన్యకల్
భూరమణాత్మజల్ ముదము • పొంపిరి వోవఁ జరింతు రర్మిలిన్. ౩౬

అర్థములు. ఖేలారమమాణలు=ఆటలాడు చున్నవారు, విపంచి=వీణె, విబుధసారసనేత్రలు=దేవస్త్రీలు, భోగికన్యకల్=నాగకన్యకలు, భూరమణాత్మజల్=రాచకూఁతులు, పొంపిరివోవన్=అతిశయింపఁగా, అర్మిలిన్=ప్రేమతో.

తాత్పర్యము

అందమైన యా ప్రదేశమందు దేవకన్యకలు, నాగకన్యకలు, రాజకన్యకలు సంతోషముతో చిత్రవిచిత్రముగా నాడుచుఁ బాడుచు వీణె మీటూచు సంచరించు చుండిరి.

తే. ఆ యనిందిత చరితల • యాటపాట, గా పులస్త్యుని నియతికి • హానిఁ గూర్చ
దానఁ గోపించి యమ్మౌని • తరుణి యెవ తె, వచ్చునమ్మఁ జూడ నద్దిగ • గర్భము
వహించు

అర్థములు. అనిందిత చరితల=నిందింపఁ బడని నడవడిగల వారియొక్క, ఇట్లు చెప్పుటచే వారు తృణబిందుని తపస్సు చెఱుపవలయునని తలంచినవారు కారు. కన్యకలు కావున వినోదముగ నా డాడుచుఁ బాడుచు వారిలోవారు వినో దించుచుండిరని భావము. ఆటపాట=ఆచ్ఛిక సమాహారద్వంద్వము కావున నేకవచ నము, కూడు గుడ్డ. తిక్కన, నియతికి=నియమమునకు=తపస్సునకు.

తాత్పర్యము

నిర్మలమైన మనస్సుగల యాకన్యకల యాటలు పాటలు పులస్త్యుని యేకాగ్ర చిత్తతకు హానికలిగింపఁగా నాయన కోపించి యిఁక నే స్త్రీ వచ్చుఁ జూడ వచ్చునో యది గర్భిణి యగును గాక యని శపించెను.

క. అనవుడు నాపలుకుల విని, వనజేక్షణ లెల్ల శాప • భయమున నచ్చో
టను జేరరు; తృణబిందుని, తనయామణి యెఱుఁగ దివ్విధం • బచ్చాపంబున్. ౩౭

తాత్పర్యము

ఆశాపము విని స్త్రీలందఱు భయమున నా ప్రాంతమునకు వచ్చినవారు కారైరి. తృణబిందుని కూఁతురు మాత్ర మప్పు డచ్చోట లేమిని వినినది కాదు.

క. ఎప్పటియట్ల చరించుచు, నప్పట్టునఁ గనదరౌయొక్క • యలికుంతలనే
నప్పుడు పులస్త్య శ్రుతిరవ, ముప్పతిలెన్ శ్రవణమాన • సోల్లాసకమై. ౩౮

అర్థములు. శ్రుతిరవము=వేదాధ్యయనధ్వని, శ్రవణమానసోల్లాసకమై= చెవులకు మనస్సునకు సంతోషకరమై.

### తాత్పర్యము

పూర్వమువలెనే సంచరించుచు నొక్క శ్రీనైన నా యాశ్రమంబునం గానక తిరుగుచుండఁగా బులస్త్యుఁడు వేదము చదువు ధ్వని వినుటకు మనస్సునకు సంతోషకరమై వినవచ్చెను.

క. విని యెవ్వరిధ్వనియో యిది, యని డాయఁగ నేగి కాంచె•నమ్మునిఁ దోడ్తోఁ
దను వెల్లఁ బలుకఁ బాఱెను, మునుకొనియెన్ గర్భచిహ్న•ములు కన్యకకున్. ౪౦

అర్థములు. తోడ్తోన్=వెంటనే, పలుకఁబాఱెను=తెల్లనయ్యెను, తనువు=దేహము.

### తాత్పర్యము.

(విని యిది యెవ్వరి ధ్వనియో యని సమీపమునకుఁ బోయి, యా మునిని జూచెను. వెంటనే యా కన్యకకు శరీరమంతయుఁ దెల్లనయ్యెను. గర్భచిహ్నములు కానవచ్చెను.)

క. చెలి యా వ్రేకటిగుర్తులు, తిలకించి యిదే మటంచు•దిగులుం గొని తా
నలసత జనకునియాశ్రమ, తలమునకుం బోయి తండ్రి•దాపున నిలువన్. ౪౧

అర్థములు. వ్రేకటి గుర్తులు=గర్భధారణ చిహ్నములు, తిలకించి=చూచి, అలసతన్=మెల్లగా, తలమునకున్=ప్రదేశమునకు.

### తాత్పర్యము

(ఆమె యా వేకటి గుర్తులు చూచుకొని, యిదేమని దిగులుపడి మెల్లఁగాఁ దన తండ్రి యాశ్రమ ప్రదేశమునకుఁ బోయి, జనకుని దాపున నిలువఁగా.)

ఉ. కన్నియవంక నాతఁడు నె•గాదిగఁ జూడఁగఁ జూచి గర్భపుం
జిన్నెలు మేనఁ గాంచి యిసి•సీ యని యా తరళాక్షిఁ జూచి నీ
కన్నెతెకంబు మాలి యిటు•కాఁ గత మేమి యయోగ్యరీతి నో
చిన్నికుమారి యన్నఁ జెలి•సిగ్గున భీతిని గ్రుస్సు చిట్లనన్. ౪౨

అర్థములు. ఇటుకాన్=ఇట్టు లగుటకు, కతము=కారణము.

### తాత్పర్యము.

కన్నియవంక నా తృణబిందుఁ డెగాదిగఁ జూడఁజూచి యామె శరీరమునఁ దోఁచు గర్భపుఁ జిన్నెలు గని ఛీఛీ! యని, నీ కన్నెతెకము చెడ నిట్లగుట కేమి కారణము? పనికిమాలిన పనిచేసితి వేమమ్మా, యనఁగా సిగ్గున భయమున గ్రుస్సుచుఁ దండ్రితో నామె యిట్లనెను.

ఉ. అన్నముపున్నమే నెఱుఁగ • నయ్యయి పొటకుఁ గారణంబు నేఁ
గన్నది లేద, యెప్పటి ప్ర • కారమునన్ విహరింపఁగోరి నే
మున్నుగ నొంటినై సఖుల • నొుత్తము రోయఁ బులస్తి యాశ్రమం
బు న్నితఁ జొచ్చి యందుఁ బువుఁ•బోణి నొక ర్తెయుఁ గానరాదికిన్. ౪౩

అర్థములు. అన్నము=అన్యశబ్దభవము, ఇతరము, పాపము, రోయిన్=వెదుకఁగా, పులస్తి=పులస్త్యుని, ఇది అగస్త్యశబ్దము వంటిది.

తాత్పర్యము

తండ్రీ! నేను బుద్ధిపూర్వకముగాఁ బాపము చేయలేదు. పుణ్యము చేయలేదు. ఈ ప్రకార మగుటకుఁ గారణ మేమో నాకుఁ దెలియదు. మునుపటివలెనే నేను వినోదముగాఁ దిరుగఁగోరి నేను ముందుగాఁ బోయి నా స్నేహితురాండ్రను వెదుకఁగా నొక్కతెయుఁ గానరాలేదు.

క. కారణ మే మని యిట నట, నారయుచుండంగ నిట్టి•యాకృతి గలిగెన్
గూరినభీతిని మిమ్ముం, జేరఁగఁ బరువెత్తితిన్ వి•శిష్టచరిత్రా! ౪౪

తాత్పర్యము

(కారణమేమై యుండునా యని యటు నిటు విచారించు చుండఁగా నీ స్థితి గలిగెను. నాయనా! దానిఁగని భయముచే మీదగ్గఱకుఁ బరువెత్తుకొని వచ్చితిని.)

**తృణబిందుఁడు తనకూఁతుఁ బులస్త్యున కర్పించుట.**

చ. అనవుడు నల్ల రాజఋషి•ధ్యానసమాస్థితుఁడై సమస్తముం
గని యిది మౌనిచేఁత యని•గ్రక్కునఁ గన్యను దోడికొంచు న
మ్మునివరుపాలి కేగి ప్రియ•ముం బచరించు మహాత్మ! దీని నా
తనయ స్వభావ సద్గుణ వి•తానవిభూషితఁ గన్యకామణిన్. ౪౫

అర్థములు. ధ్యానసమాధిస్థితుఁడై = యోగసమాధియందున్నవాఁడై; మౌనిచేఁత=ముని చేసినపని, గ్రక్కున=శీఘ్రముగా, స్వభావ=సహజముగ, సద్గుణవితాన=మంచి గుణముల సమూహముచే, విభూషితన్ = అలంకరింపఁ బడిన దానిని.

తాత్పర్యము

(అని చెప్పఁగా రాజఋషియగు నాతృణబిందుఁడు యోగసమాధి యందుండి, సర్వమును దెలిసి యిది పులస్త్యముని చేసినపని యని వెంటనే యాకన్నను వెంటఁ బెట్టుకొని యా ముని శ్రేష్ఠుని దగ్గరకుఁబోయి మంచిమాటలాడి మహాత్మా! సహజ సద్గుణములుగల కన్యారత్నము నా కూఁతురిది;)

క. మాన్యవరా! స్వయముద్యత, సన్యాసులభాభిరూప్య • నతులితవరసౌ
జన్య నన్నుం గృపఁ గని, కన్యాభిక్షగను దీనిఁ • గైకొనఁగదవే. ౪౬

అర్థములు. స్వయముద్యతన్=అయాచితముగ నీయఁబడిన దానిని, ఉత్తమ బ్రాహ్మణునకుఁ బ్రతిగ్రహము నిషిద్ధము, అయినను "ఉద్యతామాహృతాం భిక్షాం పురస్తాదప్రవేదితామ్ (చోదితామ్మని పాఠాంతరము) భోజ్యాం మేనే ప్రజానాథో హ్యపి దుష్కృతకర్మణః" తానై యాచింపక ముందుగాఁ జెప్పక తీసికొమ్మని తెచ్చి ముందుంచిన దానిని పాపులిచ్చినను దీసికొనవచ్చునని ప్రజాపతి యభిప్రాయము. పాపకర్ములనఁగా 'కులటాషండ పతిత వైరభ్యః శాకణీమపి, ఉద్యతామపి గృహ్ణీయా న్నాపద్యపి కదాచన' అంకుటాండ్రు, నపుంసకులు, పతితులు, విరోధులు=వీరు తెచ్చినది పుచ్చిన గవ్వయైనను ఎంతయాపద్దశయందుండినను గ్రహింపరాదు.

'తస్కరాత్ కితవాత్ షండాత్ దంభలోభమదాన్వితాత్, మాత్రా విత్తన్నగృహ్ణీయా దభక్తాదపచారతః.' దొంగలు జూదగాండ్రు షండులు వంచకులు లోభులు గర్వులు భక్తులు గానివారు అపచారములు చేయువారు వీరి వలన నాహార పదార్థములు దీసికొనరాదు.

'న తస్య పితరోశ్నంతి దశవర్షాణి పంచచ, నచ హవ్యం వహ త్యగ్ని ర్యస్తా మభ్యవమన్య తే॥' స్వయముద్యతమగు దానిని నిరాకరించువాఁడు పెట్టు శ్రాద్ధమందు వాని పితరులు పిండమును పదునైదు సంవత్సరములు గ్రహింపరు. వాని హవ్యమును నగ్ని దేవతల కొసంగఁడు.

ఆ పద్వశమున గ్రహింపక తప్పనపుడు 'దానం దదద్భిర్యైరుక్తమచ్యుతః ప్రీయతా మితి, ప్రతిగ్రహీతృభిశ్చైవ న తే మద్విష యోపగాః' అను శౌనక వచనము ననుసరించి ఇచ్చువాఁడు పుచ్చుకొనువాఁడు 'అచ్యుతః ప్రీయతా'మ్మని చెప్పి ప్రతి గ్రహింపవచ్చును. బలాదిమంత్రనిష్ఠులు బలాదిమంత్రము చెప్పి గ్రహింపవచ్చును. ఈనిషేధములు స్వార్థముగ గ్రహించునపుడే యనియుఁ, గుర్వర్థమో దేవతా కార్యార్థమో యైనపుడు పక్వాన్నము తప్ప మఱి దేనినైన గ్రహింపవచ్చునని యెఱుఁగవగు.

'అయాచితోపపన్నేషు నాస్తి దోషః ప్రతిగ్రహే, అమృతం తద్విదుర్దేవాస్తస్మాత్తం నైవ నిర్ణుదేత్. తానై యాచింపక లభించినదానిని ప్రతిగ్రహించిన దోషములేదు. అది దేవత లమృతముగా గ్రహింతురు. కావున దానిని నిరాకరింపరాదు. ఇది శాండిల్యమతము.

అన్య+అసులభాభిరూప్య=ఇతరకన్యలకు సులభముకాని సౌందర్యముగలది. అతులిత వర సౌజన్య=అసమానమైన శ్రేష్ఠమైన సద్గుణముగలది.

3)

### తాత్పర్యము

ప్రజాపతివై బ్రహ్మపుత్రుఁడవౌటచేఁ బూజ్యులందు నుత్తముఁడా! నీవు యాచింపక నేనై తెచ్చి తీసికొమ్మని ప్రార్థించుదానిని, ఇతరకన్యకలందు లేని సౌందర్యము కలదానిని, సాధుగుణము గలదానిని నీ వూర్ధ్వరేతస్కుఁడవగుటచేఁ గన్యలతో నీకుఁ గార్యము లేకున్నను నాయందు దయ తలఁచి నన్ను గృతార్థుని చేయుటకై నీకు శుశ్రూష చేయుటకై సమర్పించుచున్నాను. ఈకన్యను భిక్షగాఁ గైకొనుము.

చ. అతులతపస్సమాధి శ్రమ ♦ మందిన నీకు మహాత్మకా! యనా
రతపరిచర్య దృప్తియొన ♦ రం జరియించు నిజంబు, వహ్నులన్
సతతముఁ గాచు నన్న ముని ♦ చంద్రముఁ డీప్సితధర్మపద్ధతిన్
హితమతిఁ గా, గ్రహించెఁ, జని ♦ యెం దృణబిందుఁడు స్వాశ్రమోర్వికిన్. ౪౮

అర్థములు. అతుల తపస్సమాధిన్ = అసమానమైన తపస్సుచే సమాధి వలన, శ్రమము=బడలిక, అనారత=విడువక, పరిచర్య=సేవ, వహ్నులన్=అగ్నులను, ఈప్సిత ధర్మపద్ధతిన్=తృణబిందుఁడు కోరిన ధర్మమార్గము ననుసరించి హితమతిన్=మేలు చేయు కోరికతో, స్వాశ్రమోర్వికిన్=తన యాశ్రమ భూమికి

### తాత్పర్యము

దీనివలన నాకే కార్యముగలదు, నాకిది యేమిచేయు నని యనకుము. నీవుతపస్సు వేళ సమాధియందుండి లేచిన పిమ్మట నీకు బడలిక పోవఁ బదసేవ చేసి నీకుఁ దృప్తి గలిగించును. నీ యగ్నులను రక్షించును అని చెప్పఁగా నామునీంద్రుఁడు రాజుకోరిన ధర్మపద్ధతి నాలోచించి తాను గ్రహింపకుండిన నా కన్య భ్రష్టురాలగునే యని దాని మేలునకై గ్రహించెను. ఆ కన్య నచట విడిచి తృణబిందుఁడు తనయాశ్రమమునకుఁ బోయెను.

చ. లలనయు సద్గుణంబులఁ బు ♦ లస్త్యునకుం బ్రమదంబుఁ గూర్చుచున్
గొలుచుచు నుండె నా కుసుమ ♦ కోమల నిర్మలశీలవృత్తముల్
జలజభవాత్మజాతునకు ♦ సమ్మదమున్ ఘటియింప నొక్కనాఁ
డల జలజాస్యఁ గాంచి ప్రియ ♦ మారఁగ నిట్లనె వామలోచనా! ౪౯

అర్థములు. ప్రమదంబు=సంతోషము, కుసుమకోమల = పుష్పము వలె మృదువైన దేహము గలది. కుసుమకోమలి యనునది యపశబ్దము, నిర్మల శీల వృత్తముల్=శుద్ధమైన యాచారము, నడవడి, జలజభవాత్మజాతునకున్=బ్రహ్మపుత్రుఁడగు పులస్త్యునకు.

## తాత్పర్యము

ఆ కన్యయు మంచిగుణములచేఁ బతికి సంతోషము గలిగించుచు సేవసేయు చుండఁగా నామె పరిశుద్ధమైన యాచారము నడవడి చూచి పులస్త్యుఁడు సంతోషించి యామెను జూచి యిట్లులనియె.

క. మెచ్చితి నీ గుణములకును, నిచ్చెద నీకున్ వరం బ • హీనగుణాఢ్యున్
సచ్చరితె! మత్సమానునిఁ బ్రచ్చుఱఁ గనఁగోఁవెఁగఁ గలవు • కాంతా!సుతునిన్.

అర్థములు. అహీనగుణాఢ్యున్ = గొప్పగుణములను సంపత్తిగలవానిని, మత్సమానునిన్= నాతో సమానుఁడగు వానిని.

## తాత్పర్యము

(కాంతా! నీ గుణములకు మెచ్చితిని-నీకు వరమిచ్చెదను-నాతో సమానుఁడగు గొప్పగుణములుగల కొడుకును ద్వరలోఁ గనెదవు.)

గీ, ఉభయవంశంబులను నాతఁ•డుద్ధరించు, వెలఁది పౌలస్త్యుఁడని కాంచు•వినుతినివు
నాడునధ్యయనము విని•నాఁడుచూలు, పడుట విశ్రవసుం డన•వాఁడు వెలయు

అర్థములు. ఉభయవంశంబులను=తల్లిదండ్రుల వంశములను- నావంశము నీ తండ్రివంశము, వినుతి=కీర్తి, నాఁడు=ఆదినమునందు, చూలుపడుట=గర్భిణి వగుటచే, విశ్రవసుఁడు=శ్రవణమువలన జనించినవాఁడు.

## తాత్పర్యము

(ఆతఁడు నా వంశమును నీతండ్రివంశమును నుద్ధరింపఁగలడు. పౌలస్త్యుఁడని కీర్తి పడయును. నేనుచేయు నధ్యయనము విని, యప్పుడు గర్భిణివగుటచే విశ్రవసుఁడని ప్రసిద్ధి నొందును.)

చ. అనవుడు సంతసిల్లె వికి • చాంబుజలోచన కొంతకాల మే
గిన జనియించె సాధుమతి • విశ్రవసుండు త్రిలోకవిశ్రుతుం
డనుపమతుల్యదర్శి సుయ • శోంచితుఁ డుత్తమధర్మవర్తితి
జ్జనకనిభుండు సద్వ్రతుఁడు • సర్వకళాఢ్యుఁడు వేదవంతుఁడై. ౫౧

అర్థములు, వికచాంబుజ లోచన=వికసించిన కమలములవంటి కన్నులు గలది. ఏగినన్, ఏగినన్=పోఁగా, త్రిలోక విశ్రుతుండు=మూఁడు లోకములఁ బ్రసిద్ధి కెక్కినవాఁడు, అనుపమ=అసమానమైన, తుల్యదర్శి=సమదృష్టిగలవాఁడు, సుయశోంచితుఁడు=సత్కీర్తిచే నొప్పువాఁడు, ఉత్తమ ధర్మవర్తి=ఉత్తమమగు ధర్మమందు వర్తించువాఁడు తత్+జనక నిభుండు=ఆ తండ్రితో సమానుఁడు, సద్వ్రతుఁడు=మంచివ్రతములు గలవాఁడు, సర్వకలాఢ్యుఁడు=అన్ని విద్యలు తెలిసినవాఁడు, వేదవంతుఁడు=వేదము తెలిసినవాఁడు

### తాత్పర్యము

అని చెప్పఁగా నామె సంతోషించెను. ఆవలఁ గొంతకాలమునకు నామెకు మంచి మనస్సుగలవాఁడును మూఁడులోకములఁ బ్రసిద్ధుఁడును సర్వమునందు సమానభావము గలవాఁడును కీర్తిమంతుడును ఉత్తమధర్మమార్గమందు సంచరించువాఁడును తండ్రితో సమానుఁడును వ్రతములు గలవాఁడును సర్వవిద్యలు నేర్చినవాఁడును వేదజ్ఞుఁడును నగు విశ్రవసుఁడు జనించెను.

## 3వ సర్గము

ఉ. ఆతఁడు తండ్రిఁ బోలి నియ ♦ మాధికుఁడై తపముండి సత్యశాం
త్యాతతశీలవంతుఁ డయి ♦ యధ్యయనావిరతిన్ సమస్తభో
గేతరచిత్తవృత్తి యయి ♦ యెంతయు ధర్మపరాయణుండు నై
ఖ్యాతి నెసంగె నాతనిగు ♦ ణాఢ్యత విన్కిఁ బ్రహృష్టచిత్తుఁడై. ౧౨

అర్థములు. సత్యశాంత్యాతత శీలవంతుఁడయి=సత్యము శాంతి విశేష శీలము గలవాఁడై, అధ్యయన+అవిరతిన్=విడువక యధ్యయనము చేయుటచేత, సమస్త భోగేతర చిత్తవృత్తి=అన్నివిధములయిన భోగములకు నితరమైన మనోవ్యాపారము గలవాఁడై.

### తాత్పర్యము

ఆ విశ్రవసుఁడు తండ్రివలె నధికనియమము గలవాఁడై తపము చేయుచు సత్యవంతుఁడు శాంతిమంతుఁడు శీలవంతుఁడునై విడువక యధ్యయనము చేయ నాసక్తిచే నితరభోగములందు దేనియందు మనస్సుపోనీయక ధర్మమే పరమగతి యని తలఁచినవాఁడై ప్రసిద్ధివహించెను. ఆయన గుణసంపద విని సంతోషించినవాఁడై.

### —*విశ్రవసునకుఁ గుబేరుండు జన్మించుట*—

సీ. ముని భరద్వాజుండు ♦ తన తనూజాతను దేవవర్ణిని మహా ♦ భావునకును
నిచ్చి పెండిలి సేయ ♦ నింతిని గ్రహియించి, రెండవయాశ్రమ ♦ ముండి భద్ర
గుణుని శ్రేయోవంతుఁ♦గొమరు నా సతియందు,వీర్యాధికుని,గాంచె♦విశ్రవుండు
బ్రహ్మసద్గుణయుతు ♦ భావి ధనాఢ్యుఁ, గని తాత సంతోష ♦ గరిమఁ దనరి
ఆ. విబుధఋషులఁ గూడి ♦ విశ్రవుతనయుండు, వైశ్రవణుఁడనంగ♦వఱలుననుచుఁ
బేరు పెట్టె నతఁడు♦పెద్దవాఁడయి తపో, వనముఁ జేరి నియతి♦పరతనుండె. ౧౩

అర్థములు. దేవవర్ణినిన్=దేవతల కాంతిగలదానిని, మహాభావునకున్=గొప్ప మనస్సుగలవానికి, రెండవ యాశ్రమము=గృహస్థాశ్రమము, సప్తమ్యర్థమునఁ బ్రథమ, కొమరున్=కొడుకును, బ్రహ్మసద్గుణయుతున్ = శాంతిదాంత్య లోనగు బ్రాహ్మణగుణములు గలవానిని, భావిధనాఢ్యున్=రాఁగల కాలమున

ధనపతి యగువానిని, లగ్న వేళఁబట్టి తెలిసికొనెనని భావము, తాత=పులస్త్యుఁడు వైశ్రవణుఁడు=విశ్రవణుని కుమారుఁడు కావున వైశ్రవణుఁడు. అపత్యార్థక తద్ధితము. "విశ్రవసో విశ్రవణంవా" యని విశ్రవసా దేశము.

తాత్పర్యము

భరద్వాజుఁడను ముని తన పుత్రికను దేవసమాన సౌందర్యము గల దగుటచే దేవవర్ణిని యను పేరుగల దానిని నాయనకిచ్చి పెండ్లి చేసెను. ఇట్లు విశ్రవుఁడామెను భార్యగా గ్రహించి గృహస్థాశ్రమము నున్నవాఁడై యామెయందు నధికబలము గలవానిని శమదమాది గుణములు గలవానిని ముందు ధనపతి కాఁగల వానిని గనెను. ఆ బాలునిజూచి పులస్త్యుఁడు సంతోషించి విశ్రవణుని కుమారుఁడు కావున వైశ్రవణుఁడని నామకరణము గావించి సంతోషించెను. ఆవైశ్రవణుఁడు పెద్దవాఁడయి తపోవనమునకుఁ బోయి యచట నియమవంతుఁడై యుండెను.

ఆ. ఆహుతులను మండు • ననలుండు నాఁ దప, శ్శి నతండు వెలిఁగి•చిత్తమునను
దలఁచె ధర్మ మొకఁడె•తగు నుత్తమోత్తమ, మైనగతి యటంచు•నట్టుదలఁచి

అర్థములు. అనలుండు=అగ్నిహోత్రుఁడు.

తాత్పర్యము

నేతిని హోమము చేసిన మండు నగ్ని దేవునివలె నతఁడు తపస్సంపదచేఁ బ్రకాశించి ధర్మ మొకఁడే తనకుఁ బరమగతి యని తలఁచెను.

క. అతులితనిశ్చల నియమ, వ్రతుఁడై యుదకాశనుండు•పవనాశనుఁడున్
చ్యుతభుక్తుఁడు నై యొక్కొక, శతదశవర్షంబు తపము•సలుపన్ సొరిదిన్. ౧౧

అర్థములు. అతులిత=అసమానమైన, నిశ్చల=చలింపని, నియమ=నియమములతోఁ గూడిన, వ్రతుఁడై=వ్రతములు గలవాఁడై, అవి యేవి యనిన, ఉదకాశనుండు=జల మాహారముగాఁ గలవాఁడు, పవనాశనుండు=గాలి యాహారముగాఁ గలవాఁడు, చ్యుతభుక్తుఁడు=ఏయాహారము లేనివాఁడు, శతదశవర్షంబు=నూరుపదుల సంవత్సరములు, ద్విగురేకవచనమ్మని యేకవచనము, సొరిదిన్=వరుసగా.

తాత్పర్యము

అసమానమైన చలింపని నియమవ్రతములు గలఁవాడై తొలుతఁ గొన్ని దినములు జలమును ఆవలఁ గొన్ని దినములు గాలిని నాహారముగఁ గలవాఁడై యావల నదియు వదలి యీ ప్రకారము పదినూర్ల సంవత్సరములు తపము చేసెను.

చ. ఇటు లోకవేయియేఁడు లోక • యేఁడుగ ఘోరతపం బొనర్ప న
చ్చటికి విధాత దేవగణ • సంవృతుఁడై చనుదెంచి ప్రీతి నీ
పటుతరనిష్ఠ మెచ్చితిని • వత్సక! లెమ్ము వరంబుఁ గోరుమీ
తటుకున నన్న నాతఁడు య • థావిధి మ్రొక్కి వచించె నీగతిన్. ౧౮

అర్థములు. దేవగణ సంవృతుఁడై = దేవతాసమూహములతోడఁ జుట్టఁబడినవాఁడై.

తాత్పర్యము

ఈ ప్రకారము వేయిసంవత్సరము లొక సంవత్సరమువలె ఘోరమైన తపస్సు చేయఁగా దేవతలతోడ బ్రహ్మవచ్చి నాయనా! లెమ్ము! నీ దృఢనిష్ఠకు మెచ్చితిని. నీ వేది కోరెదవు కోరు మనిన నతడు శాస్త్రప్రకారము నమస్కరించి యిట్లనెను.

క. కోరెద దిగధీశత్వముఁ, గోరెద ధనరక్షణంబుఁ • గూర్మి నొసఁగవే
గీరమణీరమణ యనన్, గారవమున నతనిఁ జూచి • కంజజుఁ డనియెన్. ౧౯

అర్థములు. దిక్ + అధీశత్వము = దిక్పాలకత్వము, గీరమణీ రమణ = సరస్వతీ వల్లభా.

తాత్పర్యము

దిక్పాలకత్వము ధనరక్షణము కోరెదనిమ్మనిన బ్రహ్మయతనిఁజూచి యిట్లనియె.

—* బ్రహ్మ కుబేరు నుత్తర దిక్కున కధిపతిఁ జేయుట *—

సీ. లోకపాలురను న • ల్వుర నేను సృజియింప, జతనంబుఁ గావించి • శక్రరవిజ
వరుణుల నిలిపితి • వసుసఁ దత్పదముల, నందు నాలవవాఁడ • వగుము నీవు
నిధులకు నేతవై • నెగడుము దివ్య వి, మా ర్తండనిభము వి • మానవరము
దీనిని గైకొని • దేవతాసముఁడవై, విహరించుచుండుము • వేడ్కఁగోలఁది

తే. స్వస్తియగుఁ గాక నీకు నేఁ • జనెద నింక, నీకు వరముల రెండింటి • నిచ్చుకతన
నేనుఁ గృతకృత్యుఁడ నటంచు • నిర్జరాళిఁ గలసి స్వస్థానమునకేఁగె • జలజభవుఁడు.

తాత్పర్యము

నేను లోకపాలురను నలుగురను సృజింప యత్నించి ఇంద్ర యమ వరుణులను సృజించి వారికి వరుసగా తూర్పు దక్షిణము పడమరదిక్కులఁ బాలింప నియమించితిని. ఉత్తరదిశ నిలువయున్నది. నీవు దానికిఁ బతివై నిధుల నెల్లఁ బాలింపుము. సూర్యునితో సమానమైన యీదివ్యవిమానము దీసికొని దేవతలతో సమానముగ విహరింపుము. ఋషిపుత్రునివలె నుండకుము. నీకు మేలగునుగాక, నేనుబోయి వచ్చెదను, నీకు రెండువరములిచ్చుటచే నేను జేయవలసినపని చేసినవాఁడనైతినని చెప్పి దేవతలతోడ బ్రహ్మ తనలోకమునకుఁ బోయెను.

చ. వనజజుఁ డిట్లు వోవుటయు ♦ వైశ్రవణుండును దండ్రిఁ గావఁగాఁ
జని కరముల్ మొగిడ్చి జల ♦ జప్రభవుండు ప్రసన్నుఁడై యొసం
గినవరముల్ వచించి యొక ♦ గేము విధింపఁడు నిల్వ ధాత నా
కనయము సౌఖ్యదాయి నిల ♦ యంబు నబాధ మెఱుంగఁ దెల్పవే. ౧౯

అర్థములు. జలజప్రభవుండు = బ్రహ్మ, గేము = గేహశబ్దభవము, వాసస్థానము, అబాధము=బాధలేనిది.

తాత్పర్యము

ఇట్లు చెప్పి బ్రహ్మ వెడలిపోఁగా వైశ్రవణుఁడు తండ్రిని జూడఁబోయి నమస్కరించి బ్రహ్మయనుగ్రహించి తన కిచ్చిన వరములఁ దెలిపి, యాయన నాకు నివాసస్థానము చెప్పిన వాఁడు కాఁడు, నాకు సర్వదా సుఖము గలిగించునదియు బాధలేనిదియు నగు వాసస్థానముఁ జెప్పుము.

మ. అనుడున్ దక్షిణవారిరాశిని త్రికూ ♦ టాఖ్యాద్రిశృంగంబునన్
గొనబౌ లంక యనంగ నొక్కపురి ర ♦ క్షోనాథవాసార్థమై
మునుపానిర్జరశిల్పినిర్మితము సౌ ♦ ఖ్యం గూర్చు నెంతేని నీ
వనుమానింపక శక్రపట్టనము తీ ♦ రై యుంచు ధాత్రీస్థలిన్. ౨౦

అర్థములు. నిర్జరశిల్పి=విశ్వకర్మచే.

తాత్పర్యము

అని చెప్పఁగా విశ్రవసుఁ డిట్లనియె, దక్షిణసముద్రమునందుఁ ద్రికూటమను పేరుగల పర్వతము శిఖరమునందు నొక యందమైన పురము లంక యనునది గలదు. అది రాక్షసులు కాపురము చేయుటకై విశ్వకర్మ పూర్వము నిర్మించెను. అది మిక్కిలి యందమైనది. ఇంద్రుని పురమువలె నుండును. అది రాక్షసపురమే, నే నెట్లందు నుందునని సందేహింపకుము.

సీ. స్వర్ణవప్రంబున ♦ శస్త్రయంత్రావృత, పరిఖ వైదూర్యసు ♦ వర్ణతోర
ణంబులతోఁ గదు ♦ డంబుమీఱుచు నుండు, హరికిని వెఱచి ము ♦ న్నసురవరులు
దానిని విడనాడి ♦ తరలి రసాతల, వసుధఁ జేరుట నిప్డు ♦ ప్రభువు లేక
శూన్యమై యున్నది ♦ సుఖద మబాధంబు, నిర్దోష మది నీవు ♦ నెలవుకొనుమ
ఆ. యచట నన్న జనకు ♦ వచనంబులకుఁ బొంగి, లంక కేగి యందు ♦ శంక లేక
నైరృతాళిఁగూడి ♦ నానావిధార్థస, మృద్ధిఁ గూడి యుండె ♦ నిచ్చకోలఁది. ౨౧

అర్థములు. స్వర్ణవప్రంబును=బంగారు ప్రాకారము గలది, శస్త్రయంత్రావృత పరిఖ=శస్త్రములతోఁగూడిన యంత్రములచే నావరింపఁబడిన యగడ్తగలది.

హరికిని=విష్ణుదేవునకు సుఖదము=సుఖము నిచ్చునది, అబాధంబు=బాధ లేనిది నైరృతులు=యక్షులు, యక్షరాక్షస పిశాచాదు లేక రాశివారే.

తాత్పర్యము

బంగారు ప్రాకారము శస్త్రములతోడి యంత్రములు గల యగడ్తగలదై వైడూర్యములు బంగారు వీనితోడి గోపురములు గలదై మిగులఁ బ్రకాశించుచుండును. విష్ణువునకు భయపడి రాక్షసు లందుండక రసాతలమునకుఁబోయినారు. ఇప్పుడందు దెవ్వరు లేరు. దానికిఁ బ్రభువు లేఁడు. దిక్కులేక యున్నది. అది బాధ లేనిది, సుఖకరము, దోషము లేనిది కావున నీవు పోయి యందు వసింపుము అని చెప్పఁగాఁ దండ్రిమాటలకు సంతోషించి లంకకుఁబోయి యందు సందేహము లేక యక్షులతోడ అనేకవిధములయిన పదార్థములు విస్తారముగ నుండఁగా దన యిష్ట ప్రకారముండెను.

చ. కలుముల రాయఁ డిట్లు పరి ♦ ఖాయిత వార్ధి పురంబులోనఁ దా
వెలయుచు యోగవన్మరుద ♦ భిష్టుతుఁడై సురసుందరీ విలా
స లలితమైన యానమున ♦ సారసమిత్రుఁడు వోలె భానులన్
వెలుఁగుచు రాకపోకలను ♦ బ్రీతిని గూర్చుచు నుండెఁ దండ్రికిన్. ౬౨

అర్థములు. కలుముల రాయఁడు = ధనముల కధిపతి, పరిఖాయిత= అగడ్తవలెనైన, వార్ధి=సముద్రము గల, పురంబులోనన్=పట్టణమందు, యోగవత్ + మరుత్ + అభిష్టుతుఁడై=యోగులచేతను దేవగంధర్వాదులచే స్తోత్రము చేయఁబడినవాఁడై.

తాత్పర్యము

ధనపతి యగు నావైశ్రవణుఁడు సముద్రమే యగడ్తగాఁగల పట్టణమందు యోగులు దేవగంధర్వులు లోనగువారు స్తుతించుచుండఁగా దేవతాస్త్రీలచే నందమైన యింటియందున్నవాఁడై కిరణములచే సూర్యుఁడు ప్రకాశించునట్లు ప్రకాశించుచుఁ బుష్పక విమానముపైఁ బోవుచు వచ్చుచుఁ దల్లిదండ్రులకు సంతోషము గలిగించుచుండెను,

౪వ సర్గము

—* శ్రీరాముఁ డగస్త్యునిఁ బూర్వరాక్షసుల వృత్తాంత మడుగుట *—

చ. అనుచు నగస్త్యి పల్కఁగ హు ♦ తాశనతుల్యు మునీంద్రుఁ బల్మఱున్
గనుచు సవిస్మయాత్ముఁ డల ♦ కంజవిలోచనుఁ డేమి లంక ము
న్దనుజుల కాటపట్టొకో? వి ♦ నం గడువిస్మయ మయ్యె; రాక్షసుల్
మునిప! పులస్త్యవంశ్యు లని ♦ మున్ వినియుంటిమి, వీర లెవ్వొడన్. ౬౩

అర్థములు. అగస్త్యి=అగస్త్యుఁడు, హుతాశనతుల్యున్=అగ్నితో సమానమైనవానిని.

## తాత్పర్యము

ఈప్రకార మగస్త్యుఁడు చెప్పఁగా నగ్నితేజుఁడైన యా మునిశ్రేష్ఠుని బలుమాఱు చూచి యాశ్చర్యపడి రామచంద్రమూర్తి యిట్లనెను. ఏమి! లంక పూర్వముకూడ రాక్షసస్థానమా? ఇది వినుటకు నాశ్చర్యముగా నున్నది. రాక్షసులు పులస్త్య వంశమునఁ బుట్టినవా రని వినియుంటిమి.

సీ. అన్యులుగల రని • యాడితి రిప్పటి, దశకంఠ ఘటకర్ణ • తత్తనూజ
మంత్రులే బలియురో • మఱి తొల్లి వారలే, శూరులో? చెప్పుమీ • వారలెవరు?
వారల పేర్లెవ్వి? • వారల బల మెంత? యేమి దోషంబున • నెట్లు శౌరి
దఱిమె లంకాపురిఁ • దలఁగి పర్వెత్తఁగ? నీవాడుకుతుకంబు • భానుమాలి
ఆ. యిరుల జోపురీతి • హరియింపవే యన, నలఁతినగవుతోడ • నమ్మహాత్ముఁ
డాధరాసుతామ • నోబ్జభాస్కరుఁ గని యను, వినుతు వినుము పూర్వ • వృత్తమెల్ల.

అర్థములు. భానుమాలి = సూర్యుఁడు, ఇరులన్=చీఁకట్లను, జోపురీతి=పోఁగొట్టు విధముగ, అలఁతి నగవు=చిఱునవ్వు, తాను చేసినది తనకుఁ దెలియనట్లు నగుచున్నాఁడే యని, ధరాసుతామనోబ్జభాస్కరుఁడు = సీతాదేవి హృదయ కమలమునకు సూర్యుఁడైనవాఁడు, పూర్వవృత్తము=ముందు జరిగినది.

## తాత్పర్యము

(ఇతరు లున్నారని 'చెప్పితిరి. ఇప్పటి రావణుఁడు కుంభకర్ణుఁడు యింద్రజిత్తు మంత్రులు బలవంతులా? వెనుకటివారు శూరులా? వారలెవరు? వారల పేర్లెవ్వి? వారి బలమెంత? వారేమి తప్పుచేయుటచే విష్ణుమూర్తి వారలను లంకాపట్టణమునుండి తఱిమివేసెను? ఇది వినవలెనని కోరిక గలదు సూర్యుఁడు చీఁకట్లను పోఁగొట్టునట్లు నా సంశయమును బాపుడు' అని శ్రీరామచంద్రమూర్తి యడుగఁ జిఱునవ్వు నవ్వి యగస్త్యుఁడు 'శ్రీరామమూర్తితోఁ బూర్వ వృత్తాంత మంతయు వినుపించెద వినుము' అనెను.)

## —• యక్షరాక్షసుల యుత్పత్తి •—

ఉ. అంబుజసంభవుండు మును • నంబువులన్ సృజియించి పెక్కు స
త్త్వంబుల దాని రక్షకయి • తా నొనరింపఁగ క్షుత్పిపాసలన్
డంబఱి యువ్వి దైన్యమున • డాసి స్వకర్తను మాకు నేమి కా
ర్యంబు వచింపు మంచు విన • యంబున నన్నియు విన్నవించినన్. ౬౫

అర్థములు. అంబుజసంభవుండు = బ్రహ్మ, అంబువులన్ = జలములను, సత్త్వంబులను=ప్రాణములను, క్షుత్+పిపాసలన్=ఆకలిదప్పులచే, డంబఱి=కాంతి క్షీణించి.

తా త్ప ర్య ము

బ్రహ్మదేవుఁడు తాను రాత్రివేళ కమలమందు నిద్రించుసమయంబున జలముల రక్షించుటకై కొన్ని ప్రాణులను సృజించెను. అవి యాఁకలిదప్పులచే నలఁగి బ్రహ్మదేవుని జూచి మమ్మేల సృజించితివి? మాతోఁగాఁగల కార్యమేమి యని యడిగెను.

క. వానిని గని నవ్వుచు నా, మానసుఁడు, డిట్టనియె మీరు • మత్సృష్టజలం
బూనిక రక్షింపుఁడు మీ, కీనెతి కర్తవ్యమంచు • నెలమి వచింపన్. ౨౬

అర్థములు. మత్సృష్టజలంబు=నేను సృజించిన జలమును, నెతి=విధము, కర్తవ్యము=చేయఁదగినపని.

తా త్ప ర్య ము

(వానినిజూచి బ్రహ్మ యిట్లనియె. నేను సృష్టించిన జలమును మీరు రక్షింపుఁడు అది మీకు విధి-అని చెప్పఁగా.)

క. రక్షామ యనియె నం దబు, భుక్షిత సత్త్వములు దేవ • పూజితుతోడన్
జక్షామ యనుచుఁ బల్కెం బు, భుక్షితములు బ్రహ్మ యంత • భూతములకె నెన్.

. రక్షామ=రక్షించెదము, అబుభుక్షితసత్త్వములు=ఆఁకలిగొనని ప్రాణులు, జక్షామ=భుజించెదము, బుభుక్షితములు=ఆఁకలిగొన్నవి.

తా త్ప ర్య ము

బ్రహ్మ యిట్లు చెప్పఁగా నందు నాఁకలిగొననివి రక్షింతుమనియెను. ఆఁకలిగొనినవి భక్షింతుమనియెను. అప్పుడు బ్రహ్మ భూతముల కిట్లు చెప్పెను.

క. రక్షామ యనిన వారలు, రాక్షసు లగువారు భూత • రాసులలోనన్
జక్షామ యనిన వారలు, యక్షులు రగుఁడంచు ననియె•నవ్వారంలోలన్. ౨౭

తా త్ప ర్య ము

రక్షామ యనినవారు రాక్షసులుగను జక్షామ యనినవారు యక్షులుగను గండని బ్రహ్మ చెప్పెను, వారిలో

క. హేతిప్రహేతినాములు, భ్రాతలు జనియించి రుగ్ర • రాక్షసు లతి స
త్త్వాతులమధుకైటభనిభు, లాతతబలదర్ప శౌర్య • హతపరిపంథుల్. ౨౮

అర్థములు. అతిసత్త్వ=మిగుల బలమునందు, అతుల=అసమానులైన, మధుకైటభనిభులు = మధుకైటభులతో సమానులు, పరిపంథుల్ = శత్రువులు గలవారు.

### తాత్పర్యము

ఆరాక్షసులలో హేతియని ప్రహేతియని పేరుగల వారిరువురు రాక్షసులు బలమునందు మధుకైటభులతో సమానులు, విస్తార బలదర్పశౌర్యములచే శత్రువుల వధించువారు జనించిరి.

ఉ. అందుఁ బ్రహేతి ధర్మనిర • తాత్మకుఁడై వనసీమ కేగె, రా
కేందునిభాననన్ శమను • నిష్టసహోదరునిన్ భయాఖ్య ప్రే
మం దగ వేడి పెండ్లియయి • మానితరీతిని హేతి గాంచె నా
సుందరియందు నందనుని • శూరవరేణ్యు విభావిభావసున్. ౨౦

### తాత్పర్యము

ఆ హేతి ప్రహేతులను నిరువురిలోఁ బ్రహేతి యనువాఁడు ధర్మమునందాసక్తిగల మనస్సుగలవాఁడై తపము చేయ నడవులకుఁ బోయెను. రెండవ వాఁడగు హేతి యముని చెల్లెలును పూర్ణచంద్రుని వంటి ముఖము గల భయ యను పేరు గలదానిని పెండ్లియాడి దానియందు శూరులలో శ్రేష్ఠుఁడును కాంతియందు నగ్నిహోత్రుని.

క. విద్యుత్కేశుని నాతఁడ, నవద్యేతరతేజుఁడగుచు • వాలుచును బయః
ప్రోద్యత్కమలముభంగిని, మాద్యద్గతి సారిది వృద్ధి • మంతుఁడు కాఁగన్. ౨౧

అర్థములు. అవద్యేతరతేజుఁడు = దోషములేని తేజస్సు గలవాఁడు వాలుచు=విక్రమించి, పయఃప్రోద్యత్ +కమలము భంగిని=జలములందుఁ బుట్టిన కమలమువలె, మాద్యద్గతిన్=గర్వించిన విధముగ, సారిదిన్=క్రమముగ, వృద్ధిమంతుఁడు=వృద్ధినొందుచున్నవాఁడు.

### తాత్పర్యము

విద్యుత్కేశుఁడను వానిఁ గనెను. వాఁడు నిర్దోషమైన తేజస్సు గలవాఁడై యతిశయించు జలములందుఁ బుట్టిన కమలమువలెఁ బరిగొని క్రమక్రమముగ వృద్ధి పొందెను

సీ. యౌవనవంతుఁడై • యలగుపుత్రుఁ గాంచి, హేతి సంప్రీతి మై • నాతనికిని
పెండ్లిసేయఁగ గోరి • పెంపున సంధ్యను, హసియించుదాని సం • ధ్యాత్మజాతఁ
బుత్రునిమిత్తమై • పౌలఁతిని వేఁడంగఁ, బడఁతి పుట్టినయప్డె • పరులసొమ్ము
గావుట భావించి • కన్నిసాలకటంక, టాఖ్యనొసంగిన • నమరవిభుఁడు

ఆ. శచియు బోలె ససురదంపతుల్ దమి మీఱి, సుఖపయోధిఁ దేలి • సోలుచుండ
గంధివలన మబ్బు • గర్భంబుఁ దాల్చిన, కరణిఁ దరుణి దాల్చె • గర్భమంత.

అర్థములు. కంధి=సముద్రము.

### తాత్పర్యము

ప్రాయము వచ్చినకొడుకునుజూచి హేతి సంతోషించి యతనికిఁ బెండ్లిఁ జేయఁగోరి సంధ్యవంటి కాంతిగల దానిని సంధ్యయనుదాని పుత్రికను దన కొడుకున కిమ్మని కోరఁగా స్త్రీ పుట్టఁగానే పరులసొత్తగుట నాలోచించి సంధ్య తన పుత్రి సాలకటంకట యను దానిని విద్యుత్కేశున కిచ్చి వివాహము చేసెను. అతఁడు శచితోడ దేవేంద్రుఁడు భోగించునట్లు దానితో భోగింపఁగా సముద్రము వలన మేఘము గర్భము ధరించినట్లు ఆ రాక్షసుని వలన గర్భము ధరించెను.

### —• సుకేశుని జన్మవృత్తాంతము •—

ఉ. అంగన మందరాద్రికడ ♦ నగ్నిభవం బగు భూరిగర్భమున్
గంగ యనంగ వారిధర ♦ గర్భనికాశము నాత్మగర్భమున్
వెంగలి యొంటి నేగి ప్రస ♦ వించి నిసుంగును నంద వైచి తా
నంగజకేళికారతిని ♦ నాత్మధవుం దఱిసెన్ = యథామతిన్. ౨౩

అర్థములు. అగ్నిభవంబు=అగ్ని వలనఁ గలిగినది ఇది బాలకాండమందు వివరింపఁబడినది. చూ. బాల. ౪ ౨౪-౪ ౨౭ పద్యములు. వారిధరగర్భనికాశము= పిడుగుతో సమానమైనది, వెంగలి=బుద్ధిలేనిది, నిసుంగును=బిడ్డను, అంగజ కేళికారతిని=మన్మథక్రీడల యందలి యాసక్తిచేత.

### తాత్పర్యము

ఆ సాలకటంకట యనునది మందరాద్రి సమీపమందు గంగాదేవి యగ్ని వలనఁ గలిగిన గర్భమునుబోలె పిడుగుతో సమానమైన తన గర్భమును తెలివి మాలినదై యొంటరిగాఁ బోయి శిశువును గని యా శిశువును నందే విడిచి యిష్ట ప్రకారము రతికేళిమీఁద యాశచే భర్తయొద్దకుఁ బోయెను.

గంగను నుపమానముగఁ జెప్పుటచే నిదియుఁ గడుపు దించుకొని యాబిడ్డ నందే పాఱవైచి పోయెనని యేర్పడుచున్నది. నెలలు నిండి ప్రసవించినది కాదు. కావుననే వెంగలి యని చెప్పఁబడెను.

క. పుట్టినబిడ్డం డేగతిఁ, బట్టినొ యోజింప మఱచెఁ ♦ బడఁతుక కట్టా!
యెట్టెట్టి పనులు సేయరు, కట్టిడిజంతలు మనోజ ♦ కాండాహతలై? ౨౪

అర్థములు. కట్టా=అయ్యో! కట్టిఁడి = కట్టు+ఇఁడి = నియమహీనలైన, జంతలు=ధూర్తస్త్రీలు, మనోజ కాండాహతలై=మన్మథ బాణములచేఁ గొట్టఁబడినవారై.

తాత్పర్యము

పుట్టిన బిడ్డఁ డేగతిఁ బ్రతికెనో విచారించుటకే యా పాపాత్మురాలు మఱచెను అయ్యో! ధర్మపద్ధతిఁ గట్టుకొన్న మగనికిఁ బుట్టిన బిడ్డను అంకటాలువలె పాఱవైచెనుగదా. దుష్టస్త్రీలు కామాతిశయముచే నెంత పాపకార్యమైనఁ జేయ జంకరుగదా!

అర్థాంతరన్యాసాలంకారము.

ఉ. బాలుఁడు శారదాబ్జహిత • భాపటలిన్ వెలుఁగొంది తానుగా
వ్రేళుల నోరఁ గూరుకొని • పెద్దగ నేడ్వఁగ నాలపోతుపై
నాలును దాను బోవుచుఁ బు • రాహితుఁ డవ్యయుఁ డక్షరుండు శై
లాలయుఁ డభ్రవీథిఁ జను • చా రవమున్ విని గౌరి ప్రేరణన్. ౨౧

అర్థములు. శారదాబ్జ హితభాపటలిన్ = శరత్కాలమందలి సూర్యుని కాంతి సమూహముచే, ఆలపోతుపై=ఎద్దుమీఁద, పురాహితుఁడు=శివుఁడు, శైలాలయుఁడు=కైలాస పర్వతమం దుండువాఁడు, అభ్రవీథిన్ = ఆకాశమార్గమున, రవమున్=ధ్వనిని, అక్షరుఁడు=అవ్యయుఁడగుటచే షడ్భావరహితుఁడని యర్థము.

తాత్పర్యము

ఆ పిల్లవాఁడు శరత్కాల సూర్యుని కాంతిగలవాఁడై ప్రకాశించుచుఁ దాన్నే వ్రేళ్లు నోరఁ గూరుకొని గట్టిగా నేడువఁగా వృషభవాహనముపైఁ బార్వతితోడఁ బోవుచు నవ్యయుఁడు నక్షరుఁడు నగు శివుఁడు వాని జూచి దయావతి యగు పార్వతీదేవి ప్రేరింపఁగా.

క. కరుణార్ద్రచిత్తుఁడై యా, శరబాలకుఁ గాంచి యిచ్చె • జననివయస్సున్
బుర మాకాశగ మమరత, గిరిజయు నబ్బాలుఁగాంచి • కృప దళుకొత్తన్.

అర్థములు. కరుణార్ద్రచిత్తుఁడై = దయారసముచేఁ దడిసిన మనస్సుగలవాఁడై ఆశరబాలకున్=రాక్షసబాలుని, ఆకాశగమన = ఆకాశమునఁబోవునది, అమరతన్=చావులేమియును, గిరిజ=పార్వతి.

తాత్పర్యము

దయారసముచేఁ దడిసిన మనస్సుగలవాఁడై రాక్షసబాలునిఁ జూచి తల్లి యొక్క వయస్సును ఆకాశమునఁ బోఁగల విమానమును చావులేమియు నిచ్చెను. పార్వతీ దేవియు నా బాలునిఁ జూచి దయ యతిశయింపఁగా.

క సద్యోగర్భప్రాప్తియు, సద్యఃప్రసవంబు జనని • నమ మగు వయసున్
సద్యోవయోప్తి యొసఁగెను, జోద్యంబుగ నసురతతికి • సుర లరుదందన్. ౨౨

అర్థములు. సద్యోగర్భప్రాప్తియు = వెంటనే గర్భము వచ్చుట, సద్యః ప్రసవంబు=గర్భము వచ్చిన వెంటనే కనుట, సద్యోవయోప్తి = సద్యోవయ ఆప్తి=అప్పుడే వయస్సు వచ్చిన వా రగుట, వయస్+ఆప్తి=వయః ఆప్తి=వయ ఆప్తి=విసర్గమునకు హ్రస్వమైన అకారముతప్ప మఱి యే యచ్చు పరమైనను విసర్గకు లోపము.

## తాత్పర్యము

రాక్షసబాలునకుఁ బరమేశ్వరుఁ డిచ్చిన వరములతో సంతుష్టిపడక క్రూరలైన రాక్షసస్త్రీ లిట్టు లే బిడ్డల విషయమై ప్రవర్తింతు రని తలఁచి యీబాలుర యందుఁ బ్రేమగలదై దేవతి లాశ్చర్యపడునట్లు రాక్షసుల కందఱకు గర్భము వచ్చిన వెంటనే నెలలు నిండుట వెంటనే ప్రసవించుట ఆ పుట్టిన బిడ్డల కప్పుడే వయస్సు వచ్చుట యను వరము లొసఁగెను.

చ. హరవరదానగర్వమున ♦ నా యసురుండు సుకేశనాముఁ డం
బరచర మౌ పురంబుఁ గొని ♦ స్వైర విహారరతిం ద్రిలోకసం
చరణధురీణుఁ డయ్యె బల ♦ శాసనుమాడ్కిఁ, నసహ్యవిక్రమ
స్థిరుని సుకేశు ధర్మరతు ♦ సిద్ధవరుం గని ప్రీతియుక్తుఁడై. ౨౭

అర్థములు. హరవరదాన గర్వమునన్=శివుఁడిచ్చిన వరము వలన గర్వముచే, అంబరచరము=ఆకాశమున సంచరించునది, పురంబు=పురమువలె నుండు విమానము, స్వైరవిహారరతిన్ = స్వేచ్ఛగా సంచరించుటయం దాసక్తి గలవాఁడై, త్రిలోక సంచరణ ధురీణుఁడు=మూఁడు లోకములందు దిరుగు సామర్థ్యము గలవాఁడు, బలశాసనుమాడ్కిన్=ఇంద్రునివలె, సిద్ధవరున్=వరములు పొందినవానిని, (౨) సిద్ధులలో శ్రేష్ఠుని-సిద్ధులయందుండు నాకాశగమనాదులు వానియందుఁ గలవుకదా.

## తాత్పర్యము

శివుఁడిచ్చిన వరముచే గర్వించిసుకేశుఁడను పేరుగల యీ రాక్షసుఁడు ఆకాశగమనముగల విమానము గ్రహించి యిష్టము వచ్చినట్లు మూఁడులోకములనింద్రునివలె సంచరింపఁ సమర్థుఁడయ్యెను. సహింపరాని పరాక్రమము గలవాఁడును ధర్మమందాసక్తి గలవాఁడును వరములనొందినవాఁడును నగు సుకేశునిఁ జూచి ప్రీతిగలవాఁడై.

## ౫వ సర్గము

క. గ్రామణి యను గంధర్వ, గ్రామణి విశ్వావసునిభ ♦ ఘనతేజుఁడు శ్రీ
భామానిభ సుందరతా, ధామం దనముద్దుఁగూతుఁ ♦ దారుణ్యానిధిన్. ౨౮

అర్థములు. గంధర్వగ్రామణి = గంధర్వశ్రేష్ఠుఁడు, విశ్వావసు నిభఘన తేజుఁడు=అగ్నితో సమానమైన గొప్ప తేజస్సు గలవాఁడు, శ్రీభామానిభ=

లక్ష్మీదేవితో సమానురాలు, సుందరతాధామన్=సౌందర్యమునకు స్థానమైనది, తారుణ్యనిధిన్=వయస్సు వచ్చినదానిని.

తా త్ప ర్య ము

గ్రామణియను పేరుగల గంధర్వ శ్రేష్ఠుఁడు,అగ్నివంటి తేజస్సుగలవాఁడు, సౌందర్యమున లక్ష్మీదేవితో సమానురాలయి ప్రాయమువచ్చిన తన పుత్రికను దేవవతి యనెడు దానిని.

క. ఇచ్చి వివాహ మొనర్చిన, నచ్చెలి వరలబ్ధనిస్తు • లైశ్వర్యయుతున్
సచ్చరితుఁ బ్రాణధవుని, నిప్పచ్చరమున వేఁగుజీవి • భాగ్యముఁ బోలెన్. ౨౦

అర్థములు. వరలబ్ధ=వరములచే లభించిన, నిస్తుల=అసమానమైన, ఐశ్వర్య యుతున్=ఐశ్వర్యముఁతో గూడిన వానిని, నిప్పచ్చరమునన్= దారిద్ర్యముచే, వేఁగు=సంతాపపడు.

తా త్ప ర్య ము

ఇచ్చి పెండ్లి చేయఁగా వరములచే లభించిన యైశ్వర్యముగల మగని, మంచి నడవడి గలవానిని పేదఱికముచే బాధపడు ప్రాణి భాగ్యము పొందినట్లు పొందినదై.

క. పొంది యమందానందము, నం దనిసె నతండు నంగ • నం గూడి యనం
గుం దగుగతిఁ బూజించుచుఁ, నందించెను నంజనభవ • నాగం బనఁగన్. ౨౧

అర్థములు. తనిసెన్=తృప్తిపడెను, అనంగున్ దగుగతిఁ బూజించుచున్= మన్మథ సేవసేయుచు, రతిక్రీడలన్ దేలుచు, నందించెను=సంతోషించెను, అంజన భవనాగంబు=అంజనమను నేనుఁగునకుఁ బుట్టిన యేనుఁగువలె.

తా త్ప ర్య ము

(అమితానందమునఁ దృప్తిపడెను. అతఁడును తన భార్యనుగూడి మన్మథ క్రీడలఁ దేలుచు నంజనమను నేనుఁగునకుఁ బుట్టిన యేనుఁగువలె నానందించెను.)

—*సుకేశునకు మాల్యవదాదులు జన్మించుట*—

సీ. తేజరిల్లఁగ వారు • దేవవతీసతి, మూఁడులోకంబుల • మూఁడుకనుల
నగ్నిత్రయంబును • నామయత్రయమును, మంత్రత్రయంబును • మచ్చరించు
వారల ముగురఁ గు • మారులఁ గాంచెను. మాల్యవంతుండు సు•మాలినాఁగ
మాలి నాఁ బరఁగెడి • మహితబలాఢ్యుల, వార లుపేక్షిత • వ్యాధులనఁగ
తే. క్రమముగా వృద్ధిఁజెంది వ•రంబుపేర్మిఁ, గలుములెల్లను జనకుండు•గాంచు
చొఱఁగి
తపము సేయఁ దలంచి భ్రా • తలు సువర్ణ, శైలనికటంబునకు నేగి•సారనిష్ఠ

అర్థములు. అగ్నిత్రయము=ఆవాహనీయము, దక్షిణాగ్ని, గార్హపత్యము, ఆమయత్రయము=వాతపిత్త శ్లేష్మములు, మంత్రత్రయము=(౧) మూఁడు వేదములు, ప్రభు మంత్రోత్సాహములు, మూఁడులోకము లనుటచే స్థిరత్వమును, మూఁడగ్నులనుటచేఁ దేజస్విత్వము, మూఁడు మంత్రములనుటచే నపరిమిత సామర్థ్యము, మూఁడు వ్యాధులనుటచే హింసకత్వము గ్రాహ్యము, ఉపేక్షితవ్యాధులు=చికిత్స చేయక యలక్ష్యము జేసిన రోగములు, సువర్ణశైలనికటంబునకు=మేరు పర్వత సమీపమునకు.

### తాత్పర్యము

ఆ దంపతులిట్లు ప్రకాశించు చుండఁగా నా దేవవతి మూఁడు కన్నుల శివునితో సమానులగు వారిని మూఁడులోకములు మూఁడగ్నులు మూఁడురోగములు మూఁడు మంత్రములు వంటి వారిని ముగ్గురఁ గొడుకులను మాల్యవంతుఁడు సుమాలి మాలి యను పేరులు గలవారిని మిగుల బలవంతులఁ గనెను. వారు చికిత్సను చేయక యుపేక్షించిన రోగములవలెఁ గ్రమముగ వృద్ధి చెంది తమ తండ్రి తపస్సు చేసి వరములు సంపాదించి యైశ్వర్యవంతుఁ డయ్యెనని తెలిసికొని ముగ్గు రన్నదమ్ములు మేరుపర్వతము సమీపమునకుఁబోయి దృఢనిష్ఠ గలవారై.

తే. శమము సత్యార్జవంబు ల◆స్ఖలితములుగ, నఖిలభూత భయావహ◆మైనఘోర
తపముఁ గావింప దేవగం◆ధర్వమానవ, వాది లోకత్రయంబును◆హావళించె. ౧౩

అర్థములు. ఆర్జవంబు=చక్కఁటి నడవడి, అస్ఖలితములుగన్ = వదలకుండ, హావళించెన్=బాధపడెను.

### తాత్పర్యము

శమము సత్యము ఋజుత్వము వదలక సర్వప్రాణులు భయపడునట్లు ఘోరమైన తపస్సు చేయఁగా దేవతలు గంధర్వులు మనుష్యులు హాహాకారము గావించిరి.

ఉ. అంతఁ జతుర్ముఖుండు విబు◆ధావళితోడ సుకేశనందనా
భ్యంతిక దేశముం దఱిసి◆వాంఛిత మెయ్యది దీర్తునన్నఁ బా
కాంతక ముఖ్యదైవత స◆మావృతుఁ డిష్టదుఁ డైన భారతీ
కాంతుఁ డటం చెఱింగి ద్రుమ◆కాండములట్లు ప్రకంపితాంగులై. ౧౪

అర్థములు. అభ్యంతికదేశము=సమీపభూమి, తఱిసి=సమీపించి, పాకాంతక=ఇంద్రుఁడు, ఇష్టదుఁడు=వరముల నిచ్చువాఁడు, భారతీకాంతుఁడు=బ్రహ్మ, ద్రుమకాండములట్లు=చెట్లసమూహములవలె, ప్రకంపితాంగులై=వణఁకు దేహములు గలవారై.

తాత్పర్యము

అట్లు తపస్సు చేయఁగా బ్రహ్మదేవతలతోడ వారిసమీపమునకుఁ బోయి మీ కేమికోరికలు గలవు చెప్పుఁడు, ఇచ్చెదనని చెప్పఁగా ఇంద్రాది దేవతలతో నందు వాఁడు బ్రహ్మయని తెలిసికొని భయభక్తులచే వణకినవారై.

చ. కరములు మోడ్చి యిట్లనిరి ♦ కంజభవా! వరదుండ వేనియున్
జిర మగు జీవితంబును న ♦ జేయత శత్రునిహంతృతం బర
స్పర మనురక్తియుం బ్రభవ ♦ శాలితయుం గరుణింపవే దయా
కర! నతకంజభాస్కర! వి ♦ కారవిదూర! యటంచు మ్రొక్కినన్, ౧౬

అర్థములు. వరదుండవు=వరము లిచ్చువాఁడవు, అజేయత=పరులచే గెలువఁ బడకుండుట, శత్రునిహంతృతన్=శత్రువుల వధించుట, పరస్పరము=ముగ్గురన్నదమ్ములలో నొకరితో నొకరికి, ప్రభవశాలితయు = పరాక్రమముచేఁ బ్రకాశించుట, నతకంజభాస్కర=నమస్కరించువారనెడి కమలములకు సూర్యుఁడ వగువాఁడా.

తాత్పర్యము.

రెండు చేతులు జోడించి యిట్లు చెప్పిరి. బ్రహ్మదేవా! నీవు మాకు వరము లీయఁ దలఁచెదవేని దీర్ఘకాలము బ్రదికి యుండునట్లు, మమ్మెవ్వరు జయింప లేనట్లు, శత్రువుల మేము జయించునట్లు మాలో మాకనురాగ ముండునట్లు పరాక్రమము కలుగునట్లు లనుగ్రహింపుము అని మ్రొక్కఁగా,

తే. అట్టులగునంచు వచియించి♦యవ్విరించి,బ్రహ్మపురి కేగె బ్రాహ్మణ♦వత్సలుండు
వరములను బొంది యానిశా♦చరులు వెఱపు,లేక గారింపఁదొడఁగిరి♦లోకములను.

అర్థములు. విరించి=బ్రహ్మ, బ్రహ్మపురికిన్=సత్యలోకమునకు, కారింపన్=బాధపెట్టుటకు, తొడఁగిరి=ప్రారంభించిరి.

తాత్పర్యము

(అట్టులే యగునని చెప్పి బ్రహ్మ సత్యలోకమునకుఁ బోయెను. బ్రహ్మచే వరములు పొంది యారాక్షసులు వెఱపులేక లోకములను బాధింపఁబూనిరి.)

—∗మాల్యవదాదులు లంకయందుఁ జేరుట∗—

ఉ. వారు సురాసురాళిముని ♦ వర్గములన్ వధియింపఁ జొచ్చినన్
జేరుగ డేఁడు లేక కడుఁ ♦ జేష్ఫడె నారకజీవకోటినా
నారజనీచరుల్ పిదప ♦ నామరశిల్పిని విశ్వకర్మునిన్
జేరి వచించి రిట్లుగృహ ♦ సీమ నొకం డొనరింపుమీ వెసన్. ౧౭

అర్థములు. చేరుగడ=రక్షించుదిక్కు, అమరశిల్పిని=దేవతల శిల్పిని,

తా త్ప ర్య ము

వారు దేవతలను రాక్షసులను మునుల సమూహములను చంపఁబూనఁగా రక్షించు దిక్కులేక లోకము నరకమందుఁ బ్రాణులు బాధపడునట్లు, బాధపడ సాగెను. ఆ రాక్షసు లావల దేవశిల్పి విశ్వకర్మను బిలిచి మాకు మంచి భవనము త్వరగా నిర్మింపు మని చెప్పిరి.

క. ఓజ స్తేజోబలయుతు, లౌ జేజేతేండ్ల కీవ • యతిహృద్యం బై
రాజిలుదివ్యనికేతన, రాజిన్ నైపుణి రహింప • రచియింతు గదా. ౧౮

అర్థములు. ఓజస్+తేజస్+బలయుతులు=వీర్యము తేజస్సు బలములతోఁ గూడిన వారికి, జేజేతేం డ్లకున్ = దేవతలయందుఁ బ్రభువులగువారికి, అతి హృద్యము=మిగుల మనోహరము, నైపుణిన్=చమత్కారమున.

తా త్ప ర్య ము

వీర్యతేజోబలవంతులగు దేవతాశ్రేష్ఠులకు నీవే కదా మిగుల మనోహరమైన దివ్యగృహములు నిర్మించి యిచ్చువాఁడవు.

ఉ. మాకును నీవ మేరుగిరి • మందరహైమధరాశ్రయంబు సు
శ్రీకము శంకరాలయస • దృక్షము నౌగృహ మొండు దీర్పు మ
స్తోకవిభాయుతం బనఁగఁ • దోడనె యాతఁడు దక్షిణాబ్ధితీ
రాకలితత్రికూటకుధ • రాగ్రము పోల్పఁగఁ దద్ద్వితీయ మై ౧౯

అర్థములు. మేరుగిరి మందర, హైమ ధర ఆశ్రయము = మేరుపర్వతము మందర పర్వతము హిమవత్పర్వతము నాశ్రయించి యుండునది, సుశ్రీకము= మంచి రచన గలది, శంకరాలయ సదృక్షము=కైలాసముతో సమానమైనది, అస్తోక విభాయుతంబు=అధిక కాంతి గలది, దక్షిణాబ్ధితీర+ఆకలిత = దక్షిణ సముద్రతీరమునందుఁ గల, త్రికూటకుధరాగ్రము = త్రికూటపర్వత శిఖరము, తత్=ఆ కైలాసమునకు, ద్వితీయమై=రెండవదియై.

తా త్ప ర్య ము

మాకును నీవే మేరుపర్వతమునో మందరపర్వతమునో హిమవత్పర్వతమునో యాశ్రయించి యుండునదియు మంచి రచన గలదియు కైలాసమునకు సమానమైనదియు నగు గృహ మొకటి విశేష కాంతిగల దాని నిర్మింపుమని చెప్పఁగా నతఁడు దక్షిణ సముద్రతీరమునఁ ద్రికూటపర్వత శిఖరము కైలాసమునకు రెండవదియై యున్నది.

సీ. అంబుదసన్నిభం • బైన తన్మధ్యమ, కూటంబునను బక్షి • కోటికైన
దుష్ప్రాపమయి దిక్చ•తుష్కంబునను టంక, సంభిన్న మగుచు యో•జనశతంబు
నిడివియు ముప్పదా • మడ వెడలుపు నయి పసిఁడి ప్రాకారముల్ • పైఁడితోర
ణంబుల నింపయి • శంబసాధనునాజ్ఞ, మయుఁడు నిర్మించిన • మహితనగరి
తే. లంక యన నొప్పు దాని ని•శ్శంకముగను,జొచ్చి యమరావతీపురి•సురలయట్లు
పాలనము సేయుఁడీ శత్రు•వర్గములకుఁ, దలఁపునందేని మీరు దు•ర్ధర్షులగుచు,

అర్థములు. అంబుద సన్నిభము = మేఘముతో సమానము, తన్మధ్యమ కూటంబునను=దాని నడిమి శిఖరమందు, దుష్ప్రాపము=పొందరానిది, దిక్ + చతుష్కంబునను=నాలుగు దిక్కుల, టంకసంభిన్నము=ఉలితోఁ జెక్కఁబడినది, శంబసాధను=ఇంద్రునియొక్క, దుర్ధర్షులు=తిరస్కరింపరానివారు.

తాత్పర్యము

ఆకాశమున మేఘమువలె నాపర్వత శిఖరములలో నడిమిది పక్షులకైనను బొందరానిది. అంతయెత్తు పక్షులు నెగురఁజాలవు. దానికి నాలుగు ప్రక్కల నులితోఁ మలచఁబడి యున్నది. కావున నెవరైన నెక్కివచ్చుటకు సాధ్యపడదు. అది నూఱామడ పొడుగు ముప్పదామడ వెడల్పుగలదై బంగారు ప్రాకారములు గోపురములు గలదై యున్నది. దానిని బూర్వమున నింద్రునియాజ్ఞచే మయుఁడు నిర్మించెను. ఆ నగరముపేరు లంక. దానియందు మీరు ప్రవేశించి నిశ్శంకముగ దేవత లమరావతియందువలె మీరు విరోధులకుఁ దిరస్కరింపరానివారై పాలనము చేయవచ్చును

క. అని విశ్వకర్మ చెప్పిన, ననుచరసాహస్రయుక్తు•లై యా రక్షో
జననాథులు చని పరిఖా, కనకగృహాన్విత లంకఁ • గ్రాలిరి సుఖులై. ౯౧

అర్థములు. అనుచర సాహస్రయుక్తులై=వేలకొలఁది భటులతోఁగూడినవారై, పరిఖా=అగడ్తలతోడను, కనకగృహ=బంగారిండ్లతోను, అన్వీత=కూడిన.

తాత్పర్యము

(అని విశ్వకర్మ చెప్పఁగా వేలకొలఁది భటులతోఁ గూడినవారైయగడ్తలతో, బంగారిండ్లతో నొప్పు లంకకుఁ బోయి సుఖముగా నుండిరి.)

సీ. వా రిట్లు స్వేచ్ఛావి • హారులై వర్తిల్ల, నర్మద యనెడు గం • ధర్వతరుణి
కీర్తి ధీ శ్రీ సమ • మూర్తుల ముగ్గురఁ, దనయల నిచ్చెవా • దనుజులకును
వారును నరుసగ • వారి నుత్తర ఫల్గు, నీ తారఁ బెండ్లాడి • నిర్జరాంబు
జాక్షులతో సుర • లట్లు క్రీడించిరి, మాల్యవంతుం డాత్మ • మహిపి సైన

ఆ. సుందరీసమాఖ్య • సుప్తఘ్న దుర్ముఖో, న్మత్తయజ్ఞ కోప • మత్తవజ్ర
ముష్టులను విరూప • దృష్టి విరూపాక్షు, సుతుల ననల యనెడు•సుతనుగనియె

అర్థములు. నిర్జర+అంబుజాక్షులతోన్=దేవతాస్త్రీలతో.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము వారు స్వేచ్ఛగా సంచరింపఁగా నర్మద యనెడి గంధర్వ స్త్రీ, కీర్తి, ధీ, శ్రీలను బోలిన తన ముగ్గురు కొమారితలను ఆ ముగ్గురు రాక్షసులకు వరుసగనిచ్చి వివాహము చేసెను. వారు వారిని నుత్తరఫల్గునీ నక్షత్రమందు వివాహమాడి దేవతలు దేవతాస్త్రీలతోఁ గ్రీడించునట్లు క్రీడించిరి. అందు మాల్యవంతుఁడు తన భార్యయగు సుందరి యని పేరుగల దానియందు సుప్తఘ్నుఁడు దుర్ముఖుఁడు ఉన్మత్తుఁడు యజ్ఞకోపుఁడు మత్తుఁడు వజ్రముష్టి విరూపాక్షుఁడు అను కొడుకులను అనల యను పుత్రికను గనెను.

సీ. ప్రాణంబులకుమిన్న•యగు కేతుమతియందుఁ, గనియె సుమాలి య•కంప నాఖ్యుఁ
గాలకార్ముకభాస • కర్ణ సుపార్శ్వుల, సంహ్రాదినిం బ్రఘు • స ప్రహస్త
వికటధూమ్రాక్షుల•వికటసీలుండైన, దండుఁ డన్ సుతులను•ద్దండబలుల
రాకఁ బుష్పోత్కట, • కైకసీ కుంభీన, సీ సమాఖ్యలు గల • స్త్రీల నవల
తే. మాలివసుధాఖ్యయనియెడి•మగువయందు, ననిలుననలుని సంపాతి•హరుని గనిగా
వీరలె విభీషణునిమంత్రు•లైరహించి, రవల నిట్లు తదీయాన్వ•యంబు పెరిఁగె.

తా త్ప ర్య ము.

సుమాలి యనువాఁడు తన ప్రాణము కంటెఁ బ్రియమగు కేతుమాలియను దానియందు నకంపనుఁడు కాలకార్ముకుఁడు భాసకర్ణుఁడు సుపార్శ్వుఁడు సంహ్రాది ప్రఘసుఁడు ప్రహస్తుఁడు వికటుఁడు ధూమ్రాక్షుఁడు దండుఁడు అను మహాబలవంతులఁ బుత్రులను రాక, పుష్పోత్కట కైకసి కుంభీనసి యను పుత్రికలను గనెను ఆవల మాలి యనువాఁడు వసుధ యను పేరు గల భార్యయందు అనిలుఁడు అనలుఁడు సంపాతి హరుఁడు నను నలువురఁ బుత్రులఁ గనెను. ఈ నలువురే వెనుక విభీషణుమంత్రులైరి. ఈ విధముగ వారి వంశము వృద్ధియయ్యెను.

—*మాల్యవదాదులకు వెఱచి సురలు శివుశరణముఁ జొచ్చుట*—

కవిరాజవిరాజితము. సుతశతకంబునుగూడి నిశాచర•శూరులు ముగ్గురు గర్వితులై
హితముఁదలంపక బ్రహ్మవరంబున • నెల్లజగంబుల రేఁగి సదా
గతిగతిఁ ద్రిమ్మరుచున్ బుషిపన్నగ • కాండములన్ సహశక్రమరు
త్తతులను యక్షుల నేఁచిరి వేఁచిరి•తాఁచిరిపూఁచి దురాసదులై. ౯౯

అర్థములు. సదాగతిగతిన్=వాయువువలె; పన్నగకాండములన్ = సర్ప సమూహములను, సహశక్ర=ఇంద్రునితోడి, మరుత్తులను=దేవతలను, ఏఁచిరి= బాధించిరి, వేఁచిరి=పరితపింపఁ జేసిరి. కాఁచిరి=కొట్టిరి, పూచి=పూని.

## తా త్ప ర్య ము

ఆ రాక్షససోదరులు ముగ్వురు ననేకపుత్రులతోఁ గూడి గర్వించి మేలు నాలోచింపక బ్రహ్మవరము గలదని విజృంభించి గాలివలె నెందును నడ్డము లేక తిరుగుచు ఋషులను పన్నగులను ఇంద్రునితోడి దేవతలను పని పూనికొట్టితపింపఁ జేసి బాధించిరి.

## ౮వ స ర్గ ము

అంబురుహము. వారలు పెట్టెడి బాధల నెల్ల సు • పర్వకోటులు మానులున్
సైరణ సేయఁగఁ జాలక యెల్లరు • సాధ్వసార్తులు నొక్కటై
మారునివైరిఁ బురారిఁ ద్రినేత్రుని • మాధవున్ హరునిన్ జగ
త్కారణు మారణు లోకనమస్కృతు • దైవతాధిపు శంకరున్.

అర్థములు. సుపర్వకోటులు = దేవతాసమూహములు, సాధ్వసార్తులు= భయముచేఁ బీడింపఁబడినవారు, మారుని వైరిన్ = మన్మథునకు విరోధి యగు వానిని, పురారిన్=మూఁడు పురములు దహించినవానిని, త్రినేత్రున్ = మూఁడు కన్నులు గలవానిని, ఉమాధవున్=పార్వతి భర్తను, జగత్కారణ = ప్రపంచము నకుఁ గారణమైన వానిని, మారణు=లోకసంహారము చేయువానిని.

అంబురుహ వృత్తమునకు నాలుగు భగణములు ర, స, లగములు, పదమూ డవ స్థానంబున యతి.

## తా త్ప ర్య ము

దేవతలు మునులు వారు పెట్టెడి బాధలు సహింపలేక భయపీడితులై యందఱొక్కటిగఁ జేరి మన్మథుని జయించి పురములు దహించి మూఁడుకన్నులు గల వానిని ప్రజాపతులలోఁ జేరినవాఁ డగుటచేఁ జగత్తునకు కారణమైన వానిని కాలాగ్ని రుద్రుఁడగుటచే సంహారము చేయువానిని లోకముచేఁ బూజింపఁబడు వానిని దేవతల కధిపతియగువానిని శివుని.

ఉ. చేరఁగ నేగి హస్తములఁ • జేరిచి తొట్రిల మాట భీతిచే
నీరజసూతిదత్తవర • నిర్భరగర్వము పేర్మి దేవతా
వారములం బ్రజావళుల • బాధలు పెట్టిరి ఘాతకోటికిన్
గూరిచి రెల్లకీడులను • గ్రూరతఁ బేర్చి సుకేశనందనుల్. ౮౮

అర్థములు. తొట్రిలన్=తడబడఁగా, నీరజసూతిదత్త=బ్రహ్మచే నీయఁ బడిన, వర=వరములచే, నిర్భర=అధికమైన, గర్వము పేర్మిన్=పొగరు యొక్క యతిశయముచే.

తా త్ప ర్య ము

సమీపించి రెండు చేతులు జోడించి నమస్కరించి భయముచే మాటతడఁబడుచుండ బ్రహ్మ యిచ్చిన వరములచే గర్వించి సుకేశుని కుమారులు క్రూరులై దేవతలను మనుష్యులను భూతములను మిగులఁ గీడులపాలు చేయుచున్నారు.

క. దేవా! నాకమువలనన్, దేవతలను దఱిమి వైచి • దేవతలవలెన్
దేవనముల నుపవనముల, వావిరి క్రీడించు చున్న • వార లభీతిన్. ౯౭

అర్థములు. నాకమువలనన్=స్వర్గమునుండి, దేవనములన్=క్రీడలను, ఉపవనములన్=ఉద్యానవనములందు, అభీతిన్=భయములేనివారై.

తా త్ప ర్య ము

(దేవా! దేవతలను స్వర్గమునుండి తఱిమివేసి దేవతలవలె నుద్యానవనములలో నిర్భీతిగాఁ గ్రీడించుచున్నారు.)

శా. నేనే విష్ణుఁడ నేన రుద్రుఁడను నేనే • బ్రహ్మ నే నింద్రుఁడన్
నేనే కాలుఁడ నేన చంద్రుఁడను నే • నే పాశి నే సూర్యుఁడన్
నేనే యప్పతి నంచు సంగరమదో • న్మేషంబునన్ సర్వలో
కానీకంబుల అంపు చేసెదరు భ • ర్గా! మమ్ము రక్షింపవే. ౯౮

అర్థములు. పాశి=యముఁడను, అప్పతి=వరుణుఁడ, సంగరమదోన్మేషంబునన్=యుద్ధమందలి గర్వాతిశయముచే.

తా త్ప ర్య ము

నేనే విష్ణుఁడను నేనే రుద్రుఁడను నేనే బ్రహ్మను ఇంద్రుఁడను నేనేమృత్యుదేవత నేనే నేనే చంద్రుఁడను నేనే యముఁడను నేనే సూర్యుఁడను నేనే వరుణుఁడను నాకంటె వేఱుదేవత లెవ్వరు గలరని యుద్ధమునందు జయింపఁగలమను గర్వాతిశయముచే సమస్త లోకులను బాధపెట్టుచున్నారు భర్గా! మమ్ము రక్షింపుము.

క. క్రూరరూపముఁ గొని యను, గారిని నమ్మాల్యవంతు • ననుజసమేతున్
ఘోర వధించి జగంబుల, నారయు మనఁగా సుకేశు • నందలి ప్రేమన్ ౯౯

తా త్ప ర్య ము

క్రూరమైన యాకారమును ధరించిన వాఁడవై తమ్ములతోఁ గూడినవాఁడును దేవవిరోధియు నగు మాల్యవంతు యుద్ధమునఁ జంపి లోకముల రక్షింపుమని వేఁడఁగా సుకేశునందలి ప్రేమచే మాల్యవదాదులయందుఁ బక్షపాతముగలవాఁడై,

చ. హరుఁడు వచించె నో యమరు • లార! యవధ్యులు వారు నాకు, నేఁ
బోరిగొన నేర, నైన నొక • పోఁడిమి చెప్పెద వారు ద్రుంగఁగా
హరి శరణంబు వేఁడుఁడు, మ • హావిభుఁ డాతఁడు వారినెల్ల రన్
బరువడిఁ ద్రుంచుఁ బొం డనఁగ • వారు జయోక్తులు పల్కుచున్ వెసన్. ౧౦౦

అర్థములు. అవధ్యులు = చంపరానివారు, వారిని నను నేజయింపలేనని యర్థముగాదు; నేను వారిని జంప నిష్టపడను, పోఁడిమి = ఉపాయము, మహావిభున్=మీకును నాకును గొప్ప ప్రభువు.

### తాత్పర్యము

శివుఁ డిట్లనియె. దేవతలారా! వారిని నేను జంపశక్తుండనుగాను. వారిని నేను జంపలేను. వారియందు నాకుఁగల ప్రేమయే కారణము. అయినను వారు చచ్చుటకు మీకొక యుపాయము చెప్పెదను. విష్ణువునకు మీరు శరణాగతులు గండు. విష్ణువునకు శరణాగతుల రక్షించుట దీక్ష గావున మీశరణాగతి వ్యర్థము పోదు. ఆమహాప్రభువు వారి నందఱ శీఘ్రముగ వరుస పెట్టి చంపును పొండు అనిచెప్పఁగా వారు జయజయ యనుచు త్వరగా.

### —• దేవతలకు విష్ణు వభయ మిచ్చుట •—

క. ఘని శంఖచక్రధరునిం, గని తమదుఃఖంబు లెల్లఁ • గమలాధవుతో
మనవి యొనర్చిరి దేవా!, వినవే మాపడెడిపాట్లు • విశ్వశరణ్యా! ౧౦౧

అర్థములు. శంఖచక్రధరునిన్=ఎవరు శరణు అందురో, ఆయుధముల వెదకుకొనుచుఁ బోయి యాలస్యము చేయక వెంటనే వారి రక్షింపవలయునని శంఖచక్రాద్యాయుధముల సదా ధరించియుండువానిని, కమలాధవుతోన్ = లక్ష్మీవల్లభునితో, విశ్వశరణ్యా=ప్రపంచరక్షకా.

### తాత్పర్యము

(పోయి, శంఖచక్రధరు లక్ష్మీవిభుని శ్రీమహావిష్ణునిఁజూచి, దేవా! విశ్వశరణ్యా! మేము పడుచున్న బాధలు వినవే యని తమ దుఃఖములన్నియు మనవి చేసిరి.)

సీ. అగ్నిత్రయముఁ బోలు • వసురులు ముగురు సు, కేశుని సుతులు సు • రేశవైరు
లల త్రికూటాద్రి లం • కాఖ్యపురంబును రాజధానిఁగఁ గొని • క్రాలువారు
కమలజావరమున • గర్వించి దర్పించి, కాపు సేసెద రయ్య • లోకములను
మాదుఃఖముల నెట్లు • మనవి యొనర్తుము, ద్రుంపవే వారలఁ • దూర్ణముగను

ఆ. నీవ మాకు దిక్కు • నిఖిలలోకేశ్వర!; శరణ మీవ భూత • చయశరణ్య!
యొక్కఁడీవు దక్క • దిక్కెవ్వరును లేరు, మాభయంబుఁ బాపు • మాకళత్ర.

అర్థములు. కాను=కలఁతనొందినది, మాకళత్ర=లక్ష్మీదేవి భార్యగాఁ గలవాఁడా.

తాత్పర్యము

(నిఖిలలోకేశ్వరా! త్రేతాగ్నులవంటి రాక్షసులు ముగ్గురు. సుకేశుని కొడుకులు. దేవతలకు విరోధులు-ఆ త్రికూట పర్వతము మీఁద లంకయను పట్టనమును రాజధానిగాఁ జేసికొని యున్నవారు. బ్రహ్మవరమున గర్వించి, లోకములను బీడించుచున్నారు. మా దుఃఖముల నేమని మనవి గొనర్చెదము? వారలను శీఘ్రముగాఁ జంపుము. నీవే మాకు దిక్కు. నీవే శరణము. నీకంటె మాభయమును బోఁగొట్టఁగల రక్షకు లితరు లెవరు లేరు)

క. మంచు విరియించు రవిగతిఁ, ద్రుంచి నిశాచరుల హితుల • తో బంధులతో
నించి జగంబుల ముదమునఁ, బంచాయుధహస్త! మమ్ముఁ • బాలింపుమనన్

అర్థములు. పంచాయుధహస్త=ఐదాయుధములను జేతఁగలవాఁడా, విల్లు=శార్ఙ్గమ్ము, చక్రము=సుదర్శనము, శంఖము=పాంచజన్యము, కౌమోదకి=గద, ఖడ్గము=నందకము-ఈ యైదాయుధముల ధరించిన ఫలము సార్థకము చేసికొనుము అని భావము.

తాత్పర్యము

(సూర్యుఁడు మంచును నశింప జేయునట్లు హితులతో బంధువులతో రాక్షసులను సంహరించి, జగములను నానందమున ముంచి, మమ్ముఁ బాలింపుము-అని ప్రార్థింపఁగా.)

ఉ. వారలభీతిఁ దీర్చ నవ • వారిజలోచనుఁ డిట్లు పలుకు- న
వ్వారల నే నెఱుంగన శి • వాధవ లబ్ధవరప్రమత్తునిన్
వీరు సుకేశు నయ్యసుర • పెద్దకుమారుని మాల్యవంతునిన్
నీరజగర్భదత్తవర • నిష్ఠురశీలుని సానుజన్మునిన్ ౧౦౪

అర్థములు. నవవారిజలోచనుఁడు=క్రొత్త తామర పూవులవంటి కన్నులు గలఁవాఁడు, ఇది రక్షింపఁదగినవారు దొరకిరిగదా యను సంతోషమును దెలుపును. శివాధవ=పార్వతీపతియగు శివునిచే, లబ్ధ=పొందఁబడిన, వర=వరములచే, ప్రమత్తునిన్=మిగుల మదించిన వానిని, నీరజగర్భదత్తవర=బ్రహ్మచే నీయఁబడిన వరములుగల, నిష్ఠురశీలుని=కఠినస్వభావుని, సానుజన్మునిన్=తమ్ములతోఁ గూడిన వానిని.

తాత్పర్యము

వారల కభయహస్తమిచ్చి వారిభయము తొలఁగఁజేసి క్రొందామరలఁబోలిన కన్నులుగల విష్ణుమూర్తి యిట్లనెను. దేవతలారా! శివునిచే వరములఁబొంది గర్విం

చిన సుకేశుని, బ్రహ్మచే వరములు పొందిన కఠినశీలుఁ డగు వానిని, తమ్ములతోఁ గూడిన మాల్యవంతుని నే నెఱుఁగనాయేమి ?

చ. తనుకొలఁదుల్ దలంపక మ • దంబున రేఁగి చరించు దుష్టులన్
విమతుల రాక్షసాగ్రణుల • వే వధియించెదఁ గ్రమ్మఱందు మీ
దమునను మీరు మీ నిలుచు • తావులకున్ విగతామనస్యులై
యమర వరేణ్యులార! యన • హర్షరసోల్లసితాంతరంగులై. ౧౦౫

అర్థములు. తనుకొలఁదులు=తమశక్తి సామర్థ్యములు, విమతులన్=విరోధులను-విరుద్ధమగు నభిప్రాయము గలవారిని, విగతామనస్యులై = బాధలేనివారై, 'పీడా బాధా వ్యథా దుఃఖ మామనస్యం ప్రసూతిజమ్-ఆమనస్యము-నా- అమానస్యము=ఇది మనఃకష్టమునకుఁ బేరు,' హర్షరస=సంతోషరసముచే, ఉల్లసిత=మిగులఁ బ్రకాశించు, అంతరంగులై=హృదయముగలవారై.

తాత్పర్యము

తమశక్తిసామర్థ్యము లేమాత్రమో, బ్రహ్మరుద్రాదుల వరములు తమ్మెంత మాత్రము కాపాడఁ గలవో యని యాలోచింపక గర్వముచే విజృంభించి తిరుగు దుష్టులను మీ విషయమున విరుద్ధాభిప్రాయము గల శత్రువులను రాక్షసశ్రేష్ఠులను వేగ జంపెదను. మీ మీ స్థలములకు మీరు పొండని చెప్పఁగా వారు దుఃఖమును వదలి సంతోషించినవారై.

క. విష్ణుని బ్రభవిష్ణుని రో, చిష్ణు నరినిరాకరిష్ణు • జిష్ణున్ బలవ
ర్ధిష్ణుని నలంకరిష్ణు స, హిష్ణుని నిజభక్తలోక • హితవర్తిష్ణున్. ౧౦౬

అర్థములు. విష్ణుని=సర్వవ్యాపిని, ప్రభవిష్ణుని = కోరినప్పుడు కోరిన రూపముతో జనించు వానిని, రోచిష్ణున్=ప్రకాశించు స్వభావము గలవానిని, అరి=శత్రువులను, నిరాకరిష్ణున్=తిరస్కరించు స్వభావము గలవానిని జిష్ణున్=జయించు స్వభావము గలవానిని, బలవర్ధిష్ణున్=బలముచే వృద్ధిపొందు స్వభావము గల వానిని, అలంకరిష్ణున్ అలంకరించుకొను స్వభావము గలవానిని, సహిష్ణునిన్=సహనము గలవానిని, నిజభక్తలోక=తనభక్తులగు జనములకు, హిత = మేలగు రీతిగ, వర్తిష్ణున్=వర్తించు స్వభావము గలవానిని.

తాత్పర్యము

'అజాయమానో బహుధా విజాయతే' యన్నట్లు జన్మములు లేకున్నను భక్తుల నిమిత్తమై పుట్టు స్వభావము గలవానిని, ప్రకాశించు వానిని, శత్రువులఁ దిరస్కరించు వానిని, గెలుచు స్వభావము గలవానిని, బలముచే వృద్ధినొందు వానిని,

అలంకరించుకొను స్వభావము గలవానిని, భక్తుల యపరాధముల సహించువానిని, తనభక్తులకు మేలగు మార్గమున వర్తించువానిని, విష్ణుదేవుని.

చ. తెలచుచు బ్రొమ్కుచున్ మునులు ♦ దేవతలుం దమవీడుపట్లకై
యెలమిఁ జనంగ నయ్యమర ♦ వృత్తమెఱుంగుచు మాల్యవంతుఁడున్
బలియురఁ దమ్ములం బిలువఁ ♦ బంచి వచించెను దమ్ములార! మీ
రలు వినలేదె వార్తయుమ ♦ రప్రముఖాచరితంబు నిస్స్యాదన్. ౧౧౭

అర్థములు. తెలచుచున్= పొగడుచు, ఎలమిన్=సంతోషముతో, అమర వృత్తము=దేవతల వర్తనము, అమరప్రముఖ+ఆచరితంబు = దేవ శ్రేష్ఠులచే గావింపఁబడినది.

### తాత్పర్యము

పొగడుచు నమస్కరించుచు మునులు దేవతలు సంతోషముతో వారి వారి స్థలములకుఁ బోయిరి. దేవతలచర్య యంతయుఁ దెలిసికొని మాల్యవంతుఁడు బలవంతులగు తన తమ్ములఁ బిలిపించి ఇట్లు చెప్పెను. తమ్ములారా! దేవతాశ్రేష్ఠులు చేసిన కార్యము మీరు వినలేదా?

### —• మాల్యవంతుఁడు సురలపై దండెత్త నాలోచించుట •—

చ. సురలును మౌనులున్ హరునిఁ ♦ జూడఁగ నేగి సుకేశు నందనుల్
వరబలదర్పితుల్ పఱచు ♦ పాటుల నేమని యుగ్గడింప మా
యిరవుల నుండుటే కడిఁది ♦ యింకఁ ద్రిలోచన! వారి నెల్లరం
బ్రోరిగొనుమీ జగంబు హిత ♦ ముం దలపోసి పురాసురాహితా! ౧౧౮

అర్థములు. ఉగ్గడింపన్=చెప్ప, ఇరవులన్ = స్థానములందు, కడిఁది= కష్టము, పొరిగొనుమీ=చంపుమా.

### తాత్పర్యము

(దేవతలును, మునులు, శివునిఁ జూచుటకుఁ బోయి, సుకేశుని కొడుకులు వరబలమున గర్వించి, మమ్ముఁ బెట్టు బాధల నేమని చెప్పగలము మా స్థానములందుండుటే కష్టము-త్రిపురాసురాంతకా! లోకహితము నెంచి వారి నందఱఁ బొరిగొనుము.)

క. అని విన్నవింప శివుఁడును, దనహస్తములన్ విదిర్చి ♦ తల యూఁడఁగ ని
ట్లనె నట వారలతో నే, యనిమిష వరులార! యాసు♦రారుల నాకున్ ౧౧౯

అర్థములు. హస్తములన్ విదిర్చి=చేతులు విదలించి, తలయూఁడఁగన్= తల నడ్డముగాఁ ద్రిప్పి, తన యాశ్రితులను జంపుమని దేవతలు చెప్పినమాట విని

సహింపలేక తన యనంగీకారమును, తలయడ్డముగా నాడించి చేతులు విదిర్చి చూపెనని భావము. మిక్కిలి యసహ్యమగుటచే నోటఁ జెప్పుటయేగాక దేహాభినయముతోను దెలిపెను.

తాత్పర్యము

(అని విన్నవింపఁగా, రుద్రుఁడును, దలనడ్డముగాఁద్రిప్పి చేతులు విదలించుచు వారలతో నిట్లనెనఁట, ఓ దేవతలారా! యీ రాక్షసులను నాకును.)

ఉ. త్రుంపఁగ రాదుగాని యలదుష్టులు ♦ త్రుంగు నుపాయ మొండు భా
షింపుదు శంఖచక్రధరు ♦ శ్రీరమణీరమణున్ ముకుందు నే
వింపుఁడు భక్తిమైశరణు ♦ వేఁడిన రక్తి జనార్దనుండు దీ
పింపఁగ వారిఁ ద్రుంచి సుర ♦ బృందము డెందము కుందు మాన్పెడిన్. ౧౧౦

అర్థములు. త్రుంపఁగ రాదు = చంపుటకు సాధ్యపడదు, 'విషవృక్షోపి సంవర్ధ్య స్వయం ఛేత్తుమసాంప్రతమ్' తాను పెంచిన విషవృక్షమును దానుగొట్టరాదను న్యాయము ననుసరించియని భావము, త్రుంగు=చచ్చు, డెందము కుందు=మనోవేదన.

తాత్పర్యము

(చంపుటకు సాధ్యపడదు—కాని యీ దుష్టులు చచ్చుట కుపాయ మొకటి చెప్పెద—శంఖచక్ర ధరు శ్రియఃపతిని ముకుందు నాశ్రయింపుఁడు—భక్తితో శరణు వేఁడినచో జనార్దనుఁడు వారలఁ జంపి దేవతల దుఃఖమును బోఁగొట్టఁగలఁడు.)

క. గౌరీపతి యిటు చెప్పిన, నారాయణు నిలయమునకు ♦ నరిగి ముని మరు
ద్వారము లింతయుఁ జెప్పిన, వారల వెఱమాన్పి శౌరి ♦ వల్కిన బ్రీతిన్. ౧౧౧

అర్థములు. నారాయణు నిలయమునకున్=నారాయణుఁడున్న ప్రదేశమునకు, ముని మరుత్ + వారము=మునులయు దేవతలయు సమూహము, వెఱ=భయము.

తాత్పర్యము

(అని గౌరీపతి చెప్పఁగా, మునులయు, దేవతలయు సమూహము శ్రీమన్నారాయణుఁడున్న తావునకుఁబోయి యీ సమాచారమంతయు నివేదింపఁగా, శ్రీహరి వారల వెఱపు దీర్చి ప్రేమతో.)

క. సురలార! సురారుల నేఁ, బరిమార్చెద మీకు సుఖముఁ ♦ బరఁగించెద మీ
యిరవులకు యథాసుఖముగ, నరుగుండా యని వచించె ♦ నఁట నే వింటిన్.

అర్థములు. పరిమార్చెదన్=చంపెదను, ఇరవులకు=గృహములకు, యథాసుఖముగన్=సుఖమగునట్లు, అరుగుఁడా=పొండు.

తాత్పర్యము

(దేవతలారా! రాక్షసులను నేను సంహరించెదను. మీకు సుఖము గలిగించెద—మీరు మీయిండ్లకు సుఖముగాఁ బొండు అని చెప్పెనఁట. నేనువింటిని.)

ఆ. అభయ మిచ్చె నఁట సు♦రావళి కెల్లను, మనలఁ జంపఁ బ్రతిన♦గొనియెనఁట
చక్రి యిపుడు మనకు♦నలుపఁగ నర్హమా, తంత్రమెద్ది చెపుఁడు♦తమ్ములారా!

అర్థములు. చక్రి=విష్ణువు.

తాత్పర్యము

(చక్రి దేవతలకందఱ కభయమిచ్చెనఁట-మనలఁ జంపఁ బ్రతినపూనెనఁట. తమ్ములారా! మన మిపుడు చేయఁదగిన కార్యమేమి? చెప్పుఁడు.)

సీ. ఖండించెను హిరణ్య♦ కశిపునంతటివానిఁ, గాలనేమిని బంచెఁ♦ గాలుపురికి
హ్రాదిని యమ్యె సం♦హ్రాదశైలమునకు, నముచి మహాబలు♦ నామమణఁచె
శుంభ నిశుంభుల♦ జృంభణంబు వణఁగించె, హార్దిక్య మర్దించె♦ నమితశౌర్య
యమళార్జునులసమూ♦లము రూపుమాపెను,బహుమాయిరాధేయు♦భంగపఱచె
తె. సత్త్వవంతుల ధీరుల♦ సాహసికుల, నఖిలశస్త్రాస్త్రనిపుణుల♦ నసురవరుల
దానవుల సంహరించె దో♦ర్దర్పమునను, బీతవసనుండు సామాన్యుఁడే♦తలంప

అర్థములు. హ్రాదిని=వజ్రము, సంహ్రాదశైలమునకు=సంహ్రాదమను పర్వతమునకు, బహుమాయి=అనేక మాయలు గలవానిని. రాధేయున్=వీఁడొక రాక్షసుఁడు, రాధాయను రాక్షసికొడుకు, పీతవసనుండు=పచ్చని వలువగలవాఁడు.

ఇందుఁ జెప్పఁబడిన రాధేయుఁడు కర్ణుఁడుగాఁ బుట్టిన రాక్షసుఁడని తోఁచుచున్నది. పూర్వము సహస్రకవచుఁ డని యొక రాక్షసుఁడు గలఁడు. వాఁడుతనకు వేయి కవచములు కావలయుననియుఁ బదివేల సంవత్సరములు తపస్సు నిర్విఘ్నముగాఁ జేసిన వాఁడొక కవచము తెగఁగొట్ట సమర్థుఁడు కావచ్చునని బ్రహ్మను వరము గోరెను. ఆయనయు నట్లులే యిచ్చెను. వానిని జంప నరనారాయణులు పూని బదరికాశ్రమమందుఁ దపస్సు చేయసాగిరి. పదివేల సంవత్సరము లొకరు తపస్సు చేయుచుండగాఁగా మఱియొకరు సహస్రకవచునితో నంతకాలముయుద్ధము చేయుచు నొక్కొక్క కవచమును మార్చిమార్చి తెగఁగొట్టిరి. ఒక్కకవచముతో వాఁడు తప్పించుకొని పారిపోయి కాలాంతరమున సహజ కవచకుండలుఁడై కర్ణుడై పుట్టెను.

తాత్పర్యము

(హిరణ్యకశిపు నంతటివానిని ఖండించెను. కాలనేమిని గాలునిపత్తనమునకుఁ బంపెను. సంహ్రాదుని సంహరించెను. మహాబలుఁడగు నముచి నామ మణఁచెను.

శుంభ నిశుంభులఁ గెడపెను. హార్దిక్యుని మర్దించెను. యమళార్జునుల సమూలముగ నాశము చేసెను, అనేక మాయలుగల రాధేయునిఁ ద్రుంగించెను. సత్త్వవంతులను ధైర్యవంతులను సాహసవంతులను, శస్త్రవంతులను బాహుబలమున దైత్య దానవుల సంహరించెను. పీతాంబర ధరుఁడగు శ్రీహరి సామాన్యుఁడా!)

క. ఎల్లరు మాయాకుశలులు, నెల్లరు శతయజ్ఞకర్త • లెల్లరు శూరుల్
పొల్లువడిపోయి రెందఱో, యల్లోకాధ్యక్షుచేత • నసుర వరేణ్యుల్. ౧౧౫

అర్థములు. పొల్లువడి పోయిరి=నిర్వీర్యులయి చచ్చిరి.

తా త్ప ర్య ము

(మాయలయందు నేర్పరులు, నూఱు యజ్ఞములు చేసినవారు, శూరులునగు రాక్షసశ్రేష్ఠులందఱు నాలోకాధ్యక్షుఁడగు విష్ణువుచేత నిర్వీర్యులయిచచ్చిరి.)

ఉ. యోజనచేసి యింతయు సు • యోగ్యముఁ గార్యముఁ జెప్పరయ్య యే
యోజఁ జరించువార మన • నుగ్రబలాఢ్యుని నగ్రజాతు స్వా
రాజును నశ్వులట్లు గని • భ్రాతలు పల్కిరి లోకపాలకో
ద్వేజనకారణా! మనము • వేఁడిమిఁ జూపుట కార్య మిత్తఱిన్. ౧౧౬

అర్థములు. స్వారాజును=స్వర్ + రాజు=స్వారాజు, ఇంద్రుని, అశ్వులు= అశ్వినీ దేవతాకుమారులు, వీరు సూర్యునకు అశ్వస్త్రీ రూపము ధరించిన భార్య యందు జనించినవారు. ఇరువురు, లోకపాలకోద్వేజనకారణా=దిక్పాలురను గలఁత పొందింపఁ గారణమైన వాఁడా, వేఁడిమి=ప్రతాపము, అనఁగా మనము సంధికిఁ బోరాదు. దేవతలతో మన విరోధము మానరాదు.

తా త్ప ర్య ము

(కావునఁ జక్కఁగా ఆలోచించి మన మనుసరింపఁదగు గార్యము జెప్పుఁడని అన్నయనఁగా– "మన విషయమున ప్రతాపము ప్రకటించుటయే కార్య" మని మహాబలాఢ్యుఁడగు అన్నకుఁ దమ్ములు, ఇంద్రునికి అశ్వినీ దేవతలవలె విన్నవించిరి.)

చ. చదివితి మెల్ల వేదములు • శాస్త్రములున్ మితిమీఱు భాగ్య సం
పదలను సోలలాడితిమి • భద్రగతిం గొదలేక దానముల్
విదితముగా నొసంగితిమి • లెస్స నిరామయమైన యాయువున్
బొదలెద మర్థధర్మములు • పూర్ణముగా నొనరించి రెండియున్. ౧౧౭

అర్థములు. కొద=కొఱఁత, విదితముగాన్=ప్రసిద్ధముగా, నిరామయము= బాధలేని.

తా త్ప ర్య ము

వేదములు శాస్త్రములు నన్నియుఁ జదివితిమి అపరిమిత భాగ్యము నందుఁ దేలాడితిమి. కొఱంతలేక చేయవలసిన దానము లన్నియుఁ బ్రసిద్ధముగాఁ జేసితిమి. మన యాయువునకు బాధలేదు. చిరకాలము జీవింపఁ గలవారము. మనకు యోగ్యములైన ధర్మము లన్నియుఁ జేసితిమి.

క. అనివార్యసురాంభోనిధి, ఘనశస్త్రవితానములనె ♦ కలఁగించి మఱిన్
దునిమి యరాతుల నెల్లర,మనుచో మరణంబు భయము♦మనకుం గలదే?౧౧౮

అర్థములు. అనివార్య=వారింపరాని, సురాంభోనిధిన్=దేవత లను సముద్ర మును, ఘన=గొప్పవగు, శస్త్రవితానములనె=ఆయుధసమూహముచే,కలఁగించి= కలఁతపెట్టి, అరాతులన్=శత్రువులను, మనుచోన్=బ్రదుకుచుండఁగా.

తా త్ప ర్య ము

దేవతలను సముద్రమును నాయుధసమూహముచేఁ గలఁతపఱిచి శత్రువుల నందఱఁ జంపి బ్రదుకు మనకు మరణభయ మెక్కడిది? మనలఁ జంపువారెవరు?

క. నారాయణుఁడును శక్రుఁడు, గౌరీనాథుఁడును దండ ♦ కరుఁడును మనలన్
బోర నెదుర్కొందురె మన, పే రన్నన్ వణఁకుచుంద్రు♦భీతి సతంబున్.౧౧౯

తా త్ప ర్య ము

(నారాయణుఁడును, నింద్రుఁడు, రుద్రుఁడు, యముఁడు మన పే రనినభయ ముతో సదా వణఁకు చుందురు. అట్టివారు మనలను యుద్ధముతో నెదుర్కొన గలరా?)

ఉ. దోషము లేదు శౌరియెడఁ ♦ దోయజలోచను మానసంబు వి
ద్వేషులదోష హేతువునఁ ♦ దీరు చెడెంజుమి గాన నిప్పు డా
దూషణశీలురన్ సురలఁ ♦ దూర్ణమ హింసయొనర్చి వారి ని
శ్శేషులఁ జేసి వచ్చుటయె ♦ చిత్తములన్ శుభమంచుఁ దోఁచెడిన్. ౧౨౦

తా త్ప ర్య ము

విష్ణువునందు దోషము లేదు. ఆయన మన కపకారము చేసినవాఁడుకాఁడు. చేయఁదలఁచినవాఁడునుగాఁడు కాని మన పగవారు మనపై దోషములుచెప్పుటచే నాయనమనస్సు మాఱినది. కావున మనమై విష్ణువుమీఁదికిఁ బోవలసిన పనిలేదు. మనకు విరోధులు దేవతలు వారే కుట్రచేసిరి కావున వారిపై దండెత్తిపోయివారిని సమూలముగ దేవతయనువాఁడు లేకుండునట్లు నాశముచేసి వచ్చుటయే తగిన కార్యమని తోఁచుచున్నది.

చ. అనుచు సుమాలి మాలు లిటు ♦ లాడిన వల్లె యటంచు దేవతా
జనములమీఁద దాడి చన ♦ సర్వసురారుల కాజ్ఞ చేయుచున్
మొనలను దీర్పఁగా నసుర♦ముఖ్యుఁడు సైన్యపులన్ విధించినన్
ఘనతరశౌర్యధుర్యులు ర♦ణంబునకున్ జతనంబు సేయుచున్. ౧౨౧

అర్థములు. సర్వసురారులకున్=రాక్షసుల కందఱకు, మొనలను = సేనావ్యూహములను, సైన్యపులన్=సేనానాయకులను, జతనంబు=ప్రయత్నము.

తాత్పర్యము

మాలి సుమాలు లిటు చెప్పఁగా సరి యని మాల్యవంతుఁ డంగీకరించి సేనానాయకులఁ బిలిపించి దేవతలమీఁద దండెత్తిపోవుటకు రాక్షసుల నందఱను సేనలను వ్యూహములుగా నేర్పాటు చేయవలసినదని యాజ్ఞ చేయఁగా వారు యుద్ధప్రయత్నము చేయఁగా.

**— మాల్యవంతుఁడు దేవతలమీఁదికి యుద్ధంబునకుఁ బోవుట —**

చ. ఉరవడి స్యందనద్విపహ ♦ యోష్ట్రఖరర్షభశింశుమారభీ
కరపవనాశనాండరుహ ♦ కచ్ఛపమత్స్యసువర్ణతుల్యవి
ష్కిరకిరినక్రఖడ్గవర ♦ సింహపృదాకుముఖాన్యసత్త్వముల్
హొరఁగఁగ వాహనంబులుగ ♦ స్వర్గము ముట్టఁగ దాడి వెట్టినన్. ౧౨౨

అర్థములు. స్యందన=రథములు, ద్విప=ఏనుఁగులు, హయ=గుఱ్ఱములు, ఉష్ట్రి=ఒంటెలు, ఖర=కంచరగాడిదలు, ఋషభ=ఎద్దులు, శింశుమార=నీరికోళ్లు, భీకర=భయము గలిగించు, పవనాశన=సర్పములు, అండరుహ=పక్షులు, కచ్ఛప=తాఁబేళ్ళు, మత్స్య=చేఁపలు, సువర్ణతుల్యవిష్కిర=గరుడునితో సమానములైన పక్షులు, కిరి=పందులు, నక్ర=మొసళ్లు, ఖడ్గ=ఖడ్గమృగములు, వరసింహ=శ్రేష్ఠములైన సింహములు, పృదాకు=నాగములు, ముఖ=మొదలుగాఁ గల, అన్యసత్త్వముల్=ఇతరజంతువులు, ముట్టఁగన్=ముట్టడి వేయుటకు.

తాత్పర్యము

(రథములు, ఏనుఁగులు, గుఱ్ఱములు, లొట్టియలు, కంచరగాడిదెలు, ఎద్దులు, నీరికోళ్లు, పాములు, పక్షులు, తాఁబేళ్లు, చేఁపలు, గరుడునితో సమానమయిన పక్షులు, పందులు, మొసళ్ళు, ఖడ్గమృగములు, సింహములు, నాగములు మొదలగు నితర జంతువులు వాహనములుగాఁ గొని స్వర్గమును ముట్టడి వేయుటకు దాడి వెట్టఁగా.)

సీ. లంకకుఁ జేకుఱు • లయము భావించి లంకను వసించెడి భూత • గణము లెల్ల
దైవతంబులతోడ • దైన్యంబునొందుచు, వానితోఁ బురమును • బాసిపోయె
సురవైరినాశంబు • సూచించుచును మింట ధరణిని జెలఁగె న • త్పాతకములు
కాలేరితంబులై • కడుభీకరంబులై, యెమ్ములు వేఁడి ర • క్తమ్ముతోడ
ఆ. వృష్టిగురిసె శైల • బృందంబు లురియాడెఁ, బొంగి పొరలి వేల • ద్రిమ్మంగెజలధి
యుఱిమినట్లు నక్క • లఱచె భీమంబుగ, గ్రద్దపిండు మీఁదఁ • దద్దతిరిగె. ౧-౨౭

అర్థములు. కాలేరితంబులై=కాలముచేఁ బ్రేరింపఁబడినవై, ఉరియాడెన్=చలించెను. వేల=చెలియలికట్ట, నక్కలు=నక్కలు.

తాత్పర్యము

లంక నాశము కాఁగలదని తెలిసి లంకయందు వసించు భూత సమూహము లన్నియు గ్రామదేవతలతోడ దుఃఖపడుచు లంక వదలిపోయెను. రాక్షసులు నాశమగుదు రని సూచించు నుత్పాతములు భూమియందు నాకాశమందుఁ గాన వచ్చెను. మృత్యువుచేఁ బ్రేరింపఁబడి భయంకరముగ నెముకలు వేఁడి నెత్తురు వానగాఁ గురిసెను. కొండలు కదలెను. సముద్ర ముప్పొంగి చెలియలికట్ట దాఁటి వచ్చెను. నక్కలు మేఘము లుఱిమినట్లు ధ్వనించెను. గ్రద్దలు రాక్షసుల మీఁదఁ దిరిగెను.

క. కాలగతి నసురసేనా, జాలముపైఁ దిరిగె రక్త • చరణములు కపో
తాళులు గూసెను గాకబిడాలంబులజాల ముద్భ • టంబగు ధ్వనులన్. ౧-౨౮

అర్థములు. కాలగతిన్ = మృత్యుప్రేరణముచే, రక్తచరణములు=ఎఱ్ఱని కాళ్లు గలవి, కపోతాళులు=పావురముల గుంపులు, కాక=కాకులయు బిడాల=పిల్లులయు, జాలము=సమూహము.

తాత్పర్యము

మృత్యువు సూచించుచు రాక్షససేనలమీఁద నెఱ్ఱ కాళ్లుగల పావురములు దిరిగెను. కాకులు పిల్లులు భయంకరముగ గట్టిగఁ గూసెను.

చ. బలముగఁ గాలపాశచయ • బద్ధులు కావుట మాల్యవత్సుమా
లులు నల మాలి యేమియును • లోఁగక జంకక కీడుగూర్చు చి
హ్నాలఁ గనియున్ బలంబునకు • నంతటికిన్ మునుమున్నపోయి రు
జ్జ్వలదహనాకృతిం దనుజ • వర్యులు వెన్నడి వచ్చుచుండఁగన్ ౧-౨౯

అర్థములు. కాలపాశచయబద్ధులు=యముని పాశసమూహములచే గట్టఁబడినవారు, కావుటన్=అగుటచే, లోఁగక=లొంగిపోక, అధైర్యపడక, ఉజ్జ్వలదహనాకృతిన్=మండు నగ్నివలె.

తా త్ప ర్య ము

విడిపించుకొనుటకు సాధ్యము కానట్లు యముని పాశములచేఁ గట్టఁబడిన వారగుటచే మాల్యవంతుఁడు, సుమాలి, మాలి యనువారు అపాయము కలిగించు శకునములఁ జూచియు నధైర్యపడక సందేహింపక తమ వెంట రాక్షసులు రాఁగా సేనల కన్నిటికి ముందు ముందుగ మండు నగ్నివలెఁ బోయిరి.

ఆ. మాల్యవంతమునకు • మాద్రియై యచలుఁడౌ, మాల్యవంతు బలసి • మహిమ వెలసి
యసుర లంద ఱేగి • రబ్జసూతిని గొల్చు, నాకవాసు లనఁగ • జోక మెఱసి.

అర్థములు. మాద్రి=మాదిరి, సమానము, బలసి=చుట్టుకొని, అబ్జసూతిని=బ్రహ్మను, నాకవాసులు=దేవతలు, జోక=ఉత్సాహము.

తా త్ప ర్య ము

(మాల్యవంతముతో సాటియయి ధీరుఁడైన మాల్యవంతుని చుట్టుకొని రాక్షసు లందఱును, బ్రహ్మను సేవించు దేవతలవలె నుత్సాహముతో నేగిరి.)

క. మాలికి వశగతమై విబు, ధాలయవిజిగీష దాన • వానీకము మే
ఘాళులపోలికఁ గర్జలఁ, దూలించుచు దిక్తటంబు • తోడ్తోఁడి చనియెన్. ౧౨౭

అర్థములు. వశగతమై=స్వాధీనపడి. విబుధాలయ విజిగీషన్ = స్వర్గమును గెలుచు కోరికచే, దానవానీకము=రాక్షస సమూహము మేఘాళుల పోలికన్=మేఘసమూహములవలె, తోడ్తోఁడిన్=వేగముగ.

తా త్ప ర్య ము.

రాక్షససేన స్వర్గమును గెలువవలయునను కోరికతో మాలికి వశమై దిక్కులు తూలిపోవ మేఘములవలె గర్జించుచు వేగముగఁ బోయెను.

—* విష్ణువు దేవతలకుఁ దోడ్పడి రాక్షసులఁ బాఱఁదోలుట *—

చ. దనుజసమూహముల్ విబుధ • ధామముపైఁ జనుదెంచుటన్ సురల్
పనిచినమాట దెల్పుటయు • భండనదక్షుఁడై రమాధవుం
డనుపమకోటిసూర్యనిభ • మౌ కవచంబును దొడ్గి భీమరో
పనిచయపూర్ణతూణపరి • భాసితుఁడై కటిసూత్రయుక్తుఁడై. ౧౨౮

అర్థములు. విబుధధామము=స్వర్గము, భండనదక్షుఁడై=యుద్ధమునందు నాసక్తిగలవాఁడై, భీమ=భయంకరమైన, రోపనిచయ = బాణసమూహములచే. పూర్ణ=నిండిన, తూణ=అంబులపొదులచే, పరిభాసితుఁడై=మిగులఁ బ్రకాశించువాఁడై, కటిసూత్రయుక్తుఁడై=పట్టి కట్టినవాఁడై.

### తాత్పర్యము

రాక్షససేనలు స్వర్గము మీఁదికి వచ్చినవార్త దేవతలు పంపిన దూత తెలుపఁగా విని లక్ష్మీనాథుఁడగు నారాయణుఁడు యుద్ధమం దాసక్తిగలవాఁడై అసమానమై కోటిసూర్యుల కాంతిగల కవచంబును దొడిగి భయంకర బాణముచే నిండిన పొదుల ధరించి ప్రకాశించుచు ఖడ్గము చెక్కుటకై దట్టికట్టి.

చ. అరిదర శార్ఙ్గనందక ము • ఖాయుధుఁడై కనకాద్రిఁబోలు న
గ్గరుడుని నెక్కి దుష్ట సుర • కంటక నాశన సంభ్రమంబునన్
దొరపడి నిర్గమించె విబు • ధుల్ ఋషిసిద్ధులు యక్షులున్ మునుల్
కరములుమోడ్చి మ్రొక్కి తనుఁ • గమ్రమధూక్తుల సన్నుతింపఁగన్. ౧౨౯

అర్థములు. అరి=చక్రము, దర=శంఖము, శార్ఙ్గ=విల్లు, నందక=నందకమను ఖడ్గము, ముఖ=మొదలుగాఁగల, ఆయుధుఁడై=ఆయుధములు గలవాఁడై, కనకాద్రిఁబోలు=మేరుపర్వతమువంటి, దుష్ట=దుష్టులైన, సురకంటక = రాక్షసుల యొక్క, నాశన=నాశము చేయుటయందలి, సంభ్రమంబునన్ = వేగిరపాటుచే కమ్ర=మనోహరములైన, మధూక్తులన్=తియ్యనిమాటలచే.

### తాత్పర్యము

చక్రము శంఖము విల్లు నందకము కౌమోదకి యను గద లోనగు సాధనముల ధరించి మేరుపర్వతమువలె నత్తైబంగారు చాయఁగల గరుత్మంతు నెక్కి రాక్షసులను ధ్వంసము చేయు వేగిరపాటుతో వేగముగ నెక్కి దేవతలు ఋషులు సిద్ధులు యక్షులు మునులు చేతులు జోడించి నమస్కరించి స్తుతించుచుండఁగా బయలుదేఱెను.

క. హేమాంబరుఁ డగు జలదశ్యాముఁడు లక్ష్మీవిభుండు • సంశోభించెన్
హేమాద్రిమీఁది సతటిజ్జీమూత మనంగ సంత • సింపఁగ జగముల్. ౧౩౦

అర్థములు. హేమాంబరుఁడు = బంగారువస్త్రము గలవాఁడు, జలదశ్యాముండు=మేఘమువలె నల్లనివాఁడు, హేమాద్రి మీఁది = బంగారు కొండమీఁద నున్న, సతటిత్ =మెఱుపుతోఁగూడిన, జీమూతము=మేఘము.

### తాత్పర్యము

బంగారు కాంతిగల మేరుపర్వతము మీఁద నల్లని మబ్బువలెబంగారురంగుగల గరుత్మంతునిమీఁద నల్లని విష్ణుమూర్తి లోకములు సంతోషింపఁబ్రకాశించెను.

ఉత్సాహము. పక్షిరాజ పక్షజాత • వాతధూతకేతువై
యాక్షణంబ కీర్ణ శస్త్ర • మై చలోపలంబు నీ
లక్షమాధరాగ్ర మనఁగ • లక్షితంబునౌచు నా
రాక్షసేంద్రసైన్య మెల్ల • భ్రాంతిఁ దూలి బెగ్గిలన్. ౧౩౧

అర్థములు. పక్షిరాజ=గరుత్మంతునియొక్క, పక్ష=ఱెక్కలవలన, జాత=పుట్టిన, వాత=గాలిచే, ధూత=ఎగురఁ గొట్టఁబడిన, కేతువై=ధ్వజములు గలదై, కీర్ణశస్త్రమై=చెదిరిన యాయుధములు గలదై, చలోపలంబు=కదలుచున్న ఱాలుగలది, నీలక్షమాధరాగ్రము=అంజనాద్రి శిఖరము, లక్షితంబు=కానవచ్చునది, బెగ్గిలన్=భయపడఁగా.

తా త్ప ర్య ము

గరుత్మంతుని ఱెక్కల గాలిచే నెగురఁ గొట్టఁబడిన ధ్వజములు గలదై చెదరిన యాయుధములు గలదై రాక్షససేన కదలుచున్న ఱాలుగల కాటుక కొండ శిఖరమువలెనై భ్రమగొని భయపడి తూలిపోయెను.

క. అడ్డంబై శరముల ముజ్జిడ్డుగఁ గవయంగఁ జేయఁ • జేడ్పడక సురల్
గడ్డుకొను రోషమునఁ దమ, యొడ్డెల్లను నేకముగ మ•హోత్సాహమునన్. ౧౩౨

అర్థములు. ముజ్జిడ్డు=మూఁడు చములు గలిసినట్లుగ, చేడ్పడక=చలింపక గడ్డుకొను=అతిశయించిన, ఒడ్డు=సేన.

తా త్ప ర్య ము

విష్ణువు పైబడి వచ్చుచున్న రాక్షస సేనల కడ్డపడి ముజ్జిడ్డుగ మిగులదట్టముగ బాణవర్షము గురియింపఁగా రాక్షసులు చలింపక యతిశయించిన కోపముచేఁ దమ సేన నెల్ల నేకముఖముఁ జేసి మిగుల నుత్సాహముతో.

క. నెత్తుట నెఱచిని మేనులు. జొత్తిలియున్నను సురారి•సూదనుమీఁదన్
మొత్తమ్ములుగాఁ గురిసిరి, తత్తఱ మొకయింత లేక • దనుజవరేణ్యుల్. ౧౩౩

అర్థములు. ఎఱచిని=మాంసముచే. జొత్తిలి=ఎఱ్ఱవాఱి, సురారి సూదనుమీఁదన్=విష్ణువుమీఁద.

తా త్ప ర్య ము

తమ దేహములు నెత్తుటిచే మాంసముచే నెఱ్ఱవాఱి యున్నను రాక్షస శ్రేష్ఠులు బాణములను గుంపులు గుంపులుగా విష్ణుదేవునిపై గురియించిరి.

౮వ సర్గము

ఆ. రాక్షసాంబుదములు • ప్రకటగర్జారవ, త్రుటితదిక్చయములు తోరముగను
బరభయంకరముగ • శరవృష్టిగురిసె నా, రాయణాద్రిమీఁద•నాఁకపోక, ౧౩౪

అర్థములు. రాక్షసాంబుదములు=రాక్షసులను మేఘములు, ప్రకట గర్జారవ=స్పష్టములైన సింహనాదము లను నుఱుములచే, త్రుటిత=భేదింపఁబడిన, దిక్ + చయములు=దిక్సమూహములు గలదై, పరభయంకరముగన్ = శత్రువులు భయపడునట్లు, శరవృష్టి=బాణము లను వానను, నారాయణాద్రి మీఁదన్=నారాయణుఁ డను కొండమీఁద, ఆఁకగొనక = అడ్డములేక, నాలుగవ పాదంబున నుభయ యతి.

### తాత్పర్యము.

సింహనాదము లను నుఱుములచేఁ బగల్పఁబడిన దిక్కులుగల రాక్షసు లను మేఘములు పరులకు భయము కలుగునట్లు నారాయణుఁ డను పర్వతముమీఁద నడ్డములేక బాణములను వర్షమును గురియించెను

క. శ్యామావదాతుఁడగు హరి, శ్యామాసురపంక్తి బాణ•జాలము గురియం
గా మెఱసె వర్షమాణ మహాముదిరాచ్ఛాదితాంజ•నాద్రివిధమునన్. ౧౩౫

అర్థములు. శ్యామావదాతుఁడు=నలుపై శుభ్రమైనవాఁడు, నిర్మలమైన నలుపు గలవాఁడు, శ్యామాసురపంక్తి=నల్లని రాక్షస సమూహము, బాణజాలమున్=బాణముల సమూహమును, వర్షమాణ=వర్షించుచున్న, మహాముదిర=గొప్ప మేఘముచే, ఆచ్ఛాదిత=కప్పఁబడిన, అంజనాద్రి=కాటుకకొండ, విధమునన్=వలె.

### తాత్పర్యము

నిర్మలమైన నల్లనికాంతిగల విష్ణువు నల్లని రాక్షససమూహము బాణములు గురియఁగా వర్షించు గొప్ప మేఘముచేఁ గప్పఁబడిన కాటుకకొండవలెనుండెను.

సీ. మడిమీఁద మునరెడి • మిడుతల పోలిక, మంటపై ప్రాలు దో•మలవిధానఁ
దేనెకుండకు మూఁగఁ • దివురు నీఁగలభంగి, సంద్రంబునందు మో•సళ్ళలీల
దానవచాపము•క్తంబులు శరములు, కల్పంబువేళ లో•కంబులట్లు
హరిఁ జొచ్చె రథికులు • కరిగతుల్ రౌతులు, బంటులు పట్టల్ల•మింటికెగసి

తే. యసురవర్యులు బాణాళి•యష్టితోమ, రాదులను జిమ్మిచిమ్మి దా•మోదరుండు
నవనిసురుఁడు ప్రాణాయామ • మందుఁబోలె,
స్తంభితోచ్ఛ్వాసుఁడుగ వేగ • నలిపిరపుడు

అర్థములు. మడి=పైరుగల పొలము. ఉపమానము గుంపునందు మాత్రమే సంద్రంబు=సముద్రము, కల్పంబువేళ లోకంబులట్లు=ప్రలయ కాలమందు లోకములు భగవంతునందు లీన మగునట్లు, ప్రలయ కాలమందు లోకములన్నియు స్థూలరూపముల వదలి సూక్ష్మరూపముల భగవంతునందు లీనమై యుండును. మరల సృష్టికాలమున వాని నెల్ల బయల విడుచును. ప్రపంచమునకు

స్థూల సూక్ష్మ దశా భేదములు గలవు గాని నాశ మేనాఁటికి లేదు. అది నిత్యమైనది, కరిగతుల్=ఏనుగుల మీఁదనుండి యుద్ధము చేయువారు, యష్టి=కఱ్ఱలు, తోమరాదులను = చిల్లకోలలు మొదలగువానిని, స్తంభితోచ్ఛ్వాసుఁడుగ= శ్వాసము వెలికి రాక లోపలనే నిలిచి పోయిన వానిఁగ.

తా త్ప ర్య ము

మడిమీఁద గ్రావాలు మిడుతలవలె, మంటలపైఁబడు దోమలవలె, తేనె కుండకుఁ గ్రమ్ముకొను నీఁగలవలె, సముద్రమునందు మొసళ్ళవలె, ప్రలయ కాలమందు లోకములు నారాయణునందువలె రాక్షసులు విడిచిన బాణములగుంపులు విష్ణునందుఁ బ్రవేశించెను. రథములమీఁద నేనుఁగులమీఁద, గుఱ్ఱముల మీఁద నుండి యుద్ధము చేయువారును కాలిబంటులును నగు రాక్షసులు బాణములను, గఱ్ఱలను, చిల్లకోలలను, ఈ మొదలైన యాయుధములను ఆయనపైఁజిమ్మిచిమ్మి బ్రాహ్మణుఁడు ప్రాణాయామ సమయంబునందుఁ గుంభకంబునందున్న విధముగ శ్వాసము వెలికి రాకుండఁ జేసిరి.

మ. శకులిక్షోభితవారిరాశియటులై ♦ శార్ఙ్గంబు బ్రమోయించి నం
దకహస్తుండు స్వరూపమానపవమా♦నక్షిప్రశాఖీల పూ
ర్ణకరాకృష్టనిశాతసాయకములన్ ♦ రాత్రించరశ్రేష్ఠులన్
వికలీభూతశిరస్కులం జలిపె వే ♦ వే వేలుగాఁ గూలఁగన్. ౧౩౭

అర్థములు. శకులిక్షోభితవారిరాశి=చేఁపలచేఁ గలఁతఁ బెట్టఁబడిన సముద్రము, రాక్షసు లెన్ని బాణములు ముమ్మరముగా వేసినను లక్ష్యము చేసినవాఁడు కాఁడయ్యెనని భావము, నందక హస్తుండు=నందకమను ఖడ్గమును జేత ధరించినవాఁడు, విష్ణువు, స్వరు+ఉపమాన=వజ్రముతో సమానమైన, పవమానక్షిప్రశాఖీల=వాయువేగమువంటి వేగముతో భయంకరమైన, పూర్ణకరాకృష్ట=నిండుగఁ జేత లాగఁబడిన, నిశాత=పదునైన, సాయకములన్=బాణములను, రాత్రించర శ్రేష్ఠులన్=రాక్షసులందు ముఖ్యులగువారిని, వికలీభూత శిరస్కులన్ = పగిలి పోయిన తలలు గలవారిఁగా, వేవే=త్వరత్వరగా, వేలుగాన్—వేలకొలఁదిగా.

తా త్ప ర్య ము

చేఁపలచేఁ గలఁతఁబెట్టఁబడిన సముద్రమువలెనై విష్ణుమూర్తి కోదండము మీఁటి వజ్రాయుధముతో సమానములై, వాయువేగములై, భయంకరములై యాకర్ణాంతము లాగి విడువఁబడిన బాణములను త్వరత్వరగాఁ బ్రయోగించి వేలకొలఁది రాక్షస శ్రేష్ఠుల తలలు నఱకెను.

ఉ. దైన్యముఁగూర్చి యిట్లు నిశి ♦ తప్రదరప్రకరైకవృష్టి సా
జన్యధనుండు శౌరి బల ♦ శాలిత నొత్తఁగఁ బాంచజన్యమున్
జన్యసమాగత త్రిదశ ♦ శాత్రవకోటులు సింహగర్జనన్
వన్యగజంబులట్లు పఱ ♦ వం దొడఁగెన్ హృదయంబు బెగ్గిలన్. ౧౩౮

అర్థములు. నిశితప్రదరప్రకరైకవృష్టిన్=వాఁడిగల బాణముల సమూహ ముల విడువని వర్షముచే, జన్యసమాగత=యుద్ధమునకై వచ్చిన, త్రిదశ శాత్రవ కోటులు=రాక్షస సమూహములు. వన్యగజంబులట్లు=అడవి యేనుఁగులవలె, పఱవఁదొడఁగెన్=పరువెత్తిపోవ నారంభించెను.

తాత్పర్యము

వాఁడిబాణముల వర్షముచే రాక్షససేన దుఃఖపడఁజేసి విష్ణుమూర్తి పాంచ జన్యముఁ బూరించెను. ఇట్లు బలశాలి యూఁదిన శంఖము ధ్వనిచే యుద్ధమునకు వచ్చిన రాక్షసులు సింహధ్వని విన్న యేనుఁగులవలె భయపడి గుండెలు పగిలి పరువెత్త నారంభించిరి.

శా. త్రైలోక్యంబు వ్యథాప్రపూర్ణముగ నా ♦ ధ్వానంబు నిండారినన్
వ్రాలెన్ దంతులు నేల నిర్మదములై ♦ స్రుక్కెం దురంగంబులున్
వ్రాలెన్ స్యందనముల్ దొలంగి రథిక ♦ వ్రాతంబు నిస్తేజమై
•తూలెం బద్ధసముత్కరంబు ధరణిం ♦ దోడ్తోడ నిశ్చేష్టమై. ౧౩౯

అర్థములు. వ్యథాప్రపూర్ణముగన్=వేదనచే నిండినదిగా, ధ్వానంబు= ధ్వని, నిర్మదములై = మదము పోయినవై, స్యందనములు = రథములు, రథిక వ్రాతంబు=రథముమీఁదనుండి యుద్ధము చేయువారి సమూహము, నిస్తేజము= కాంతి తొలఁగినది, బద్ధ=కాలిబంటులయొక్క, సముత్కరంబు=సమూహము.

తాత్పర్యము

ఆ ధ్వని మూఁడులోకములకు పూర్ణముగ బాధ కలిగించునదియై వ్యాపిం పఁగా నేనుఁగులు మదముచెడి పడెను. గుఱ్ఱములు నేలవ్రాలెను. తేరులు వంకలి రథికులు కాంతిహీనతచేఁ బడిపోయెను. భటులు నిశ్చేష్టులైరి.

శా. నీరంధ్రంబుగ బాణవర్షమసురా ♦ నీకంబుపై వేగి రై
నీకేశాంబకుఁ డంతటం గురియఁగా ♦ నిర్భిన్నగాత్రంబులై
స్వారాట్శత్రువిదారితాద్రులన ర ♦ క్షఃపాలకస్తోమముల్
తీరుం బాసె రెడం బడెన్ సమసె బీ ♦ ద్రం బింక వేసం బెగన్. ౧౪౦

అర్థములు. నీరంధ్రంబుగన్=నిర్+రంధ్రము = సందులేకుండునట్లు, నిర్భి న్నగాత్రంబులై=భేదింపఁబడిన దేహములు గలవారై, స్వారాట్+శత్రు=

ఇంద్రుని వజ్రాయుధములచే, విదారిత=చీల్పఁబడిన, అద్రులవన్=కొండలో యను నట్లు, రక్షఃపాలక=సేనానాయకుల, స్తోమముల్=సమూహములు, బిర్దెన్=చచ్చెన్ డింక వేసెన్=పనుసెను.

తాత్పర్యము

ఒకదాని కొకదానికి పఱుమసందు లేనట్లు రాక్షసుల సేనమీఁద విష్ణుమూర్తి బాణవర్షము గురియింపఁగా రాక్షసనాయకుల సమూహముపై దేహములు చీలి వజ్రాయుధముచేఁ జీల్పఁబడిన కొండల వలెనై చచ్చిపడిరి.

క. హరిచక్రకృతవ్రణములఁ దొరఁగెన్ నెత్తురులు సోఁకు ♦ తుటుములమేనన్
ధరణీధరములఁ గాఱెడి, గిరిభవధాతువు లనంగఁ ♦ గెంజాయలతోన్ ౧౪

అర్థములు. హరిచక్రకృతవ్రణములన్=విష్ణుచక్రముచేఁ జేయఁబడిన గాయములనుండి, సోఁకుతుటుముల=రాక్షస సమూహముల, మేనన్ = దేహములనుండి. గిరిభవధాతువులు=కొండయందుఁ బుట్టిన లోహసారములు, కెంజాయలతోన్= రక్తకాంతులతో.

తాత్పర్యము

విష్ణుచక్రమువలనఁ గలిగిన గాయములనుండి రాక్షస దేహములందు నెఱ్ఱని కాంతులతోఁ బర్వతము లందలి ధాతువుల వలె నెత్తురు కాఱెను.

తే. పాంచజన్యరవంబు దుఃస్సహమైన, శార్ఙ్గమౌర్వీవినాదంబు ♦ శత్రునికర
కంఠరవమునన్నింటిఁ ♦ గడచి మించెఁ, గాంచనాంబరుభయదహుం ♦ కారరవము.

అర్థములు. పాంచజన్యరవంబు=శ్రీ మహావిష్ణువుయొక్క శంఖధ్వని, శార్ఙ్గమౌర్వీవినాదంబు=విష్ణుధనస్సునకు శార్ఙ్గమని పేరు; ఆ ధనస్సుయొక్క శబ్దము, శత్రునికర=విరోధుల సమూహము, కంఠరవము = కంఠములనుండి వెలువడు నాదము, భయదహుంకారరవము=భయంకరమగు "హుం"మ్మను నాదము.

తాత్పర్యము

విష్ణుదేవుని భయంకరమైన హుంకారధ్వని పాంచజన్యరవమును కోదండ ధ్వనిని శత్రువులగు రాక్షసుల కంఠధ్వనిని నన్నింటిని మించియుండెను.

సీ. తరణిబింబమునుండి ♦ కిరణంబు లట్టుల, జలనిధినుండి రే ♦ అలవిధాన
నగరాజమునుండి ♦ నాగరాజులభంగి, వారిదంబుననుండి ♦ ధారలట్లు
శౌరినమ్రేరిత ♦ శార్ఙ్గవినిర్ముక్త, కాండముల్ దమమీఁదఁ ♦ గవయుటయును
దునిఁగిన మెడలును ♦ దునిసినమొడలును బగిలినశిరములు ♦ నొగులువిండ్లు

ఆ. భగ్నవాహనములు ♦ ప్రగ్గడికరులును, నెగయు కేతనములు ♦ తెగినకేలు
గాఁగ నసురసేన ♦ కళవళించెదలించె, గండ్రెఁ గుండె డిందె ♦ మ్రందె నపుడు.

అర్థములు. తరణిబింబము=సూర్యబింబము, నగరాజమునునుండి = పర్వత శ్రేష్ఠమునుండి. నాగరాజుల భంగిన్=సర్పశ్రేష్ఠములవలె, వారిదంబు=మేఘము, శౌరిసంప్రేరిత=విష్ణువుచే ప్రేయఁబడి, శార్ఙ్గవినిర్ముక్త=శార్ఙ్గమునుండి విడువఁబడిన, కాండముల్=బాణములు.

తాత్పర్యము

(సూర్యబింబమునుండి వెడలు కిరణములవలె, సముద్రమునుండి వచ్చు యేఁటుల తీరున, పర్వతమునుండి వెలువడు పాములవలె మేఘములనుండి పడు వర్షధారలవలె, విష్ణుమూర్తియొక్క శార్ఙ్గమునుండి బయలుదేఱిన బాణపరంపరలు తమమీఁదఁబడి, మెడలు తెగి, తొడలు తునిగి, రథములు పగిలి ధనస్సులు విఱిగి, వాహనములు చచ్చి, కరులు ఒఱఁగి రాక్షససేన ఛిన్నాభిన్నమయి నశించెను.)

సీ. శరభంబులకుఁ బాఱు ♦ హరిసంఘములభంగి, హరికిని వెఱచెడి ♦ కరులసరణి
వారణంబుల కులుకు ♦ వ్యాఘ్రంబులట్టుల, వ్యాఘ్రంబునకును జి♦వ్వంగులట్లు
చివ్వంగికిని గ్రామ♦సింహముల్ తీరున, శ్వానంబునకును మా♦ర్జాలరీతి
మార్జాలమున కహి♦మండలంబుల త్రోవ, కాకోదరమున కె♦ల్కలవిధాన
ఆ. హరికి వెఱచి పఱచి ♦ ధరణిని బన్నుండి, యసురవరులసేన ♦ హతముగాఁగ
వారిధరవరంబుఁ బర్జన్యునట్టులు, నించె వారిజంబు ♦ నీలతనుఁడు. ౧౪౪

అర్థములు. హరిసంఘములభంగిన్= సింహసమూహములవలె, హరికిని= సింహమునకును, కరులసరణిన్=ఏనుఁగులవలె, వారణంబులకున్ = ఏనుఁగులకు, ఉలుకు=భయపడు, గ్రామసింహముల్, తీరున=కుక్కలవలె, శ్వానంబునకున్= కుక్కకు, మార్జాలరీతిన్=పిల్లులవలె, అహిమండలములు = పాములు సమూహములు, కాకోదరమునకున్=పామునకు, పఱచి=పరువెత్తి, పన్నుండి=పండుకొని, వారిధరవరంబు=గొప్పమేఘము, వారిజంబు=శంఖము,నీలతనుఁడు=నల్లని దేహము గల విష్ణువు

తాత్పర్యము

(శరభమునుగని పాఱిపోవు సింహములవలె, సింహమునకు వెఱచి పఱచు నేనుఁగులవలె, నేనుఁగుల కులికిపడు కుక్కలవలె, కుక్కనుజూచిన పిల్లులవలె, పిల్లినిఁగన్న పాములవలె, పామునుఁగనిన యెలుకలవలె శ్రీమహావిష్ణువునకు వెఱచి పరుగెత్తి నేలఁబడి రాక్షసులసేనలు హతముకాఁగాఁబర్జన్యుఁడు గొప్పమేఘమును బలె నీలమేఘ శరీరుఁడగు శౌరి శంఖమును బూరించెను.)

క. నగధారిబాణములకున్, బెగడుచుఁ బలలాశిబలము ♦ బిగిచెడి లంకా
నగరాభిముఖముగాఁ జన మగిడిన రోసంబుతో సు♦మాలియుఁ గడిమిన్. ౧౮౫

అర్థములు. నగధారి=పర్వతము ధరించినవాఁడు, విష్ణువు, బెగడుచున్=భయపడుచు, పలలాశిబలము=రాక్షససేన, బిగిచెడి=బిగువు చెడిపోయి, మగిడిన=మరలిన, రోసమును మరలఁ దెచ్చుకొని, కడిమిన్=బలముతో.

తా త్ప ర్య ము

విష్ణువువేయు బాణములకు రాక్షససేన భయపడి ధైర్యము గర్వము చెడి లంక ప్రక్కముఖము చేసి పోఁగా సుమాలి బలమున మరల రోషము దెచ్చుకొని.

## —* వి ష్ణు వు సు మా లి తోఁ బో రు ట *—

చ. తరణిని ముంచు మంచుగతిఁ ♦ దాఁకి శరంబుల విష్ణు ముంచినన్
మరలిన సైన్య మంతయు సమ ♦ గ్రధృతిం జెలరేఁగి క్రమ్మఱన్
సురపరిపంథియున్ దనుజ ♦ సూదనుఁ గిట్టి సురారిజీవసం
భరణచణంబుగా గళర ♦ వంబును నించె నితాంతధీరతన్. ౧౮౬

అర్థములు. తరణి=సూర్యుని. సమగ్రధృతిన్=నిండు ధైర్యముతో, సురపరిపంథియున్=దేవవిరోధి సుమాలి, కిట్టి=సమీపించి, సురారిజీవ=రాక్షసుల ప్రాణములను, సంభరణచణంబుగాన్=భరించు సామర్థ్యము గలదిగా, గళరవము=కంఠధ్వని, నితాంత ధీరతన్=మిగుల ధైర్యముతో.

తా త్ప ర్య ము

సూర్యుని మంచువలె సుమాలి విష్ణువు నెదిరించి బాణముల ముంచఁగా బమవెత్తుచున్న సేనయంతయు ధైర్యము తెచ్చుకొని మరలి విజృంభించెను. ఆ రాక్షసుఁడును విష్ణువును సమీపించి ధైర్యము చెడి శవముగా నున్న రాక్షససేనకు మరలఁ బ్రాణము వచ్చునట్లు మిగుల ధైర్యమున కంఠధ్వని గావించెను.

ఉ. తపనీయాభరణోజ్జ్వలం బయిన హ ♦ స్తం బుద్ధతిన్ వీచుచున్
దపనీయాంశుకుఁ బిల్చుచున్ సహతటి ♦ ద్ధారాధరంబో యనన్
విపులారావము రోదసీకుహరని ♦ ర్భేదంబుగా నించినన్
దపనాభప్రదరంబునన్ హరియుఁ ద ♦ త్కర్ణోజ్జ్వలద్భూషలన్. ౧౮౭

అర్థములు. తపనీయాభరణ=బంగారు భూషణముచే, ఉజ్జ్వలము = ప్రకాశించునది, తపనీయాంశుకు=బంగారు వస్త్రముగల విష్ణువును, సహతటిత్+ధారాధరంబు=మెఱపుతోఁ గూడిన మేఘమో, విపులారావము = గొప్పధ్వని, రోదసీకుహర నిర్భేదంబుగాన్=భూమికి నాకాశమునకు నడుమ గుహవలె నుండు

ప్రదేశము పగులునట్లు, తపనాభప్రదరంబులన్ = సూర్యునితో సమానమైన బాణములచే, తల్=ఆ రాక్షసుని, కర్ణోజ్జ్వలత్ భూషలన్=చెవులయందు ప్రకాశించు నాభరణములను.

తాత్పర్యము.

బంగారు భూషణములచేఁ బ్రకాశించు చేయిరొత్తి విష్ణుదేవుని బిలువఁగా, విష్ణుదేవుఁడును మెఱుపులతోడి మేఘమువలె నంతరాళము పగులునట్లు గట్టిగా ధ్వనించుచు సూర్యునివంటి కాంతిగల బాణములచే నారాక్షసుని చెవులయందున్న సొమ్ములను.

క. త్రుంచియు సారథిశిరముం, ద్రెంచినఁ దత్సైంధవములు ♦ తిరమఱ గొనుచున్
మించిన వెఱ గిరగిర మని, పంచజనాదునిరథంబు ♦ బలువిడిఁ ద్రిప్పెన్. ౧౭౭

అర్థములు. సైంధవములు=గుఱ్ఱములు, పంచజనాదుని = మనుష్యభక్షకుని,

తాత్పర్యము

త్రుంచి సారథి తల త్రెంచివేయఁగా నా గుఱ్ఱములు తిరమిఱగొని భయపడి గిరగిర మని యా రాక్షసు తేరిని విచ్చలవిడి త్రిప్పెను.

కం. భ్రాంతము లగుచును రథహయ, సంతతి భ్రమచే సుమాలి ♦ చలియించెఁబరి
భ్రాంతేంద్రియాశ్వములచేఁ, జింత ధృతి వొలంగు నరుని ♦ చెలువుననాలోన్.

అర్థములు. భ్రాంతములు=భ్రమగొన్నవి, భ్రాంత=భయపడిన, ఇంద్రియాశ్వములచే=ఇంద్రియములను గుఱ్ఱములచే, చింతన్ = విచారముచే, ధృతి దొలఁగు=ధైర్యము విడిచిన.

తాత్పర్యము

గుఱ్ఱములు భ్రమగొని తిరుగుటచే సుమాలియు దిక్కు తెలియక యింద్రియము లను నశ్వములు భ్రమపడఁగాఁ జింతచే ధైర్యము చెడిన మనుష్యునివలె భ్రమగొనెను. అంతలో

చ. సుడివడు చున్నయగ్రజునిఁ ♦ జూచి మహోగ్రహవృత్తి మాలియున్
బిడుగులఁబోలుబాణములు ♦ వెన్నుని హంసలు క్రౌంచశైలమున్
గడువడిఁ దూఱి యేగుగతి ♦ గా నిగిడించిన నాధికిన్ వశం
బడని జితేంద్రియుం డనఁగ ♦ మాధవుఁ డేమి చలింప కాత్మలోన్. ౧౭౮

అర్థములు. సుడివడు=చిక్కువడు, అగ్రజుడు=అన్న, వెన్నుఁడు = విష్ణువు' క్రౌంచశైలము=క్రౌంచమను పర్వతము, ఆధి=మానసిక దౌర్బల్యము, జితేంద్రియుఁడు=ఇంద్రియములను జయించినవాఁడు, చలింపక=చెదరక.

తాత్పర్యము

తన యన్న నుఱిపడుచుండుట చూచి మిగులఁ గోపించి మాలి క్రౌంచ పర్వతమున హంసలు దూఱిపోవునట్లుగా పిడుగులఁబోలిన బాణములు విష్ణుని మీఁద వేయఁగా మనోవేదనకు వశపడని జితేంద్రియునివలె విష్ణువు వారికిఁ జలింపక.

—* విష్ణువు సుమాలిని వధించుట *—

శా. మౌర్వీరావము దిక్ప్రపూర్ణముగ భీ ♦ మహ్రాదినీవజ్రభా
దుర్వారాశుగ వేగ బాణముల దై ♦ త్యున్ నాటఁగా నేసినన్
సర్వాంగంబులఁ దూఱి పాములు సుధా ♦ సారంబుభంగిన్ మనః
పర్వం బారఁగఁ గ్రోలె నెత్తురులు వి ♦ భ్రాంతిం గొనన్ వైరియున్. ౧౫౧

అర్థములు. మౌర్వీరావము = అల్లెత్రాటి మ్రోఁత, దిక్ప్రపూర్ణముగన్= దిక్కులు నిండునట్లు, భీమ=భయంకరమైన, హ్రాదినీవజ్రభా=పిడుగులవంటి, వజ్రములవంటి కాంతిగల, దుర్వార=వారింపరాని, ఆశుగ = వాయువువంటి, వేగ= వేగముగల, బాణములన్=సుధాసారంబున్=అమృతసారమును, మనఃపర్వంబు= మనస్సుకు సంతోషము.

తాత్పర్యము.

అల్లెత్రాటి ధ్వని దిక్కులు నిండఁగా భయంకరమైన పిడుగులయు వజ్రములయు కాంతిగలవియు వాయువేగము గలవియు నగు బాణములను రాక్షసుని యవయవము లన్నియు దూఱిపోవ వేయఁగా పాము లమృతమును ద్రావినట్టులవి వాని నెత్తురులు ద్రావెను. వాఁడును దానికి భ్రాంతిఁగొనెను.

ఉ. అంతటఁ బోక శౌరి యసు ♦ రాధము మౌళి ధ్వజంబు చాప మిం
తింతలుగాఁగఁ ద్రుంచి హయ ♦ బృందములన్ వధియింప మాలిదు
ర్దాంతజవంబుతోడుత గ ♦ దాధరుఁడై చని పక్షిరాట్ఛిరః
ప్రాంతమునందు మోఁదె హరు ♦ డంతకున ట్లిరుకేల హుంకృతిన్. ౧౫౨

అర్థములు. మౌళి=కిరీటము, పక్షిరాట్+శిరః ప్రాంతమునందున్=గరుత్మంతుని తలప్రక్క భాగమున.

తాత్పర్యము

విష్ణుదేవుఁడంతతో వదలక యా నీచ రాక్షసుని కిరీటము, ధ్వజము, విల్లు తునకలు తునకలుగా ఖండింపఁగా మాలి గద దీసికొని మిగుల వేగముతోఁబోయి గరుత్మంతునితల ప్రక్కభాగంబున రెండుచేతులతో శివుడు యమునివలెఁ గొట్టెను.

మ. స్వరుధారాహతి నద్రియట్లడలి యా • సర్పారి దిగ్భ్రాంతి నై
మరలం బాఱి భృశార్తి మాధవునకున్ • పరాఙ్ముఖము గావించినన్
సురవైరిప్రకరంబులందు గగన • స్ఫోటంబుగా రావము
ద్ధురతన్ వెల్వడె హర్షహేతు వయి త • ద్ఘోరారవోద్భూతికిన్. ౧౫౩

అర్థములు. స్వరుధారాహతిన్ = వజ్రాయుధము వాదర దెబ్బచే, అద్రి యట్లు=కొండవలె, సర్పారి=గరుడుఁడు పరాఙ్ముఖము=పెడమర ముఖము, గగన స్ఫోటంబుగాన్=ఆకాశము పగులునట్లు, రావము=ధ్వని, తత్=ఆ రాక్షసుల, ఘోరారవ=భయంకరధ్వనియొక్క, ఉద్భూతికిన్=పుట్టుటకు.

తాత్పర్యము

వజ్రాయుధము దెబ్బచేఁ గొండవలెఁ జలించి యాగరుడుఁడు దిగ్భ్రమఁగొని మిగుల వేదనచే వెనుక ముఖమై పరువెత్తి రాక్షసునకా విష్ణువు పెడవాటగు నట్లు చేయఁగా రాక్షసు లాకాశము పగులునట్లు కేకలు వేసిరి. ఆఘోరమైన ధ్వని పుట్టుటచూచి.

ఉ. ఆగ్రహ మార శ్రీరమణుఁ • డడ్డముగాఁగ మలంగి తార్క్ష్యుపై
వ్యగ్రతఁ గేలఁ దాల్చి పెడ • వాటుగ నయ్యుప నైచె భాస్కరో
దగ్రవిభావిభాసము ది • శావళిసంగతనైజతేజమున్
విగ్రహభీషణంబు నరి • వీరశిరఃప్రతిభేదదక్షమున్. ౧౫౪

అర్థములు. మలంగి=తిరిగి, తార్క్ష్యుపై=గరుత్మంతునిమీఁద, వ్యగ్రతన్= వేగముగ, భాస్కరోదగ్రవిభా=సూర్యకాంతియొక్క యతిశయముచే. విభాసము=ప్రకాశించునది, దిశావళిసంగతనైజతేజమున్=దిక్కులయందు వ్యాపించిన తన కాంతిగల దానిని, విగ్రహభీషణంబు=యుద్ధమందు భయంకరమైనది, భయంకరమైన యాకారముగలది, అరివీర=వీరులగు శత్రువులయొక్క, శిరః=శిరస్సులను ప్రతిభేద=తెగఁగొట్టుటయందు, దక్షము=సామర్థ్యముగలది.

తాత్పర్యము

విష్ణుమూర్తి కోపించిన వాఁడై గరుడుని మీఁదఁ డొంకదిక్కు ముఖముగాఁ దిరిగి పెడవాటుగా నున్నను వేగముగ సూర్యకాంతి గలదియు దిక్కుల యందు వ్యాపించిన తేజస్సు గలదియు భయంకరాకారము గలదియు శత్రువుల శిరస్సులు భేదించు సామర్థ్యము గలదియు.

తే. కాలచక్రంబుఁబోని చ • క్రంబు నసురవరునిపై వైచె నది రాహు • శిరముఁ ద్రుంచు
కరణి మాలిశిరంబును • ధరణిఁ గూల్చె, నమరు లరువంబునను గర్జ • లారనింప.

అర్థములు. అసురవరునిపై=రాక్షసశ్రేష్ఠునిపై, అమరులు=దేవతలు, అరుసము=సంతోషము, గర్జలు=కేకలు, ఆరనింప=తెఱపి లేకుండ (నిండుగా).

తా త్ప ర్య ము

కాలచక్రమువంటి తన చక్రంబును వేయగా, నది పూర్వము రాహు శిరస్సును ఖండించినట్లు మాలి శిరస్సును ఖండించి నేలఁ ద్రోచెను. దేవతలు సంతోషించి సింహనాదములు చేసిరి.

—• రా క్ష స సే న ప లా యి త మ గు ట •—

సీ. మాలి గూలినఁజూచి • మాల్యవంతుండు సు,మాలియు శోకని•ర్మగ్నులగుచు
బలగంబు భీతిఁ • బొంతెరి లంకామ,ఖమ్ముగ నింతలో • ఖగవరుండు
తెప్పిలి తత్క్రోధ • తీవ్రత నిజపక్ష వాతూల నిహతిని • వారి నొంపఁ
బెనుగాలి నొగుడాకు • లనఁ జెల్లచెదరులై సేనలువారలు • చెదరిపోవ

తే. శరగణచ్ఛిన్న గాత్రులఁ•జక్రకృత్త, మూర్ధు లసిదారితాంగులఁ•ముసలహతివి
ఘటితశీర్షులు లాంగల•గ్లపితకంధ,రులు గదాహతవక్షులఁ•త్రుటితకరులు.౧౪౯

అర్థములు. శోకనిర్మగ్నులు = శోకమున మునిఁగినవారు, తత్ + క్రోధ తీవ్రతన్=ఆకోపాతిశయముచే, నిజపక్ష=తన తెక్కలవలనఁ గలిగిన, వాతూల నిహతిని=గాలిదెబ్బచే, ఒగుడాకులు=ఎండిన యాకులు,శరగణచ్ఛిన్నగాత్రులు= బాణసమూహములచే ఛేదింపఁబడిన దేహము గలవారు చక్రకృత్తమూర్ధులు= చక్రముచే ఖండింపఁబడిన తలలుగలవారు, అసిదారితాంగులు=కత్తిచేఁ జీల్పఁ బడిన దేహములు గలవారు, ముసలహతి=రోఁకలిదెబ్బలచే, విఘటిత శీర్షులు= తలలు పగిలినవారు, లాంగల=నాఁగేలిచే, గ్లపితకంధరులు = నొచ్చిన మెడలు గలవారు, గదాహతవక్షులు=గదచేఁ గొట్టఁబడిన ఱొమ్ములు గలవారు, త్రుటిత కరులు=విఱిగిన చేతులు గలవారు.

తా త్ప ర్య ము

మాలి చచ్చుట చూచి మాల్యవంతుఁడును సుమాలియు శోకమునమునిఁగి భయపడి సేనతో లంకవైపుతిరిగి పరువెత్తిరి. ఇంతలో గరుత్మంతుఁడు తెప్పతిల్లి కొని తనతెక్కలు విదుర్చఁగా రాక్షసులు పెద్దగాలికి నొగుడాకులవలెఁ జెదరి పోయిరి. బాణములచే నఱకఁబడిన యవయవములు గలవారును జక్రముచే ఛేదింపఁబడిన తలలు గలవారును గత్తిచేఁ జీల్పఁబడిన దేహములు గలవారును రోఁకటి దెబ్బలచేఁ బగిలిన తలలు గలవారును నాఁగేటి దెబ్బలచే నొచ్చిన మెడలుగల వారును గదచేఁ గొట్టఁబడిన వక్షస్సులు గలవారును చేతులు తెగినవారునైరి.

చ. అగుచును వెండ్రుకల్ విరియ • నాహవమున్ విడి పాఱ రాక్షసుల్
నగధరుఁడున్ శతాయుతక•లంబక వృష్టిని నాతపత్రముల్
తెగఁ దురగాళిఁ గూలఁ బెడఁ • దేరులు ప్రేవులు ప్రోవులై పడన్,
బిగిచెడఁ దత్తఱింపఁ బరి•విచ్చఁగఁ దద్దఱిలంగఁ జేసినన్ ౧౫౭

అర్థములు. ఆహవమున్=యుద్ధమును, నగధరుఁడు=విష్ణువు, శతాయుత=వేయివేల, కలంబక=బాణముల, వృష్టిని=వర్షముచే, ఆతపత్రముల్=గొడుగులు, పురివిచ్చఁగన్=వేఱుపడఁగా.

తాత్పర్యము

ఈ ప్రకారము రాక్షసులు తలవెండ్రుకలు విరియఁబోసికొని యుద్ధభూమి విడిచి పరువెత్తఁగా విష్ణుమూర్తి పదునుగల వేయివేల బాణముల వర్షముచే గొడుగులు తెగిపడ గుఱ్ఱములు చచ్చిపడ తేరులు తునకలైపడ ప్రేగులుప్రోగులు పడ బిగువుచెడ భయపడ నొకరితో నొకరు వేఱుపడ గడగడ వడఁకచేయఁగా

క. సుడివడఁగా నేత్రంబులు, తడఁబడఁగా బాదములును • దటతట మనఁగా
నెడదలు సైనికులందఱు, వెడఁగులవలె నగుడుఁ జలము • వీడ్కొని పఱవన్.

అర్థములు. ఎడదలు=గుండెలు, (మనస్సులును) వెడఁగులు = తెలివిలేని వారు, అగుడున్=కాగా, చలము=పట్టుదల, వీడ్కొని పఱవన్ = వదలుకొని పఱువెత్తగా.

తాత్పర్యము

కన్నులు తిరుగఁగాఁ కాళ్ళు తడఁబడఁగా గుండెలు తటతట కొట్టుకొనఁగా సైనికులందఱు పిచ్చివాండ్రవలెనై చలమువదలి పరువెత్తఁగా.

చ. కని నరసింహమూర్తి ఘన•గర్జల నించిన సింహగర్జలన్
వినిన మతంగజంబు లన • విభ్రమ మొందుచుఁ జాపముక్త రో
ప నికర మారుతాహతికి • వారిదసంఘము లట్టులైరి త
త్కనకమణీమయాభరణ • కాండములన్ ధరయెల్ల నిండఁగన్. ౧౫౯

అర్థములు. నరసింహమూర్తి=విష్ణువు, అంతటి భయంకరాకారము వహించెనని భావము. మతంగజంబులు=ఏనుగులు, చాపముక్త = వింటినుండి విడువఁబడిన, రోపనికర=బాణసమూహముల, మారుతాహతికిన్= గాలిదెబ్బకు, వారిదసంఘములట్టులు=మేఘముల సమూహములవలె, తత్=ఆ రాక్షసుల, కనకమణీమయ=బంగారు రత్నములచే నిండిన, ఆభరణ = భూషణముల యొక్క, కాండములన్=సమూహములచే.

### తాత్పర్యము

చూచి విష్ణుమూర్తి సింహనాదముచేయఁగా సింహధ్వని విన్న యేనుఁగుల వలె రాక్షసులు దిగ్భ్రమ చెందుచు వింటినుండి విడువఁబడిన బాణముల గాలి దెబ్బకు నా రాక్షసులు వారు ధరించిన బంగారు రత్నముల సొమ్ములు నేల రాలఁగా మేఘములవలెఁ జెదరిపోయిరి.

క. నీలబలాహకతుల్యులు, లోలంబ లలంతికోజ్జ్వ • లులు హరిశర ధా
రాలులితచిత్తు లగుచును, నీలాంజనగిరు లనంగ • నేలం ద్రెళ్ళన్. ౧౬౦

అర్థములు. నీలబలాహకతుల్యులు = నల్లని మేఘముతో సమానులు, లోలంబ=వ్రేలుచున్న, లలంతికా=మెడను వ్రేలాడు హారములు లోనైనవానిచే, ఉజ్జ్వలులు=ప్రకాశించువారు, హరి=విష్ణువు యొక్క, శరధారా=బాణవర్షముచే, లులిత=కలఁతఁబెట్టబడిన, చిత్తులు = మనస్సుగలవారు, నీలాంజనగిరులు=నల్లని కాటుక కొండలు.

### తాత్పర్యము

నల్లమబ్బులతో సమానులును మెడలందు వ్రేలాఁడు మాలికలు గలవారును నగు రాక్షసులు విష్ణు బాణవృష్టిచేఁ జలించిన మనస్సు గలవారై కాటుకకొండల వలె నేలఁబడఁగా.

## ౮వ సర్గము

చ. పరువిడు రాక్షసోత్కరము • పాటును వెన్కను గోరిపోటు నా
శరకులనాయకుండు గని • సంద్రము వేలను దాఁకి మర్లిన
క్కరణిని వెన్కకుం దిరిగి • కంజదళాక్షునిఁ జూచి యిట్లనున్
గరువతనంబుతోఁ డఁగిన • కం జలియింపఁగ మౌళి రేఁగుచున్. ౧౬౧

అర్థములు. రాక్షసోత్కరము = రాక్షససమూహము, ఆశరకుల నాయకుండు=రాక్షససమూహాధిపతి, మాల్యవంతుఁడు, సంద్రము = సముద్రము, వేలను=చెలియలికట్టును.

### తాత్పర్యము

రాక్షసులు పరువెత్తుచుఁ బడు కష్టము వారిని వెంబడించి తఱుము విష్ణుపరాక్రమముఁ జూచి మాల్యవంతుఁడు సముద్రము చెలియలికట్టవఱకుఁ బోయి వెనుకకు దిరిగినట్లు తిరిగి విష్ణువును జూచి కోపముచే కిరీటము కదలుచుండఁగా గరువముతో నిట్లనియె.

### —* మాల్యవంతుండు విష్ణుని నిష్ఠురమాడుట *—

క. ప్రాకృతజనునట్టులు నీ, వీకరణిని క్షత్త్రధర్మ • మెఱుఁగక యుద్ధం
బాకాంక్షింపనివారల నాకులపడఁ జంపనగునె • నారాయణుఁడా! ౧౬౨

అర్థములు. ప్రాకృతజనుపట్టులు=సామాన్యమానవునివలె, ఈ కరణిని=ఈవిధముగ, ఆకాంక్షింపనివారలను=కోరనివారలను, ఆకులపడ=చీకాకుపడ.

తా త్ప ర్య ము

నారాయణా! సామాన్య జనునివలె, వగవెత్తిపోవువారిని జంపఁగూడదను క్షత్రియనీతి పాటింపక యుద్ధము కోరనివారలను నీవు వ్యాకులపడఁజంపవచ్చునా?

క. విను సమరవిముఖులన్ వెనోన్కని చంపెడి పూరుషుండు♦కోటికోలందుల్
ఘనసుకృతంబులు చేసియుఁ, జన నేరఁడు స్వర్గమునకు ♦ సత్యవిచారా! ౧౬౩

అర్థములు. సమరవిముఖులన్=యుద్ధమున మాఱుమొగము పెట్టిన వారిని సత్యవిచార=సత్యమైన యాలోచన గలవాఁడా.

తా త్ప ర్య ము

సమర్థమగు నాలోచన గలవాఁడా! యుద్ధము చేయనొల్లక వెనుకకుఁ దిరిగి పోవువారిని జంపెడివాఁడు కోట్లకొలఁది పుణ్యములు చేసి యుండినను స్వర్గమునకుఁ బోఁజాలఁడు.

క. యుద్ధమొనర్పంగ నంతటి, శ్రద్ధయుఁ గల దేని రమ్మ ♦ చక్రధరుండా!
సిద్ధముగ నున్నవాఁడఁ బ్రసిద్ధంబుగఁ జూపు నీదు ♦ చేవయు బలమున్. ౧౬౪

అర్థములు. చక్రధరుండా=సుదర్శనమను చక్రాయుధమును ధరించినవాఁడా (నారాయణా!) చేవయున్=గట్టితనమును.

తా త్ప ర్య ము

(చక్రధరా! యుద్ధము చేయవలెననెడి శ్రద్ధగలదేని యిదే సిద్ధముగా నున్నాను. రమ్ము-నీ బలము నీ చేవ ప్రసిద్ధముగునట్లు చూపుము)

సీ. అని మాల్యవంతంబు♦ననువున నమ్మాల్య, వంతుండు నిలిచిన ♦ వనజపాణి
యిట్లను విభీషి ♦ బృందారకుల్ నన్ను, శరణంబుఁ జొచ్చినఁ♦గరుణఁదలఁచి
మిమ్ము నుత్సాదింప ♦ మేకొంటి నా నుడి, రక్షించుకొనువాఁడ♦రాక్షసేంద్ర!
నాప్రాణములకంటె ♦ నాకనివాసుల, కార్యంబు ప్రియమయి ♦ క్రాలునాకుఁ
తే. గాన మీరు రసాతల♦గతులరైన, హతులఁ జేయక విడువ దు♦రాత్ములార!
యనిన నసురుఁడు శక్తి చే♦నంబుజాక్షు, వక్షమున నాట దృఢశక్తి♦వైవనదియు

అర్థములు. మాల్యవంతంబు=మాల్యవంతమను పర్వతము, అనువునన్=విధముగా, వనజపాణి=శంఖమును జేతఁగలఁవాఁడు, పాంచజన్యము=సముద్రమునఁ బుట్టినది, ఉత్సాదింపన్=సమూలము నాశముచేయ, మేకొంటిన్=అంగీకరించితిని, పూనితిని, నుడి=మాట.

తాత్పర్యము

అని మాల్యవంతమను పర్వతమువలె మాల్యవంతుఁడు కదలక నిలువఁగా విష్ణు విట్లనియె. మీకు భయపడి దేవతలు నాశరణు చొచ్చిరి. నేను వారియందు దయఁదలఁచి మిమ్ము నిర్మూలము చేసెదనని మాట యిచ్చితిని. నామాట నేను దక్కించుకొనవలెను. నా ప్రాణముల రక్షించుకొనుటకంటె నన్ను నమ్మి నాపై నాధారపడియుండు దేవతల యోగక్షేమములు భరించుట నాకుఁ బ్రియమైన పని కావున మీరు పాతాళమునకుఁ బోయినను పాపాత్ములారా! మిమ్ముఁ జంపక వదలను అని చెప్పఁగా రాక్షసుఁడు తన బలముకొలఁది శక్తియను నాయుధమును విష్ణువు ఱొమ్మున నాటుకొనవేసెను.

క. జలదంబున సౌదామిని, చెలువునఁ గడు వెలిఁగె దైత్య • జిద్వక్షమునన్
బలియుఁడు శక్తిధరప్రియుఁ, డలవున నద్దాన నైచె•నయ్యసురేంద్రున్. ౧౬౬

అర్థములు. జలదంబునన్=మేఘమునందు సౌదామిని = మెఱుపుఁదీఁగ, దైత్యజిత్=రాక్షసుల జయించువాని, విష్ణువుయొక్క, వక్షమునన్ = ఱొమ్మునందు, శక్తిధరప్రియుఁడు=సుబ్రహ్మణ్యునకుఁ బ్రియుఁడైనవాఁడు. 'షాణ్మాతుర శ్శక్తిధరః కుమారః క్రౌంచదారణః' అమరము.

తాత్పర్యము

• నల్లని దేహకాంతిగల విష్ణువు వక్షమునందా మెఱయుచున్న శక్తి మేఘమునందు మెఱుపువలె మెఱసెను. బలవంతుఁడైన విష్ణువు ఆశక్తిని దీసి దానిచేతనే యా రాక్షసేంద్రునిఁ గొట్టెను.

చ. అధియును మాల్యవంతు నుర • మందుఁ బడెన్ గిరికూటసీమపై
భిదురముచందమై యసుర • వీరునివర్మము దాన భేదిలెన్
హృదయముఁ గాఁడు తన్నిహతి • నంతయు నొచ్చి చలించి క్రమ్మఱన్
మదమునఁ దెప్పిఁదెల్లి ధృతి • మంతుఁడు నిల్చె మహానగంబనన్. ౧౬౭

అర్థములు. ఉరమందు=ఱొమ్మునందు, గిరికూటసీమపై=కొండ నెత్తిమీద, భిదురము=ఇంద్రుని వజ్రాయుధము, వర్మము=కవచము, భేదిలెన్=బద్ధలయ్యెను, నిహతి=దెబ్బ, ధృతిమంతుఁడు=ధైర్యముగలవాఁడు.

తాత్పర్యము

కొండ శిఖరము మీఁదఁబడు వజ్రాయుధము వలె నాశక్తి మాల్యవంతుని ఱొమ్మునందుఁ బడెను. ఆ దెబ్బచే వాని కవచము తెగఁగా నది ఱొమ్మునఁ గ్రుచ్చుకొనెను. ఆ దెబ్బచే వాఁడు మిగుల బాధపడి చలించి మదముచే దెప్ప తెల్లుకొని ధైర్యము గలవాఁడు కావున కొండవలె నిలిచెను.

చ. అతులితకంటకావృత మ • హాయసశూలముఁ ద్రిప్పి దైత్యుఁడు
ద్ధతిని స్తనాంతరస్థలిని • దాఁచి దృఢంబుగ నంతఁ బోక యా
దితిసుతవైరి ముష్టిహతిఁ • దీవ్రత నొంచియు గ్రుద్ది తార్క్ష్యువ
చ్చతురుఁడు దాఁటె వెన్కకు వె • సన్ నలుమూరకొలంది నేలకున్. ౧౬౮

అర్థములు. అతులిత=అసమానమైన, కంటకావృత=మేకులతోఁ గూడిన, మహాయసశూలమున్=గొప్ప యినుపశూలమును, స్తనాంతరస్థలిని = రొమ్మునందు రెండుచన్నులకు నడిమిప్రదేశమును, తాఁచి=కొట్టి, దితిసుతవైరిన్= విష్ణువును.

తాత్పర్యము

వాఁడికల మేకులతోఁ గూడిన యినుపశూలమును ద్రిప్పి యా రాక్షసుఁడు విష్ణువు రొమ్మున దానిచే గట్టిగఁ గొట్టి పిడికిట నొప్పించి గరుత్మంతుని గ్రుద్ది యా నేర్పరి నాలుగు మూరలదూర మీవలికి దాఁటెను.

మ. వినతానందనుఁ డంత రోషవశుఁ డై • వీచెన్ గరుద్ద్వంద్వమున్
దనుజాధీశ్వరుఁ డెండినాకువలెఁ ద • ద్వాతూల వేగంబున
న్జనియెన్ నిల్వఁగ లేక, యగ్రజగతిం • దద్భ్రాత వీక్షించి త
క్కినసేనాతతిఁ గొంచు లంక దెస నే • గెన్ హ్రీనతాస్యంబుతోన్. ౧౬౯

అర్థములు. వినతానందనుఁడు=గరుత్మంతుఁడు, గరుత్ = ద్వంద్వమున్= రెండు రెక్కలను, వాతూలవేగంబునన్-గాలివేగముచే, హ్రీ=సిగ్గుచేత, నత= వంచుకొనఁబడిన, ఆస్యంబుతో=ముఖముతో.

తాత్పర్యము

అంతట గరుత్మంతుఁడు కోపించి రెండు రెక్కలు విసరఁగా నా గాలికి రాక్షసుఁడు నిల్వలేక యెండినయాకువలె నెగిరిపోయెను. తనయన్న పడినపాటు చూచి సుమాలి సేన నంతయుఁ బ్రోగుచేసికొని సిగ్గుతోఁ దలవంచుకొనిలంకకుఁబోయెను.

**—• రాక్షసులు పరాజితులై లంకఁ జొచ్చుట •—**

క. ఈవిధమునఁ బలుమాఱు ర, మావిభుచే భగ్నమగుచు • మనుజాశన నా
థావళి హావళి గొనియెన్, శ్రీవరు నెదిరింప దైత్య • సేనకు వశమే? ౧౭౦

అర్థములు. రమావిభుచేన్ = లక్ష్మీవల్లభుఁడగు విష్ణువుచే, మనుజాశన నాథావళి=రాక్షసశ్రేష్ఠులగుంపు, హావళి=ఆపద

(ఈవిధముగాఁ బలుమాఱులు శ్రియఃపతిచే నోటువడి రాక్షసశ్రేష్ఠుల గుంపు లాపదనొందెను. శ్రీమహావిష్ణువు నెదిరింప రాక్షస సేనకు వశమా?)

క. పంకజనేత్రుని కడలుచు, లంకాపురి విడిచి యాత్మ•లలనలతోడన్
బింకం బఱి పాతాళము. తెంకిగఁ గొని నిల్చి రెదలు • దిగ్గన నసురుల్. ౧౭౧

అర్థములు. అడలుచు=వెఱచుచు, ఆత్మలలనలు=తమతమ యాఁడువాండ్రు, తెంకి=ఉనికిపట్టు, ఎదలు=మనస్సులు, దిగ్గన=దడదడమనఁగా (అడలుపుట్టగా)

తాత్పర్యము

విష్ణువునకు భయపడి పౌరుషము చెడి రాక్షసులు లంక విడిచి యాఁడువారలతోడ గుండెలు గొట్టుకొనుచుండఁ బాతాళము చేరి యందునిలిచిరి. ఇప్పటి అమెరిక యనునది పాతాళమే. అమేరుక యనునది అమెరిక యయ్యెను. మేరువు Equator భూమధ్యరేఖ, మన భూమధ్యరేఖకు చక్కఁగా క్రింది వైపున నుండునది అమేరుక, అ+మేరు+క, ఇందు అకారము నఞ్. అతల (Atla) యను గ్రామము నేఁటికిని గలదు. అట్లాంటిక్ (Atlantic) మహాసముద్రము పూర్వము దేశము, (అతలాది) లోకములుగా నుండెను. అందు నెత్తైన భూభాగము అమెరికగా నిలిచెను. తక్కినది నీటమునిఁగి సముద్ర మయ్యెను.

క. సాలకటంకటు లనఁగా, వాలినవా రీ సురారి • వర్యులు రామా!
పౌలస్త్యనామకీర్తితు, లాలంబున నీవు చంపి • నట్టిసురారుల్. ౧౭౨

అర్థములు. వాలినవారు = పేరుబడినవారు, కీర్తితులు=చెప్పఁబడుచున్నవారు, ఆలము=యుద్ధము.

తాత్పర్యము

ఈ మాల్యవంతుఁడు లోనగు వారు సాలకటంకటు లనఁబడుదురు, యుద్ధమునందు నీవు చంపిన రావణాసురుఁడు లోనగువారు పౌలస్త్య లనఁబడుదురు. | సాలకటంకట సుకేశుని భార్య మాల్యవదాదులకు పితామహి దాని వంశము వారు సాలకటంకటులు.

"On the mother's side Revana is even in the present Ramayana represented as having been born of the race of Salakatankata, a name which has undoubtedly an aboriginal sound ab ut it. It reminds one of the name Xicotencatle borne by one of the chiefs of tlascale in the history of the conquest of Mexico' Riddle of Ramayana, Page 130.

క. పౌలస్త్యులకంటెను బల, శాలుఱు మఱి సాంపరాయ • చతురులు ప్రజ్ఞా
శాలులు ధైర్యస్థైర్యర, మాలసితులు రామచంద్ర! • మాల్యవదాదుల్. ౧౭౩

అర్థములు. సాంపరాయచతురులు = యుద్ధమునందు నేర్పుగలవారు. ప్రజ్ఞాశాలులు=బుద్ధిమంతులు, ధైర్యస్థైర్య రమాలసితులు=ధైర్యస్థైర్య లక్ష్మిచేఁ ప్రకాశించువారు.

తాత్పర్యము

రామా! మాల్యవంతుఁడు లోనగువారు పౌలస్త్యులకంటె యుద్ధమునందు నేర్పుగలవారు, బుద్ధిమంతులు, ధైర్యసంపత్తి, స్థైర్యసంపత్తిగలవారు.

క. సురకంటకు లగు నసురులఁ, బరిమార్పఁగ నెవరివశము • పద్మాక్షుండౌ
అరిదర శార్ఙ్గగదాయుధ,ధరునకు నారాయణునకుఁ • దక్క నొకనికిన్. ౧౨౪

అర్థములు. సురకంటకులు=దేవతల బాధపెట్టువారు, అరి=చక్రము, దర=శంఖము, శార్ఙ్గ=విల్లు, గదాయుధ=గద ఆయుధముల ధరించినవానికి.

తాత్పర్యము

(దేవకంటకులగు రాక్షసుల సంహరింపఁ బుండరీకాక్షుఁడు, శంఖ, చక్ర శార్ఙ్గ గదాయుధధరుఁడునగు నారాయణునకుఁ దక్క నితరులకుఁ దరమా కాదనుట).

తే. నీవ నారాయణుండవు • నీవ యవ్య యుండవు సనాతనుండవు•నుత్పలాంగ!
దివిజవరదచతుర్భుజుం•డవు నజయ్యుఁడవుఁ బ్రభుండవు నీవ మా•ధవ!మురారి!

అర్థములు. నీవ=నీవే, ఉత్పలాంగ=నీలోత్పములవలె మనోహర శ్యామల కోమల వర్ణముగలవాఁడా, దివిజవరద=దేవతల కిష్టములొసంగువాఁడా, అజయ్యుఁడవు=జయింప నసాధ్యుఁడవు.

తాత్పర్యము

నారాయణుఁడనువాఁడు మఱి యెవ్వఁడో కాఁడు. రామచంద్రమూర్తీ! నీవే నారాయణుఁడవు. అవ్యయుఁడవు నీవే. త్రికాలములందు సత్యముగ నిత్యముగ శాశ్వతముగ నుండువాఁడవునీవే. నాలుగుభుజములుగలవాఁడవు, దేవతలకు వరము లిచ్చువాఁడవు నీవ, లక్ష్మీనాథ ! మురారీ! నీవే లోకమునకుఁ బ్రభుండవు. నీవు జయింపసాధ్యపడనివాఁడవు. నిన్ను జయించిన వా రెవ్వరును లేరు.

రావణవధ ముగియుటచే నవతారరహస్యము, శ్రీరామచంద్రమూర్తి పరత్వము ప్రకాశము చేయఁబడెను.

చ. అసురుల సంహరింప మను • జాకృతి నొందితి వీవు, ధర్మముల్
పసచెడ నప్పు డప్పుడు వ్య • వస్థ మఱిన్ ఘటించుపొంటె నీ
రస జనియించు చుందువు వ • రాతులఁ ద్రుంపఁగ సాధుకోటికిన్
వ్యసన మణంచి ప్రోవ శ • రణాగతరక్షణ! ధర్మవీక్షణా! ౧౨౬

అర్థములు. ధర్మముల్=సనాతనములైన వర్ణాశ్రమ ధర్మములు, వ్యవస్థ=శాస్త్రమునందు నిరూపింపఁబడిన నియమము, ఘటియించు పొంటెన్ = చేయు

కొఱకు, ఈరసన్=ఈభూమియందు, అరాతులన్=శత్రువులను, ధర్మవీక్షణా=ధర్మమునందుఁ జూపుగలవాఁడా, ధర్మము నిలుపు సంకల్పము గలవాఁడా.

తాత్పర్యము

ఇట్టి నీవు రాక్షసులఁ జంపుకొఱకు మానుష్యాకారము ధరించితివి. ఎప్పుడెప్పుడు ధర్మములు సారహీనములై చెడునో యప్పుడప్పుడు శాస్త్రనిరూపితములైన వర్ణాశ్రమ ధర్మనియమములను నిలుపుటకుఁగాను ధర్మమునకు హాని గలిగించు విరోధుల నంహరించుటకును ధర్మస్థాపనమునందే దృష్టియు శరణాగతుల రక్షించు దీక్షయుఁ గల నీవు జనించుచుందువు.

ఇచ్చట నగస్త్యుఁడు చెప్పిన యీ యవతార ప్రయోజనమునే శ్రీకృష్ణ భగవానుఁడు తానే యర్జునున కిట్లు చెప్పెను.

శ్లో॥ యదా యదా హి ధర్మస్య-గ్లాని ర్భవతి భారత।
అభ్యుత్థాన మధర్మస్య-తదాత్మానం సృజా మ్యహమ్॥
పరిత్రాణాయ సాధూనాం-వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ-సంభవామి యుగేయుగే ॥

ఎప్పుడెప్పుడు ధర్మ మెడరు చెందెడినో, యెప్పు డధర్మంబు వృద్ధిచెందెడినో
యప్పుడప్పుడ నేన యవని సృజింతుఁ, దప్పక నమ్మనో ధర్మజావరజ !
సాధుజనంబులసంరక్ష సలుప, బాధింప దుష్కృతిపరులైనవారి
జగతి ధర్మంబు సంస్థాపనసేయ, యుగ యుగంబునఁ బుట్టు చుందుదు నేను.

ద్విపద భగవద్గీత-౪వ అధ్యాయము.

ఈ యుభయ వాక్యములవలన నవతార ప్రయోజనములు సాధువుల రక్షించుట, ఆ నిమిత్తమై పైరు వృద్ధిచెందుటకుఁ గాను పొలములోని గడ్డిగాదము పీకివేసినట్లు పాపాత్ముల శిక్షించుట, వర్ణాశ్రమధర్మముల స్థాపించుట యీమూఁడు కార్యములు నెఱవేర్చుటకుఁగానుఁ శరణాగత రక్షణార్థమై భగవంతుఁడు కాలోచిత వేషమును ధరించి వచ్చుచుండును. అందు రామావతారము ధర్మమును స్వయముగ నాచరించి లోకమునకుఁ జూపినవాఁడు. కృష్ణభగవానుఁడు ధర్మసందేహము తీర ధర్మ ముపదేశించినవాఁడు.

క. సరసిజనయనా! నీ కీ, కరణిని రాక్షసులజన్మ • కథఁ దెలిపితి శ్రీ
కర! యింక రావణాసురు, చరిత వచించెదఁ దదీయ•జనిసత్త్వంబుల్. ౧౭౭

అర్థములు. సరసిజనయనా=కమలాక్షా (శ్రీరామచంద్రా!) ఈకరణిని=ఈరీతిని, శ్రీకర=సంపదలిచ్చువాఁడా, తదీయ=వానియొక్క, జని=పుట్టుక, సత్త్వంబు=బలము.

తా త్ప ర్య ము

శ్రీరామచంద్రా! నీకీ విధముగ రాక్షసు లనువా రెట్లు పుట్టిరి. యను విషయమును దెలిపితిని. ఇక రావణుఁను లోనగు వారు పుట్టిన వృత్తాంతము వారు చేసిన కార్యములు చెప్పెద వినుము.

మ. చిరకాలంబు రసాతలంబునన ల ♦ క్ష్మీనాథుభీతిన్ నిశా
చరయుక్తుఁడు సుమాలి యుండెఁ దనయా ♦ స్యం బుర్విపైఁ జూప, కి
న్నరమిత్రుండు సపుత్రపౌత్రుఁ డయి య ♦ క్షస్వామి లంకాపురిన్
స్థిరసౌఖ్యంబున నేలు చుండ నిటు లెం ♦ తేఁగాల మొయ్యం జనన్. ౧౭౪

అర్థములు. చిరకాలము=చాలాకాలము, ఆస్యము=మొగము, యక్షస్వామి=యక్షులకు ప్రభువు (కుబేరుడు) ఒయ్యంజనన్=క్రమముగా జరిగిపోగా.

తా త్ప ర్య ము

విష్ణువు వలని భయంబున సుమాలి తల వెలుపలఁ జూపక పాతాళమందే దీర్ఘకాల ముండెను. కుబేరుఁడు ఈశ్వరుని స్నేహము సంపాదించుకొని కొడుకుల తోను మనుమలతోను లంకానగరమునందు శాశ్వతసౌఖ్యము లనుభవించు చుండెను. ఇట్లు దీర్ఘకాలము గడచెను.

౯వ సర్గము

**—* సుమాలి కూఁతుం దోడ్కొని భూలోకంబునకు వచ్చుట *—**

సీ. ఒక్కనాఁడు సుమాలి ♦ యుజ్జ్వలగాత్రను బద్మంబుఁ బాసిన♦పద్మఁ బోలు
తనకూతుఁ దోడ్కొని ♦ ధరణికి నేతెంచి, వరుని నన్వేషించు♦వాంఛతోడఁ
జరియించు చొక చోటఁ♦బరికించెఁ దండ్రికి, నభివాదన మొనర్చి♦ యురుగువాని
స్వచ్ఛందు ధననాథు ♦ వాసవనిభునిఁ బు లస్త్యతనూజుని లలితరూపుఁ
తే. గాంచి క్రమ్మఱి గనదులో♦కమున కేగి, యెట్లు సేయఁగ మే లగు♦నీ సురారి
వంశమున కిదియభివృద్ధిఁ♦బరఁగు నెట్లటంచునూహించికూఁతుడా♦యంగఁబిలిచి.

అర్థములు. ఉజ్జ్వలగాత్ర=చక్కగాఁ మెఱయుచున్న శరీరముగలది, పద్మఁబోలు=లక్ష్మీదేవినిపోలు, వరుఁడు=పెనిమిటి వాంఛ=కోరిక, చరియించుచు=తిరుగుచు, అభివాదనము నమస్కారము, స్వచ్ఛందుఁడు స్వతంత్రుఁడు,క్రమ్మఱి=మరలి, కూతు=కూతురిని, డాయంగఁబిలిచి=దగ్గరకు రమ్మని పిలిచి.

తా త్ప ర్య ము

ఒక్కనాఁడు సుమాలి ప్రకాశించు దేహము గలట్టియు కమలముఁ బాసి చరించు లక్ష్మీదేవి వంటిదియు నగు తన పుత్రికను దోడుకొని భూలోకమునకు వచ్చి దీనికిఁ దగిన వరుఁ డెవ్వఁడా యని వెదకుచు నొకనాఁడు తన తండ్రికి

నమస్కరించి పోవుచున్న కుబేరుని స్వేచ్ఛగాఁ జరించువానిని నింద్రునితో సమానుఁడగు వానిని బులస్త్యపుత్రుని సుందరాకారునిఁ జూచి మరల తన లోకమునకుఁ బోయి యీ రాక్షసవంశము వృద్ధియగు నుపాయ మేది? ఏమి చేసిన నిది బాగుపడును? అని ఆలోచించి కూఁతును దన సమీపమునకుఁ బిలిచి యిట్లనియె.

ఉ. బాలిక! నీకు యౌవనము ♦ వర్తిలు చున్నది, పెండ్లి సేయఁగాఁ
గాల మిదే, తిరస్కృతినిఁ ♦ గందునో యంచును సాధ్వసంబునన్ ?
మే లగుచుట్ట మెవ్వఁడును ♦ మేకొనఁ డయ్యెను ని న్వరింప ల
క్ష్మీలలనాసమానవు వి ♦ శిష్టగుణాన్విత నీవు కూఁతురా ! ౧౨౦

తాత్పర్యము

కూఁతురా ! నీవు లక్ష్మీదేవితో సమానురాలవు. శ్రేష్ఠము లయిన సద్గుణములు గల దానవు. నీకు యౌవనము వచ్చినది. ఇదియె నీకుఁ బెండ్లి చేయ సమయము. అయినను మన చుట్టములం దెవఁడును నిన్నుఁ దన కిమ్మని యడిగిననే నియ్యనందునను భయముతో నిన్ను వరింప వచ్చినవాఁడు కాఁడు, అట్టివారికి నేనై బలవంతముగాఁ బిలిచి ని న్నెట్లిత్తును? వధువును గోరుట వరునకు ధర్మముగాని వధువు వరుని వెదకుచుఁ బోవుట కులధర్మము గాదు. పిలిచియైన ని న్నియ్యఁ దగినంతవాఁడు మనలో లేఁడు.

క. కావున నీ కర్హు మహా, భావునిఁ బెనిమిటినిఁగూర్పఁ ♦ బడెదఁ బ్రయాసం
బో వెలఁదుక! నీకతమున, నీవంశము వెలయఁగా న ♦ భీష్టము నాకున్ ౧౨౧

తాత్పర్యము

ఈ కారణముచే నీకుఁ దగినవానిని గొప్పమహిమ గలవానిని భర్తగా నీకుఁ గూర్ప నే నెంతో శ్రమపడుచున్నాను. నీవలన నీ వంశము వృద్ధిగావలయునని నాకోరిక.

క. గౌరవముం గాంక్షించెడు, పూరుషునకుఁ గూఁతు రొకతె ♦ పుట్టినయేనిన్
గూరును దుఃఖం బెవఁడా, యీరమణికి మగఁడటంచు ♦ నెనఁగినచింతన్. ౧౨౨

తాత్పర్యము

నానిమిత్తమై నీ వేల యింత శ్రమపడెద వందువా? గౌరవముగోరుపురుషునకుఁ గూఁతురు పుట్టినా యది పుట్టినది మొదలు దీనికిఁ దగిన మగఁ డెవఁడు దొరకునా యను విచార మతని బీడించుచుండును.

కన్యకను తగిన వరునకీయక తన యిచ్ఛకొలఁది నెవనికో యొకని కిచ్చిన బ్రహ్మహత్య వచ్చును. కావునఁ దగినవరునకే కన్యకనీయవలెను. అయోధ్య కాండము ౨౫౨౦-౨౫౨౧ పద్యములఁ జూచునది.

క. జననీవంశమువారిని, జనకు కులమువారి న్పతి ♦ సంతతివారిన్
దనయా! కన్యక సంశయమునఁ ద్రోయు సదా యకీర్తి ♦ ముంచునోయనుచున్

తా త్ప ర్య ము

ఆఁడుపిల్లవలన దుఃఖించువాఁడు తండ్రి యొక్కఁడేకాఁడు. కన్యక యే వేళకు నే దుర్బుద్ధి గలదై కామదాసియై యే చేయరాని పనిచేసి యపకీర్తియుఁ బరలోక హానియుఁ గలిగించునోయని దాని తండ్రివంశమువారిని, దన తల్లివంశము వారిని, దన మగనివంశమువారిని సందేహ సముద్రమున నెల్లప్పుడు ద్రోయును. కావునఁ గన్యకను సన్నివిధములఁ దగినవరునకే యివ్వవలయును.

ఉ. కావున నీవు విశ్రవునిఁ ♦ గంజభ వాన్వయు మౌనివర్యు స
ద్భావమునన్ వరింపు పతి ♦ భావముఁ దాలిచి తన్మహానుకం
పావిభవంబునన్ సుతుల ♦ భాస్కరతేజులఁ గాంచుదాన వ
మ్మా! విదితప్రభావుల ధ ♦ నాధిపునిం బురుడించువారలన్. ౧౪౪

అర్థములు. కంజభవాన్వయున్=బ్రహ్మవంశమునఁ బుట్టిన వానిని, తత్=అతనియొక్క, మహానుకంపావిభవంబునన్ = గొప్పదయయొక్క సమృద్ధిచే, భాస్కరతేజులన్=సూర్యకాంతి కలవారిని, విదిత ప్రభావులన్ = ప్రసిద్ధికెక్కిన మహిమ గలవారిని, పురుడించు=పోలు.

తా త్ప ర్య ము

కాఁబట్టి నీవు పోయి బ్రహ్మవంశమునఁ బుట్టిన విశ్రవసుఁడను మునిని మగనిగా వివరింపుము. ఆయన దయను నీవు సంపాదించుకొంటివా సూర్యునివంటి ప్రకాశము గలవారిని బ్రసిద్ధికెక్కిన మహిమ గలవారిని కుబేరునితో సమానమగు వారిని పుత్రులఁ గనెదవు.

—* కైకసి విశ్రవసు నాశ్రమంబునకు వచ్చుట *—

ఉ. భాసురతేజ! పుణ్యజన ♦ వల్లభ నీవును గంటి గాదె యు
ల్లాసము మీఱఁ బోవ సబ ♦ లా! చనుమీ యనఁ దండ్రియానతిం
జేసి వధూమతల్లి చని ♦ చెచ్చెరఁ గైకసి మౌనియాశ్రమ
త్క్ష్మా సొబగారఁ జేయుచు వికాసముఖాంబుజయై రహించుచున్. ౧౪౫

అర్థములు. పుణ్యజనవల్లభున్=యక్షులకు రాజగు కుబేరుని 'పుణ్యజన స్సుజనే స్యా ద్రక్షసి యక్షే' నానా ॥౪॥ వధూమతల్లి స్త్రీలయందు శ్రేష్ఠురాలు; ఆశ్రమక్ష్మా=ఆశ్రమభూమి, వికాసముఖాంబుజ=విచ్చిన ముఖకమలము గలది, రహించుచున్=ప్రకాశించుచు.

క. జననీవంశమువారిని, జనకు కులమువారి స్వపతి ♦ సంతతివారిన్
దనయా! కన్యక సంశయమునఁ ద్రోయు సదా యకీర్తి ♦ ముంచునోయనుచున్

తాత్పర్యము

ఆఁడుపిల్ల వలన దుఃఖించువాఁడు తండ్రి యొక్కఁడేకాఁడు. కన్యక యే వేళకు నే దుర్బుద్ధి గలదై కామదాసియై యే చేయరాని పనిచేసి యపకీర్తియుఁ బరలోక హానియుఁ గలిగించునోయని దాని తండ్రివంశమువారిని, దన తల్లివంశము వారిని, దన మగనివంశమువారిని సందేహ సముద్రమున నెల్లప్పుడు ద్రోయును. కావునఁ గన్యకను సన్నివిధములఁ దగినవరునకే యివ్వవలయును.

ఉ. కావున నీవు విశ్రవునిఁ ♦ గంజభవాన్వయు మౌనివర్యు స
ద్భావమునన్ వరింపు పతి ♦ భావముఁ దాల్చి తన్మహానుకం
పావిభవంబునన్ సుతుల ♦ భాస్కరతేజులఁ గాంచెదావ వ
మ్మా! విదితప్రభావుల ధ ♦ నాధిపునిం బురుడించువారలన్. ౧౨

అర్థములు. కంజభవాన్వయున్=బ్రహ్మవంశమునఁ బుట్టిన వానిని, తత్=అతనియొక్క, మహానుకంపావిభవంబునన్ = గొప్పదయయొక్క సమృద్ధిచే, భాస్కరతేజులన్=సూర్యకాంతి కలవారిని, విదిత ప్రభావులన్ = ప్రసిద్ధికెక్కిన మహిమ గలవారిని, పురుడించు=పోలు.

తాత్పర్యము

కాఁబట్టి నీవు పోయి బ్రహ్మవంశమునఁ బుట్టిన విశ్రవసుఁడను మునిని మగనిగా వివరింపుము. ఆయన దయను నీవు సంపాదించుకొంటివా సూర్యునివంటి ప్రకాశము గలవారిని బ్రసిద్ధికెక్కిన మహిమ గలవారిని కుబేరునితో సమానమగు వారిని పుత్రులఁ గనెదవు.

—* కైకసి విశ్రవసు నాశ్రమంబునకు వచ్చుట *—

ఉ. భాసురతేజ! పుణ్యజన ♦ వల్లభు నీవును గంటి గాదె యు
ల్లాసము మీఱఁ బోవ సబ ♦ లా! చనుమీ యనఁ దండ్రియానతిం
జేసి వధూమతల్లి చని ♦ చెచ్చెరఁ గైకసి మౌనియాశ్రమ
క్ష్మా సొబగారఁ జేయుచు వికాసముఖాంబుజయై రహించుచున్. ౧౩

అర్థములు. పుణ్యజనవల్లభున్=యక్షులకు రాజగు కుబేరుని 'పుణ్యజనస్సుజనే స్యాద్రక్షసి యక్షే' నానా ॥౨॥ వధూమతల్లి స్త్రీలయందు శ్రేష్ఠురాలు; ఆశ్రమక్ష్మా=ఆశ్రమభూమి, వికాసముఖాంబుజ=విచ్చిన ముఖకమలము గలది, రహించుచున్=ప్రకాశించుచు.

తాత్పర్యము

ప్రకాశించు తేజస్సు గలదానా! కుబేరుఁడు సంతోషముతోఁ బోవ నీవు కూడఁ జూచితివికదా. కావున నీవుకూడఁ బొమ్ము అని చెప్పగా నా కన్యారత్నము కైకసి పోయి మునీశ్వరు నాశ్రమభూమిని నలంకారము గలదానినిగాఁ జేయుచు సంతోషముచే విచ్చిన ముఖముగలదై ప్రకాశించుచు.

చ. వినుతసుశీలుఁ జేరఁ జన ♦ విశ్రవు డప్పుడు వేల్చి సంజవే
శను వెలుఁగొంద నాల్గవజ్వ ♦ లద్దహనుం డనఁ గ్రూరకాలమం
చను గణియింప కా యువతి ♦ చూచుచు మక్కువ నమ్మునీశ్వరున్
దన కొనయుంగుటంబునను ♦ ధారిణి గీయుచు నేలఁ జూచుచున్. ౧౮౬

అర్థములు. సంజవేళను=సాయంకాలమున, జ్వలత్=మండుచున్న. దహనుఁడు=అగ్నిహోత్రుఁడు, ఉంగుటంబునను=కాలి బొటన వ్రేలిచే.

తాత్పర్యము

ప్రసిద్ధి కెక్కిన మంచి యాచారముగల విశ్రవుని చేరఁబోఁగా నప్పుడాయన సంధ్యవేళఁ జేయవలసిన హోమము నెరవేర్చి యాముూఁడగ్నులతోఁదాను నాలుగవ యగ్నివలెఁ బ్రకాశించుచుండఁగా నది సాయంకాలమనియుఁ గ్రూరకాలమనియుఁ గూడ లక్ష్యపెట్టక యా యువతి యా మునీశ్వరుఁ గామముతోఁ జూచుచుఁ దనకాలి బొటనవ్రేల నేల రాయుచు నేలఁ జూచుచు.

చ. నిలిచినఁ బూర్ణచంద్రముఖి ♦ నీరజలోచన సింహమధ్య నా
కులపతి గాంచి యిట్టు లనుఁ ♦ గోమలి యెవ్వరిదాన వేల యిం
దుల కరుదెంచి తేమిపని ♦ తొయ్యలి పల్కు మటన్న హస్తముల్
నలలితశీల మోడ్చి ముని ♦ సత్తము మ్రొక్కి వచించె నీగతిన్. ౧౮౭

అర్థములు. కులపతి=పదివేల శిష్యుల కన్నముపెట్టి చదువుచెప్పు వానికి కులపతి యనిపేరు. "మునీనాం దశసాహస్రం యోన్నదానాది పోషణాత్, అధ్యాపయతి విప్రర్షి రసౌ కులపతి స్మృతః" ఇందులకున్=ఈప్రదేశమునకు.

తాత్పర్యము

నిలువఁబడఁగా పూర్ణచంద్రునివంటి ముఖము, కమలములవంటి కనులు, సింహము నడుమువంటి నడుము గలదానిని జూచి కులపతి యగు విశ్రవసుఁడు ఓ కోమలీ! నీవెవ్వరిదానవు? ఇచ్చటికేల వచ్చితివి? చెప్పుమని యడుగఁగా నది చేతులు జోడించి మ్రొక్కి మునీశ్వరునితో నిట్లు చెప్పెను.

చ. మునివర తండ్రియాజ్ఞను మి ♦ ముం గన వచ్చితి, పేరఁ గైకసిన్
వనజభవాన్వవాయమణి! ♦ నామత మాత్మమహానుభావత
న్గన నగు నన్న నాతఁడు క్ష ♦ ణంబు తలంచి యెఱింగి సర్వమున్
వనితకు నిట్లు పల్కె మగు ♦ వా! భవదాశయ మే నెఱింగితిన్. ౧౨౨

అర్థములు. వనజభవాన్వవాయమణి = బ్రహ్మవంశమున శ్రేష్ఠుఁడా, నామతము=నా యభిప్రాయము, ఆత్మమహానుభావతన్=నీ తపోమహిమచేత, భవదాశయము=నీయభిప్రాయము.

తా త్ప ర్య ము

మునీశ్వరా! తండ్రియాజ్ఞప్రకారము మిమ్ము నేను జూడవచ్చితిని. నాపేరు కైకసి. నే నేల వచ్చితినో దానిని మీ తపోమహిమచే మీరే తెలిసికొనవలయును అని చెప్పఁగా క్షణకాల మాలోచించి సర్వము తెలిసికొని దానితో నిట్లనెను. ఓసీ! నీయభిప్రాయము నేను దెలిసికొంటిని.

క. తనయాభిలాష వచ్చితి, కనఁనై తివి క్రూరవేళ ♦ కావునఁ గ్రూరల్
తనయులు క్రూరాకారులు జనియింతురు నీకు రాక్షసప్రాగ్రసరుల్. ౧౨౩

అర్థములు. తనయాభిలాష=కొడుకులు కావలయునను కోరికచేత, రాక్షసప్రాగ్రసరుల్=రాక్షస శ్రేష్ఠులు.

తా త్ప ర్య ము

కొడుకులు కావలయు నను కోరికతో వచ్చితివి కాని యిది క్రూరవేళయని నీ వాలోచించినదానవు కావు ఇట్టి క్రూరవేళ నీ కీ సంకల్పము గలిగెను గావున నీకు క్రూరులైన రాక్షసశ్రేష్ఠులు పుత్రులుగాఁ బుట్టుదురు.

సాయంసంధ్యాసమయంబున దితి కశ్యపునితో రమించుటచే హిరణ్యాక్ష హిరణ్య కశిపు లుదయించిరి. భాగవతము తృతీయస్కంధము రచించిన పద్యము.

గీ. తరళలోచన! నీవు సంతానవాంఛఁ, జేసి వచ్చితి వొఁగులశీల వర్త
నములుగల భార్య మనమున నమరుకోర్కెఁ, దవిలితీర్చుట పతికిఁగర్తవ్యమరయ.

మ. తరుణీ! యొక్కముహూర్తముండు మిది సంధ్యాకాల మిక్కాలమం
దరయం భూతగణావృతుం డగుచుఁ గామారాతి లీలన్ వృషే
శ్వరయానంబున సంచరించుట వఖ్యావం బయ్యె నీ యుగ్రవే
ళ రమింపంగ నిషిద్ధకర్మ మగు నేలా ధర్మమున్ వీడఁగన్.

ఇట్లు చెప్పినను వినక దితి.

క. మునుకొని లజ్జావనతవ, దనయై ప్రాణేశు కొంగుఁ దాలిమి దూలం
బెనఁగొనియె వార కామిని, యనువును వినిషిద్ధకర్మమందభిముఖయై, రచించిన పద్యము

ఫలము—క॥ పరఁగిన దర్పోద్ధతు లి,ద్ధలుకొడుకులు నీకుఁ బుట్టి ధరణికి వ్రేఁగై
నిరతము బుధజనపీడా,పరులై వర్తింతు రాత్మబలగర్వమునన్.

శివుఁడు తమోగుణ విశిష్టుఁడు కావున సాయంసమయమునఁ గ్రీడించినచో నాయనదృష్టివలనఁ దమోగుణ విశిష్టులై క్రూరులైన పుత్రులు కలుగుదురు. గర్భము నిలిచినపుడు బ్రాహ్మవేళ యయ్యెనేని బ్రహ్మదృష్టి యగుటచే రజోగుణ విశిష్టు లగు పుత్రు లుదయింతురు. విష్ణువుదృష్టి పడెనేని సాత్త్వికులుదయింతురు.

'యా నపశ్యే జ్జాయమానాన్ పాపినో మధుసూదనః. బ్రహ్మరుద్రోధవా పశ్యే ద్రజసా తమసా వృతాన్, తై రాలాపం నకుర్వీత నానద్భిః కించి దాచరేత్'॥ ఏ పాపాత్ముల విష్ణుదృష్టి పడని వేళ, బ్రహ్మరుద్రుల దృష్టి పడినవేళ జనింతురో యట్టి రాజస తామసులతో మాటలాడరాదు వారి కొఱకే కార్యము చేయరాదు.

దీనివలన విశ్రవసునకుఁ గైకసి వివాహిత భార్య కాదని యేర్పడుచున్నది.

## —*రావణ కుంభకర్ణ విభీషణ జననము*—

సీ. అనవుడుఁ గైకసి ♦ యనియె నో బ్రహ్మవా,దీశ్వర! నను క్షమి ♦ యింపు నీకుఁ
గలిగెడు పుత్రులు ♦ కఠినచిత్తులు దురా,చారులు గావుట ♦ సమ్మతింప
నవిన నీ కడగొట్టు ♦ తనయుఁడు ననువంటి, వాఁడు ధర్మాత్ముఁడై ♦ పరఁగునిజము
కొమ్మ యన్నను సతి ♦ నెమ్మది నట నుండి, కొంతకాలం బేగఁ ♦ గొడుకుఁగనియె
తే. దీర్ఘదంష్ట్రి దశగ్రీవు ♦ దీప్తకేశు, నంజనచయాభుఁ దామ్రోష్ఠు ♦ నతులభయద
రూపు వింశతిభుజు మహా ♦ క్రూరు రాక్ష,సాకృతిని నప్పు డశని చ ♦ యంబు లురలె

అర్థములు. దీర్ఘదంష్ట్రిన్ = నిడివికోరలు గలవానిని, దశగ్రీవున్=పది మెడలు(శిరస్సులు)గలవానిని, దీప్తకేశున్=ప్రకాశించు వెండ్రుకలు గలవానిని, అంజనచయాభున్=కాటుకకుప్పవంటి వానిని, తామ్రోష్ఠున్ = ఎఱ్ఱని పెదవులు గలవానిని, అతుల=అసమానమైన, భయద=భయము కలిగించు రూపున్= ఆకారము గలవానిని, వింశతిభుజున్=ఇరువది చేతులుగలవానిని, మహాక్రూరున్= బొత్తిగ దయలేనివానిని, రాక్షసాకృతిని=రాక్షసరూపము గలవానిని, అశనిచయంబులు=పిడుగుల సమూహములు, ఉరలెన్=పడెను.

### తాత్పర్యము

విశ్రవసుఁ డిట్లు చెప్పఁగాఁ గైకసి, యో బ్రహ్మవేత్తలందు శ్రేష్ఠుఁడా! నన్ను క్షమింపుము. నే నట్టిదాననై నను నీకుఁ గలిగెడు పుత్రులు క్రూరులుదురాచారులు నగుట కంగీకరింపనని చెప్పఁగా విశ్రవసుఁ డిట్లనియె. చేయరానిపని చేసి

దానిఫలము నేను సమ్మతింప వనిన నెట్లు తప్పును ? అయినను నీకడగొట్టుకొడుకు నన్నుఁ బోలి ధర్మాత్ముఁడై యుండును. అనిన నది సమ్మతించి కొంతకాల మచటనే యుండెను. ఇట్లు కొంతకాలము పోఁగా నది నిడుపాటి కోఁరలు, పదితలలు, ఎఱ్ఱని వెంట్రుకలు, ఎఱ్ఱని పెదవి, ఇరువది చేతులు భయంకరమైన యాకారము గల వానిని కాటుకసమూహమువలె నల్లనివానిని మిక్కిలి క్రూరుని రాక్షసాకారునిఁ గనెను. అప్పుడు పిడుగులు రాలెను.

క. కురిసెను నెత్తురువానలు, మొరసె ఖరస్వనము లగుచు • మొగుళులు సత్త్వో
త్కర మపసవ్యము దిరిగెను, ధరణి వణఁకె దేజు మాసెఁ • ధరణియునంతన్

అర్థములు. మొరసెన్=ధ్వనించెను, సత్త్వోత్కరము=జంతుసమూహము, అపసవ్యము=అప్రదక్షిణము.

తాత్పర్యము

నెత్తురువానలు గురిసెను. మేఘములు కఠినస్వరముల ధ్వనించెను. జంతువుల ప్రదక్షిణము తిరిగెను. భూమి వణఁకెను. సూర్యునికాంతి మాసెను.

రావణునకుఁ దండ్రి బ్రాహ్మణుఁడైనను, దల్లి రాక్షసరాజకన్య కావున బ్రాహ్మణునకు క్షత్రియ స్త్రీయందు క్షత్రియుఁ డగునే కాని బ్రాహ్మణుఁడు కానేరడు.అందు కైకసి వివాహితయుఁ గాదు. దానికిఁదోడు రావణుని వృత్తియు క్షత్రియ వృత్తియే.

ఈ పద్యమువలన రావణాసురుఁడు పుట్టినపుడే పదితలలతోఁ బుట్టెననియుఁ బదితలలు కృత్రిమములు గావనియు నేర్పడుచున్నది.

క. విశదయశుండును ధాతృసదృశుఁ డగునమ్మౌని వచ్చి • దృష్టించి సుతున్
దశకంధరుఁ డగుకతమున, దశకంధరుఁ డనుచు నిడియెఁ • దన్నామంబున్.

అర్థములు. విశదయశుఁడును=తెల్లని కీర్తిగలవాఁడు, ధాతృసదృశుఁడు=బ్రహ్మతో సమానుడు, దశకంధరుఁడగు కతమునన్=పదిమెడలు గలవాఁడగుటచే, తన్నామంబున్=వానిపేరును.

తాత్పర్యము

నిర్మలకీర్తి గలిగి బ్రహ్మతో సమానుఁడగు విశ్రవసుడు వచ్చి కొడుకును జూచి పదిమెడలుగల వాఁ డగుటచే దశకంధరుఁ డని వానికి బేరు పెట్టెను.

సీ. కొలఁది చెప్పఁగరాని • క్రూరరూపమువాఁడు, కుంభకర్ణుం డను•కొడుకుపుట్టె
నావల శూర్పణ•ఖాఖ్య సంభవమందెఁ గుటిల విరూపాస్య • కూఁతు రగుచుఁ
బశ్చిమసుతుఁ డయి•ప్రభవించె ధర్మాత్ముఁ, డగు విభీషణుఁ డంబ•హర్ష మంద
నతఁడు జనించిన • యదనునఁ బుష్పవర్షము రాలె దుందుభి•రవము నెఱసె

ఆ. మింట భూతవితతి • మేలు మే లని మెచ్చ, వారలెల్ల మౌని•వర్యునాశ్ర
మంబునంద పెరిగి • మహితతేజస్కులై, తనరుచుండఁ బిన్న•తనమునుండి.

అర్థములు. పశ్చిమ సుతుఁడు=కడపటి కొడుకు, అంబ=తల్లి, హర్ష మందన్=సంతోష మందఁగా-అనుటచేఁ దక్కినవారి యెడ నామె సంతోషింప లేదని భావము. అదనునన్=సమయమందు.

తాత్పర్యము

(ఇంత ప్రమాణమని చెప్ప వీలులేని క్రూరమయిన రూపముగల కుంభకర్ణుఁడను కొడుకు పుట్టెను. తరువాతఁ గుటిలాత్మురాలు వికటరూపమయిన ముఖముగల శూర్పణఖ యనెడు కూఁతురు పుట్టెను. అందఱకు కడకొట్టు కొడుకయి ధర్మాత్ముఁడయిన విభీషణుఁడు పుట్టెను. అతఁడు జన్మించిన సమయమున పూలవాన గురిసెను. దుందుభులు మింట మొఱసెను-భూతము లన్నియు మేలు మేలని మెచ్చుకొనెను. వారందఱు తండ్రియయిన విశ్రవసు నాశ్రమమందే పెరిఁగి గొప్ప తేజఃగల వారయి యుండఁగా, చిన్నతనము నుండియు)

తే. క్రూరులయి దశకంఠుండుఁ•గుంభకర్ణుఁ డుర్వికిని బాధఁగలిగించు • చుండిరందుఁ
గుంభకర్ణుండు మౌనులఁ•గూల్చి తినుచు, దుష్టచరితల మిగుల సం•తుష్టిగనియె.

తాత్పర్యము

(క్రూరాత్ములయి దశకంఠుఁడు, కుంభకర్ణుఁడు భూమియందలి ప్రాణులను బాధించుచుండిరి అందులోఁ గుంభకర్ణుఁడు మునులను జంపి తినుచు, దుష్టవ్యాపారములు చేయుచు మిగుల సంతోషించెను.)

క. శ్రుతులఁ బఠించుచు నింద్రియ తతి గెల్చి మితాశనుండు • ధర్మాత్ముండై
మతిమంతుండు విభీషణుఁ, డతులిత సాధుత్వగరిమ•యశముం గాంచెన్ ౧౬౫

అర్థములు. శ్రుతులన్=వేదములను, మితాశనుండున్=మితమైన యాహారము గలవాఁడు, సాధుత్వగరిమన్=మంచితనము యొక్క యతిశయముచే.

తాత్పర్యము

(వేదములను జదువుచు, నింద్రియములను గెలిచి, మితాహారమును గొనుచు ధర్మాత్ముఁడై బుద్ధిమంతుఁడగు విభీషణుఁడు పరమ సాధువనెడి ప్రఖ్యాతి వడసెను.)

చ. అనుగఁగఁ గొంతకాల మిటు • లావల నొక్క దినంబునందుఁ గి
న్నరపతి మ్రొక్కఁ దండ్రికి ఘ • నం బగు తేజముతోడఁ బోవ నా
సురపతి శత్రుకంఠుఁ గని • చూచితె పుత్రిక ! నీదు భ్రాత దే
కరణి మహానుభావతను • గ్రాలెడినో విధవాభి రాముఁడై. ౧౬౬

అర్థములు. కిన్నరపతి=కుబేరుఁడు, మహానుభావతను=గొప్ప మహిమచే విభవాభిరాముఁడై=సంపదచే నొప్పినవాఁడై.

తాత్పర్యము

రావణాదులు పెద్దవారైన పిమ్మట నొక్కనాఁడు తండ్రికి నమస్కరించి మిక్కిలి తేజస్సుగలవాఁడై పోవుచున్న కుబేరునిఁ దన కొడుకునకుఁ జూపి చూచితివా నాయనా! మీయన్న యెంతి సంపదగలవాఁడై గొప్పమహిమగలవాఁడై యున్నాఁడో.

చ. అటువలె మీర లెప్పు డొకొ ♦ యాట యటన్నను బంక్తికంఠుఁడున్
స్ఫుటతర రోషమూని తల్లిఁ ♦ జూచి వచించెను, బాసఁ జేసెదన్
బటుతర వైభవంబునను ♦ వాలెద నీతని కంటె మిన్ననై
యటు లొనగూడకున్న సరి ♦ యయ్యెద నీడుము నీమనోవ్యథన్. ౧౯౭

తాత్పర్యము

వానివలె మీ రెప్పుడౌదురో కదా యనఁగా దల్లినిజూచి దశకంఠుఁడు రోషము గలవాఁడై యిట్లనియె. తల్లీ! నీ మనోవేదన వదలుము. ప్రమాణము చేయుచున్నాను. వైభవమునందు వీనికంటె గొప్పవాఁడ నయ్యెదను. అట్లు కాఁజాలనేని సమానుఁడుగనైన నయ్యెదను.

క. ఘనతపమున నాకార్యముఁ, గొనసాగించెద నటంచు ♦ గోకర్ణంబున్
జని తమ్ములతోఁ దపముం, బొనరించె నభీష్టవరముఁ♦బొందెన్ విధిచేన్. ౧౯౮

తాత్పర్యము

(పెద్ద తపస్సుచేసి నా కార్యమును గొనసాగించెదనని తమ్ములతో గోకర్ణమునకుఁ బోయి దప మొనరించి బ్రహ్మచే నభీష్టవరములను బొందెను.)

—౧౦వ సర్గము—

## —: అగస్త్యుఁడు శ్రీరామునకు రావణాదుల తపోవిధంబుఁ జెప్పుట :—

క. నావుడు నా దేవాహితు, లేవిధమునఁ దపముచేసి ♦ రెఱిఁగింపుము పా
రావారపానచణ యని, రాఘవుఁ డడుగంగఁ గలశ♦సంభవుఁడనియెన్. ౧౯౯

అర్థములు. పారావార పానచణ=సముద్రమును పానముచేసిన సమర్థుఁడా, కలశసంభవుఁడు=ఘటమునందుఁ బుట్టినవాఁడు, ఈకథ ముందు రాఁగలదు.

తాత్పర్యము

సముద్రమును ద్రావిన మహానుభావా! ఆరాక్షసు లెటుల దపస్సుచేసిరి తెలియ జెప్పుఁడు.)

సీ. ధర్మమార్గంబును ♦ దలఁగక తపియించె, గుంభకర్ణుం డతి ♦ ఘోరభంగి
మండు నెండల నైదు ♦ మంటలనడుమను, వానకారున జడి ♦ వానలందు
మంచుకారున నీటి ♦ మధ్యంబునను నిల్చి, పదివేలవర్షముల్ ♦ పరమతపము
సలిపె విభీషణుం ♦ డలఘు ధర్మస్థితి నేకపాదంబున ♦ నిలను నిల్చి
తే. యైదువే లబ్దములు తప ♦ మాచరించి
యంతకాలంబ మఱియు సూ ♦ ర్యాభిముఖుఁడు
నగుచు స్వాధ్యాయదృఢచిత్తుఁ ♦ డగుచు నూర్ధ్వ
మూర్ధ్వ బాహుకుఁ డగుచు ని ♦ ర్మోహమతిని. ౨౦౦

అర్థములు. వానకారున=వర్షాకాలమందు, మంచుకారునన్=మంచుకురియు హేమంతమునందు.

తాత్పర్యము

ధర్మపద్ధతి వదలక కుంభకర్ణుఁడు ఎండలు మండుచున్న గ్రీష్మమందు పంచాగ్ని మధ్యమునను, వానకాల మందు జడివానలందును, మంచుకాలమున నీళ్ళనడుమను నిలిచి పదివేల సంవత్సరములు తపస్సు చేసెను. విభీషణుఁడు ధర్మమందున్న వాఁడై యొంటికాలిమీఁద నిలబడి యైదువేల సంవత్సరములు తపస్సుచేసి యావల సూర్యుని జూచుచు దృఢముగ మంత్రము జపించుచు చేతులు తలమీఁది కెత్తి మోహము వదలినవాఁడై యైదువేల సంవత్సరములు.

క. నందనమున నాకాలయు, చందంబునఁ దప మొనర్ప ♦ సదయాత్మునిపైఁ
జిందెను సుమనోవర్షము, బృందారకు లంత సంక్షు ♦ భితులై యడలన్. ౨౦౧

అర్థములు. నాకాలయు చందంబునన్=దేవతలవలె, సదయాత్మునిపైన్= దయగల మనస్సు గలవానిపై, సుమనోవర్షము=పూలవాన, బృందారకులు=దేవతలు, సంక్షుభితులు=కలఁత చెందినవారు.

తాత్పర్యము

(నందన వనమునందు దేవతవలెఁ దప మొనరింపఁగా దయగల మనస్సు గల వానిపైఁ బూలవాన గురిసెను. దేవతలు కలఁత చెందిన వారయి భయపడు నట్లుగా.)

సీ. పదివేలయేఁడులు ♦ పంక్తికంఠుఁడు నిట్టు, పాసంబు గాఁగఁ ద♦పం బొనర్చె
వర్షసహస్రంబు♦పరిపూర్తి యగుడును, దల నొండు గోసి య♦గ్నులను వేల్చె
వేయింటి కొకటి నీ♦విధిఁ దలల్ తొమ్మిది,యగ్ని కాహుతిఁ జేసె♦నజనిగుఱిచి
పదియవ వేయేఁటి ♦ తుదఁ బదియవతల, హోమంబుఁ గావింప♦నున్నయంత
తే. సిద్ధరాస్యైతుఁ డగుచు వా♦ణీవిభుండు వానిఁ జేరంగ వచ్చి యో♦పంక్తివదన!
మెచ్చితిని నీదుతపము నీ♦యిచ్ఛఁ జెపుము,సఫలమొనరింతు నీపరి♦శ్రమము వత్స!

అర్థములు. నిరుపవాసంబు = శుష్కోపవాసము, వర్షసహస్రంబు=వేయి యేడులు, నిర్జరాన్వితుఁడు=దేవతలతోఁ గూడినవాఁడు, వాణీవిభుండు=బ్రహ్మ, పరిశ్రమము=కష్టము, వత్స=నాయనా.

తా త్ప ర్య ము

దశకంఠుఁడు పదివేల సంవత్సరములు నిరాహారియై తపము చేసెను. అందు వేయి సంవత్సరములు పూర్తి కాఁగానే తన తలలలో నొక తలఁ గోసి యగ్ని లందు హోమము చేసెను. ఈ ప్రకారము వేయి సంవత్సరముల కొకటి వంతున తొమ్మిది తలలు బ్రహ్మ దేవు నుద్దేశించి యగ్నిలో హోమము చేసెను. ఆవలఁ బదియవ వేయి సంవత్సరములు తపస్సుచేసి పదియవ తల హోమము చేయఁ బ్రయత్నించుచుండఁగా దేవతలతోడ బ్రహ్మదేవుఁడు ప్రత్యక్షమై యోయి పంక్తికంఠా! నీ తపమునకు మెచ్చితిని. నీయిష్టము చెప్పుము. నీవు పడిన శ్రమము సఫలము చేసెదను అనెను.

—* బ్ర హ్మ రా వ ణు న కు వ ర ము లి చ్చు ట *—

క. అనవుడుఁ బంక్తిగ్రీవుం డనుపమ హర్షాబ్ధిఁ దేలి ♦ యాడఁగ జిత్తం
బనియెం గరంబుల మోడిచి, వనజాసన! వరద! భక్త ♦ వత్సల! దేవా! ౨౦౩

అర్థములు. అనుపమ హర్షాబ్ధిన్=అ స మా న మై న సంతోష మను సముద్రమందు.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా దశగ్రీవుఁడు సాటిలేని సంతోష సముద్రమున మునిఁగి చేతులు జోడించి, వనజాసనా! వరదా! భక్తవత్సల! దేవా!)

క. జీవికి మరణభయము గా,కావల భయ మేది గలుగ ♦ దనవరతంబున్
జీవికి మృత్యువుతో సరిసా వైరియు లేదు గాన ♦ నమరత నిడవే. ౨౦౪

తా త్ప ర్య ము

ప్రాణముగలిగి జీవించువానికిఁ జావునకు మించిన భయములేదు. సర్వదా ప్రాణికి మరణముతో సమానమైన శత్రువు లేఁడు కావున నాకుఁ జావు లేకుండ వర మిమ్ము.

క. నావుడుఁ బద్మజుఁ డిట్లను నేవారికి నైన వచ్చు ♦ నే యీయ దశ
గ్రీవా! యమరత్వంబును, నీ వొండువరంబుఁ గోరు♦మీ గాన నతఁడున్.. ౨౦౫

అర్థములు. పద్మజుఁడు=బ్రహ్మ. అమరత్వము=చావులేమి.

తాత్పర్యము

దశకంఠా! అమరత్వము నెవరి కనిన వారికెల్ల సీయరాదు కావున వేఱొక వరముఁ గోరుము అని బ్రహ్మ చెప్పెను.

చ. అనిమిషదైత్యయక్షదను • జాహిసుపర్ణ పలాశికోటిచే
వనజజ! మృత్యువుం గనమి • వాంఛిత మీవ వర మిమ్ము నల్పృపన్
మనుజులఁ దక్కువారిఁ దృణ • మాత్రము గాఁగ గణింతు లెక్కగాఁ
గొనుదుస వారి నన్న నల • కోర్కె యొసంగి విధాత వెండియున్. ౨౦౮

అర్థములు. అనిమిష=దేవతలయు, దైత్య=దైత్యులయు, యక్ష=యక్షులయు, దనుజ=దానవులయు, అహి=పన్నగులయు, సుపర్ణ=గరుడులయు, పలాశి=రాక్షసులయు, కోటిచేఁ=సమూహముచే, వనజజ=బ్రహ్మదేవా, వాంఛితము=కోరిక.

తాత్పర్యము

బ్రహ్మదేవా! దేవతలు మొదలగు వారిచే నాకుఁ జావు లేకుండ వర మిమ్ము. మనుష్యులను సంతకుఁ దక్కువ జీవులను దక్కిన వారిని తృణముగా నేను జూతును కావున వారిని లక్ష్యము సేయను అని చెప్పఁగా నట్టులే యగునని బ్రహ్మ మఱియు నిట్లనియె.

ఉ. ప్రీతుఁడ నైతి నీవలన • వేఱొకమేలు ఘటింతు మస్తక
వ్రాతము నీవు వేల్చినది • క్రమ్మఱ నెప్పటియట్ల గల్గు, నీ
చేతమునం దలంచినటు • చేకొనఁజాలుదు నెట్టిరూపమేన్
ఖ్యాతచరిత్ర నావరము • కల్మినటం చన నింతలోపలన్. ౨౦౯

తాత్పర్యము

నీ విషయమున నేను సంతోషించితిని. కావున నీవు కోరినది గాక మఱి యొక మేలు సమకూర్చెదను. నీవు నన్నుద్దేశించి హోమము చేసిన తలలు మరల నెప్పటియట్ల కలుగును. అదిగాక నీ వేరూపము నెత్తఁదలఁచిన నారూప మెత్తఁ గలవాఁడవగుదువు అని చెప్పుచున్నంత.

క. రాక్షసుఁడు మున్న లోకము, వీక్షింపఁగ వహ్నులందు • వేల్చినశిరముల్
లక్షింపఁగలిగెఁ దొమ్మిది, యాక్షణమున నెల్లవార • లౌరా యనఁగన్.

తాత్పర్యము

లోకమంతయుఁ జూచుచుండఁగా రాక్షసుఁడు ముందగ్నులందు హోమము చేసిన తలలు తొమ్మిది మరల మొలిచెను. చూచినవా రాశ్చర్యపడిరి.

## —* బ్రహ్మ విభీషణునకు వరంబు లిచ్చుట *—

చ. అవల విభీషణుం గదిసి • యంబుజగర్భుఁడు ధర్మబుద్ధివై
భవకలితుండ వీ వగుటఁ • బల్మఱు మెచ్చితి ధర్మశీల! నేఁ
డివుట నొనర్తు నీమతముఁ • దెల్పుము నీయభికాంక్షితంబు నా
దివిజనుతుండు హస్తములు • దెప్పున మోడ్చి వచించె నీగతిన్. ౨౦౯

అర్థములు. ఇవుట=కోరిక.

తాత్పర్యము.

ఆ పిదప విభీషణు నొద్దకుఁ బోయి బ్రహ్మ యిట్లనియె. ధర్మస్వభావము గలవాఁడా! నీవు ధర్మబుద్ధి గలవాఁడ వగుటచే నివిషయమున మెచ్చుకొంటిని. నీకోరిక సంతోషముతో నెఱవేర్చెదను అని చెప్పఁగా విభీషణుఁడు రెండు చేతులు జోడించి నమస్కరించి యిట్లనియె.

క. లోకగురుం డంట తానై, నా కెదురుగ నిల్చి మెచ్చి•నాఁడ నటంచున్
వాకొను నంట యింతకు వే, తే కలదే భద్రమైన • నిచ్చెద వేనిన్. ౨౧౦

అర్థములు. వాకొనెన్=చెప్పెను.

తాత్పర్యము

(లోక గురుఁడంట తానయి నా కెదురుగ నిలచి మెచ్చితి ననెనంట యింతకు మించి వేఱే శుభము కలదా? అయినను వరమిచ్చెదవేని,)

క. పరమాపత్కాలము నను, దొరసినయేనియు మనంబు•వోలఁగక యెపుడున్
బరఁగుత ధర్మమునం దే, నెరయుత బ్రహ్మాస్త్రమెవరు•నేర్పక నాకున్. ౨౧౧

అర్థములు. పరమాపత్కాలము=ప్రాణము పోవునంతటి కీడుదశ, తొరసిన యేనియున్=కలిగినను.

తాత్పర్యము

ప్రాణము పోవునంత కీడుదశ నాకుఁ గలిగినను నా మనస్సు ధర్మమునందే నిలువవలయును నా కెవరు నేర్పకయే బ్రహ్మాస్త్రము లభింపవలెను.

క. ఏనే యాశ్రమమందును, నేయేమఱి సంభవించు • నీశ్వర! నిరతం
బాయా యది ధర్మమునం, దే యనువర్తించఁ గాక•హితమిటు సేయన్. ౨౧౨

తాత్పర్యము

నేను బ్రహ్మచర్యము లోనగు నాశ్రమములందు దేనియందున్నను నా యాశ్రమ ధర్మములు నిర్వహించుటయందు, ధర్మబుద్ధియే నాకు దృఢముగా నిలుచునుగాక.

క. పరమాభీష్టము లగు నీ, వరములు నా కమరవినుత • వాణీనాథా
 వరధర్మరత్తునకు దుష్కర మెందును లేదు నాఁగఁ • గమలజుఁడనియెన్. ౨౧౩

అర్థములు. పరమాభీష్టములు=మిక్కిలి యిష్టములైనవి, వరధర్మవర్తనకున్=ఉత్తమధర్మమందుఁ బ్రీతిగలవారికి, దుష్కరము=చేయఁ గష్టమైనది, కమలజుఁడు=బ్రహ్మ.

తా త్ప ర్య ము

ఇవి నేను గోరు నుత్తమవరములు. ఉత్తమ ధర్మమునందుఁ బ్రీతిగలవానికి సాధింపరాని కార్యములేదు అనగా బ్రహ్మ యిట్లనియె.

చ. ఒసఁగితి నీవు కోరిన వ • రోత్తమముల్ సుకృతాత్మ! నీవు రా
 క్షసకులమందుఁ బుట్టియును • గల్గ దధర్మమునందు రక్తి; నీ
 కసమశుభంబుఁ గూర్తు నహి • తాంతక! నీ కమరత్వ మిచ్చితిన్
 రస మెసఁగంగ నంచు విధి • క్రచ్చఱ నాఘటకర్ణుఁ డాయఁగన్. ౨౧౪

అర్థములు. సుకృతాత్మ=పుణ్యాత్ముఁడా, రక్తి=ప్రేమ, అహితాంతక=విరోధులకు మృత్యుస్వరూపుఁడా, అమరత్వము=చావులేమి, అమరత్వమనఁగా నెన్ని కల్పములైనఁ జావులేకయుండుట యని యర్థము కాదు కల్పాంతమున బ్రహ్మకే వినాశ ముండఁగాఁ దనకు లేనిది యితరుల కేమి యియ్యఁగలఁడు? కావున నమరత్వ మనఁగా ప్రలయమువఱ కనియే యర్థము, లేదా దీర్ఘ కాలమని యైన గ్రహింపనగు, రసము=సంతోషము, విధి=బ్రహ్మ, డాయఁగన్=సమీపింపఁగా.

తా త్ప ర్య ము

నీవు కోరిన యుత్తమవరము లిచ్చితిని. నీవు రాక్షసులకులమందుఁ బుట్టినను నీకు నధర్మమందుఁ బ్రీతిలేదు కావున నీవు నితరుల కెవ్వరికిని లేని మేలుచేసెదను. నీకు సంతోషముతో నమరత్వము నిచ్చితినిఅని కుంభకర్ణునియొద్దకుఁబోవుచుండఁగా

బ్రహ్మదేవుఁ డడిగినరావణునకు నమరత్వమీయలేదు, ధర్మాత్ముఁడగుటచే విభీషణుఁ డడుగకున్నను నమరత్వ మిచ్చెను. కావున మనము ధర్మమునే యాధారము చేసికొని దానిని విడువక యుంటిమేని మనకుఁ గావలసిన శుభములు మనమడుగకున్నను భగవంతుఁ డిచ్చును. అడిగితిమా యడిగినంతమాత్రమే యిచ్చును. అడుగకుండిన సర్వము నిచ్చును.

—* బ్రహ్మ కుంభకర్ణునకు నిద్ర నిచ్చుట *—

చ. అనుగఁగ వేల్పు లో సురహి • తా! వర మీయఁగరాదు వీనికిన్
 సురపరిపంథి వీఁ డమిత • శూరుఁడు లోకభయంకరుండు న
 చ్చరలను ద్రుంగ నేడ్వురను • నారవనంబున శక్రభృత్యుని
 ద్దరదశకంబుఁ జంపె నర • సంయమివర్గముఁ ద్రుంచెఁ గ్రూరుఁడై. ౨౧౫

అర్థములు. సురహితా=దేవతల మేలుకోరువాఁడా, సురపరిపంథి=దేవతలకు శత్రువు, శక్రభృత్య=ఇంద్రుని భృత్యులను, నిర్జరదశకంబున్=పదుగురు దేవతలను, నరసంయమి వర్గమున్=మనుష్యులను ఋషుల సమూహములను, పౌరవనంబునన్=నందనమందు.

తాత్పర్యము

దేవత లిట్లు చెప్పిరి-దేవతల మేలుకోరువాఁడా! వీనికి నీవు వరమీయరాదు. ఏలన వీఁడు దేవతలకు శత్రువు. వీనికి వరమిచ్చిన దేవతలకు నీవు కీడు చేసినవాఁడవగుదువు. వీఁడిప్పుడే గొప్ప క్రూరుఁడు; ప్రజలకు భయము గలిగించువాఁడు. నందనంబున ఏడుగు రప్సరః స్త్రీలను బ్రిమింగెను. పదుగురు దేవేంద్ర భృత్యుల వధించెను. క్రూరుఁడై మనుష్యసమూహములను ఋషుల సమూహమును జంపెను.

క. ఏవరములు లేకయె యీ, కై వడి హావడి ఘటించు ♦ కలుషాత్మునకున్
నీవు వరంబులనిచ్చిన, శే వాతన్ వేసికోఁడ ♦ విశ్వం బెల్లన్. ౨౧౬

అర్థములు. ఈకైవడిన్=ఈవిధముగ, హావడి=కీడు, కలుషాత్మునకున్=పాపపు మనస్సుగలవానికి, వాతన్=నోరను.

తాత్పర్యము

వరము లేవియు లేకయే లోకములకీ విధముగాఁ గీడుచేయువాఁడు వరములుకూడఁ బొందెనేని ప్రపంచము నంతయు నొక్కసారిగ వాతనేసికోఁడా?

క. వర మని తెలివి దొలంగఁగఁ, గరుణించిన జగములకును ♦ కల్యాణంబౌ
సురనాయక ! యన వాణీ, తరుణీమణి నవ్వెంచి ♦ తలఁచెఁ దలఁచినన్. ౨౧౭

అర్థములు. తెలివి దొలంగఁగన్=స్మృతి తప్పియుండునట్లు.

తాత్పర్యము

వరమని చెప్పినీవు స్మృతి తప్పియుందువుగాక యని వర మిచ్చిన లోకమునకు మేలుకలదు అని చెప్పఁగా బ్రహ్మదేవుఁడు సరస్వతిని దలఁచెను.

క. ప్రాంజలియై నిలువంబడి, సంజ యనెడు వేల్పుసాని ♦ సమ్మతి మై నా
కుం జలుపఁ గర్జ మెయ్యది, రంజితసుజనా! యటన్న ♦ బ్రహ్మవచించెన్. ౨౧౮

అర్థములు. సంజ యనెడు వేల్పుసాని=సరస్వతి, ప్రాతఃకాల సంధ్యాధిదేవత గాయత్రి, మధ్యాహ్నాధిదేవత సావిత్రి, సాయంకాలాధిదేవత సరస్వతి.

తాత్పర్యము

(సాయంకాలాధి దేవతయగు సరస్వతి చేతులు మోడ్చి నేను శేయవలసిన పనియేమి యని ప్రియమారఁ బలుక బ్రహ్మ చెప్పెను.)

క. దేవీ! రాక్షసునోరను, నీ వుండి వరంబువేళ • నిర్జరవాంఛన్
గావింపుము నా భారతి, తీవరమున నేగి నిలిచె • దితిజునినోరన్. ౨౧౯

తా త్ప ర్య ము

(దేవీ! రాక్షసునకు వరమడుగు వేళ వాని నోరను నీవుండి దేవతల యభీష్ట మును నెఱవేర్పుము. అనఁగానే భారతి శీఘ్రముగాఁ బోయి రాక్షసుని నోరను)

ఉ. ఆవలఁ గుంభకర్ణు నిక • టావనికిం జతురాస్యుఁ డేగి నీ
భాగవతంబుఁ జెప్పు మన • వాఁడును నిద్దురఁ గోరెఁ జెక్కు- లేం
డ్లావిధి యట్టు లౌతమని • స్వాలయముం జనె దేవయుక్తుఁడై
దేవవిరోధి వా వెడలి • దేవి సరస్వతి పోనొఁ బోయినన్. ౨౨౦

అర్థములు. నికటావనికిన్=సమీపభూమికి, దేవవిరోధి వా=రాక్షసుని నోరు, వాక్ శబ్దభవము వా - వాయి.

తా త్ప ర్య ము

ఇట్లు ముందు సరస్వతీదేవిని బంపి పిమ్మట బ్రహ్మ కుంభకర్ణుని యొద్దకుఁ బోయి నీ మనస్సునం దేమి యున్నదో చెప్పుమన వాఁడు నిత్యత్వమనఁబోయి నిద్రాత్వమును జెక్కు-లేం డ్లనుభవింపఁ గోరెను.

ఆ బ్రహ్మదేవుఁ డట్టులే నిద్రపొమ్మని చెప్పి తన లోకమునకు దేవతలతోఁ దాను బోయెను. సరస్వతీదేవియును రాక్షసుని నోరు వెడలి పోయెను. ఇట్లు పోయిన తరువాత.

క. తెలివి గొని తనదునుడికిం, బలువిధముల వగచి యేమి • పలికితి నయ్యో
తెలిసి యిటు మోహపడుటలు, ఖలమతులగు సురలచేఁత•గా యని మఱిఁగెన్

అర్థములు. ఖలమతులు=దుష్టబుద్ధులు, చేఁత=చేసినపని, మఱిఁగెన్=తపించెను.

తా త్ప ర్య ము

(తా నన్నమాట తెలిసికొని, యనేక విధముల విచారపడి, యయ్యో! యేమంటిని? తెలిసియు భ్రమపడితినిగదా! ఇది దుష్టబుద్ధులగు దేవతలు చేసిన పని యని పరితపించెను.)

తే. భ్రాత లీరీతి విధిచేత • వరములొంది చనిరి శ్లేష్మాత్మకవనంబు • జాడఁ బట్టి
జనకుఁ డారఁదపంబునఁ•జలుపునెడకు, నందు సుఖముండి రిచ్ఛావి•హారములను.

అర్థములు. విధిచేత=బ్రహ్మచే, శ్లేష్మాత్మకవనంబు=విరిగి చెట్లతోఁపు.

తా త్ప ర్య ము

ఇట్లన్నదమ్ములు బ్రహ్మచే వరములు పొందినవారై తమతండ్రి తపము చేయు విరిగితోపునకుఁ బోయి యచ్చట నిష్టము వచ్చినట్లు సంచరించుచుండిరి.

## ౧౧వ సర్గము

### —• సుమాలి రావణాదులఁ జూడ భూలోకంబునకు వచ్చుట •—

సీ. రాక్షసుల్ వారు వ♦రంబులఁ గాంచుట, యాలకించి సుమాలి ♦ హర్షవశత
నాత్మమంత్రులు విరూ ♦ పాక్షమారీచప్ర, హస్తమహోదరు ♦ లనెడివారు
గొలువ నిర్భయమతిఁ♦గుతలంబునకు వచ్చి,కంఠకంఠుని గ్రుచ్చి♦ప్రమదమునను
నాయనా! నెఱవేఱె ♦ నాకోర్కి యజునిచే, నుత్తమవరము నీ♦నొందుకతన

ఆ. మనది సుమ్ము లంక ♦ యనుపురం బందుండ, విష్ణుభీతి వెఱచి ♦ వీడు విడిచి
చనినవార మూర ♦ పాతలసీమకు, మేము పడెడిపాటు ♦ లేమి చెప్ప. ౨౩౭

అర్థములు. కుతలము=భూలోకము, నిర్భయమతిన్=భయములేని మనస్సుతో; రావణుఁడు దేవతలచే చావులేకుండ వరము తీసికొనెను గావున దేవతల భయము వదలెనని భావము.

#### తాత్పర్యము

రావణాది రాక్షసులు వరముల సంపాదించుట విని సుమాలి సంతోషపడి తన మంత్రులు విరూపాక్షుఁడు మారీచుఁడు ప్రహస్తుఁడు మహోదరుఁడు నను వారిని గూడికొని దేవతలవలన విష్ణునివలన భయము వదలి భూలోకమునకు వచ్చి దశకంఠుని గాఁగిలించుకొని సంతోషముతో నిట్లనియె. నాయనా! నీవు బ్రహ్మచే నుత్తమవరములను బొందుటచే నాకోరిక నెఱవేఱెను. లంకయను పురముమనది, విష్ణువునకు భయపడి యందుండక పాతాళమునకుఁ బోయితిమి. అచ్చట మేము పడు కష్టము లేమని చెప్పుదును.

ఆ. రాక్షసోచితంబు ♦ రహిమీఱు నాలంక, మనది తండ్రి! యిపుడు♦ధనవిభుండు
నీ విమాతృజుండు♦నెలవుగా జేకొన్న,వాఁడు దాని మరలఁ♦బాడి పడయ. ౨౩౮

అర్థములు. రాక్షసోచితంబు=రాక్షసులకుఁ దగినది, నీ విమాతృజుండు= నీ సవతితల్లి కొడుకు, ధనవిభుండు=కుబేరుఁడు.

#### తాత్పర్యము

(తండ్రీ! సొంపు మీఱు లంక రాక్షసుల కుచితమైనది. మనది ఇప్పుడు నీ సవతి తల్లి కొడుకు కుబేరుఁడు నివాసముగాఁ జేసికొనియున్నాఁడు. దానిని మరలఁబడయుట న్యాయము.)

ఉ. సామముచేత నొండె బలి ♦ సత్తమ! దానముచేత నొండె ను
ద్దామపరాక్రమంబునవో ♦ క్రమ్మఱఁ దత్పురి నీవు గొమ్ము, మ♦
ఖామితవార్ధి మున్గిన సుశారికులంబు సముద్ధరించి లం
కామహిప ప్రశస్తి నెసఁ ♦ గాంచు మనన్ దశకంఠుఁ డిట్లనున్. ౨౩౯

అర్థములు. బలిసత్తమ=బలవంతులలో శ్రేష్ఠుఁడా, దుఃఖామితవార్ధిన్=దుఃఖ మనెడి మితిలేని సముద్రమునందు, లంకామహీప=లంకారాజు, అనెడి ప్రశస్తి=కీర్తి.

తాత్పర్యము

మంచి మాటలచేతఁగాని లేక దానముఁగాగాని లేక అధికపరాక్రమముచే గాని యీ పురమును నీవు మరలఁ దీసికొని దుఃఖసముద్రమున మునిఁగిన రాక్షసుల నుద్ధరింపుము. లంకారాజనెడి కీర్తి వహింపుము. అనిన దశకంఠుఁ డిట్లనియె.

ఉ. అన్నయనంగఁ దా జనకు • నంతటివాఁడు గదయ్య యిట్లు నీ
వి న్నుడి తాత! చెప్పఁ దగ • వే? యన వానిమనం బెఱుంగుచున్
మిన్నక యుండె, రక్కసుల • మేటి యొకానొకనాఁడు నట్టులే
యన్నఁ బ్రహస్తుఁ డా దశము•ఖాసురుతో వినయంబు దోఁపఁగన్. ౨౬

అర్థములు. ఇన్నుడి=ఈ మాట.

తాత్పర్యము

(తాతా? అన్నయనఁగాఁ దండ్రితో సమానుఁడుగదా. నీవిట్టు లీమాట చెప్పఁదగునా? యనఁగా వాని యభిప్రాయము దెలిసి యూరకుండెను. దశకంఠుఁ డొకానొకనాఁడును నట్టులే చెప్పఁగాఁ బ్రహస్తుఁడతనితో వినయముగా.)

—• ప్రహస్తుఁడు లంక గ్రహింప రావణునకు బోధించుట •—

క. ఇన్నీతి నీవు పలుకఁగఁ, జన్నే శూరాగ్రణీ! ప్ర • శస్తబలుఁడ వై
యన్నదమ్ములవావులు, నున్నవొకో! శూరులం ద • నుత్తమచరితా! ౨౭

అర్థములు. అన్నాదమ్ముల వావులు=అన్నయని తమ్ముఁడని బంధుత్వము వరుసలు, "కొన్నియెడల మహద్ద్వంద్వంబునఁ బూర్వపదాంత్యస్వరంబునకు దీర్ఘంబును జూపట్టెడు. అన్నాదమ్ములు, ఉ, హరి. ౪ ఆ అప్పాచెల్లెండ్రు నిర్వ. ౯ఆ. తల్లీదండ్రులు, భల్లా. ౪ ఆ. అక్కాచెల్లెండ్రయ్యును దక్కరు నాతోడివారు దానుం దితియున్" భాగ ౭ స్కంధము-౪౭౦. ప.

తాత్పర్యము

శూరులందు శ్రేష్ఠుఁడవై ప్రశస్తమైన బలము గలవాఁడవై నీ వీ రీతి నీతులు చెప్పఁదగునా? మిగుల నుత్తమములైన గుణములు గలవాఁడా! శూరులందు నన్నయని తమ్ముఁడని బంధుత్వములు గలవా?

క. అక్కాచెల్లెండ్రై పెను,మక్కువ నదితియును దితియు • మలయుచు నుండ్రై
రక్కసులకు సమానికి నం, దక్క గనియె భువనపతుల•నమరోత్తములన్. ౨౮

తా త్ప ర్య ము

కశ్యపునకు నిరువురు భార్యలు-అదితియని దితియని. వా రిద్ద అక్క-చెల్లెండ్రు. అం దక్క-యగు నదితి లోకపాలకుల దేవతా శ్రేష్ఠులను గనియెను.

చ. దితియును గాంచె దైత్యవిత ♦ తిన్, ననగార్ణవకాననంబుగా
క్షితితల మెల్ల వారలది ♦ కీర్తిధనా! యలవంశమందు నీ
వతులితశౌర్యవిక్రమధ ♦ నాఢ్యుఁడవై జనియించి తయ్య, శ్రీ
పతి దితిజాళిఁ జంపి యని ♦ వారితవిక్రముఁడై జగత్త్రయిన్. ౨౯

అర్థములు. ననగార్ణవకాననంబుగన్=కొండలతో సముద్రములతో అడవులతో

తా త్ప ర్య ము

చెల్లెలగు దితి దైత్యులను గాంచెను. కొండలు పర్వతములు సముద్రములు గల యీ భూమి యంతయు వారిదే. వారివంశమందు నీ వసమానశౌర్యము విక్రమ సంపత్తి గలవాఁడవై పుట్టితివి విష్ణువు దైత్యులను జంపి నివారింపరాని బలముగల వాఁడై మూఁడు లోకములను.

ఉ. దైవతకోటి కిచ్చె, నల ♦ దాయలు తమ్ములటంచు నన్నలం
చీవిధి నీతు లాడరు సు ♦ మీ, చరియింపు మదుక్తి నా దశ
గ్రీవుఁడు, యోజనం జలిపి ♦ హృష్టమనంబున వల్లె యంచుఁ దం
పావహిలంగ స్వీయము వ ♦ నావనిఁ జేరి తదన్వితంబుగన్. ౩౦

అర్థములు. దాయలు=జ్ఞాతులు, వనావనిన్ = వనప్రదేశమును, తదన్వితంబుగన్=ఆ ప్రహస్తునితోడ.

తా త్ప ర్య ము

దేవతలకిచ్చెను. ఆ జ్ఞాతులు తమ్ములని యన్నలని నీవలె వారి వరుసలు గణించినవారు గారు. నా మాట విని నేను జెప్పినట్లు చేయుము అని చెప్పఁగా దశకంఠుఁడు ఆలోచించి సంతోషించి సరియని యంగీకరించి సాహసించి తన వనప్రదేశమునకు వానిని తోడఁ దీసికొనిపోయెను.

క. ఆనాఁడ త్రికూటస్థుం,డై నుడికారంపుఁబ్రోడ ♦ యనియె ప్రహస్తున్
గానఁగఁ బొమ్మా ధనపతి, నానుడిగా నిట్టు లనుము ♦ నయపూర్వముగన్.

అర్థములు. నుడికారంపుఁ బ్రోడన్ = చమత్కారముగా మాటలాడుట యందు సమర్థుని;

తా త్ప ర్య ము

ప్రహస్తుఁ డుపదేశించిన దినమందే త్రికూటపర్వతమం దున్నవాఁడై నేర్పుగా మాటలాడ సమర్థుఁ డగు ప్రహస్తునితో నీవు కుబేరుని జూడఁ బొమ్ము, వినయముతో నేను జెప్పినట్లుగాఁ జెప్పుము.

### —• రావణుఁడు ప్రహస్తునిఁ గుబేరునొద్దకుఁ బంపుట •—

సీ. ఈలంక రాజేంద్ర! • యింతకు మున్ను ప,రాక్రమశాలులౌ • రాక్షసులది
నీ విందుఁ జేరుట • నీయట్టి యనఘున, కర్హమ్ముగా దని • యాడవలెనె?
కావున నీపురిఁ • గ్రమ్మఱ నా కిచ్చి తేని నే సంప్రీతి • నెసఁగువాఁడ
నీవును ధర్మంబు • నెఱి కాచి నటు లగు, నని చెప్పుమీ యన్న•నాతఁడరిగి

తే. యత్యుదారునిఁ గిన్నరా•ధ్యక్షుఁ జూచి యధిప! నీతమ్ముఁడైన ద•శాననుండు
పనిచె నను దూతఁగాఁగ నీ•పాలికిప్పు,డతనివాక్కులవినిచెద•నాలకింపు. ౨౩౨

అర్థములు. అత్యుదారుని=మిగుల దానశీలుని, "కామేశ్వరో వైశ్రవణో దదాతు" అని శ్రుతి, వినిచెద=వినిపించెదను.

తాత్పర్యము

రాజరాజా! యీ లంక పూర్వము పరాక్రమవంతులైన రాక్షసులది. ఇట్టి దీనియందు నీ వుండుట తగినపనిగాదు. కావున దీనిని మరల నా కిచ్చితివేని సంతోషించెదను. నీవును ధర్మము రక్షించినవాఁడ వగుదువు అని చెప్పుమనిన వాఁడును దానశీలుఁడగు కుబేరునొద్దకుఁ బోయి, రాజా! నీ తమ్ముఁడు దశకంఠుఁడుపంపఁగా దూతనై వచ్చితిని ఆయన చెప్పినమాటలు చెప్పెదను వినుము.

ఉ. దేవ! సుమాలిముఖ్యులు ది • తిప్రభవుల్ మహనీయశక్తి సం
భావితు లేలి రీ పురిని • ప్రాక్తనవేళల, నిప్పుడున్ దశ
గ్రీవుఁడు నీదుసోదరుఁడు • కీర్తిధనా! నిను నీయ వేఁడెఁ దం
డ్రీ! విహితంబు గాదె యిపు • డిచ్చుట వారల సొత్తు వారికిన్. ౨౩౩

అర్థములు. దితిప్రభవుల్=దైత్యులు, ప్రాక్తనవేళల=పూర్వకాలమందు.

తాత్పర్యము

దేవా! మహాశక్తిసంపన్నులైన సుమాలి మొదలగు దైత్యులు పూర్వకాలమం దీ లంకను బరిపాలించిరి. ఇప్పుడు నీ తమ్ముఁడు దశకంఠుఁడు దీనిని దన కిమ్మని కోరుచున్నాఁడు. కీర్తిధనా! వారలసొత్తు వారి కిచ్చుట ధర్మమేకదా!

### —* కుబేరుఁడు లంక విడిచిపోవ నమ్మతించుట *—

చ. అనవుడు విత్తనాథుఁ డను • రావళి దీనిని బాసిపోవఁగా
జనకుఁడు నన్ను నిల్ప నిజ • జక్కులతోడుత నున్న వాఁడ నో
దనుజవరా! దశాస్యునకుఁ • దక్షిణ మేగి వచింపు మిందు ర
మ్మనుము మదీయరాజ్యనగ • రాఖిలవిత్తము లేల హాయిగన్. ౨౩౪

తా త్ప ర్య ము.

ఇట్లు ప్రహస్తుఁడు చెప్పఁగాఁ గుబేరుఁ డిట్లనియె. దనుజశ్రేష్ఠుఁడా! రాక్షసులు దీనిని వదలిపోయిన కారణమునఁ దండ్రి నీ విందుండు మని నన్ను నియమించుటచే నాయన యాజ్ఞప్రకార ముం దున్నాను. నేనై యాక్రమించినవాఁడఁ గాను. నీవు పోయి నా తమ్ముఁడు దశకంఠునితో నీ విపుడే వచ్చి యిందుఁ జేరి నారాజ్యము నగరము సమస్తధనము సుఖముగ పాలింపుమని తత్క్షణము చెప్పుము.

ఉ. పొమ్మని పంచి తత్క్షణమ ♦ భూవర! యాయన దండ్రిఁ జేరి పా
దమ్ముల వ్రాలి రావణును ♦ దంతము సర్వముఁ జెప్పె లంక పూ
ర్వమ్మున వానివారి దఁట ♦ క్రమ్మఱ దానిని గోరె నంత నే
నెమ్మెయిఁ బోవువాఁడ వచి ♦ యింపుము నాకు యథార్థ్యమం చనన్. ౩౫

అర్థములు. ఉదంతము=వృత్తాంతము.

తా త్ప ర్య ము

పొమ్మనిపంపి తండ్రియొద్దకు వెంటనే పోయి సాష్టాంగనమస్కారము గావించి రావణుఁడు తనకుఁ జెప్పి పంపినవార్త తెలిపి లంక తనవారి దఁట, దాన్ని మరలఁ గోరుచున్నాఁడఁట. నే నెచ్చటికిఁ బోయి యుందును? తగిన మార్గము చెప్పుము అని చెప్పఁగా.

ఉ. ఇట్లు వచించె విశ్రవసుఁ ♦ డీ విషయంబు మదీయసన్నిధిన్
దిట్టతనంబునం బలికె ♦ దీమస మారఁగ బెక్కుమార్లు ఛీ
కొట్టితిఁ గాని వాఁడు మదిఁ ♦ గొంకఁడు నా నుడి చీరికిం గొనం
డెట్టును వాఁడు మానఁ డిఁక ♦ నేటికిఁ దేరకు రచ్చ వానితోన్. ౩౬

తా త్ప ర్య ము

విశ్రవసుఁ డిట్లనియె. ఈ విషయము నాయెదుటనే వాఁడు సగర్వముగాఁ జెప్పెనుగాని నేను వలదని ఛీ కొట్టితిని. కాని వాఁడు మానఁడు కావున వానితో నీ కేల వృథాకలహము.

ఉ. మత్తిలియున్న వాఁడు తన ♦ మానితమైన వరంబు నెంచుచున్
జిత్తమునందుఁ బెద్ద లని ♦ చిన్న లటంచు నెఱుంగ లేఁడు, నై
మిత్తికమద్వచస్సరణి ♦ మిక్కిలి దారుణమౌ స్వభావమున్
హత్తెను వానికిన్ వినుము ♦ భావహధర్మ్యపథంబుఁ జెప్పెదన్. ౩౭

అర్థములు. మత్తిలి=మదించి, నైమిత్తిక=కారణముగల, మద్వచనసరణి=నామాట ప్రకారము నీకుఁ గ్రూరులగు రాక్షసులు పుట్టెదరని కైకసితోఁ దాను జెప్పినమాట, దారుణము=క్రూరము, శుభావహ=మేలు కలిగించు, ధర్మపథంబు=ధర్మముతోఁ గూడిన మార్గము.

తా త్ప ర్య ము

వాఁడు బ్రహ్మ తన కిచ్చినవరములఁ దలచి మదించి యున్నాఁడు. వానికి మనస్సునందు వీరు పెద్దవారని వీరు చిన్నవారని చిన్నవారు పెద్దవారియందుభయభక్తులుగలవారై ప్రవర్తింపవలయునని తలంపు లేదు. ఒకానొక కారణముగ నేను జెప్పిన ప్రకారము వానికి క్రూరమైన స్వభావము లభించినది కావునవానితో నీకు విరోధము వలదు. నీకు మేలగు మార్గము చెప్పెద వినుము.

శా. కైలాసంబున కేగి నీవు తనయా! • కావించు కో మ్మాలయం
బాలంకన్ విడుమీ సహానుగుఁడ వై • యారమ్యమందాకినీ
కూలంబంగ వసింపు తజ్జలము వ్యా • కోచార్కసంకాశస
న్నాళీకాళిసమావృతంబు కడు నా • నందంబుఁ గల్గించెడున్. ౨౩౮

అర్థములు. వ్యాకోచ=వికసించిన, అర్కసంకాశ=సూర్యునితో సమానమైన; సన్నాళీకాళి=మంచికమలములగుంపుతో, ఆవృతంబు=కప్పఁబడినది.

తా త్ప ర్య ము

నీవు కైలాసపర్వతమునకుఁ బొమ్ము కుమారా! నీ వందు వాసస్థానమేర్పఱచుకొమ్ము. లంకను నీవు నీపరిచరులతోడ వదలిపెట్టి మనోహరమైన మందాకినీతీరమందు వసింపుము. అచ్చట జలము వికసించిన కమలములతోఁ గూడి మిగుల సంతోషము గలిగించును.

క. అచ్చట నచ్చర చెలులు వి,యచ్చర గంధర్వకిన్న • రాఘులతోడన్
బెచ్చుముదంబున నాటల, మచ్చిక విహరించుచుంద్రు•మానుగ సతమున్. ౨౩౯

తా త్ప ర్య ము

ఆ ప్రదేశమందు నప్సరసలు దేవగంధర్వకిన్నరాములతోడ మిక్కిలి సంతోషముతో నాడుచుఁ బాడుచు సంచరించుచుందురు.

క. ఆకూళరక్కసునితో, వాకాటుల కీవు పోరకు • వనజాసను నే
కోన్న వరముచందము, నీకెఱుక యె కాదె యన వి•నీతుం డగుచున్. ౨౪౦

అర్థములు. వాకాటులకున్=కలహమునకు, వినీతుఁడు=వినయముగలవాడు

తా త్ప ర్య ము

ఆ క్రూరరాక్షసునితో నీవు కలహామునకుఁ బూనకుము. బ్రహ్మచే వాఁడు దీసికొనిన వరము నీకుఁ దెలియును గదా యనినఁ గుబేరుఁడు వినయవంతుఁడై.

క. అనతిగొని ధనదుఁడు భా, ర్యా నందన సచివ వాహ•నార్థయుతుండై
యానిమిషమ కైలాస మ, హానగదేశంబుఁ జేరి • హాయిగ నుండెన్. ౨౪౧

తా త్ప ర్య ము

తండ్రిచే నాజ్ఞ దీసికొని కుబేరుఁడు పెండ్లాము కొడుకులు మంత్రులు వాహనములు ధనములు నన్ని తీసికొని యానిమిషమందే కైలాసముఁ జేరి యందు సుఖముగ నుండెను.

## —* రావణుఁడు లంకా ప్రవేశము సేయుట *—

ఉ. అంతఁ బ్రహస్తుఁ డా దశము • ఖాసురుఁ జేరి వచించె నెల్లవృ
త్తాంతము విత్తపాలుఁడు య • థాగతి నేగెను లంక వీడి యే
చింతయు లేదు పట్టనముఁ • జేరి స్వధర్మము రక్ష సేయుమీ
కాంతుఁడ వై సురాహిత ని • కాయముపాలికి నంచుఁ బల్కినన్. ౨౪౨

అర్థములు. విత్తపాలుఁడు=కుబేరుఁడు, సురాహిత నికాయము=రాక్షస సమూహము.

తా త్ప ర్య ము

కుబేరుఁ డట్లు చెప్పిన పిమ్మటఁ బ్రహస్తుఁడు దశకంఠునొద్దకుఁ బోయి వృత్తాంత మంతయుఁ దెలిపి కుబేరుఁడు తనగతి కొలఁది లంక వదలిపోయెను. ఇఁక నాలోచింప వలసినది లేదు. నీ వా పట్టణమందుఁ జేరి రాక్షసులకెల్ల రాజవై స్వధర్మ ముద్ధరింపుము.

క. సానుజుఁ డై శూన్యము లం, కానగరవరంబుఁ బంక్తి • కంఠుఁ డమందా
నానానందంబున నిం, ద్రాణీపతి నాకపురివి • ధంబునఁ జొచ్చెన్. ౨౪౩

అర్థములు. సానుజుఁడై=తమ్ములతోఁ గూడినవాఁడై, శూన్యము=జనులు లేనిది, ఇంద్రాణీపతి=ఇంద్రుఁడు, నాకపురి=స్వర్గపట్టణము.

తా త్ప ర్య ము

(జనులు లేని లంకా పట్టనమును దమ్ములతోఁగూడి దశకంఠుఁ డమందానందముతో నింద్రుఁడు స్వర్గపట్టణమువలెఁ బ్రవేశించెను.)

తే. ఇట్లు లంకఁ బ్రవేశించి • యెలమిమీంచి, దనుజరాజ్యాభిషేకంబు•ఘనతఁ గాంచి
ప్రాప్తసంపూర్ణ కాముఁ డై •పరిఢవించి, యెదురుబెదురును లేక ర•హించెఁబిదప.

అర్థములు. ఎలమిన్=సంతోషముచే, ప్రాప్తసంపూర్ణకాముఁడై=లభించిన కోరిక లన్నియుఁ గలవాఁడై, పరిఢవించి=అతిశయించి.

తాత్పర్యము

(ఇట్లు లంకలోఁ బ్రవేశించి పట్టాభిషిక్తుఁడయి యభీష్టసిద్ధిఁబడసి యెదురుబెదురు లేక సంతోషముతో నుండెను.)

౧౨వ సర్గము

క. తనయనుఁగుంజెల్లెలు శూర్పణఖకుఁ దగువరుని వెదకి ♦ పాణిగ్రహణం
బున విద్యుజ్జిహ్వుం డన్దనుజుం డగు కాలకేయు♦నకుఁ దా నొసగెన్. ౨౮౫

తాత్పర్యము

తన ప్రియసోదరి యగు శూర్పణఖకుఁ దగిన మగని వెదకి కాలకపుత్రుఁడయి కాలకేయు లనఁబడువారి వంశమునఁ జేరిన విద్యుజ్జిహ్వుం డను వానికిచ్చి వివాహము గావించెను.

—* రావణునకు మయుఁడు మండోదరీ వృత్తాంతముఁ జెప్పుట *—

ఉ. ఆవల నొక్కనాఁడు మృగ ♦ యాభిరతిం జరియించువాఁడు ర
క్షోవరుఁ డొక్కచోఁ గనియెఁ ♦ గోమలి కన్యక యోర్తు కూడరాఁ
ద్రోవను వచ్చువాని మయుఁ ♦ దోడన కానఁగ నేగి పల్కె న
య్యా! వని నిర్మనుష్యతల♦మందుఁ జరించెడి మీర లెవ్వరో. ౨౮౬

అర్థములు. మృగయాభిరతిన్=వేటయందలి మక్కువచే, వనిన్=అడవియందు. నిర్మనుష్యతలమందు=మనుష్యులు లేని ప్రదేశమున.

తాత్పర్యము

ఆ పిమ్మట దశకంఠుఁడు వేటయందలి యాశచేఁ దిరుగుచు నడవిలో నొకచోట నొకకన్యక తనవెంట రాఁగా మార్గమున వచ్చు మయునిఁజూచి యయ్యా! మీ రెవ్వరు? మనుష్యులు లేని యీ యడవిలోఁ దిరుగ గారణమేమి ?

క. ఈమృగలోచనతో మీ, రేమి నిమిత్తంబు తిరుగ ♦ నెంచితి రనఁగా
నా మయుఁడు యథావృత్తం, బా మనుజాశనున కిట్టు♦లాదృతిఁ జెప్పెన్. ౨౮౭

అర్థములు. మృగలోచనతో=జింక కన్నులవంటి కన్నులుగల దానితో, యథావృత్తంబు=జరిగినది జరిగినట్లు, ఆదృతిన్=ఆదరముతో.

తాత్పర్యము

(మీరీ మృగాక్షితో నెందుకుఁ దిరుగ నెంచితిరని యడుగఁగా మయుఁడా రావణునితో జరిగినది జరిగినట్లు లాదరముతో నిట్లు చెప్పెను.)

ఉ. నాయన! నీవు హేమ యను ♦ నాతిని మున్ వినియుందువే కదా
యాయువిదన్ శచీసతి బ ♦ లారికి నిచ్చినయట్లు దేవతల్
జాయగ నా కొసంగ సుఖ ♦ లంపటవృత్తిని దాని గూడి నే
జాయక యుంటి వర్షములు ♦ పంచశతంబులు, నిర్జరాజ్ఞ చేన్. ౨౮౮

అర్థములు. సుఖలంపటవృత్తిని=సుఖమునం దాసక్తిగల వ్యాపారముతో.

నాయనా! నీవు హేమయని ప్రసిద్ధికెక్కిన యప్సరసను వినియున్నావుకదా! దేవత లింద్రునకు శచీదేవి నిచ్చినట్లు భార్యగా దానిని నా కిచ్చిరి. దానిని గూడి యైదునూర్ల సంవత్సరములు సుఖముగాఁ జరించితిని. ఆవల దేవతల ఆజ్ఞచొప్పున.

ఉ. అయ్యలివేణి వాసి చని ♦ హాయనముల్ పదునాలుగయ్యె, నే
నయ్యబలా నిమిత్తమయి ♦ హైమమయంబుఁ బురంబుఁ గట్టి యం
దయ్యెలనాఁగఁ గూడితిని ♦ నాసతి లేమిని నంతు నిల్వనో
యయ్య! మనంబు లేదు విర ♦ హానలతప్తుఁడ నౌటఁ గావునన్. ౨౮౯

అర్థములు. హైమమయంబు=బంగారుతో నిండిన, విరహానలతప్తుఁడన్=వియోగ మను నగ్నిచేఁ గాలుచున్నవాఁడను, ఇదియే స్వయంప్రభాగుహ-హనుమదాదులు ప్రవేశించినది దీనియందే.

తాత్పర్యము

ఆ కాంత నన్ను వదలిపోయి పదునాలుగు సంవత్సరము లయ్యెను. దాని నిమిత్తమై బంగారుమయమైన పురముగూడఁ గట్టితిని. అది వదలిపోవుటచే విరహాగ్నిని దపించువాఁడ నగుట నా పురంబున నుండ మనస్సు లేదు.

క. ఆపురి విడి హేమాత్మజ, నీపాపను నాదుకూఁతు ♦ నిటు దోడ్కొని భూ
మీపర్యటనముఁ జేసెదఁ, జేపడుఁ గా కర్హవరుఁడు ♦ చెలువకటంచున్. ౨౯౦

అర్థములు. హేమాత్మజ=హేమకూఁతురు, ఈ పాపను=ఈచిన్న వయస్సు దానిని, భూమీపర్యటనము=భూమియందు సంచారము, చేపడుఁగాక=లభించును గాక, అర్హవరుఁడు=తగిన మగఁడు.

తాత్పర్యము

ఆ హేమయందు నాకుఁ గూఁతురై యీపిల్ల పుట్టెను. దీనికిఁ దగిన మగని వెదకుచు భూలోకమందు సంచరించుచున్నాను.

క. కన్యాజనకత్వ మసామాన్యంబుగ దుఃఖకరము ♦ మానేర్పులకున్
గన్యక రెండుకులంబుల, దైన్యంబున ముంచు శీల ♦ శాశంకఁ జుమీ. ౨౯౧

అర్థములు. కన్యాజనకత్వము=ఆడుపిల్లకుఁ దండ్రియగుట, అసామాన్యంబు గన్=విశేషముగ, మానేప్సులకున్ = గౌరవమందుఁ గోరికగలవారికి, రెండు కులంబులన్=తల్లిదండ్రుల వంశములను, శీలతాశంకన్=సదాచార విషయమైన సందేహముచే, పాతివ్రత్యసందేహముచే.

తాత్పర్యము

గౌరవము గోరువారికిఁ గూఁతురు పుట్టుట విశేషదుఃఖమునకుఁ గారణ మగును. ఏలన కన్యక తల్లిదండ్రుల వంశములవారిని నిది యే చెడుపడవడి గల దగునో దీని చెడుపడత వలన మనము నరకములపాలు గావలసివచ్చునో యని సందేహమున ముంచును.

క. ఇరువురు కొడుకులు నాకు న,మరసుందరియందుఁ గలరు ♦ మాయావియనన్
బరఁగెను జ్యేష్ఠుఁడు దుందుభి, వలబలుఁడు ద్వితీయుఁ డగుచు♦వర్తిలుజగతిన్

తాత్పర్యము

ఈ మాయావి వాలికి భయపడి పరువెత్తివచ్చి చొరఁబడి చచ్చిన దీ స్వయం ప్రభాగుహయందే.

క. వాకొంటి నాదుచరితము, నీకథ నీకఁ దెలుపవయ్యా ♦ నీ వెవ్వఁడవో
యాకాంక్షించెద విన నన, నైకసితనయుండు వినయ♦గరిమ వచించెన్. ౨౫౩

అర్థములు. వాకొంటిన్=చెప్పితిని, ఆకాంక్షించెదన్=కోరెదను, వినయ గరిమన్=విశేషవినయముతో.

తాత్పర్యము.

(నాకథ చెప్పితిని. ఇఁక నీ విషయ మేమో తెలుపుము నీ వెవఁడవు? అనఁగా రావణుఁడు వినయముగాఁ జెప్పెను.)

ఉ. నేను బులస్త్యమన్మఁడను ♦ నీరజగర్భునకుం దృతీయుఁ డై
మానితుఁ డైన విశ్రవుకు ♦ మారుఁడ, పేరను బంక్తికంఠుఁడన్
నా వతనిన్ మునిప్రవరు ♦ నందనుఁ డంచు మయుం డెఱింగి మో
దానఁ దనూజ నాతనికి ♦ దారగ దానముఁ జేయ నెంచుచున్. ౨౫౮

తాత్పర్యము

నేను పులస్త్యమహర్షి మనుమఁడను. బ్రహ్మకు మూఁడవ వాఁడగు విశ్రవసుని కుమారుఁడను, నాపేరు దశకంఠుఁడు. అని చెప్పఁగా నతఁడు మునిశ్రేష్ఠుని కుమారుఁడని తలంచి మయుఁడు తనపుత్రికను వానికి భార్యగా దానముచేయ నాలోచించి.

**మయుఁడు రావణునకు మండోదరి నిచ్చి వివాహము చేయుట.**

ఉ. ఆదర మారఁ బంక్తిముఖు ♦ హస్తముఁ గేలఁ గదించి పల్కె, హే
మా దివిజాంగనా భవయు ♦ మామకపుత్రిక యైన దీని మం
డోదరి పేరి కన్య నను ♦ రోత్తమ! భార్యగ నీకొసంగెదన్
మోదముతోడఁ గొమ్మనిన ♦ నూల్కొని వల్లె యటంచుఁ బల్కినన్. ౨౫౯

అర్థములు. హేమాదివిజాంగనాభవ=హేమయను దేవశాస్త్రీకి జనించి నది, మామకపుత్రిక=నాయొక్క కూఁతురు, నూల్కొని=ఒప్పుకొని, వల్లె=అట్లులే చేసెదనని.

తాత్పర్యము

(ఆదరముతో రావణుని హస్తమును దన చేతితోఁ బట్టుకొని మయుఁడు, 'యిది హేమయను దేవశాస్త్రీకిఁ బుట్టినది నాఁకూఁతురు. దీనిపేరు మండోదరి. దీనిని నీకు భార్యగా నిచ్చెదను. సంతోషముతో గ్రహింపుము' అనెను. అంత రావణుఁ డొప్పుకొని యట్టులే చేసెదనని చెప్పఁగా)

క, పౌలస్త్యకులుఁ డనియును, ఖ్యాతమునిప్రవర శాప♦గతి నెఱుఁగుటఁ గ
న్యాతిలకము మయుఁ డొసఁగెను, దైతేయుఁడు వహ్నిప్రమోలఁ♦ దరుణిం గొనియెన్

అర్థములు. పౌలస్త్యకులుఁడు=పులస్త్యవంశమునఁ బుట్టినవాఁడు. ఖ్యాత=ప్రసిద్ధికెక్కిన, మునిప్రవర=మునిశ్రేష్ఠుఁడైన విశ్రవసుని యొక్క, శాప గతి=శాపము విధము, నీకుఁ గ్రూరులు రాక్షసులు కొడుకులు పుట్టుదురని చెప్పిన మాట-దీనివలన వంశము మంచిదనియుఁ దా నీయకున్నను వాఁడు క్రూరుఁడు కావున బలవంతముగఁ గొట్టియైనఁ బిల్లను గ్రహించుననియుఁ దెలిసి యీ యవ మాన మేల పడవలయును అని తానే కన్యాదానము చేసెను. అగ్నిప్రమోల=అగ్ని కెదురుగ, అగ్నిసాక్షికముగ.

తాత్పర్యము

(మయుఁడు 'పులస్త్యవంశమునఁ బుట్టినవాఁడనియును, ప్రసిద్ధికెక్కిన ముని శ్రేష్ఠుఁడైన విశ్రవసుని శాపవిధము తెలియుట చేతను మండోదరిని రావణునికిచ్చి కన్యాదానము చేసెను. రావణుఁడును దాని నగ్నిసాక్షికముగాఁ బెండ్లియాడెను.)

క. అనఘంబుఁ దపోలబ్ధం,బును గరమాశ్చర్యకర మ♦మోఘం బగు శ
క్తిని మయుఁ డల్లున కొసఁగెను, మనలక్ష్మణు నొంచె దాన♦మనుజాశనుఁడున్

అర్థములు. అనఘంబు=దోషరహితమైనది, తపోలబ్ధంబు=తపస్సుచే సంపా దించినది, అమోఘము=వ్యర్థము కానిది.

తాత్పర్యము

దోషరహితమై తపస్సుచే లభించినదై మిగుల నాశ్చర్యకరమైన వ్యర్థము గాని శక్తిని మయుఁ డల్లున కిచ్చెను. ఆ శక్తి చేతనే వాఁడు మన లక్ష్మణు మూర్ఛనొందించెను.

**— రావణుఁడు తన సోదరులకు వివాహములు చేయుట. —**

సీ. స్వీకృతదారుఁ డై • చేరి లంకాపురిఁ, బంక్తికంఠుఁడు తన • భ్రాతలకును
బరిణయంబు లొనర్ప • భావించి కుంభక,ర్ణునకు వైరోచను•తనయతనయ
నారనవదన వ•జ్రజ్వాల యనునొక్క, ప్రేయసిఁ గూర్చి వి•భీషణునకు
దారఁగాఁ జేసె గం•ధర్వ విభుండైన, శైలూషుతనయను • సరమ యనెడి

తే. సాధుధర్మజ్ఞ నామె శై•శవమునందు, మానసముపొంతఁ జరియింప•వానలకును
గొలను పొంగిన భీతిల్లి•కూఁతుఁ గాంచి తల్లి యిట్లని యఱచె వా•త్సల్యగరిమ

అర్థములు. స్వీకృతదారుఁడు=భార్యను గ్రహించినవాఁడు.

తాత్పర్యము

తాను పెండ్లి చేసికొనిన వాఁడై లంకాపురముఁ జేరి దశకంఠుఁడు తన తమ్ములకు వివాహముచేయ నాలోచించి వైరోచను కూఁతు కూఁతును (దౌహిత్రిని) వజ్రజ్వాల యను దానిని కుంభకర్ణునకు నిచ్చి వివాహము చేయించెను. ఆవల గంధర్వుఁడగు శైలూషుని తనయను మంచి ధర్మము దెలిసినదానిని సరమ యను దానిని విభీషణునకు నిచ్చి వివాహము చేయించెను. మానససరోవరము తీరమున నీ కన్యను బ్రసవించి తల్లియందే యుండఁగా వానలకు సరస్సు పొంగి నీళ్ళు పిల్లయొద్దకు రాఁగా నది భయపడి యేడ్చెను. అప్పుడు తల్లి.

క. రామ! సరో మా వర్ధయ,నా మాతృతదుక్తిఁ బట్టి • నవలామిహికిన్
భూమి సరమాభిధానము, ప్రేమోక్తిగ వెలసె నంత • వీరవరేణ్యల్. ౨౫౬

అర్థములు. సరో మా వర్ధయ=సరస్సా! వృద్ధినొందవలదు మాతృతదుక్తి= తల్లి యొక్క యా మాట, నవలామిహికిన్=స్త్రీలయందు శ్రేష్ఠురాలగు దానికి, సరమాభిధానము=సరమ యను పేరు.

తాత్పర్యము

రామచంద్రా! సరో మా వర్ధయ యను తల్లిమాటనుబట్టి యీ యుత్తమ స్త్రీకి సరమ యను పేరు ముద్దు పేరుగ నొప్పెను. ఇటు పెండ్లిండ్లు చేసికొనియున్న వీరవర్యులు.

క. గంధర్వులు నందనమున, బంధురకేళీవిహార • పరు లౌనట్టుల్
సింధురగమనలతో దశకంధరముఖు లుండఁ గొంత • కాలంబునకున్. ౨౬౦

అర్థములు. సింధుర గమనలతోన్=ఏనుఁగు నడకవంటి నడక గలవారితో.

తాత్పర్యము

నందనవనమందు గంధర్వులు దేవతాస్త్రీలతో మనోహరముగఁ గ్రీడించు నట్లు దశకంఠుఁడు మొదలగువారు తమ స్త్రీలతోఁ గ్రీడించుచుండఁగాఁ గొంత కాలమునకు.

మ. కనె మండోదరి యొక్క పుత్రు నతడున్ • క్ష్మాజాతమాత్రంబునన్
ఘననిర్ఘోషమునన్ ధ్వనించుటయు లం • కాపట్టనం బెల్లఁ ద
ద్ధ్వని నిశ్చేష్టము గాఁగ రావణుఁడు మో • దం బారఁగా దానఁ ద
త్తనయుం బిల్చెను మేఘనాదుఁ డనుచుం • దాత్పర్యసంయుక్తుఁడై. ౨౬౧

అర్థములు. క్ష్మా=భూమియందు, జాతమాత్రంబునన్=పుట్టినంత మాత్రము ననే, ఘననిర్ఘోషమునన్=మేఘధ్వనితో, తత్+ధ్వనిన్=ఆ చప్పుడుచే, మేఘనాదుఁడు=మేఘనాదమువంటి నాదము గలవాఁడు.

తాత్పర్యము

మండోదరి యొక కొడుకును గనెను. వాఁడు భూమిమీఁదఁ బడఁగానే మేఘము ఉఱిమినట్లు ధ్వనించెను. ఆ ధ్వనికి లంకానగరము నిశ్చేష్టమయ్యెను. అది చూచి సంతోషపడి రావణుఁడు ప్రేమతో నా శిశువును మేఘనాదుఁడను పేరఁబిలిచెను.

క. మీఁదటింద్రజిత్తుం డని యొసఁగి, పేరఁ బిలుచువాఁడు వాఁడె • పెరిఁగెను రక్ష
స్స్త్రీరక్షితుఁ డింధనముల, చే రక్షిత మైనవహ్ని • చెలువున నంతన్. ౨౬౨

అర్థములు. రక్షస్స్త్రీ రక్షితుఁడు=రాక్షస స్త్రీలచే రక్షింపబడినవాఁడు, ఇంధనములచే=కట్టెలచేత.

తాత్పర్యము

మీఁదటింద్రజిత్తు అని పిలిచెదరే, వాఁడే యీ మేఘనాదుఁడు. కట్టెలచే రక్షింపఁబడు నగ్నివలె రాక్షసస్త్రీలచే వాఁడు కాపాడఁబడి వృద్ధిచెందెను.

౧౩వ సర్గము

## —• రావణుఁడు లోకంబుల బాధించుట •—

సీ. నీరజసంభవ • ప్రేరిత మై నిద్ర, యేఁపఁగా రాక్ష త • న్నలముకొనుడుఁ
గుంభకర్ణుం డన్నఁ • గొలువఁగ నేగిపై, కొనె నిద్ర సముచిత • కూట మొండు
కట్టింపుమీ యన • గ్రక్కునఁ బనివాండ్రఁ, బనుప రావణుఁడు వా • రనుపమాన
శాల యోజనము వి • శాలంబుగా రెండు, యోజనంబుల నిడు • పొప్పుచుండ

ఆ. స్ఫటిక కాంచనముల • స్తంభముల్ కింకిణీ, జాలకములు దాంత • చారుతోర
ణములు స్ఫటికవేదు • లమల వైడూర్యంపు, సోపనములు గలిగి • సొబగుమీఱ

అర్థములు. నీరజసంభవప్రేరితమై=బ్రహ్మచేఁ బ్రేరింపఁబడినదై, కింకిణీ జాలకములు=చిఱుగజ్జెలుగల కిటికీలు, దాంత=దంతమయమైన, చారు=మనోహరమైన తోరణములు, స్ఫటికవేదులు=స్ఫటికములతో నిర్మింపఁబడిన యరుగులు, సోపనములు, సోపానములు=మెట్లు.

తాత్పర్యము

బ్రహ్మవాక్యము చొప్పున నిద్రనిలుపరాక తన్నుపై పడఁగాఁ గుంభకర్ణుఁడన్న యొద్దకుఁబోయి నాకు నిద్రనిలుపరాక పైబడి వచ్చుచున్నది. పండుకొనుటకొక యిల్లు కట్టింపుమని చెప్పఁగా వెంటనే యతఁడు పనివాండ్ర నేర్పాటుచేసెను. వారును యోజనము వెడలుపు రెండుయోజనములు నిడివి యుండునట్లు స్ఫటికముల బంగారు స్తంభములు గజ్జెల కిటికీలు దంతములతోరణములు స్ఫటికపుటరుఁగులు వైడూర్యముల మెట్లు గలిగి యందమైయుండఁగా.

ఉ. కట్టిరి విశ్వకర్మవలెఁ • గాంచనశైలగుహావిధంబునన్
దిట్టము గాఁగఁ, బండుఁ, • దను నిద్దుర ద్రెక్కొనఁ గుంభకర్ణుఁడున్
నెట్టన పెక్కువర్షములు • నెమ్మది నుండె, సురర్షియక్షులన్
బట్టి నిరంకుశుం డగుచుఁ • బంక్తిముఖుండు వధించెఁ గ్రూరుఁడై. ౨౬౮

అర్థములు. కాంచనశైల గుహావిధంబునన్ = మేరుపర్వతము గుహవలె, పెక్కువర్షములు=అనేక సంవత్సరములు, వీని నిద్రాకాలవిషయము యుద్ధకాండమునఁ జెప్పఁబడెను. ఆఱు నెలలకుఁ దక్కువలేదు గాని యంత కెక్కువ యెంత కాలమైన నిద్రించును, నిరంకుశుండు=అడ్డగించువారు లేక.

తాత్పర్యము

మేరుపర్వతగుహవలె విశ్వకర్మ కట్టినట్లు కట్టిరి దానిలోఁ గుంభకర్ణుఁడు పెక్కు సంవత్సరములు నిద్రించుచు హాయిగా నుండెను. దశకంఠుఁడు క్రూరుఁడై యడ్డము లేక దేవతలను ఋషులను యక్షులను జంపెను.

సీ. తోఁటలఁ గనుఁగొన్నఁ • దోరంపుగాడ్పునా, మించి చెట్టులఁ గంచు • మించుఁ జేయు
నేరులఁ గనుఁగొన్నఁ • నేనుఁగువలెఁ జొచ్చి, సంచు నశింపఁ గ • లంచియాడుఁ
గొండలఁ గనుఁగొన్నఁ • బండవజ్రముభంగిఁ, బిండిపిండిగ నేలఁ • జెండివైచు
నందనోద్యానంబు • చందంబుఁ గనుఁగొన్న, నేపున నెనరేఁగి • రూపుమాపు

తే. వేల్పులను బట్టు గంధర్వ • వితతిఁ గొట్టు, సిద్ధులను గట్టు, మగువలఁ • జెఱలఁ బెట్టు
సాధువుల నెట్టు కిన్నర • సమితి మొట్టు, రట్టుమీఱుచుఁ గైకసి • పట్టికినిసి. ౨౬౯

అర్థములు. కంచుమించు=అగోచరము, సంచు=అందము, ఎన రేఁగి=విజృంభించి.

తాత్పర్యము

(రావణుఁడు కినిసి, తోటలను, జూచినచోఁ బెద్దగాలివలె చెట్లను విఱిచి పాడుచేయును. ఏరులను నేనుఁగువలెఁగలఁచి వాని యందమును జెడఁగొట్టును. కొండలను వజ్రాయుధమువలె పిండి పిండి చేయును. నందనోద్యానము నందము గనిన గర్వమున విజృంభించి రూపుమాపును. దేవతలను బట్టి కొనును. గంధర్వ సమూహమును గొట్టును. సిద్ధులను గట్టును స్త్రీలను జేఁబట్టును, సాధువులను బాధించును. కిన్నరులను మొట్టును.)

—* కుబేరుండు రావణునకు నీతిఁ దెలుప దూత నంపుట *—

ఉ. ఆలని దుష్టచేష్టల ధ • నాధిపుఁడెల్ల నెఱింగి తమ్ముఁ డన్
ప్రీతి నిజాన్వవాయము సు • వృత్తము ధర్మము సంస్మరించుచున్
దూతను బుచ్చె లంకకును • దూర్ణము వాఁడును బోయి మున్న వి
ఖ్యాతయశున్ విభీషణునిఁ • గన్గొని యాతఁడు ప్రశ్న సేయగన్. ౧౬

అర్థములు. నిజాన్వవాయము సువృత్తము=తమవంశముయొక్క మంచినడవడి.

తాత్పర్యము

దశకంఠుఁడు చేయు దుష్టచేష్టలను కుబేరుఁడు విని తమ మంచి వంశము యొక్క నడవడి యాలోచించి ధర్మము తలపోసి లంకకు దూతను బంచెను. వాఁడును త్వరగాఁ బోయి ముందు ధర్మాత్ముఁడని పేరు గనిన విభీషణుఁజూచి యాయన ప్రశ్నింపఁగా.

క. తనే యాగమనము హేతువు, వినిపించినయంత నతఁడు•వింశతిబాహున్
గనిపింప సభాసీనుని, వినయమున జయోక్తిఁబల్కి•విభుతో ననియెన్? ౧౭

అర్థములు. ఆగమనము హేతువు=వచ్చిన కారణము, సభాసీనునిన్=కొలువుకూటమందు గూర్చుండిన వానిని.

తాత్పర్యము

(తావచ్చిన కారణమును వినిపించెను. అంత విభీషణుఁడాతని సభలోనున్న రావణునిఁ గనిపింపఁగా వినయమున జయజయయని పలికి రావణునితోనిట్లు పలికెను.)

తే. అధిప! యక్షవిభుండు మీ • యగ్రజుండు
ప్రీతి ననుఁ బంపె నిచటికి • దూతఁ గాఁగఁ
గులము మీతల్లిదండ్రుల • గుణముఁ దలచి
యాడు మనెఁ గొన్ని నుడులు మీ • తోడ వినుము. ౧౮

అర్థములు. యక్షవిభుండు=కుబేరుఁడు, అగ్రజుఁడు=అన్న, నుడులు=మాటలు.

తా త్ప ర్య ము

(రాజా! కుబేరుఁడు మీ యన్నగారు, నన్నిచ్చటకు దూతగాఁ బంపెను. మీ కులము, మీ తల్లిదండ్రుల గుణము తలఁచి కొన్ని మాటలు మీతోఁ జెప్పు మనెను. వినుము.)

క. చేసినవి యేమొ పూర్వము, చేసితి వవి చాలు నింకఁ ♦ జేయకు మట్టుల్
వాసిగ శక్యం బేనియు భాసురశుభ మొదవ ధర్మ ♦ పద్ధతి నడుమీ. ౧౯

తా త్ప ర్య ము

(ఇంతకుముందు చేసిన వేమో చేసితివి. ఇఁక నా విధముగాఁ జేయకుము, అట్లులయిన నీకు మేలు కలుగును. ధర్మమార్గమున నడువుము.

ఉ. కంటిని నందనంబు బహు ♦ కాల వివృద్ధము పాడుపాడుగా
వింటిని మౌనిసంఘములఁ ♦ బెట్టితి బాధ లటంచు, వెండి నీ
కొంటతనంబు లోఁపు తమిఁ ♦ గూరిచి దైవతవర్గ్య లంచు నే
వింటిని, నీకు నిట్లు తగ ♦ వే జగ మేఁచుతలంపు తమ్ముఁడా! ౨౦

అర్థములు. బహుకాల వివృద్ధము=చాలఁ గాలముఁగా బెంపఁబడినది, ఏఁచు=బాధించు, తలంపు=ఆలోచన.

తా త్ప ర్య ము

(తమ్ముఁడా! నందన వనమును జూచితిని. ఎంతకాలము నుండియో పెంపఁ బడిన దానిని బాడుపాడు చేసితివి. మునులను బాధపెట్టితివని విన్నాను. దేవతలు నీ దుండగములోఁపవలెనని యున్నారనియు వింటిని. లోకముల బాధించు నాలోచన నీకుఁ దగునా?

క. ఏలికముగఁ జూచితి నను, జాలఁగఁ బలుమాఱు దాని ♦ సైఁచితిఁ జుమ్మీ
బాలుఁడు దుడుకం డైనను, బాలించుట నీతి యతని ♦ బాంధవతతికిన్. ౨౧

అర్థములు. ఏలికముగన్=చులుకనగ, అలక్ష్యముగ, దుడుకఁడు=దుష్టుఁడు.

తా త్ప ర్య ము

(నన్నెన్నిసారులో చులకనగఁ జూచితివి. నేనోర్చియుంటిని. బాలుఁడు దుష్టుఁడైనను నతనిఁ బాలించుట వాని చుట్టాలకు ధర్మము.)

ఉ. ఉగ్రతపంబు సేయఁ జని ♦ యుంటిని హైమధరంబుపొంత కం
దుగ్రుఁడు పార్వతీసహితుఁ ♦ డొప్పఁగఁగంటి నతుల్యతేజ మా
విగ్రహ మార నున్నపృథి ♦ వీధరకన్యకఁ జూచినంతఁ ద
న్నిగ్రహకారణంబునను ♦ నేత్రము సవ్యము దగ్ధమై చనెన్. ౨౨

అర్థములు. హైమధరంబు పొంతకున్=మంచుకొండ సమీపమునకు, ఉగ్రుఁడు=శివుడు, విగ్రహము=ఆకారము, పృథివీధరకన్యకన్=పార్వతిని తన్నిగ్రహకారణంబునను=ఆమె నిగ్రహించిన కారణముచే.

తా త్ప ర్య ము

నేను హిమాచలము సమీపమునకుఁ దపస్సుచేయఁబోయి యుంటిని. అక్కడఁ బార్వతీసమేతుఁడైన శివుని జూచితిని. అసమాన కాంతిగల పార్వతి యాకారము చూచినంతనే యామె నిగ్రహించుటచే నా యెడమకన్ను కాలిపోయెను.

తే. రేణుకలుషీకృతజ్యోతి • రాణ దనరఁ, గన్ను తద్గిరి నవ్యశృంగంబుఁ జేరి
నూటయెనిమిదియేఁడులు•గాటమైన, వ్రతము సల్పితి శ్రీమహే•శ్వరునిఁగూర్చి

అర్థములు. రేణుకలుషీకృతజ్యోతి=రేణువులచే మలినముగాఁ జేయఁబడిన కాంతి.

తా త్ప ర్య ము

కన్ను రేణువులచే మలినమైన యగ్ని కాంతివలెఁ గాఁగా నా ప్రదేశము విడిచి మఱియొక శిఖరమునొద్దకుపోయి నూటయెనిమిది సంవత్సరములు శివుని గుఱించి తీవ్రమైన వ్రతము సలిపితిని.

• ఇది కేదారేశ్వర వ్రతమని కొందఱ యభిప్రాయము.

సీ. వ్రతము సాంతం బైన•భర్గుఁడు దోఁతెంచి, కరుణాతరంగితే•క్షణము లొప్ప
నన్నుఁ గాంచి పల్కెనో•యనఘ! యీవ్రతమును, నేనొకఁడను మఱి•నీవు నిట్లు
చేసినవారలు • చేయఁ డన్యుం డనఁ, డీ వ్రతంబును నేన•సృష్టి చేసి
నాఁడఁ బూర్వంబు నీ•నయనంబు దేవిచేఁ, బింగళత్వంబుఁ బ్రా•పించుకతన

తే. నేకపింగళుఁ డనుపేర • నెసఁగ వయ్య, నిర్జితుండను నీ తపో•నిష్ఠచేత
మత్సఖత్వంబుఁగోరుమీ•మానసీయ, యనుచుఁగరుణించి యిడియెనా•కాజ్ఞ చనఁగ

అర్థములు. భర్గుఁడు=శివుఁడు, తోఁతెంచి=కనఁబడి, కరుణాంతరంగితేక్షణములు=దయారసములలుగాఁగల చూపులు, దేవిచే=పార్వతిచే. పింగళత్వము=గోరోజనవర్ణము, నిర్జితుండను=గెలువఁబడినవాడను, మత్సఖత్వంబు=నాస్నేహము.

తా త్ప ర్య ము

వ్రతము పూర్తి కాఁగా శివుఁడు ప్రత్యక్షమై దయచే నన్నుఁ జూచియిట్లనియె. ఈవ్రతమును నేను నీవు తప్ప నిట్లు చేసినవారు మఱి యెవ్వరు లేరు. ఈ వ్రతమును నేనే పూర్వము సృష్టించితిని. నీకన్ను పార్వతీదేవిచేఁ బింగళమైనకారణ

మున నీ వీఁకమీఁద నేకపింగళుఁడని ప్రసిద్ధిగాంచుము. తపస్సుచే నీచేతఁ గెలువఁబడితిని. కావున నా సఖ్యముఁ గోరుము అని దయ యుంచి నాకు సెలవిచ్చెను.

ఉ. ఆతనిచే ననుజ్ఞఁ గొని ♦ స్వాలయముం జనుదెంచి వింటి నీ
యాతతపాపకార్యముఁ గు ♦ లార్హము ధర్మపథంబుఁ దప్పఁగా
నీతి యటయ్య? లోకముల ♦ నింద వహించుట మేలె! నిర్జర
వ్రాతము నిన్నుఁ ద్రుంప నదు ♦ పాయము రోయుచు నున్న దంచనన్. ౨౦౫

అర్థములు. స్వాలయము=నా యిల్లు, ఆతత పాపకార్యము=మిక్కిలి పాపము కలిగించు పని, కులార్హము=వంశమునకు యోగ్యమైనది, ధర్మపథంబు=ధర్మమార్గము, రోయుచున్=వెదకుచు.

తాత్పర్యము

శివునిచే నాజ్ఞ దీసికొని యింటికి వచ్చి నీవు చేసిన మిగుల పాపకార్యముల వింటిని. వంశయోగ్యమగు ధర్మమార్గము తప్పినడచుట నీతియగునా? లోకములందు నిందల పాలగుటవలన మేలుకలదా? నీ విట్లు చేయుటచే దేవతలు నిన్నుఁ జంపవలయునని యుపాయము వెదకుచున్నారు- అని చెప్పఁగా.

ఆ. కటము లదరఁ గోప♦గరిమ సంరక్తలో, చనుఁడు పంక్తిగళుఁడు♦ధనద దూత
మోముఁ జూచి పలికె ♦ నీమాటలందలి, భావమెల్ల దెలియ♦వచ్చెలేర. ౨౦౬

అర్థములు. కటములు=చెక్కిళ్ళు, సంరక్తలోచనుండు=ఎఱ్ఱని కన్నులు కలవాఁడు.

తాత్పర్యము

(రావణుఁడు కన్నులెఱ్ఱఁజేసి కుబేరుని దూతముఖముచూచి యిట్లనియెను. ఓరి! నీ మాటలయందలి భావము తెలిసినది లేరా!)

## —• రావణుఁడు కుబేరు దూతను వధించుట •—

ఉ. దూతవు గావు నీవు ఖల ♦ ధూర్తుఁడ! ని న్నిటఁ బంచినాతఁడున్
భ్రాత యటంచు నన్నుఁ దలఁ ♦ పండు నిజంబిఁక నీదు ప్రేలుడుల్
నీతులు గావు, శంకరుని ♦ నెయ్యము గల్గె నటంచు స్వీయ మ
ఖ్యాతియుఁ జెంపు చాటుకొనఁ ♦ గా నిటు పంచెను నిన్ను మూఢుఁడా. ౨౦౭

అర్థములు. ప్రేలుడుల్=వదరుటలు.

తాత్పర్యము

నీవు దూతవుగావు పరమదుర్మార్గుఁడవు, నిన్నుఁ బంపినవాఁడును నన్ను దమ్ముఁడని తలఁచినవాడుకాఁడు, నీవు వదరినవి నీతులుగావు, శివుని స్నేహము తనకుఁ గలిగెనని తనకీర్తి గొప్పతనము చాటించుకొనుటకుఁగా నిన్నుఁబంపెను.

ఆ. పెద్దవాఁడు గురుఁడు పీడింప రాదని, తలఁచి యుంటి నింత•దనుక నోరి
యింక సైఁపఁ గూడ•దితఁడుకారణముగఁ, ద్రుంతుఁ గకుబధిప చ•తుష్కమిపుడ

అర్థములు. కకుప్+అధిప చతుష్కము=దిక్కుల కధిపతులగు నలుపురను, ఇంద్ర యమ వరుణ కుబేరులను.

తాత్పర్యము

(పెద్దవాఁడు, గురువుతో సమానుఁడు అని యింతవఱకు బాధింపకుండ నూరకుంటిని; ఇఁకసైరణకూడదు. ఇతని కారణమున నింద్ర యమవరుణులను గూడఁ ద్రుంచెదను)

చ. గెలిచెద మూఁడులోకములఁ • గీర్తిత బాహువిలాససంపదన్
గలఁచెద దేవతావితతి • గండఁడనై యని రాక్షసేశ్వరుం
డలఘుజవంబునన్ నఱికి • యాతని మూర్ధముఁ జెంతనున్న య
వ్పలలభుగుత్కరంబునకు • భక్ష్యము గాఁగ నొసంగెఁ గ్రూరుఁడై. ౨౭౯

అర్థములు. కీర్తిత=పొగడఁబడిన, బాహు=భుజబలముయొక్క, గండఁడనై = శూరుఁడనై. అలఘుజవంబునన్=మిగుల వేగముగ, మూర్ధము=తల, పలభుక్ + ఉత్కరంబునకు=మాంసమును దిను రాక్షసుల సమూహమునకు.

తాత్పర్యము

పొగడఁబడిన భుజబలసంపదచే మూఁడులోకములను గెలిచెదను. శూరుఁడనై దేవతలగుంపులను గలఁతపడఁజేసెదను అని దశకంఠుఁడు మిగుల వేగముగ నాహూత తలనఱికి దానిని నందున్న రాక్షసులకుఁ దినుడు పొండని యిచ్చెను.

క. అప్పుడె స్వస్త్యయనంబును, దెప్పునఁ గావించి లేచి • దిగధీశతతిన్
ముప్పున ముంపఁగ నెంచుచు, నప్పిశితాశనుఁ డుదగ్ది • శాభిముఖుండై. ౨౮౦

అర్థములు. స్వస్త్యయనంబును = మేలుకలుగుటకై చేయవలసిన కార్యమును, దిగధీశతతిన్=దిక్కులకుఁ బతులగువారి సమూహమును, పిశితాశనుఁడు= రాక్షసుఁడు, ఉదగ్దిశాభిముఖుండై=ఉత్తరదిక్కు ముఖముగలవాఁడై.

తాత్పర్యము

అప్పుడే మంగళవాచకములు లోనైనవి కావించి వెంటనే లేచి దిక్పాలకులకుఁ గీడుఁ గలిగింప నెంచి యా రాక్షసుఁ డుత్తరదిక్కు ముఖమై.

౧౪వ సర్గము

## —* రావణుఁడు కుబేరు జయింపఁ బోవుట *—

సీ. ధనదుని గెలువంగఁ దరలి రథస్థుఁడై సచివులు ధూమ్రాక్ష • సారణులును
శుకమహోదరులును•శూరవర్యులు ప్రహ, స్తుండు మారీచుండు•తోడ రాఁగ
జగములు దహియించు•చందంబునను గిన్క, నమరకాంక్షను బుర•శైలములును
వనములు నదులు జ•వంబునఁ దరియించి, కైలాసగిరిఁ జేర • క్షణములోన

ఆ. యక్షచయము జూచి • యక్షపుత్రమ్ముదన్, మతిని దాఁకనోడి • యతనిఁ గలనఁ
జిక్కనరిగి యీశ • సఖునకు నెఱిఁగించి, యతని ముదలఁగాంచి • యరుగుదెంచి.

అర్థములు. సమరకాంక్షను=యుద్ధమందలి కోరికచే, తాఁకనోఁడి=ఎదురింప భయపడి, ముదల=ఆజ్ఞ, ఈశసఖునకు=కుబేరునకు.

తాత్పర్యము

కుబేరుని గెలువవలయునను నుద్దేశముతో రథము మీఁదఁ గూర్చుండిన వాఁడై ధూమ్రాక్షుఁడు శుకుఁడు మహోదరుఁడు ప్రహస్తుఁడు మారీచుఁడు నను మంత్రులు తనతోడ రాఁగాఁ గోపముచే లోకములను గాల్చువానివలె మండి యల్పకాలములోఁ గైలాసపర్వతముఁ జేరఁగా యక్షులు చూచి తమ ప్రభువగు కుబేరుని తమ్ముఁడే యను తలంపుతో యుద్ధముచేయ భయపడి చక్కఁగాఁబోయి కుబేరునకు దశకంఠుఁడు దండెత్తి వచ్చిన వార్త తెలిపి యతని యనుజ్ఞ తీసికొనివచ్చి.

శా. కైలాసంబు చలింపఁ బైఁబఱచు ర • క్షస్సైన్యమున్ దాఁకి నా
భీలంబైన దురంబు చెల్లె నమర • ద్విడ్యక్షసైన్యాళికిన్
దాళం జాలక యక్షధాటికిని బ్ర • ద్రావించు సైన్యంబుఁ దా
నాలోకించి దశాననుం డెదిరె సా • హంకారహుంకారుఁడై. ౨౮౨

అర్థములు. పైఁబఱచు=తమ మీఁదికిఁ బరువెత్తివచ్చు, దురంబు=యుద్ధము, అమరద్విట్+యక్షసైన్యాళికిన్=రాక్షసులయు యక్షులయు సేనలకు, ప్రద్రావించు=పరువెత్తు, సాహంకార హుంకారుఁడై = అహంకారముతోఁ గూడిన హుంకారము గలవాఁడై.

తాత్పర్యము

కైలాసము వడఁకునట్లు తమమీఁదికిఁ బరువెత్తివచ్చు రాక్షససేనను యక్షు లెదిరింపఁగా నిరువురకు భయంకరమైన యుద్ధము జరిగెను. అందు యక్షుల ధాటికి రాక్షసులు నిలువలేక పరువెత్తఁగా జూచి దశకంఠుఁడు గర్వముతో హుంకరించి శత్రువుల నెదిరించెను.

## —* యక్షరాక్షస యుద్ధము *—

ఉ. తోడన వానిమంత్రులును • దోర్బలి వేయికి వేయి యుద్ధిగా
వీడని యీసునం గొడర • వింశతిబాహుని యక్షవీరులున్
క్ష్వేడల నింపుచుం గవిసి • కేరుచు శక్తి కృపాణికాగదా
తాడనముం జేయ వారిదము • ధారలకున్ గిరి నాఁగ నీరతన్. ౨౮౩

తా త్ప ర్య ము.

దశకంఠుఁడు శత్రువుల నెదురింపఁగానే యతని మంత్రులును వానికిరోక్షై వేయిమంది యక్షులకు వేయిమంది రాక్షసులుగా నెదిరించిరి. అందు యక్షవీరులు సింహనాదములు చేయుచు దశకంఠునిపైఁగవిసి విజృంభించి శక్తులచేతను కత్తుల చేతను గదలచేతను గొట్టఁగా వాఁడు మేఘములు గురియు జలధారలకుఁ గొండ వలెనై ధైర్యముచే.

చ. కలఁగక రావణుండు లయ, కాలునిదండము వోని పెన్గదన్
జలమునఁ ద్రిప్పుచున్ విమత ♦ సైన్యములోఁ జొరబాఱి కుప్పకు
ప్పలుగను యక్షులం దునిమి ♦ వాయుసుహృద్వరుఁ డెండు గడ్డి క
ట్టెల దహియించునట్టులు ద్రు ♦ టిం దెగఁగాల్చె నరాతిసైన్యమున్. ౨౮౪

అర్థములు. విమతసైన్యములోన్=విరోధిసేనలో, వాయుసుహృద్వరుఁడు=అగ్నిహోత్రుఁడు, అరాతిసైన్యమున్=విరోధుల సేనను.

తా త్ప ర్య ము

చలింపక రావణుఁడు ప్రలయకాలయముని దండమువంటి గదను ద్రిప్పుచు శత్రువుల సేనలోఁ దూఱి యక్షులను గుప్పలు కుప్పలుగాచంపి యగ్నిహోత్రుఁడు ఎండినగడ్డిని కట్టెలనుగాల్చు విధమున శత్రుసేనల నల్పకాలములోఁదెగఁగాల్చెను

తే. శుకమహోదరసచివులు ♦ ప్రకటశౌర్య, లెగవ నెగనంగ యక్షచ ♦ యేంద్రు లెల్ల
గాలికిని దూలు మబ్బుల ♦ కరణిఁ దూల్చి, చనిరి కొందఱు సమసిరి ♦ సమరభూమి.

తా త్ప ర్య ము

ప్రసిద్ధబలులగు శుకుఁడు మహోదరుఁడు నను మంత్రులు తెఱుమఁగాఁ దఱుమఁగా యక్షముఖ్యు లందఱు గాలికి మబ్బులవలె నెగిరిపోయిరి. కొందరు యుద్ధభూమియందుఁ జచ్చిరి.

క. పెదవులు గొఱుకుచుఁ గినుకన్, గుదికొనుచును భ్రష్టశస్త్ర ♦ కూటంబులతో
నెద నన్యోన్యముఁ గ్రుచ్చుచు, నదిమొరయిక నొడ్డువోలె ♦ నలఁగిరి యక్షుల్.

అర్థములు. భ్రష్టశస్త్ర కూటంబులతో=పడిన శస్త్రముల సమూహములతో, నదిమొరయిక=వేటి రాపిడిచే, ఒడ్డు=గట్టు.

తా త్ప ర్య ము

(కోపముతోఁ బెదవులు గొఱుకుచుఁ, బడిన శస్త్రములతోఁ గూలఁబడుచు నొకరి నొకరు పొడుచుకొనుచు నదిమొరయికవలన నొడ్డువిఱిగి కూలిపోవునట్లు యక్షులు నలిగిపోయిరి.)

క. సమరమున నీల్గి ధరణిని, సమరపురికి నరుగువారి • యలజడిచే న
భ్రమునం జూచెడి ఋషి సంఘములకు నిలువంగఁ దలము • కలుగదయ్యెమిన్. ౨౦౭

అర్థములు. అలజడి=సందడి, అభ్రమునన్=ఆకాశమందు, తలము=ప్రదేశము.

తాత్పర్యము

భూమియందు యుద్ధమునఁ జచ్చి స్వర్గమునకుఁ బోవువారి రాయిడిచేత నాకాశమునుండి యుద్ధమును జూచు ఋషులు మొదలగు వారికి నిలువస్థలము లేదాయెను.

క. విచ్చిన సేనలఁ గనుఁగొని, హెచ్చిన కినుపువను గుహ్యా • కేశ్వరుఁ డనుపన్.
వచ్చి సురారుల శరములఁ, గ్రుచ్చెను సంరోధకంట • కుఁడు భీకరుఁడై. ౨౦౮

అర్థములు. కినుపు=కోపము, గుహ్యకేశ్వరుఁడు=కుబేరుఁడు.

తాత్పర్యము

తనసేనల విచ్చిపోవుట చూచి కుబేరుఁడు కోపించి సంరోధకంటకుఁ డను వానిని బంపఁగా వాఁడు రాక్షసులను బాణములచేఁ గ్రుచ్చెను.

ఉ. ఏచిన శౌర్యగర్వమున • నెల్లెడఁ దా నయి వచ్చువాని మా
రీచుఁడు దాఁకెఁ దాఁకుటయు • రేఁగి సుదర్శనతుల్యచక్రధా
రాచకితాత్ముఁ జేసి ధర • వ్రాలఁగఁ ద్రోసిన వాఁడు పోలియున్
లేచి బలాతిరేకమున • లీలగఁ బాఱగఁ దోలె నాతనిన్. ౨౦౯

అర్థములు. ఏచిన=అతిశయించినఁ, రేఁగి=విజృంభించి, సుదర్శనతుల్య=విష్ణుచక్రముతో సమానమైన, చక్ర=చక్రము యొక్క, ధారా=వాదరచే, చకితాత్మున్=చలించిన మనస్సుగలవానిని, బలాతిరేకమునన్=అతిశయబలముచే.

తాత్పర్యము

అతిశయించిన శౌర్యము వలనఁ గలిగిన గర్వముచే నెంచుఁ జూచినను దానే యై విచ్చలవిడి వచ్చువానిని మారీచుఁ డెదిరింపఁగా సంరోధకంటకుఁడు విజృంభించి విష్ణుచక్రమువంటి చక్రముదెబ్బచే వానిని జలించిన మనస్సుగల వానింగాజేసి నేలఁబడఁద్రోయఁగా వాఁడు మూర్ఛిల్లి లేచి బలాతిశయముచే నతనిఁ బార దోలెను.

చ. తొలఁగినవానిఁ గాంచి రణ • దుర్జయుఁ డా దశకంఠరుండు పే
రెలమిని హేమరత్నినిచ • యోద్ధము ద్వారముఁ జొచ్చెఁ జొచ్చినన్
బలియుఁడు సూర్యభానుఁ డను • వాఁడు దశాస్యు నెదిర్చి యాఁగి వి
శ్చలుఁ డయి యొక్క స్తంభమునఁ • జయ్యన మోఁదెసురారిమూర్థమున్. ౨౧౦

అర్థములు. పేరెలమిని=మిగుల సంతోషముతో, హేమరత్న నిచయ+ ఇద్ధము=బంగారు రత్నసమూహములచేఁ బ్రకాశించునదియగు, ఆఁగి=నిలువరించి.

### తాత్పర్యము

ఇట్లు ద్వారమున కడ్డములేక తొలఁగిపోయిన సంయోధకంటకునిఁ జూచి రణమునందు జయింపరాని దశకంఠుండు మిగుల సంతోషించి బంగారుతోను రత్నసమూహములతోను బ్రకాశించు ద్వారము ప్రవేశించి లోపలికిఁబోఁగా బలశాలి సూర్యభానుఁడనువాఁడు దశకంఠు నెదిర్చి నిలఁబడఁజేసి యచ్చట నున్నయొక స్తంభముతో దశకంఠుని తలమీఁద మిగుల వేగముగ మొత్తెను.

తే. తోరణస్తంభహతినిశా•చారి గ్రక్కెఁ, రక్తమును గొండ ధాతువుల్ • గ్రక్కు పగిది
వరబలమునఁ జేసి యే•బాధ లేక, వాని నద్దాన దానవ•భర్త వైచె. —౧

అర్థములు. తోరణస్తంభహతిన్ = తోరణములు గట్టుటకై పాఁతిన స్తంభముయొక్క దెబ్బచే, నిశాచారి=రాక్షసుఁడు, రావణుఁడు.

### తాత్పర్యము

తోరణస్తంభము దెబ్బచేత; రావణుఁడు కొండ గైరిక ధాతువులఁగ్రక్కు నట్లు నెత్తురు గ్రక్కెను. కాని బ్రహ్మవరము బలమున నే బాధలేక వాని నా స్తంభము చేతనే కొట్టెను.

క. యక్షుఁడు తత్ప్రహరణమున, నాక్షణమ నశించె భస్మ•మై వెఱచేతన్
బక్షులకై వడిఁ దక్కిన యక్షులు తటినీగుహా•చయంబులఁ జొరఁగన్. —౨

అర్థములు. తత్ప్రహరణమునన్=ఆ దెబ్బచే, తటినీ=ఏళ్ళను, గుహాచయంబులన్=గుహల గుంపులను, జొరఁబడఁగా.

### తాత్పర్యము

ఆ దెబ్బచే యక్షుఁడు వెంటనే చచ్చెను. అది చూచి భయపడి యక్షులు గుహలలో నదులలో దాఁగికొనిరి.

## ౧౫వ సర్గము

క. పురివిచ్చిన సైన్యముఁ గని, నరవాహుఁడు మాణిభద్రు•నకు ననె దశకం
ధరుఁ బాపాత్మునిఁ ద్రుంపఁగ, నరుగుము దిక్కగుము శూర•యక్షులకెల్లన్.

అర్థములు. పురివిచ్చిన=చెదరిన, నరవాహుఁడు=కుబేరుఁడు.

### తాత్పర్యము

(చెదరిన సేనను జూచి కుబేరుఁడు మాణిభద్రునితోఁ బాపాత్ముఁడగు రావణుని సంహరింపఁ బొమ్ము, శూరులగు యక్షులకు దిక్కుకమ్ము అని చెప్పెను.)

ఉ. నావుడు వాడు వల్లె యని ♦ నాలుగు వేవురు యక్షవీరు లెం
తేవడిఁ దోడరా నరిగి ♦ తీవ్రగదాముసలాసిశక్తులన్
దేవ దలిర్ప నొంచి వెఱ ♦ జేద్పడ శత్రులు డేగ యో యనం
గా విహరించె లాఘవము ♦ కల్మి సురర్షిచయంబు మెచ్చఁగన్. ౨౯౮

అర్థములు. ఎంతేవ=ఎంతేని వడి, మిక్కిలి వేగముగా, ముసల=రోకండ్ల చేతను, అసి=కత్తులచేతను రెండవపాదంబున నిత్యయతి. "ఏని తున నాంధ్ర శబ్దము, తో నతికిన పూర్వపదము తుదిఁ బ్రాయికి న, చ్చెనను వ్యంజన వర్ణం, బైన రచింపుదురు. 'నిత్యయతు లనుచుఁ గవుల్' అప్ప కి—౨౧౭ వ." క్రొత్తగా నామకరణ మొకటి చేయబడెనే కాని యిది వాస్తవమున ఖండ యతియె. ఏని మొదలైన విట్టివే.

తా త్ప ర్య ము

అని చెప్పఁగాఁ వాఁడంగీకరించి నాలుగువేల యక్షవీరులు తనతోఁడ రాఁగాపోయి తీవ్రములైన గదలచేతను రోఁకండ్లచేతను కత్తులచేతను శక్తులచేతను శత్రువులు భయపడునట్లు బలముతో నొప్పించి దేవఋషులు మెచ్చఁగా డేగ వలె లాఘవముచే సంచరించెను.

ఉ. యక్షుల నొక్క వేవురఁ బ్ర ♦ హస్తుఁడు ద్రుంచె మహోదరుండునున్
దక్షుల వేవురం దునిమె ♦ దాటకపుత్రుఁ డుదగ్రమూర్తి సం
ధుక్షితరోష వేగమునఁ ♦ ద్రోచె ధరం బడ రెండువేల ధూ
మ్రాక్షుఁడు మాణిభద్రునుర ♦ మం దొకరోఁకటఁ దాఁచె బిట్టుగన్. ౨౯౯

అర్థములు. వేవురన్=వేయిమందిని, సంధుక్షిత=రాఁజఁబెట్టఁబడిన, రోష వేగమునన్=కోపాతిశయముచే.

తా త్ప ర్య ము

(ప్రహస్తుఁడొక వేయిమంది యక్షులను జంపెను. మహోదరుఁడు వేయి మందిని, మారీచుఁడు రోషాతిశయమున రెండువేలను జంపిరి. ధూమ్రాక్షుఁడు మాణిభద్రుని రొమ్ము రోఁకటితోఁ గొట్టెను.)

క. చక్కటి నోరాడెడి యా, జక్కులబలగంబు లేద? ♦ శాంబరిపేర్మిన్
నిక్కెడి రక్కసు లెక్కడ?, నక్కతమునఁ జూవె యెక్కుడగు రాయసురల్.

అర్థములు. చక్కటి=ధర్మపద్ధతి మించనలేక, జక్కుల బలగంబు=యక్షుల సేన, శాంబరిపేర్మిన్=మాయయతిశయముచే, అక్కతమునన్=ఆ కారణముచే.

తా త్ప ర్య ము

యక్షులు న్యాయ్యముగ యుద్ధముచేసిరి, రాక్షసులు మోసయుద్ధముచేసిరి. ఆ కారణముచే రాక్షసు లధికులైరి. కాని వాస్తవబలమునఁ గాదు.

క. ముసలము వ్రేటువడుటను దానిసుమంతయు జంక కాతఁ డెసఁగినకినుకన్
వెస ధూమ్రాక్షుని గదఁ జేకసిమిరి తీఱంగ నెత్తి గ్రక్కున మోఁదెన్. ౨౯౭

అర్థములు. ఇసుమంతయు=కొంచెమైన. చేకసిమిరి=చేతిదురద.

తాత్పర్యము

(రోకటిపోటున కిసుమంతయును జంకక మాణిభద్రుఁడు కోపముతోఁ జేతి తీట తీఱునట్లు నెత్తుకు గ్రక్కున ధూమ్రాక్షుని గదతోఁ మోఁదెను.)

క. వ్రేటు వడి పడినమంత్రి ని, శాటునిఁ గని రావణుండు సక్రోధుం డై
దీటోనరని వేగము పరి, పాటిని సమ్మాణిభద్రుపై బఱతెంచెన్. ౨౯౮

అర్థములు. మంత్రి నిశాటుని=మంత్రియగు రాక్షసుని, ధూమ్రాక్షుని, పరిపాటిని=క్రమముగ, దీటోనరని=సమానములేని.

తాత్పర్యము

(వ్రేటుపడిన మంత్రినిఁ గని రావణుఁడు క్రోధముతో తివ్వన మాణిభద్రుని మీఁదికిఁ బరువెత్తుకొని వచ్చెను.)

క. పఱతెంచు పంక్తిముఖుఁ గని, బిఱుసగుశక్తిత్రయమున వ్రేయ నతఁడున్
వఱలెడిగదచే బగతుని, మొఱకపడం బిట్టు డాఁచె ముకుటస్థలమున్. ౨౯౯

అర్థములు. పగతుని=విరోధిని, మొఱకపడన్=మొక్కపోవునట్లు, ముకుటస్థలమున్=కిరీటప్రదేశము.

తాత్పర్యము

(పరువెత్తివచ్చు రావణునిఁ జూచి మాణిభద్రుఁడు కఠినములగు శక్తి యనెడి ఆయుధములు మూఁడు రావణుని మీఁద వేయ నతఁడు విరోధి కిరీట ప్రదేశము మొక్కవోవునట్లు క్రూరముగ గదతోఁ గొట్టెను.)

తే. ఆ ప్రహారంబునను మహాయక్షుమకుట, మొఱగెనొక పార్శ్వమున
కాతఁ డుత్తలంబు
నొందఁడయ్యెను గాన నా యుఱిదిబంటు, పార్శ్వమౌళి యటంచును వాసిఁ గాంచె.

అర్థములు. ఆ ప్రహారంబునకు=ఆ దెబ్బచే, మకుటము=కిరీటము, ఒఱగె=వ్రాలెను, ఉత్తలంబు=తత్తఱపాటు, ఉఱిదిబంటు=ధైర్యము గల శూరుఁడు, వాసి=కీర్తి.

తాత్పర్యము

ఆదెబ్బకు నా మహాయక్షుని కిరీట మొక్కప్రక్కకు ఒఱగెను. దానికి వాఁడు చలింపలేదు. కావున యాదార్ఢ్యముగల శూరుఁడు పార్శ్వమౌళియని కీర్తివడసెను.

**—• కుబేరుఁడు రావణు నిష్ఠురంబు లాడుట •—**

ఉ. దవ్వుననుండి విత్తపతి • దానవనాథునియేపుఁ గాంచి బ
లివ్వునఁ బద్మశంఖకప • రీవృతుఁడై హితశుక్రయుక్తుఁడై
యుర్వ్విబుధారిఁ జేరి మరి • యూద దలంపని శాపమూఢునిన్
గ్రొవ్వునఁ గన్నుఁ గానని య • ఘోరచరిత్రునిఁ బల్కె నిర్వ్యథన్. ౩౦.౧

అర్థములు. దవ్వుననుండి=దూరమునందుండి, విత్తపతి=కుబేరుఁడు, ఏపు=పరాక్రమము, బల్ లివ్వునన్=మిగుల వేగముగ, శకటరేఫములు సంయుక్తములైనపుడు లఘురేఫములగును. కావున రేఫద్వయమునకు యతి చెప్పఁబడెనని భ్రమింపరాదు. "అలఘు రేఫము లుత్తాక్షమగుచో లఘురేఫంబగు" ప్రౌ-వ్యా. ముక్తలక్షణవివేచనము ౨ సూ. 'లఘుర్భ వేద్గురుః కుత్ర'-చిద్గురుశ్చ లఘుస్తథా ఉచ్చారణస్య కల్పత్వాన్ని దానం తత్ర సద్వచః'॥ అథర్వణ కారికలు సంశ్లేషమందు నలఘురేఫము అలఘువుగా నుచ్చరింప సాధ్యపడదు. పద్మశంఖకపరీవృతుఁడై=పద్మశంఖనిధుల కధిదేవత లగువారిచే చుట్టఁబడినవాఁడై, హితశుక్రయుక్తుఁడై=అనుకూలుఁడగు శుక్రుఁడు ప్రోష్ఠపదుఁడను మంత్రులతోఁ గూడినవాఁడై, శాపమూఢునిన్=విశ్రవసు శాపముచే క్రూరుఁడై మట్టు మర్యాద లెఱుఁగని వానిని, అఘోరచరిత్రునిన్=మిక్కిలి భయంకరమైన నడవడి గలవానిని.

తా త్ప ర్య ము

కుబేరుఁడు దూరమున నుండి రావణుని పరాక్రమముఁ జూచి మిక్కిలి వేగముతోఁ, శంఖపద్మాది నిధిదేవతలతోను మంత్రులగు శుక్రప్రోష్ఠపదులతోను గూడినవాఁడై యా రాక్షసు సమీపించి శాపముచే మూఢుఁడై పెద్ద పిన్న గౌరవము తలంపని వానిని గర్వముచే నంధుఁడగు వానిని మిగుల క్రూరమైన నడవడి గల వానిని నీ ప్రకారము పలికెను.

చ. వలదుర కీడుచేఁత లని • భ్రాత వటంచును బుద్ధి చెప్పినన్
నిలువవు, యాత్మలోఁ దలఁప • నేరవ యుక్తమయుక్త మేనియున్
దెలిసెదు దుర్గతిం బొరసి • దీనిఫలానుభవంబు వేళ హా
సలిపితి ఘోరపాపమును • సల్పను బుణ్య మటంచు నేచ్చుచోన్. ౩౦ ౨

అర్థములు. దుర్గతిన్=నరకము, అధోలోకము.

తా త్ప ర్య ము

నీవు తమ్ముఁడవు గదా యని శ్రేయస్సు గోరి చెడుకార్యము లేల చేసెదవని బుద్ధి చెప్పఁగా నిలిచిన వాఁడవు కావు. ఇది యుచితము, ఇది యనుచితమని నీవు మనస్సునం దాలోచించిన వాఁడవు కావు. దీని ఫలము నీవు నరకమునఁ బడి

యనుభవించుచు నయ్యో ఘోరపాపమును జేసితినే, పుణ్యముచేయక పోయితినే యని యేడ్చు సమయమునఁ దెలిసికొందువు.

క. పరికింపక విూఁ దెవ్వఁడు, గరళంబును ద్రావు వాఁడు ♦ కర్మఫలంబున్
పరిణామవేళఁ దలఁచున్, గురుసుల నయ్యది కసింది ♦ కోఁతలు కోయన్. ౩౦౩

అర్థములు, పరికింపక=చూడక, విూఁదు=ముందు రాఁగలది, గరళంబును= విషమును, పరిణామవేళన్=జీర్ణమగు సమయంబున, గురుసులన్=జీవస్థానముల, కసిందికోఁతలు=కలుకు కోఁతలు.

తాత్పర్యము

విషము ద్రావిన విూఁద నెట్లగునో యని యాలోచింపక త్రావువాఁడు అది జీర్ణమగు సమయంబున జీవస్థానముల కలుకల తెగఁగోయు సమయంబున తాను జేసిన కర్మఫల మిది గదాయని యప్పుడు తలఁచును.

తే. న్వల్ప మేదియొ ధర్మంబు ♦ సల్పినట్టి, నిన్నుఁగని సంతసింపరు ♦ నిర్జరాళి
యిట్టి క్రూరంపుబుద్ధి వ ♦ హించి దుష్ట, కార్యముల నిప్పుడొనరించు ♦ కారణమున

నీ విట్టివంటి క్రూరమైన బుద్ధిగలవాఁడవై దుష్టకార్యములు చేయుటచే నేదియో కొంచెము పుణ్యము చేసిన నిన్నుఁ జూచి దేవతలు సంతోషింపరు.

క. జననీ జనకుల నాచా, ర్యుని నవమానించు నాతఁ ♦ డో దుర్మతి కా
లునకున్ వశపడి భృశయా, తనలం దపియించువేళఁ ♦ దత్కృతిఁ దలఁచున్.

అర్థములు. భృశయాతనలన్=అధిక నరక బాధల.

తాత్పర్యము

ఓరి! చెడుబుద్ధిగలవాఁడా! తల్లిని దండ్రిని ఆచార్యుని అవమానించువాఁడు చచ్చి యమలోకమున నరకబాధపడునపుడు దానుజేసినపనిని దలంచి దుఃఖించును

క. తను వధ్రువంబు ధరణిన్, మనువేళన తపముఁ జలుప ♦ మానినయేనిన్
దనగతికిఁ జనిన వెనుకన్ ♦ బనవును బో మానవుఁడు ♦ పరితప్తుండై. ౩౦౬

అర్థములు. అధ్రువంబు=స్థిరముగానిది, మనువేళన = బ్రతికియుండునపుడే, పనవును=ఏడ్చును.

తాత్పర్యము

దేహము శాశ్వతంబు గాదు. జీవించి యున్నప్పుడే తపము చేయఁడేని, తన గతికిఁ దాను బోయిన వెనుక మిగులఁ దపించువాఁడై పుణ్యము చేయక పోయితిని గదా యని యేడ్చును.

క. ధర్మమున రాజ్యధనములు, శర్మంబు నధర్మమునను • సంతాపం బౌ
ధర్మము సౌఖ్యార్థము దు,ష్కర్మమ్మును వదలి చేయఁ•గా సుమతికగున్. ౩౦౭

తా త్ప ర్య ము

ధర్మము చేయువానికి రాజ్యము ధనము ఉభయలోక సుఖము కలుగును. అధర్మము చేయువానికి దుఃఖము కలుగును. బుద్ధిమంతుఁ డగువాఁడు దుష్టకార్యములు చేయక సౌఖ్యార్థమై ధర్మమే చేయవలెను.

ఆ. పాపమునకు నెపుడు•ఫలము దుఃఖమయగు,దాని నిందుఁ గుడువఁ•దగునరుండు
అట్టు గాన మూఢుఁ•డాత్మావఘాతార్థ, మాచరించుచుండు•నఘచయంబు. ౩౦౮

అర్థములు. ఆత్మావఘాతార్థము=తాను నాశమైపోవు కొఱకు, అఘచయంబు=పాపసమూహము.

తా త్ప ర్య ము

(ఎప్పుడయినను పాపమునకు ఫలము దుఃఖమే. దాని మానవు డిందే యనుభవింప దగును. కావున మూఢుఁడు తన వినాశముకొఱకు పాపముచేయుచుండెను.)

క. కట్టఁడి కెవనికి శుభమతి, పుట్టంగాఁ బోదు గురులఁ • బూజింపక యే
యెట్టిది కర్మ మొనర్చునో, యట్టిది ఫల మనుభవించు•నసురేశ్వరుఁడా! ౩౦౯

అర్థములు. కట్టఁడికి=నియమహీనునకు, శుభమతి=మంచిబుద్ధి.

పెద్దలఁ బూజింప నియమహీనునకు మంచి బుద్ధి పుట్టఁజాలదు. రాక్షసరాజా! ఎవఁ డెట్టికర్మము చేయునో దానికిఁ దగిన ఫలమే యనుభవించును.

తే. పుణ్యకర్మవినిర్జిత•పురుషులకును, బుద్ధికనురూప మగుఫలం•బులు ఘటిల్లు
శౌర్య మేనియుఁ బుత్రులేన్•ధైర్యమేని, బుద్ధికొలఁదియయైయుండు•బుద్ధిహీన.

అర్థములు. పుణ్యకర్మ వినిర్జిత పురుషులకును=పుణ్యకర్మములచే జయింపఁబడిన పురుషులకు.

తా త్ప ర్య ము

బుద్ధిలేనివాఁడా! పుణ్యకర్మములచే జయింపఁబడిన పురుషునకు ఫలములు వాని బుద్ధి కొలఁదిగ లభించును శౌర్యమైనను కొడుకులైనను ధైర్యమైనను బుద్ధి కొలఁది యుండును. బుద్ధి మంచిదైన సర్వము మంచిగానే యుండును.

క. పాపాత్ముఁడ వై నిరయప, మాపాదకకర్మకరుఁడ • వగుటను నీ నీ
తోపాటు పలుకఁ జెల్లదు, పాపులతో సుజనుఁ డెపుడుఁ • బలుకడు నియతిన్.

అర్థములు. నిరయసమాపాదకకర్మకరుఁడవు=నరకమును గలిగించు కార్యములఁ జేయువాఁడవు, నీతో పాటు=నీకుసమముగా.

తాత్పర్యము

నీవు పాపపు మనస్సు స్వభావము గలవాఁడవై నరకము గలిగించు కార్యములు చేయువాఁడ వగుటచే నీతో మాటలాడరాదు. మాటలాడినఁ బాపము వచ్చును. సత్పురుషుఁడు పాపాత్ములతో మాటలాడఁడు. ఈ సందర్భమున నీ వాక్యంబులు స్మరణీయంబులు.

'యాం నపశ్యే జ్జాయమానాన్, పాపినో మధుసూదనః
బ్రహ్మరుద్రోథవా పశ్యే ద్రజసా తమసావృతాన్
తై రాలాపం నకుర్వీత నావద్భిః కించిదాచరేత్
ఏకశయ్యాసనం పంక్తి భాండం పక్వాన్న మిశ్రణమ్
యాజనాధ్యాపనే యోని స్తథైవ సహభోజనమ్
నవధా సంకరః ప్రోక్తోనక ర్త వ్యోథమై స్సహ
సల్లాప స్పర్శన స్వాప విధానాసన శాయనాత్
యాజనాధ్యాపనాద్యానా త్పాపం సంక్రమతే నృణామ్
సంవత్సరేణ పతతి పతితేన సమాచరన్
యాజనా ధ్యాపనా ద్యానా త్సహాశయ్యాసనాశనాత్
పాషండినో వికర్మస్థాన్ బైడాల్రవతికాన్ శఠాన్
హైతుకాన్ బకవృత్తీంశ్చ వాఙ్మాత్రేణాపి నార్చయేత్'

## —• రావణ కుబేర యుద్ధము •—

మ. అని మారీచముఖాసురుల్ గదియ యక్షాధీశుఁ డా సోఁకులన్
ఘననారాచపరంపరానిహతి వీఁగం జేసి రక్షోధిపున్
దన చేనున్నగదన్ శిరస్స్థలమునం • దాఁచెన్ రవంతేని య
ద్దనుజుం డుత్తలపాటు లేక నిలిచెన్ • ధైర్యంబు దీపింపగన్. ౩౧౨

అర్థములు. కదియన్=సమీపింపఁగా, యక్షాధీశుఁడు=కుబేరుఁడు, సోఁకులన్=రాక్షసులన్, ఘననారాచ పరంపరానిహతిన్=గొప్ప బాణముల వరుసల దెబ్బలచే, వీగన్=వెన్నిచ్చునట్లు, ఉత్తలపాటు=కలఁత.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి యింతలో మారీచుఁడు మొదలగువారు సమీపమునకు రాఁగా వారి గొప్ప బాణపరంపరలచే వెన్నిచ్చునట్లు, చేసి తన చేతనున్న గదచే రావణుని తలమీఁద గొట్టఁగా వాఁడు ధైర్యముచేఁ గలఁతజెందకనిలిచెను.

శా. అన్యోన్యంబును శ్రాంతి లేక సురయక్షాధీశ్వరుల్ లోకసా
మాన్యాన్యప్రథమానవిక్రమకళా మాత్సర్యసందీప్తులై
జన్యోద్రేకిత నొంప యక్షుఁ డనలా స్త్రం బేయ దైత్యుండు వ
ర్షన్యాస్త్రంబున నార్చి మాయఁ గొనియెన్ శత్రుప్రహారార్థమై. ౩౧౩

అర్థములు. శ్రాంతి=విరామము, లోకసామాన్య అన్య=లోకమున నసాధారణమైన,ప్రథమాన=కీర్తి కెక్కిన,విక్రమకళా=బలవిద్యచేతను, మాత్సర్య=మచ్చరము చేతను, సందీప్తులై = వెలుఁగుచున్నవారై, జన్యోద్రేకితన్=యుద్ధమందలి యుద్రేకముచే, నొంపన్=నొప్పింపఁగా, శత్రుప్రహారార్థమై=విరోధిని గొట్టు నిమిత్తమై.

తాత్పర్యము

రావణ కుబేరులు లోకమున నసాధారణమై ప్రసిద్ధి కెక్కిన బలముచేతను మాత్సర్యము చేతను వెలుఁగుచు యుద్ధమందలి యుద్రేకముచే నొకరి నొకరు విరామము లేక నొప్పింపఁగా కుబేరుఁడు ఆగ్నేయాస్త్రము వైచెను. దానిని రావణుఁడు వారుణాస్త్రంబునఁ జల్లార్చి శత్రువును గొట్టుటకై మాయచేసెను.

క. పులులయు వృక్షంబుల యేకలముల కొండలయు మబ్బుగములయు మున్నీ
రులయున్ యక్షుల దైత్యుల, పలువిధముల తనులు వేలు వందలు దాల్చెన్.

అర్థములు. ఏకలములు=అడవిపందులయు. మబ్బుగములయు=మేఘ సమూహములయు, మున్నీరులయున్=సముద్రములయు, తనులు=శరీరములు, వందలు=నూర్లు.

తాత్పర్యము

(పులులు, చెట్లు, కొండలు, అడవిపందులు, మేఘములు, సముద్రములు యక్షులు, రాక్షసులు మున్నగు శరీరములు నూర్లు వేలు ధరించెను.)

క. మాయారూపంబులఁ దై, తేయుని శరవృష్టి నొకఁడ త్రినయనమిత్రుం
డారయఁ గనెఁ గాని కనం, డా యసురాధముని సంభ్రమాకలితుండై. ౩౧౪

అర్థములు. త్రినయనమిత్రుండు=కుబేరుఁడు, మాయా రూపంబులన్=అద్భుత శక్తిచే గల్పింపఁబడిన యాకారములను, శరవృష్టి = బాణవర్షము, సంభ్రమాకలితుండై=మిగుల భ్రమచెందినవాఁడై.

తాత్పర్యము

రావణుఁడు తన యద్భుతశక్తిచేఁ గల్పించిన రూపములను, బాణవర్షమును మాత్రము కుబేరుఁడు చూడఁగలిగెనేకాని యదృశ్యుఁడైన రావణాసురుని జాడఁ జాలకపోయెను ఆ కారణమున మిగుల భ్రమగొనెను.

## —* రావణుఁడు కుబేరు జయించి పుష్పకంబుఁ గొనుట *—

ఉ. అంత దశాననుండు విమ•మాస్త్రముఁ బూని మనుష్యధర్ము దు
ర్దాంతజవంబు మై నడవఁ • గ్రమ్మినమూర్ఛ మునింగి వ్రాలె మే
నంతయు రక్తసిక్తముగఁ • గృత్తమమూల మశోకమో యనన్
జెంతలఁ జేరి పద్మముఖ • శేవధు లా ధననాథుఁ దేర్చుచున్. ౩౧౬

అర్థములు. మనుష్యధర్మ=కుబేరుని, 'మనుష్యధర్మా ధనదో రాజరాజో ధనాధిపః' అమరము, మనుష్యుల యాచారమువంటి యాచారము గలవాఁడు, దుర్దాంతజవంబుమై—అణఁపరాని వేగమున, అడవన్=కొట్టఁగా, రక్తసిక్తముగన్=నెత్తుటఁ దడసినదిగ, కృత్తము మూలము=నఱకఁబడిన వేఱుగలది, పద్మముఖ శేవధులు=పద్మము లోనగు నిధుల కధ్యక్షులగువారు, తేర్చుచున్=మూర్ఛ తేరునట్లు చేయుచు.

### తాత్పర్యము

కానవచ్చు నాకారములలో రావణుఁ డెవ్వఁడో తెలియక కుబేరుఁడు తికమక గొనియుండఁగా రావణుఁడు మిగుల వేగముగల కఠినాస్త్రము నొకటి ప్రయోగింపఁగా నది తగిలి యతఁడు మూర్ఛపోయి వేళ్ళునఱికినఁ బడు నశోక వృక్షమువలెఁ బడెను. అది చూచి పద్మాధిదేవత లాతనను మూర్ఛ తేలఁ జేయుచు.

క. నందనమునకుం గొని చన, నందితుఁడై యసుర ధనదు•నగరికిఁ జని యం
దందమగు పుష్పకము న•స్పందమదంబునను గొనియె•జయచిహ్నముగన్. ౩౧౭

అర్థములు. నందితుఁడై=సంతోషించినవాఁడై, అస్పందమదంబునను=చలింపని గర్వముతో, జయచిహ్నముగన్=గెలిచినదానికి గుర్తుగా.

### తాత్పర్యము

ఉపచారమునకై నందనవనమునకుఁ దీసికొనిపోఁగా రావణుఁడు సంతోషించి కుబేరుని నగరిఁ బ్రవేశించి దాను గెలిచినదానికి గుర్తుగా మిగుల గర్వముతో పుష్పకమును హరించెను.

సీ. జాతరూపోజ్జ్వల• స్తంభసంవీతమై, వైడూర్యతోరణ•భ్రాజిత మయి
సరసముక్తాజాల•సంప్రతిచ్ఛన్నమై, సర్వకామఫలవృ•క్షంబు నగుచుఁ
గామరూపం బయి•కామజవం బయి కామగమం బయి • ఖచర మగుచు
భర్మమణీద్ధ సో•పానసంఘం బయి, తప్తకాంచనవేది•తలము నగుచు
తే. నాకనిలయోపవాహ్యమై•నవ్యమగుచు,దృష్టిహృదయసుఖంబయి•దివ్యమగుచు
సర్వఋతుసుఖదం బయి•శైత్యతాప,హీనమై బ్రహ్మనిర్మిత•మైనదాని. ౩౧౮

అర్థములు. జాతరూప+ఉజ్జ్వల=బంగారువలెఁ బ్రకాశించు, స్తంభ=స్తంభములచే, సంవీతమై=కూడినదై, వైడూర్యతోరణ భ్రాజితమయి=వైడూర్యములతోఁ జేయఁబడిన తోరణములచేఁ బ్రకాశించునదియై, సరస=బంగారుతోఁ గూడిన, ముక్తాజాల=ముత్యాల సమూహముచే, సంప్రతిచ్ఛన్నమై=చక్కఁగాఁ గప్పఁబడినదై, సర్వకామ ఫలవృక్షంబు=కోరినవన్నియు నిచ్చు ఫల వృక్షము గలదై, కామరూపంబు=కోరిన రూపము గలది, కామజవంబు=కోరిన వేగమునఁ బోఁగలది, ఖచరము=ఆకాశమునఁ బోగలది, భర్మ+మణి+ఇద్ధ=బంగారు రత్నములచేఁ బ్రకాశించు, సోపానసంఘంబయి=మెట్ల సమూహములు గలదై, తప్త కాంచన=పుటము వేయఁబడిన బంగారుతోఁ జేయఁబడిన, వేదితలము=అరుఁగుల ప్రదేశము, నాకనిలయ=దేవతలకు, ఉపవాహ్యమై=వాహనముగా నుండఁదగినదై, నవ్యము=మనోహరము, దృష్టి హృదయ సుఖంబయి=చూపులకు మనస్సునకు సుఖము కలిగించు నదియై, సర్వ ఋతు సుఖదంబయి=అన్ని ఋతువులందు సుఖము కలిగించు నదియై, శైత్యతాపహీనమై=చలియిరి వేడిమిలేనిదై, బ్రహ్మనిర్మితము=బ్రహ్మచేఁ గల్పింపబడినది.

తాత్పర్యము

* బంగారు స్తంభములు వైడూర్య తోరణములు ముత్యములజాలములుగలిగి కోరిన ఫలము లీయగలిగిన చెట్లుగలదై కోరినరూపము గలదిగా మార్ప సాధ్యమైనదై కోరిన వేగమునఁ బోఁగలదై కోరినట్లు మింటను నేలలో నెందైనఁ బోఁగలదై యాకాశమున సంచరించునదియై బంగారు రత్నములచే ప్రకాశించు సోపానములు గల్గదై పుటము వేసిన బంగారు తిన్నెలు గలదై దేవతలకు నెక్కి తిరుగ యోగ్యమై మనోహరమై కంటికి మనస్సునకు సుఖము గలిగించునదియై దేవతాసంబంధమై అన్ని ఋతువులందు సుఖము గలిగించునదియై చలివేఁడుములు లేక యెల్లకాలము సమశీతోష్ణములు గలదై బ్రహ్మ నిర్మించినదానిని.

క. కడిమి మెయి నవ్విమానము. నొడిచి దురాత్ముండు విక్ర•మోద్ధతి జగముల్
పడ నడచినట్ల పొంగుచు. వడి దిగియెన్ వెండికొండ•ధ్వజినీయుతుఁడై. ౩౧౯

అర్థములు. కడిమి మెయిన్=పరాక్రమముచేత, ఒడిచి=హరించి, పడనడచినట్లు=పడఁగొట్టినట్లు, జయించినట్లు, ధ్వజినీయుతుఁడై=సేనతోఁగూడినవాఁడై.

తాత్పర్యము

(పరాక్రమముచేత నావిమానమును హరించి; విక్రమాతిశేయమునలోకములన్నిఁటిని గెలిచినట్లు పొంగిపడి సేనతోఁ గూడ వెండికొండనుండి వడిగాదిగెను.)

## ౧౬వ సర్గము

### —• కైలాస ప్రాంతంబునఁ బుష్పకము చన కుండుట •—

క. సేనలతోడ విమానము,పై నెక్కి కుమారజన్మ • వసుధ శరవణం
బౌ నెలవు హేమమయమున్, భానూపమ మైనదానిఁ • బర్వతవరమున్. ౩౨౦

అర్థములు. కుమార జన్మవసుధ=కుమారస్వామి పుట్టినభూమి యందు, శరవణంబు=జెల్లువనము వనములోనివకారము రేఫ యోగముచేణకారమయ్యెను. 'రషాభ్యాం నోణస్సమాన పదే'యని పాణిని, త్రినయన శబ్దమపవాదము, హేమమయమున్=బంగారుతో నిండినది, భానూపమము=సూర్యునితో సమానమైనది.

తాత్పర్యము

సేనలతో విమానముమీఁద నెక్కి కుమారస్వామి పుట్టిన భూమి జెల్లుగల ప్రదేశము బంగారుతో నిండినది సూర్యకాంతి గలది యగు పర్వత శ్రేష్ఠమును.

శా. ఆరోహించుచుఁ బోవుచోట నొక ర•మ్యారామముం గాంచె వాఁ
డా రారాజువిమాన మేగ కట ని • ర్వ్యాపారమై నిల్చినన్
చేరం బిల్చి యమాత్యవర్యులను ని • ల్చెం బుష్పకం బిష్టసం
చారం బయ్యు నిదేల యెవ్వఁ డిటు సం • స్తంభించెనో దీనినిన్. ౩౨౧

అర్థములు. ఆరోహించుచున్=ఎక్కుచు, రమ్యారామమున్=అందమైన యుద్యానవనమును, రారాజు=కుబేరునియొక్క, రాజరాజశబ్దభవము రారాజు, నిర్వ్యాపారమై=జరుగుటలేనిదై, ఇష్టసంచారంబు=కోరినట్లు తిరుగునది, సంస్తంభించెనో=కదలకుండఁ జేసెనో.

తాత్పర్యము

ఎక్కుచుఁ బోవుచు నొకచోట నందమైన యుద్యానవనమును జూచెను. అచ్చట నా కుబేరుని విమానము కదలక నిలిచెను. అప్పుడు రావణుఁడు మంత్రులను చేరఁ బిల్చి యిష్టము వచ్చినట్లు పోవఁగల యీ విమానము కదలకుండుటకు గారణ మేమి? ఎవ్వఁడు దీనిని కదలకుండఁ జేసెను?

సీ. అన బుద్ధికోవిదుం•డైన మారీచుండు, నిష్కారణమ్ముగ • నిలువ దిద్ది
కత మేదియో గల్గుఁ•గాకున్నఁ గిన్నర,ముఖ్యుఁ దప్పుఁగ నన్య•మోవ దేమొ?
యనియిట్లు యోజించు•నవసరంబునఁ గృష్ణ,పింగళుండును ముండి•వికటుఁడొకఁడు
కుఱుచచేతులవాఁడు•గుజ్జుదేహమువాఁడు బలవంతుఁడును మిట్ట•పండ్లవాఁడు
తే. ఈశ్వరుని యనుచరుఁడు నం•దీశ్వరుండు, పంక్తికంఠునిఁ జేరంగ•వచ్చి నిలిచి
కొంత మది లేక రాక్షస•కోటి వినఁగ,వానితో నను గంభీర•భాషణముల ౨౨

అర్థములు. కోవిదుఁడు=పండితుఁడు, కతము=కారణము, కృష్ణపింగళుండు=నలుపు పసుపు కలిసిన వన్నెగలవాఁడు, ముండి=బోడి, వికటుఁడు=

భయంకరమైనవాఁడు, నందీశ్వరుఁడు=వృషభేశ్వరుఁడు, నందము = ఆనందము, అది కలవాఁడు నంది, అట్టినందులం దీశ్వరుఁడు,నందీశ్వరుడు ఈశ్వరసేవానందము గలవాఁడని భావము.

తాత్పర్యము

(అనఁగా, బుద్ధిమంతుఁడగు మారీచుఁడిది నిష్కారణముగ నిలువదు. కారణ మేదియో యుండును, అటుగాక యిది కుబేరునిఁ దక్క నితరుల మోపదేమొ? అని యోజించుచుండుసంతలోఁ, గుఱుచ చేతులవాఁడు, పొట్టివాఁడు, నలుపు పసుపు గలసిన వన్నెగలవాఁడు, బోడితలవాఁడు, భయంకరమైనవాఁడు, శివుని యనుచరుఁడు నగు నందీశ్వరుఁడు రావణుని దగ్గఱకు వచ్చి జంకులేక బిగ్గరగా రాక్షసులు వినుచుండ రావణునితోఁ.)

క. దశకంఠ! మరలి చను మీఁ,దిశ రాకుము శంకరుండు • దేవియుఁ గ్రీడా
వశులై యున్నారరుగఁగ, వశపడదు సురాహియమర•వరులకు నైనన్. ౩ ౨౩

అర్థములు. ఈదిశ=ఈవైపు, దేవి=పార్వతీదేవి. వశపడదు=సాధ్యపడదు, సుర=దేవతలకు, అహి=సర్పములకు, అమరవరులకు=ఇంద్రుఁడు లోనగువారికి,

తాత్పర్యము

(రావణా! యిటు రాకుము-మరలిపొమ్ము-ఇక్కడ శంకరుఁడు పార్వతితోఁ గ్రీడాపరుఁడయి యున్నాఁడు. దేవతలకు సర్పములకు నింద్రుఁడు మొదలగు వారికిఁ గూడ పోవుటకు సాధ్యపడదు.)

తే. అనినఁ గంపితకుండలుఁ•డగుచు రోష,సంభ్రమంబున నివ్వెఁ డా•శంకరుండు
టంచుఁ బుష్పకమును డిగ్గి•యద్రిమూల, మరిగియచ్చోట రెండవ•హరుఁడనంగ.

అర్థములు. కంపితకుండలుఁడు=కదలుచున్న కుండలములు గలవాఁడు, దీనిచేఁ దలయూఁచెనని గ్రాహ్యము, రోషసంభ్రమంబునన్=కోపమువలని వేగిరపాటుతోఁ, అద్రిమూలము=పర్వతము క్రిందిభాగము.

తాత్పర్యము

అని చెప్పఁగా కుండలములు కదల రోషవేగమునఁ దలయూఁచి యెవ్వఁడురా యీ శంకరుఁడని పుష్పకము దిగి కొండక్రిందివైపుపోయి యచ్చట రెండవ హరునివలె.

తే. దీప్తశూలంబు చేఁ గ్రాలఁ•దేజరిల్లు, కీశముఖు నందిఁ గనుఁగొని•యాశరుండు
వారిదము మ్రోఁగుపట్టు ల•వజ్ఞఁ దోఁకఁ జకపకమటంచు నవ్వె నా•భ్రమఁడనియె.

అర్థములు, కీశముఖున్=కోఁతిముఖము వంటి ముఖము గలవాని, ఆశరుండు=రాక్షసుడు, వారిదము=మేఘము, అవజ్ఞ=తిరస్కారము.

తా త్ప ర్య ము

మండుచున్న దానివలెఁ బ్రకాశించు శూలమును జేతఁ ధరించి క్రోఁతి ముఖము గల నందిని జూచి యా రాక్షసుఁడు మేఘధ్వనితోఁ దిరస్కారబుద్ధి పకపక నవ్వఁగా నా నంది యిట్లనియె.

—* నందీశ్వరుఁడు రావణు శపించుట *—

ఉ. మర్కటవక్త్రుఁ డంచు నవ•మానము దోఁపఁగ నవ్వెదే వనుం
దర్కమిదేల? నిన్ను రణ• దర్పసమగ్రులు మద్బలాకృతుల్
కర్కశవిగ్రహుల్ గిరిని• కాశులు పుత్రకమిత్రభృత్య సం
పర్కభవద్బలంబు రణ• మండలిఁ ద్రుంపఁగఁ బుట్టువారలన్. ౩౨౬

అర్థములు. మర్కటవక్త్రుఁడు=క్రోఁతి ముఖము గలవాఁడు, రణదర్ప సమగ్రులు=పూర్ణమైన యుద్ధగర్వము గలవారు, మద్బలాకృతుల్=నాబలమంత బలము నాయాకారము వంటి యాకారము గలవారు, కర్కశ విగ్రహుల్=కఠిన దేహము గలవారు, గిరినికాశులు=పర్వతములతో సమానులు, పుత్రక=కొడుకుల తోను, మిత్ర=స్నేహితులతోను, భృత్య భటులతోను, సంపర్క=కూడిన, భవ ద్బలంబు=నీ సేనను.

తా త్ప ర్య ము

ఓరి రాక్షసుఁడా! నాముఖము క్రోఁతి ముఖమువలె నున్నదని పరిహసించె దవా? కానీ, నీతో నాకు వాద మేల? యుద్ధ గర్వము పూర్ణముగాఁ గలవారు నాయంత బలము నాయాకారము వంటి యాకారము గలవారు కఠిన దేహములు గలవారు పర్వతసమానులు కొడుకులతో మిత్రులతో భటులతోఁ గూడిన నీ సేనను యుద్ధమందుఁ జంపగలవారు భూమిపై బుట్టుదురు.

క. మందుఁడ! నిన్నున్ మృత్యువుఁ బొందింపఁగ నిపుడ శక్తిఁ•బొరయుదునైనన్
నిందలఁ జచ్చినవాఁడవు, మ్రందింపఁగఁ జన్నె మున్నె•మడిసినవానిన్. ౩౨౭

తా త్ప ర్య ము

బుద్ధిలేనివాఁడ! నిన్ను నే నిప్పుడే చంపగలను గాని నీవు ముందే నిందలచేఁ జచ్చినవాఁడవు. చచ్చినవానిని మరలఁ జంప నేల?

క. అను నందికేశ్వరునిపై, వినుతెరవున నుండి పుష్ప•వృష్టియుఁ గురిసెన్
ఘనదేవదుందుభిస్వన, మొనరెన్ దశకంఠుఁ డద్ది•యుఱుక మదమునన్. ౩౨౮

అర్థములు. ఉఱుక=లక్ష్యము సేయక, వినుతెరువు=ఆకాశము.

తాత్పర్యము

(అనిన నందికేశ్వరుని మీఁద నాకాశమునుండి పూలవాన గురిసెను. దేవ దుందుభులు మ్రోసెను. రావణుఁడు దానిని లక్ష్యము సేయక పొగరుతో.)

చ. బసవఁడ! మద్విమానగతి ♦ భంగముఁ గూర్చిన యల్లరుద్రునిం
బసచెడ నీధరాధరముఁ ♦ బట్టి పెకల్చెద మూలముట్టుగా
వెస నిదె చూడు మేబలము ♦ పెంపున భర్గుఁడు రాజువోలె నం
దనమునఁ గ్రీడసల్పెడిని ♦ దారుణు భీతిఁ దలంప కెప్పుడున్. ౩౨౯

అర్థములు. బసవఁడ=ఎద్దా, మద్విమానగతి=నా విమానము పోవుటను, భంగము=విఘ్నము, ధరాధరమున్=కొండను.

తాత్పర్యము

ఓసి యెద్దా! నా విమానము నడవకుండ విఘ్నము చేసిన రుద్రుని పసచెడునట్లు ఈ కొండను మొదలంటఁ బెకలించెదఁ జూడుము. శివుఁ డేమిబలము నమ్మి రాజువలె భయము లేక యీ నందనవనమందుఁ గ్రీడించుచున్నాఁడు?

## —* రావణుఁడు కైలాసముఁ బెల్లగించుట *—

క. అమహిమఁ జూతుఁ గా కని, యామహీభృద్వరముఁ బెకికి ♦ హస్తంబులచే
నా మొఱకుం డాడించిన, నామల యాపాదశిఖర ♦ మల్లలనాడెన్. ౩౩౦

అర్థములు. మహీభృద్వరము=గొప్ప పర్వతము, మొఱకుఁడు=మూర్ఖుఁడు, మల=పర్వతము, ఆపాదశిఖరము=అడుగుపాఁదు మొదలు శిఖరము వఱకు, అల్లలనాడెన్=వణఁకెను.

రావణుఁడు శివభక్తులలోఁ జేర్పఁబడినవాఁడు, శివలింగపూజ చేయువాఁడని ౭౯ మొదలగు పద్యములందుఁ జెప్పఁబడెను. అట్లుండియు శివు నిప్పు డింత యవమానదృష్టిఁ జూడఁ గారణమేమో? మొట్టు దేవరకు వెఱతునా, మ్రొక్కు దేవరకు వెఱతునా యన్నట్లు ఈ కథ జరిగిన తరువాత శివభక్తి పుట్టెనేమో.

బలి ప్రహ్లాద విభీషణాదులు కతిపయరాక్షసులుతప్పఁ దక్కిన రాక్షసులందఱు శివభక్తులే. తామసులు, తామసదేవతను గొలుచుట స్వభావమేకదా.

తాత్పర్యము

(ఆ ప్రభావమును జూచెదనుగాక, యని యా మూర్ఖుఁడు తన చేతులతో నా గొప్ప పర్వతమును బెల్లగించి యాడింపఁగా నా కొండ, యడుగు పాఁదు మొదలు కొన వఱకు వణఁకెను.)

క. చోద్యంబుగ నతఁ డిగ్గిరి, మాద్యద్గతి నూఁపఁ బ్రమథమండలి వణఁకెన్
ప్రోద్యత్కంపంబున దే, వాద్యుని గిరిరాజతనయ యాశ్లేషించెన్. ౩౩౧

అర్థములు. ప్రోద్యత్+కంపంబునన్=మిక్కిలిగాఁ బుట్టుచున్న వణఁకుచే, గిరిరాజతనయ=పార్వతి, దేవాద్యుని=శివుని, ఆశ్లేషించెన్=కౌఁగిలించెను.

తాత్పర్యము.

మదించిన వానివలె వాఁడా కొండ నూఁగులాడింపఁగా ప్రమథు లందఱు వణఁకిరి. పార్వతీదేవి భయపడి శివునిఁ గౌఁగిలించెను.

అప్పుడే పార్వతీదేవి రావణాసురుఁడు స్త్రీ నిమిత్తముననే చచ్చునుగాక యని శపించెను.

తే. అంతటఁ గపర్ది పాదంబు నంగుటమున, నదుమ నగ్గిరి తొల్లిటియట్టులుండఁ
గేలిఁజిక్కొన్న దైత్యుండు జాలిపుట్ట, బిట్లు వాపోయెఁ బెనునొవ్వి పుట్టుటయును

అర్థములు. కపర్ది=శివుఁడు, కపర్దము=జటాజూటము, అది గలవాఁడు కపర్ది, అంగుటమునన్=బొటనవ్రేలిచే.

తాత్పర్యము

(అంతట శివుడు తన కాలి బొటనవ్రేలితో నాకైలాస పర్వతమును మునుపటి విధముగా నుండు విధముగా నదిమెను. అందుచేత రావణుఁడు చేతు లా కొండ క్రింద నిఱికి నొక్కికలుగుటచే జాలిపుట్టునట్లు పెద్దగా నేడ్చెను.)

చ. అదరె జగత్త్రయంబు సకలాబ్ధిచయంబులు క్షోభ నొందె గ్ర
క్కదలె ధరాధరంబులు ది గాలున నిర్జరయక్షసంతతుల్
బెదరె నిదే మటంచు సుర బృందము సేంద్రముగాఁ దలంచలన్
జెదరె సమాత్యకోటి వెఱ చెన్ లయకాలమహాశనిభ్రమన్. ౩౩౩

అర్థములు. జగత్+త్రయంబు=మూఁడులోకములు, సకలాబ్ధిచయంబులు=అన్నిసముద్రముల సమూహములు, క్షోభము=కలఁత, ధరాధరంబులు=కొండలు. లయకాల=ప్రళయకాలమందలి, మహాశని=పెద్దపిడుగను, భ్రమన్=భ్రాంతిచే.

తాత్పర్యము

రావణుఁ డేడ్చిన యేడుపునకు ముల్లోకము లదరెను. సముద్రము లన్నియు కలఁత చెందెను. కొండలు గడగడ కదలెను, దేవతలు యక్షులు దిగాల్పడి బెదరిరి. ఏమిది యేమిది యని యింద్రునితోడ దేవతా సమూహము తమనెలవు లందుండి చెదరెను. ప్రలయ కాలమందలి పిడుగు పడెనా యేమని రావణుని మంత్రులు దిగ్భ్రమ గొనిరి.

ఉ. రావణుఁ డిట్లు రోదనప • రాయణుఁ డౌటయు మంత్రులెల్ల వా
చావినయంబు దోఁప హరు • శంకరు భర్గు నుమేశునిన్ మహా
దేవుని వేఁడుమీ యతఁడ • దిక్కయి త్రిక్కణగించు నన్న నా
దేవవిరోధి యట్ల విను • తించెఁ గృపాలుని భక్తపాలునిన్. ౩౩౪

అర్థములు. రోదన పరాయణుఁడు=ఏడ్చుటొక్కటే గతిగాఁగలవాఁడు వాచావినయంబు=వినయవాక్యలు, త్రిక్క=బాధ.

తాత్పర్యము

రావణుఁ డీప్రకార మేడ్చుట తప్పఁ జేతు లూడఁదీసికొనుటకు మరే మియుఁ జేయ లేకుండుటఁ జూచి మంత్రు లందఱు రాజా! హరుని శంకరు భర్గు పార్వతీపతిని మహాదేవుని ప్రార్థింపుము నీ బాధ పోఁగొట్టునని చెప్పఁగా నతఁ డట్లే దయావంతుఁడును భక్తరక్షకుఁ డగు శివునిఁ బ్రార్థించెను.

**—• శివుఁడు రావణునకు వరంబు లిచ్చుట •—**

ఉ. ఈగతి వేయివత్సరము • లేడ్చిన నంతట నంతకారి యా
ప్రాగమరాధినేత కర • వర్గము నూడఁగఁదీయఁ బంచుచున్
రాగరసంబు దోఁప నను • రక్షవరా! భవదీయధీరతా
భోగపరాక్రమంబులకుఁ • బూర్ణముదంబు వహించితిం జుమీ. ౩౩౫

అర్థములు. అంతకారి=యముని జయించినవాఁడు, ప్రాగమర+అధినేత= రాక్షసరాజు, కరవర్గము=చేతులసమూహము, రాగరసంబు=ప్రేమ, భవదీయ ధీరతా,భోగ పరాక్రమంబులకు=నీ విస్తార ధైర్య పరాక్రమంబులకు.

తాత్పర్యము

ఈవిధముగ వేయి సంవత్సరములు రావణుఁ డేడువఁగా శివుఁడు వాని చేతులూడఁ దీసికొను మని చెప్పి ప్రేమతో నిట్లనెను. రాక్షసశ్రేష్ఠా నీ విస్తార! ధైర్యపరాక్రమములకు మిక్కిలి సంతోషించితిని.

క. శైలాక్రాంతుఁడ వై నీ, వీలీల మహారవంబు • నెల్లజగంబుల్
వ్యాలోలంబుగఁ జేయుట, హాలిన్ ఘటియింతు రావ•ణాఖ్యను నీకున్. ౩౩౬

అర్థములు. శైలాక్రాంతుఁడవై=పర్వతముచే నాక్రమింపఁబడినవాఁడవై, వ్యాలోలంబుగన్=మిగులఁ జలించునదిగ, రావణాఖ్యను=రావణుఁ డను పేరును

తాత్పర్యము

కొండక్రిందఁ జిక్కుకొని యీవిధముగ నెల్లలోకములు వ్యాకుల మగునట్లు లేడ్చితివి గావున నీకు రావణుఁ డను పేరు పెట్టితిని.

క. దేవతలు నరులు యక్షులు, భూవలయమునందుఁ గల్గు ♦ భూతము లెల్లన్
రావణుఁ డంచును జగతీ, రావణు నినుఁ బిల్చు నింక ♦ రాక్షసరాజా! ౩౩౭

అర్థములు. జగతీ రావణున్=ప్రపంచము నేడ్చునట్లు చేయువానిని.

తాత్పర్యము

(రాక్షసరాజా! దేవతలు, మానవులు, యక్షులు ప్రపంచమందలిభూతము లన్నియు లోకుల నేడ్పించు నిన్నిఁక రావణుఁడని పిలుచును.)

క. పొమ్మింట కేగదవో యథేచ్ఛమ్ముగ నిశ్శంక మనుడు ♦ సంతసమున నా
ముమ్మొనవాలుందాలుపు, నమ్మనుజాశనచయేశుఁ ♦ డార్తశరణ్యా! ౩౩౮

అర్థములు. ముమ్మొన వాలుందాలుపు=మూఁడు మొనలుగల యాయుధమును (త్రిశూలమును) ధరించిన వానిని, శివుని, మనుజాశనచయేశుఁడు రాక్షస ప్రభువు

తాత్పర్యము

(జంకుమాని యిఁక నీ యిష్టమయిన చోటికెక్కడకుఁ బోయెదవో పొమ్మని అనఁగానే సంతోషముతోఁ ద్రిశూలధారియగు శివుని రావణుఁడు 'ఆర్తశరణ్యా!')

ఉ. ప్రీతుఁడ వేని నాయెడల ♦ వేఁడెద నొండు ఘటింపవే దయన్
ధాత యొసంగె దేవఫణి ♦ దానవగుహ్యకయక్ష రాక్షస
వ్రాతముచే నవధ్యత దు♦రంబున, దుర్బలమానవావళిన్
జేతమునన్ గణింప, దయ♦చేసెను వెండియు దీర్ఘ మాయువున్. ౩౩౯

అర్థములు. అవధ్యత=చావులేకుండుట, దురంబునన్=యుద్ధమందు.

తాత్పర్యము

నాయందు నీవు ప్రీతి గలవాఁడ వేని నేను వేఁడొకటి కోరుచున్నాను. దాని ననుగ్రహింపుము. బ్రహ్మదేవుఁడు నాకు దేవ నాగ దానవ గుహ్యక యక్ష రాక్షసులచే యుద్ధమందుఁ జావు లేకుండ వరమిచ్చెను, బలహీనులగు మనుష్యులను నేను లెక్కపెట్టినవాఁడఁ గాను. అంతియ గాక నాకు దీర్ఘాయువు ననుగ్రహించెను.

ఉ. అల్లవిరించిదత్తమగు ♦ నాయువునందు గతించెఁ గొంత నీ
వెల్లను దొల్లియట్ల ఘటి ♦ యింపుము నీమహనీయశస్త్రము
ద్యల్లలితానుకంప గిరి ♦ శా! దయసేయు మటన్న దేవతా
తల్లజమిచ్చె భాస్కరశ ♦ తప్రవిభాసముఁ జంద్రహాసమున్. ౩౪౦

అర్థములు. విరించిదత్తము = బ్రహ్మచే నీయబడినది, ఉద్యత్ లలితానుకంపన్=పుట్టుచున్న సంతోషకరమైన దయచే, గిరిశా=శంకరా, దేవతా

తల్లజము=దేవతలందు శ్రేష్ఠుఁడు, భాస్కర శత ప్రవిభాసము=నూర్గురు సూర్యుల కాంతి గలది, చంద్రహాసము=కత్తి.

తాత్పర్యము

ఆ బ్రహ్మ యిచ్చిన యాయుస్సునందుఁ గొంత గతించిపోయినది. నీవు మొదటివిధమున సర్వము పూర్తియగునట్లు చేయుము. నాయందు దయగలవాఁడవై నీ శస్త్రమును నిమ్మ అని వేఁడఁగా దేవతలందు శ్రేష్ఠుఁడగు శివుఁడట్టులే నూర్గురు సూర్యుల కాంతిగల చంద్రహాస మిచ్చెను.

చ. ఇటు తన ఖడ్గ మిచ్చి మది • నెంచి గతాయువుఁ బూరణించి ధూ
ర్జటి సురవైరితో ననియె • రావణ! నీవు మదీయ శస్త్రమున్
స్ఫుటతరభక్తిఁ బూజలను • బొల్పుగఁ జల్ప కనాదరించినన్
గుటిలత మమ్ముఁ జేరు నది • గొబ్బున నిక్కము పొమ్మటంచనన్. ౩౨౧

అర్థములు. గతాయువు=కడచిపోయిన యాయుస్సును, పూరణించి=పూర్తి చేసి, ధూర్జటి=శివుఁడు, స్ఫుటతరభక్తి=వంచనలేని పూర్ణమైన భక్తిచే, అనాదరించినన్=అలక్ష్యము చేసినయెడల.

తాత్పర్యము

ఈప్రకారము శివుఁడు తన కత్తినిచ్చి యీ పాపాత్మున కాయువునెక్కువ చేసిన లోకమునకు బాధ యెక్కువచేసినవాఁడ నగుదునేమో అని కాఁగల కార్యమాలోచించి యాయుస్సు నిండించి యిట్లనియె. నీవీ యాయుధమును స్పష్టమైన భక్తితోఁ బ్రతిదినము పూజింపుము. కుటిలబుద్ధివై పూజింపక యలక్ష్యము చేసితివా యిది నాయొద్దకు మరలివచ్చును. ఇది నిజము పొమ్ము. ఈ కారణముచేఁ గాబోలు రావణుఁడు శివపూజచేయ నారంభించుట.

మ. హరుచే నిట్టులు పేరుగాంచి దురిత•స్వాంతుండు స్వచ్ఛందసం
చరణక్రీడ రహించెఁ బుష్పకమునన్ • క్ష్మాభర్తలన్ శౌర్యదు
ర్ధరుల న్నొంచుచు మాఱుకొన్నయెడ సం•గ్రామంబునం ద్రుంచుచున్
శరణన్నన్ విజితాస్మ యన్నఁ గరుణన్ • రక్షించుచున్ గర్వియై. ౩౨౨

అర్థములు. దురితస్వాంతుఁడు=పాపాత్ముఁడు, స్వచ్ఛంద సంచరణక్రీడన్=ఇష్టప్రకారము వేడుకగాఁ దిరుగుటయందు, క్ష్మాభర్తలన్=రాజులను, శౌర్య దుర్ధరులన్=విశేష శౌర్యము గలవారిని, విజితాస్మ=గెలువఁబడితిమి, ఓడిపోయితిమి.

తాత్పర్యము

ఈ ప్రకారము శివునిచే పేరుబొందినవాఁడై పాపాత్ముఁడు తన యిష్టము వచ్చినట్లు పుష్పకముమీఁదసంచరించుచుశౌర్యవంతులనఁబడినరాజులనొప్పించుచు

యుద్ధమందెదిరించిన వారిని జంపుచు నోడిపోయితి మనిన వారిని దయతో రక్షించుచు గర్వించి తిరిగెను.

## ౧౭వ సర్గము

### —• రావణుఁడు వేదవతితో సంభాషించుట •—

చ. ఇటు చరియించుచున్ హిమమ • హీధరచారువనాంతరంబునన్
జటలు మృగాజినంబు నయి • సాధుగతిన్ నిగమైక చోదిత
స్ఫుటశుభసద్వ్రతాఢ్య యగు • సుందరిఁ గన్యక దేవరూపిణిన్
గుటిలుఁడు గాంచి కామవశ • గుం డయి చిక్కఁ-ర యంచు నవ్వుచున్. ౩౪౩

అర్థములు. హిమమహీధర=హిమవత్పర్వతము యొక్కఁ, చారు=మనోహరమైన, వనాంతరంబునన్=వనములోపల, జటలు=జడలు. మృగాజినంబు=జింక చర్మము, అయి=కలదై, నిగమైకచోదిత=వేదమునందు ముఖ్యముగాఁ జెప్పఁబడిన స్ఫుట=ప్రసిద్ధమైన, శుభ=మేలయిన, సద్వ్రత=మంచివ్రతమును, ఆఢ్య=సంపద గలది. దేవరూపిణిన్=దేవతాస్త్రీల సౌందర్యము గలదానిని, కామవశగుండు=మన్మథునకు వశపడినవాఁడు.

### తాత్పర్యము

ఈ ప్రకారము సంచారము సేయుచు హిమవత్పర్వత ప్రాంతమున నున్న మనోహరమైన వనమునందు జడలు కృష్ణాజినము ధరించి వేదోక్తమైన మంచి వ్రతమును సాధుమార్గమున జరుపు దానిని నొక్కఁ సుందరిని కన్యకను దేవతాస్త్రీవంటి దానిని జూచి యనుచితపుబుద్ధిగల రావణుఁడు కామమునకుఁ లోలుపడి చిక్కఁ-రా చక్కఁని చక్కఁరబొమ్మ యని నవ్వుచుఁ జేరఁబోయి.

మ. తరుణీ! యెవ్వతె వీవు? యౌవనవిరు•ద్ధం బైనయీ నిష్ఠలం
బరివర్తింపఁగ నేటికే? యసమ మా•ప్రాయంబు సౌందర్యమున్
బురుషున్ వేఁదుఱుగొల్పఁజాలుఁ, దగవే • పూఁబోణి నీ యట్టి సుం
దరియుం దాపసివోలె మేనిఁ గసుగం•దం జేయ శాతోదరీ! ౩౪౪

అర్థములు. వేఁదుఱు గొల్పఁజాలు=పిచ్చపట్టునట్లు చేయఁజాలు, కసుగందన్=మిక్కిలి వాడిపోవునట్లు, చేయ, శాతోదరీ=పలుచని కడుపుగలదానా.

### తాత్పర్యము

ఓసిపడుచా! నీ వెవ్వతెవు? నీ ప్రాయమునకు విరుద్ధమైన యీ నిష్ఠలం దేల యున్నావు? నీ యసమానమైన వయస్సు సౌందర్యము పురుషుని పిచ్చివానిఁ జేయగలవై యున్నవి ఓసి పలుచని కడుపు గలదానా! పూవువలె మనోజ్ఞమైన దానా! నీ యట్టి చక్కఁదనము గలది తాపసివలె నిష్ఠలచే శరీరమును మిగుల వాడిపోవఁ జేయఁ దగునా!

క. ఎవ్వరిదానవు చెలువా, యెవ్వఁడు నీభర్త? బాల♦మృగలోచన! నిన్
బువ్విలుతుకేళిఁ దేల్చెడి, యవ్వరపురుషుండె సుకృతి♦యంబుజవదనా! ౩౮౫

అర్థములు. పువ్విలుతుకేళిన్=మన్మథక్రీడయందు, సుకృతి=పుణ్యాత్ముఁడు.

తాత్పర్యము

(ఓ వనితా! నీ వెవ్వరిదానవు? నీ పెనిమిటి యెవ్వఁడు? నీతో మన్మథక్రీడయందు సుఖించెడి పురుషశ్రేష్ఠుఁడే పుణ్యాత్ముఁడు.)

క. అడుగుచు నున్నాఁడను నినుఁ, బడఁతీ! నీ విట్లు కష్ట♦పడ నేల వనిన్?
నొడువుము సర్వం బన నా, జడదారి నెలంత యతని♦శాస్త్రహితముగన్. ౩౮౬

అర్థములు. జడదారి నెలంత=తాపసస్త్రీ.

తాత్పర్యము

(ఓ పడఁతీ! నిన్నడుగుచున్నాఁడను. నీ వీ యడవిలో నిట్లు కష్టపడనేల? నాకు సర్వము తెలుపుము. అనఁగా నా తాపసస్త్రీ యతని శాస్త్రోక్తవిధిగా.)

—♦ వేదవతి రావణునకుఁ దన వృత్తాంతముఁ దెలుపుట ♦—

సీ. ఆతిథ్యమునఁ దన్పి ♦ యనియె బ్రహ్మర్షి నా,జనకుండు పేరఁ గు♦శధ్వజుండు
గీష్మతిపుత్రుండు ♦ గీష్పతితుల్యుండు, బుద్ధివైభవమునఁ ♦ బుణ్యమూర్తి
యాతండు దినము వే♦దాభ్యాస మొనరించు, నప్పుడు వాఙ్మయి ♦ నైన నేను
గన్యనై పుట్టిన ♦ కారణంబున వేదవతి యని పేరు నా♦కతఁ డొసంగె
తే. దివిజగంధర్వయక్షాహి ♦ దితిజవరులు
నన్నొసంగఁగ వేఁడిన ♦ నాదుతండ్రి
మూఁడులోకంబు లేలెడు ♦ వాఁడు ఘనుఁడు
విష్ణుఁ డొకఁడె యోగ్యుఁడౌ ♦ పెండ్లికొడుకు. ౩౮౭

అర్థములు. గీష్పతి పుత్రుండు=బృహస్పతి పుత్రుండు, గీష్పతితుల్యుండు=బృహస్పతితో సమానుండు,...వాఙ్మయి=వాఙ్మయి వేదమూర్తి,...భగవంతుని శక్తియగు లక్ష్మీదేవియే పతివ్రతల పాతివ్రత్యముఁ దెలుపుచు రావణుని వధకుఁ దాను నిమిత్తముగాఁ గోరి నిరాకారముగఁ జంపరాదు గావున నార్ద్రాపరాధుఁడయ్యేని చంపింపవచ్చునని తలఁచి యయోనిజగా జనించెను వాక్కు లక్ష్మీదేవి కళావిశేషమే కదా. పెండ్లికొడుకు=అల్లుఁడు.

తాత్పర్యము

అతిథి సత్కారమున సంతుష్టునిఁజేసి యిట్లు చెప్పెను. నా తండ్రి బృహస్పతి కుమారుఁడగు కుశధ్వజుఁ డను బ్రహ్మర్షి, బుద్ధిసంపదయందుఁ దండ్రితో సమా

నుఁడు. మూర్తీభవించిన పుణ్యము. ఆయన ప్రతిదినము వేదాభ్యాసముచేయును. ఒకనాఁడు, వాగ్రూపకమైన నేను నాయన వేదాధ్యయనము చేయునపుడు దా స్వరములనుండి వెలువడితిని, కావున నన్నాయన వేదవతి యను పేరఁ బిలిచెను. దేవ గంధర్వులు యక్షులు నాగులు దేవతాధిపతులు నన్నొసంగ నాతండ్రిని వేఁడిరి కాని నాతండ్రియో మూఁడు లోకములఁ బాలించు విష్ణువొక్కఁడే నా కల్లుఁడు గాఁదగిన వాఁడు, తక్కిన వారు గారు అని వారిని నిరాకరించెను.

వేదాధిష్ఠాత వేదవతికిఁ దగిన మగఁడు కాని తక్కినవా రెట్లగుదురు.

క. అనుచుండు నతని పల్కులు, విని దంభుం డనెడి దనుజ•వీరుఁడు కినుకన్
జనుదెంచి యర్ధరాత్రంబున నిద్రితుఁ దండ్రిఁ జంపి •పోయెన్ ఖలుఁడై. ౩౮౮

తాత్పర్యము

(అనుచున్న నాతని మాటలు విని దంభుఁడనెడి రాక్షసుఁ డర్ధరాత్రమున వచ్చి నిద్రపోవుచున్న తండ్రినిఁ జంపిపోయెను.)

క. జననియు దుఃఖభరంబునఁ, దనభర్తం గౌఁగిలించి • దహనార్చులకున్
దన మే నర్పించెను నా,జనకుని సంకల్ప మేను • సత్య మొనర్పన్. ౩౮౯

అర్థములు. దహనార్చులకున్=అగ్నిశిఖలకు, మేను=దేహము, సంకల్పము=కోరిక.

తాత్పర్యము

నా తల్లి దుఃఖాతిశయమున నగ్నులకుఁ దన దేహ మర్పించి సహగమనము గావించెను. నాతండ్రికోరిక నెఱవేర్పఁ గోరినదాననై.

ఉ. చేయుచు నేఁ బ్రతిజ్ఞ నిటు • చేసెదు దానఁ దపంబు నిష్ఠ, నా
రాయణుఁడే మదీయధవుఁ • డాతఁడుగాక మఱేఁడుఁ గాఁడు, దై
తేయుఁడ! నా చరిత్ర యిది • దెల్పితి నెల్లఁ బులస్త్యపౌత్ర! వి
చ్ఛేయుము నేను శక్తను వి•శిష్టజగచ్చరితం బెఱుంగఁ గన్. ౩౯౦

తాత్పర్యము

నారాయణుఁడప్పఁ నేను మఱొకనిని వివాహమాడనని ప్రతిజ్ఞచేసి యా ప్రకారము తపముచేయుచున్నదానను నా మగఁడు నారాయణుఁడే కాని మఱి యెవ్వఁడుకాఁడు. రాక్షసుఁడా! యిది నా చరిత్రము. నీవు పులస్త్యుని మనుమఁడవు కావున గౌరవించి యాతిథ్యమిచ్చి మాటలాడితిని. నే నెవ్వఁడవో నీ కెట్లు తెలిసె నందువా సమస్తలోకముల జరుగు విషయమంతయు నే నెఱుఁగుదును. ఇఁకఁ బొమ్ము. రెండవ పాదంబున నుభయయతి.

తే. అనుచు నమ్మహావ్రత తన్ను • నాడు చుండఁ
బుష్పకము డిగ్గి మరుముల్కి • పోటుకతన
రావణుఁడు ఋషికన్యఁ జే • రంగఁ బోయి
యిట్టు లనియెను దనమది • నెఱుకపడఁగ. ౩౫౧

అర్థములు. మరుముల్కి-పోటుకతన=మన్మథుని బాణము దెబ్బచేత.

తాత్పర్యము

(ఆమహావ్రత తనతో ననుచుండఁగా రావణుఁడు మన్మథుని బాణము దెబ్బచేతఁ, బుష్పకముదిగి యా ఋషికన్య సమీపమునకుఁ బోయి తన యభిప్రాయము తెలియునటుల నిట్లనెను.)

## —* రావణుఁడు వేదవతిని దురుక్తులాడుట *—

ఉ. సుందరి యెంత గర్వితవె • స్రుక్కఁగఁ జేసెదు కాయమున్, మహా-
మందతపంబులన్ నవసి • మానని నిష్ఠల సద్వ్రతంబులన్
వందుర నౌనె జవ్వనులు • బాలికలున్ ముదుసళ్ళఁ గాక? నీ
యందముచంద మెంచ కిటు • లాడఁగఁ జెల్లునె పల్లవాధరా! ౩౫౨

అర్థములు. గర్వితవె=మదించినదానవే, మహా+అమంద తపంబులన్=గొప్పవై తీవ్రమైన తపస్సుచే, నవసి=శుష్కించి, వందురన్=దుఃఖపడఁగ, ఔనె=తగునా, జవ్వనులు=యౌవనవతులు, పల్లవాధరా=చిగురువంటి పెదవిగలదానా!

తాత్పర్యము

సుందరీ! నీవు దేహమును శుష్కింపఁజేయుచున్నావు. ఎంత మదము పట్టిన దానవే నీవు. దేహమనిన లక్ష్యము లేదు. ముసలివారు తపములని నిష్ఠలచేఁగృశింప వచ్చునుగాని పిల్లలు వయస్సు వచ్చిన స్త్రీలు వ్రతములచే దుఃఖింప వచ్చునా? నీ సౌందర్య మెటువంటిదో యాలోచింపక నీవిట్లు పలుకఁదగునా?

క. నీవు జగత్సుందరివై, కేవలముం బిఱికి వయి మృ•గీనయన! సుఖా-
భావంబున వర్తించెదు, యౌవన ముడి వోవ సౌఖ్య • మావలఁ గలదే! ౩౫౩

అర్థములు. మృగీనయన=ఆఁడుజింక కన్నులవంటి కన్నులు గలదానా, సుఖాభావంబునన్=సౌఖ్యము లేక, ఉడివోవన్=ఉడిగిపోఁగా.

తాత్పర్యము

(ఓ మృగాక్షీ! నీవు లోకమున మిగులఁ జక్కఁదనము గలిగిన దానవై కేవలము పిఱికిదాన వగుటచే సుఖము లేక యున్నావు. యౌవన ముడిగిపోయిన పిమ్మట సుఖము గలదా?)

ఉ. పోయెడి నీకు యౌవనము • పొల్తుక ! యెన్నఁడె యింక హాయిగాఁ
గాయజు కేళిఁ దేలుదు సు • ఖంపడె దీ! వటుగాన నేను లం
కాయతరాజ్యనాథుఁడ మ • హాబలవంతుఁడఁ బంక్తికంధరా
ఖ్యాయుతుఁడన్ మదాత్మసతి • వై సుఖయింపుము భోగభాగ్యముల్. ౩౫౪

అర్థములు. కాయజుకేళిన్=మన్మథక్రీడయందు.

తా త్ప ర్య ము

ఓసీ చిన్నదానా! నీకు యౌవనము పోవుచున్నది. ఇంక నెప్పుడు, నీవు రతి కేళుల సుఖపడు టెప్పుడే? కావున నేను లంకారాజ్యాధిపతిని. మిగులబలవంతుఁడను. దశకంఠుఁడను పేరుగలవాఁడను, కావున నాభార్యవై భోగభాగ్యముల సుఖింపుము.

ఉ. ఎవ్వని నీవు విష్ణుఁ డని • యెన్నెదువాఁ డెవఁడైన నేమి ? యౌ
జవ్వని భోగదర్పబల • శౌర్యతపోవిభవంబులందు నా
కెవ్వఁడు నీడు లేఁడు నిజ • మియ్యది, నన్ను వరింపు మన్న నా
క్రొవ్వరిభాషణంబులకుఁ • క్రొవ్విరిఁబోఁణి వచించె నీగతిన్. ౩౫౫

అర్థములు. జవ్వని=ప్రాయవతి, క్రొవ్వరి=పొగరుబోతు, క్రొవ్విరిఁబోఁణి= క్రొత్తపువ్వువలె మనోజ్ఞురాలు.

తా త్ప ర్య ము

ఎవని నీవు విష్ణుఁ డనియెదు? వాఁ డెవఁడైన నేమి? కాని భోగమునందు గర్వమునందు బలమునందు శౌర్యమునందు తపస్సంపదయందు నాకు సమానుఁడు లేఁడు. ఇది నిజము కావున నన్ను వరింపుము. అనఁగా నా పొగరుబోతువాక్యములకు నామె యిట్లనియె.

ఆ. అట్టు లనకు మోరి • హరిని నారాయణు, సర్వలోకవంద్యు • సర్వలోక
రమణు విష్ణుదేవు • రాక్షసుండా! నీవు గాక సూరి యెవఁడు • కఱకు లాడు.

అర్థములు. సూరి=జ్ఞానము గలవాఁడు,

తా త్ప ర్య ము

(ఓరీ రాక్షసుఁడా! నీ వట్టులనకుము. సకలలోకారాధ్యుఁడు సర్వలోకరమణుఁడు, హరి నారాయణుఁడు ఆ మహాత్ముని నీవుగాక జ్ఞానముగలవాఁ డెవఁడు కఠినముగా బలుకును?)

క. అని తొలఁగు వేదవతినిన్, దనుజాధముఁ డొడిసి తిగిచెఁ • దలవెంట్రుకలన్
వనితయు నంతకుఁ గురులం, దన కేలన కత్తిఁబోలెఁ•దటుకున నఱకెన్. ౩౫౬

### తాత్పర్యము

అని చెప్పి తొలఁగిపోవుచున్న వేదవతిని నీచరాక్షసుఁడు ఆమె తలవెండ్రు కలను బట్టి లాగెను. ఆమెయు వాఁడు పట్టుకొన్నంత వఱకు వెండ్రుకలను తన చేతితో కత్తితో నఱికినట్లు టకాలున నఱికెను.

### —♦ వేదవతి రావణు శపించి యగ్నిలోఁ జొచ్చుట ♦—

చ. తెగ నిటు ద్రెంచి రోసమున ♦ దీప్తహుతాశనువట్లు మండుచున్
మగువ నిశాటు దృక్తతుల ♦ మాడ్చెదునట్లయి మేను పాయఁగా
దెగి యసురేంద్రుతో ననియె ♦ దేవవిరోధి! భవత్ప్రధర్షితం
బగు తను వింక నిల్పను, హు ♦ తాశనుఁ జొచ్చెద నీవ చూడఁగన్. ౩౫౦

అర్థములు. దీప్తహుతాశనువట్లు=మండుచున్న యగ్నివలె, నిశాటున్=రాక్షసుని, దృక్తతులన్=చూపుల సమూహముచే, తెగి=సాహసించి, భవత్+ప్రధర్షితంబు=నీచే నవమానింపఁ బడిన, తనువు=దేహము, హుతాశనున్=అగ్నిహోత్రుని

### తాత్పర్యము

ఈప్రకారము వెండ్రుకలు తెగనఱికి కోపముచే మండు నగ్నివలెమండుచు నామె రాక్షసుని జూపులచేతనే మాడ్చుదానివలెనై దేహము వదలిపెట్ట దలఁచి రావణునితో నిట్లనెను. ఓరీ! దేవవిరోధీ! నీ నవమానించిన యీ దేహమును నిఁక ధరింపఁ జాలను. నీవు చూచుచుండఁగనే యగ్నిప్రవేశము గావించెదను.

శా. పాపీ! నేను వనంబులోఁ దపసినై ♦ వర్తింప నన్నేఁపఁగా
నీపట్లిం జనుదెంచితే? యబలనై ♦ యే నుంట నిన్ బూరుషున్
వ్యాపాదింపఁగ రాదు, నాతపము శా ♦ పం బీయ నాశిల్లుటన్
నీపీఁచం బడఁగింప, వెండియును జ ♦ న్మింతుం జుమీ రావణా! ౩౫౧

అర్థములు. వ్యాపాదింపఁగరాదు=చంపరాదు. పురుషులు స్త్రీలను జంపరాదు, స్త్రీలు పురుషులను జంపరాదు. దీని కపవాదములు గలవు. విష్ణువు భృగుపత్నిని రామచంద్రమూర్తి తాటకను, దమయంతి యెఱుకలవానిని జంపిరి. నీపీఁచంబు=నీ గర్వము.

### తాత్పర్యము

ఓరీ పాపాత్ముఁడా! నే నడవిలో దపసినై యుండఁగా నన్ను బాధించుటకు నీవు వచ్చితివా? నేనాఁడుదానను గావున నిన్నుఁ జంపఁరాదు. నిన్ను శాపంబిచ్చితినేని నా తపస్సు క్షయించును. అదియుఁ జేయను, అయిన నీవు చేయఁగల దేమందువా, నీ గర్వమణఁచుటకు నేను మరల జన్మింతును.

ఉ. హోమము దానముం జలిపి • యుండితి నేనియుఁ గొంచెమైన ధ
ర్మామితరక్తు నాత్మభవ • నౌచు నయోనిజ నౌచు సాధ్వినై
నే మెయిఁ గొందుఁ జూడు మని • నిర్మలశీలిని చొచ్చె నగ్నులం
దామరసంచయంబు గురి • యన్ సుమవృష్టిఁ దథాస్తటంచునన్. ౩౦

అర్థములు. ధర్మామితరక్తు=ధర్మమందు నమిత మగు ప్రేమగల వాని యొక్క, ఆత్మభవ=కూఁతురు, అయోనిజను=మనుష్యస్త్రీ గర్భమునుండి పుట్టని దానను, సాధ్వినై=పతివ్రతనై, మెయిఁగొందున్=దేహముధరింతును,తథాస్తు= అట్టులే యగును.

తాత్పర్యము

నేను గొంచెమైనను హోమము దానము చేసియుంటినా ధర్మమునం దమితమైన యాసక్తి గలవాని కూఁతురనై యయోనిజనై పతివ్రతనై మరల దేహము ధరింతును జూడుము అని యగ్నులందుఁ బ్రవేశించెను. దేవతలు ఆమె చెప్పినట్లు జరుగునుగాక యని చెప్పుచు పూలవాన గురియించిరి. చెడుతనము పూర్వపుణ్య వశమున తత్కాలమునకు మేలుగాఁ దోఁచినను కాలాంతరమున సమూలనాశము చేయక తప్పదు. ఇప్పటికిఁ బార్వతీ శాపము, నందీశ్వర శాపము, వేదవతీ శాపము మూఁడు శాపములైనవి. స్త్రీనిమిత్తముగా నీవు నాశ మయ్యెదవని పార్వతి శపించెను. ఆ స్త్రీ నేనే యయ్యెదనని వేదవతి చెప్పెను. కావలసిన వానర సేనకు నందీశ్వరుఁడు తోడుపడెను. ఈ విధముగ రావణవినాశమునకు బీజారోపణ మయ్యెను.

ఆ. అల్ల వేదవతియె • యధిప వైదేహుని, తనయ యగుచుఁ బుట్టి•ధరణియందు
నిఖిలనాథు విష్ణు•నిను సనాతనమూర్తి, విభునిఁ గాఁగఁ బొందె • నెలఁతమిన్న.

తాత్పర్యము

ఆ వేదవతియే రామచంద్రా! జనకమహారాజు కూఁతురై భూమియందుఁ బుట్టి సర్వలోకనాథు విష్ణు నిన్ను సనాతనమూర్తిని వివాహమాడెను.

ఉ. ఏమె రుషాతిరేకమున • నీల్గెను బూర్వ మెవండు నిర్జర
స్తోమవిరోధి యాతఁడె, వ•సుంధరఁ బుట్టి యమానుషోగ్రతే
జోమహితుండ వౌచు నల • సుందరికై హతినైన నీదు దు
ర్ధామశరాగ్నికీలలఁ బ • తంగమువల్ల నశించె నివ్వెడన్. ౩౧

అర్థములు. రుషాతిరేకమున=కోపాతిశయమువలన, నిర్జరస్తోమవిరోధి= దేవతాసమూహములకు శత్రువు,వసుంధరన్=భూమియందు,అమానుష=మనుష్యులందు లేని, ఉగ్ర=భయంకరమైన, తేజోమహితుండవు=తేజస్సుచే గొప్పవాఁడవు, అల సుందరికై=ఆ యందగత్తెకై, దుర్ధామశరాగ్నికీలలన్=అణఁపరాని బాణములను నగ్నిజ్వాలలందు, పతంగము=మిడుత.

తాత్పర్యము

రామచంద్రా! యేమె కోపాతిశయమున నెవఁడు పూర్వముచచ్చెనో యా రాక్షసుఁడే, భూమియందుఁబుట్టి యమానుషమైనభయంకర తేజస్సుగలిగి యామెకే భర్తవైన నీ బాణాగ్ని జ్వాలలందు మిడుతయై యిప్పుడు నశించెను.

సీతాదేవి కోపముచేతనే లంకయు రావణుఁడు శవప్రాయమయ్యె ననియు రామచంద్రమూర్తి నిమిత్తమాత్ర మనియుఁ జెప్పిన హనుమంతుని వాక్యములు దీనిచే దృఢపడుచున్నవి.

తే. ఈమహాభాగ జనియించె నిట్లు మర్త్యభువనమునయందుఁ బొలమునఁ బూజ్యభంగి
వేదియం దగ్నిశిఖవోలె విశ్వవినుతి రమ్యగుణభద్ర. పట్టాభి రామభద్ర! ౩౬౩

అర్థములు. మహాభాగ=గొప్ప భాగ్యము కలది, లక్ష్మీదేవి=మర్త్యభువనమునయందు=మనుష్యలోకమందు, పొలమున=నాగుభూమియందు, వేదియందు=యజ్ఞమండలి వేదియందు.

తాత్పర్యము

ఆ భాగ్యవతియే రామచంద్రమూర్తీ! యీవిధముగ సీత యను పేర మనుష్య లోకమందు భూమియందుఁ బవిత్రమైనరీతిగా వేదియందు నగ్నివలెఁ దన ప్రతిజ్ఞ చొప్పున జనించెను.

తే. వేదవతి యనఁ గృతయుగ వేళఁ బుట్టి, త్రేతయందు వధింపఁగ దితిజనాథు
సంభవించెను జనకవంశంబునందు, సీతయం దుదయించుట సీతయయ్యె. ౩౬౪

అర్థములు. సీతయందు=నాఁగేటి చాలునందు.

తాత్పర్యము

కృతయుగమందు వేదవతిగా జనించిన యామె త్రేతయందు రావణునిజంప జనకవంశంబున జనించెను. నాఁగేటిచాలునందుఁ బుట్టుటచే సీతయని పేరుగాంచెను. దీనివలన రామావతారము త్రేతాయుగాంతమందు కావున కృతాంతమందునుండి త్రేతాంతమువఱకు రావణుఁ డుండెనని యేర్పడుచున్నది.

సీతాదేవి జననము వైశాఖ శుక్ల నవమియందని మహాసుందరీ తంత్ర మందుఁ జెప్పఁబడినది.

"వైశాఖే శుక్ల నవమ్యా ముత్పన్నా పావనీసుతా
సీతాముఖా త్సా సంజాతా పాలితా జనకేనచ
రామపత్నీ మహాభాగా సీతానామేతి విశ్రుతా
తస్మిన్ దినే రామభక్తాః శ్రద్ధాభక్తి సమన్వితాః
మహోత్సవపరాః సర్వే విత్తశాఠ్యా ద్వివర్జితాః

గీతవాదిత్ర నృత్యాద్యై రామభక్తిపరాయణాః
వైశాఖసితనవమ్యాం పురాణపఠనం తథా
లక్ష్మీసూక్తం పఠన్ స్త్రత యాతి రామం సనాతనమ్
సౌభాగ్యం ధనధాన్యంచ పుత్రసంతతి విస్తృతామ్.
రామప్రసాదా ల్లభతే ముచ్యతే సర్వపాతకాన్".

ఈ చరిత్రము వలన లక్ష్మీదేవియే సీత యని రామచంద్రమూర్తి నారాయణుఁ డనియు రావణ వధయందు సీతాదేవియే (లక్ష్మియే) ముఖ్య కారణ భూతురాలనియు నేర్పడుచున్నది.

౧౮వ సర్గము

## —* రావణుఁడు మరుత్తు యజ్ఞశాలకుఁ బోవుట *—

సీ. వహ్నులలో వేద•వతి చొచ్చుటను గాంచి, పుష్పకం బెక్కి యా•పుణ్యజనుఁడు
ధరణిఁ జరించుచో • దైవతాన్వితుఁడై, క్రతువు మరుత్తను • క్ష్మాధవుండు
సలుప నుశీరబీ • జంబునఁ గని యందు, జనవర! బలుని దు • స్సాధుఁ గాంచి
దేవతలందఱుఁ•దిర్యక్స్వరూపమున్, గొని రందుఁ బాకశా•సనుఁడు నెమలి
ఆ. యయ్యె, యముఁడు కాక • మయ్యెఁ, గుబేరుఁడు
తొండయయ్యె, జలధి • భుండు హంస
మయ్యెఁ, దక్కువార • లన్యరూపంబుల మఱుఁగుపడిరి నిలువ•వెఱచియచట.

అర్థములు. పుణ్యజనుఁడు=రాక్షసుడు, పుణ్యమెట్టిదో యెఱుఁగని జనుఁడు పుణ్యజనుఁడు, విపరీతలక్షణచేత నీ యర్థము. దైవతాన్వితుఁడై = దేవతలతోఁ గూడినవాఁడై, దుస్సాధున్=సాధింపరాని వానిని, తిర్యక్ స్వరూపముల్=పశు పక్షి స్వరూపములు.

తాత్పర్యము

అగ్నిహోత్రమందు వేదవతి ప్రవేశించుట చూచి గా రాక్షసుఁడు పుష్పక మెక్కి భూమియందుఁ దిరుగుచు మరుత్తను రాజు ఉశీరబీజమునందు యజ్ఞము చేయుచుండఁ జూచెను. అప్పు డందున్న దేవతలు జయింపరాని రావణునిఁ జూచి తిర్యక్స్వరూపములు ధరించి కానరాకుండిరి. అం దింద్రుఁడు నెమలి యయ్యెను, యముడు కాకియయ్యెను. కుబేరుఁడు తొండయయ్యెను. వరుణుండు హంస యయ్యెను. తక్కిన దేవతలు అచ్చటనుండి వెఱచి వేఱువేఱు స్వరూపములు ధరించి మఱుఁగు పడిరి.

ఉ. జన్నపువాడ జాగిలము • చందమువన్ సురవైరి చొచ్చి యం
దున్న మరుత్తుఁ గాంచి నృప • యుద్ధము సేయఁగ రమ్ము శక్తి లే
కున్న 'జితోస్మి' యం చనుమ • యూరక పోదు నటన్న దైత్యభ
ర్తన్నరభర్త యెవ్వఁడవు•రా యిటు లాడెడి నీ వటం చనన్. ౩౬

అర్థములు. జన్నపువాడన్=యజ్ఞశాలను, జాగిలము=కుక్క, జితోస్మి=జయింపబడితిని.

తాత్పర్యము

యజ్ఞశాలయందుఁ గుక్క ప్రవేశించినట్లు ప్రవేశించి రావణుఁ డాశాలయందున్న మరుత్తును జూచి రాజా! యుద్ధము చేయరమ్ము. లేకున్న నోడితినను ము. ఊరకపోదును అనిన వానిని జూచి ఓరీ! యిటు మాటలాడెడి వాఁడవు నీ వెవ్వఁడవు అని యడుగఁగా.

క. పకపక నగి యసురుఁడు నీ, యకుతూహల భావమునకు • హర్షించితిఁ ద్ర్యం
బకసఖు ననుజాతుని భృశ,వికటబలున్ నన్నెఱుఁగ • వే రావణునిన్. ౩౬౭

అర్థములు. అకుతూహల భావమునకున్=నన్నుఁజూచియు విస్మయముగాని, భయముగాని, ఆదరముగాని లేని తనమునకు, త్ర్యంబకసఖు ననుజాతుని=ఈశ్వరు స్నేహితుఁడగు కుబేరుని తమ్ముని, భృశవికటబలున్ = మిక్కిలి భయంకరమైన బలము గలవానిని.

తాత్పర్యము

రావణాసురుఁ డా మాట విని పకపకనగి రాజా! నన్నుఁజూచి భయముగాని లక్ష్యముగాని యాదరముగాని లేని నిన్నుఁ జూచి సంతోషించితిని. కుబేరుతమ్ముని భయంకర బలుని రావణుని నన్నెఱుఁగవా నీవు.

క. అన్నను గెలిచి రణంబున, నిన్నిరుపమ పుష్పకము గ్ర • హించిన వీరున్
నన్నెఱుంగనివాఁడును, మన్నీఁడా నీవు గాక • మఱియొకఁ డున్నే. ౩౬౮

తాత్పర్యము

అన్నయగు కుబేరుని గెలిచి యసమానమైన యాపుష్పకమును గ్రహించిన వీరుని నన్నెఱుంగనివాఁడు రాజా! నీవు గాక మఱియొకఁడు గలఁడా?

క. నావుడు మరుత్తుఁడనియెన్, నీవే ధన్యుఁడవు జ్యేష్ఠు • నిర్జించితనిన్
నీవంటి శ్లాఘ్యపురుషుఁడు, క్ష్మావలయమునందు లేఁడు • మాంసాదనుఁడా. ౩౬౯

అర్థములు. మాంసాదనుఁడా=మాంసభక్షకుఁడా.

తాత్పర్యము

(అని పలుకఁగా, మరుత్తుఁడు 'ఓరీ! మాంసభక్షకుఁడా! నీ పెద్దవాఁడగు నన్నను యుద్ధములో గెలిచితివి. నీవే ధన్యుఁడవురా! నీవంటి శ్లాఘ్యమైన వర్తనముగల మానవుఁడు భూమండలమున లేఁడురా!)'

క లోకంబు మెచ్చు కార్యముఁ, బ్రాకటగతిఁ జేసి చెప్పు • వాఁ డుండు ధరన్
లోకవిరుద్ధాధర్మము, నీకరణిం జేసి చెప్పు • నెఱసరి నెఱుఁగన్. ౩౭౦

అర్థములు. లోకవిరుద్ధాధర్మము=ప్రజలకు శాస్త్రమునకు విరుద్ధమగు నధర్మము, సెలసరిన్=కోరుని.

తా త్ప ర్య ము

లోకము మెచ్చునట్టి సత్కార్యముచేసి ప్రతిష్ఠకై చెప్పుకొనువాడున్నాడు గాని ప్రజల నీతికి శాస్త్రనియమమునకు విరుద్ధమైన కార్యముచేసి యది యొక గొప్పగాఁ జెప్పు కోరుని నే నింతవఱ కెఱుఁగను.

క. కేవలధర్మవ్రతమున, నీవు వరంబులను గొంట • నే వింటిని మున్
నీవే యిప్పుడు చెప్పిన, యా వృత్తాంతంబు వినిన • యది లే దసురా. ౩౭౧

తా త్ప ర్య ము

నీవు కేవల ధర్మమార్గమందే యుండి బ్రహ్మచే వరములను గ్రహించుట వింటినిగాని నీవిప్పుడు చెప్పిన కార్యము చేయుట రాక్షసుఁడా! నేనువినిన వాఁడఁగాను.

చ. నిలు నిలు దుర్మతీ! యిపుడు • నిష్ఠురఘోరకఠోరమార్గణా
వళి నినుఁ గాలు వీటికిని • బంపెద నంచు శరాసనంబు న
మ్ములుఁ గొని క్రుద్ధుఁడై చనఁగఁ • బూనఁగ నడ్డము వచ్చినిల్చి య
బ్బలియునిఁ జూచి దేవగురు•భ్రాతయు యాజకుఁడున్ మహాత్ముఁడున్. ౩౭౨

అర్థములు. దుర్మతీ=దుర్బుద్ధీ, నిష్ఠుర=పరుషములైనవి, ఘోర=భయంకరము లైనవియు, కఠోర=కఠినములైనవియు నగు, మార్గణావళిన్=బాణసమూహములచే, దేవగురుభ్రాత = బృహస్పతి తమ్ముఁడు, యాజకుఁడు = యజ్ఞము చేయించువాఁడు, మహాత్ముఁడున్=గొప్పమనస్సు గలవాఁడు.

తా త్ప ర్య ము

('ఓరి దుర్బుద్ధీ! నిలు నిలు- ఇప్పుడే కఱకులయి భయంకరములయి కఠినము లయిన బాణసమూహముచే నిన్ను యముని పట్టణమునకుఁ బంపెద' ననుచు విల్లు నమ్ములు గొని, కోపముతోఁ బోబోవఁగా నడ్డమువచ్చి బృహస్పతి తమ్ముఁడు, యాగము చేయించు నతఁడు మహాత్ముఁడు.)

—• సంవర్తుఁడు మరుత్తుని శాంతుఁ జేయుట •—

తే. ఆఖ్య సంవర్తుఁ డనెడి బ్ర•హ్మర్షి వరుఁడు, స్నేహసంయుక్తముగ నిట్లు• చెప్పె రాజ
వినఁదగునయేని నానుడి • వినుము సంగ,రంబు సేయుట నీకు యో•గ్యంబుగాదు.

అర్థములు. ఆఖ్య=పేరుచే.

తాత్పర్యము

సంవర్తుఁడను పేరుగల బ్రహ్మర్షి శ్రేష్ఠుఁడు స్నేహభావముతో నిట్లు చెప్పెను. రాజా! నామాట నీకు వినఁదగినదాయెనా వినుము. అది యేమంటివా? యుద్ధము సేయుట నీకుఁ దగినపని గాదు.

తే. ఇదియు మాహేశ్వరం బయి ♦ యెసఁగు సత్ర
మంతరాయంబు కొంచెమేన్ ♦ బ్రాప్తమైనఁ
గర్తృవంశంబు దహియించుఁ ♦ గావ తేఁడ!
యింత యోచించి యని సేయ ♦ నర్తికొనుము. ౩౮౪

తాత్పర్యము

ఇది మహేశ్వర సంబంధమైన యాగము. దీనిలోఁ గొంచెము విఘ్నము కలిగినను యజ్ఞకర్త వంశమును గాల్చివేయును కాఁబట్టి రాజా! యిదియాలోచించి తరువాత యుద్ధముసేయఁ బ్రయత్నింపుము. వంశనాశమైపోవుట శ్రేష్ఠమో, యుద్ధముసేయుట శ్రేష్ఠమో యాలోచింపుము.

తే. దీక్షితుండెడ? యుద్ధంబు♦తెరువదెడ, దీక్ష యొచ్చట? నిట్టిక్రో♦ధిత్వమెచట?
రాక్షసుఁడు దుర్జయుండు దు♦రంబులోన,నీవ గెలిచెద వను టేమి♦నిశ్చయంబు

తాత్పర్యము

క్రోధము మాని యజ్ఞదీక్ష వహించినవాఁ డెక్కడ? క్రోధము వహించియే చేయవలసిన యుద్ధ మెక్కడ? దీక్ష యేయూరు? క్రోధ మేయూరు? పరస్పర యుద్ధములైన రెంటికి సంబంధము గలదా? యుద్ధమే చేసితివనుకో రాక్షసుఁడు జయింపరానివాఁడు, నీవే జయింతువని యేమి నమ్మకము? యుద్ధమందు నీవు చచ్చితివేని యజ్ఞము గతియేమి? యజ్ఞము సగములో విడిచి చచ్చిన నీగతియేమి?
తే. అనిన గురువాక్యమాలించి♦యవనివిభుఁడు,చాపబాణాళివిడనాడి♦స్వస్థుఁడగుచు
మఖము సంపూర్తి చేయంగ♦మరలెనని యెు,దానిఁగనుఁగొని శుకుఁడను దానవుండు.

తాత్పర్యము

(అనిచెప్పిన గురువు మాటలను విని, ధనుస్సు బాణములను వదలి శాంతుఁడయి మరుత్తు యజ్ఞము పూర్తిచేయుటకు తిరిగిపోయెను. దానిని జూచి శుకుఁడను రాక్షసుఁడు.)

తే. గెలిచె రావణుఁ డనుచును ♦ బలములోనఁ
జాటఁగాఁ గంచె నసురుఁ డ ♦ చ్చోటనున్న
సర్వరాగతఋషులను ♦ హతులఁ జేసి
నెత్తురులు ద్రావి యాపోక ♦ హత్తనరిగె. ౩౮౭

అర్థములు. అధ్వరాగతః=యజ్ఞము నిమిత్తమై వచ్చిన, హతులఁ జేసి=చంపి, అపోశహత్తన్=తృప్తికలుగఁగా.

తాత్పర్యము

(రావణుఁడు గెలిచినాఁడని సేనలోఁ జాటుటకుఁ బంపెను. రావణుఁడచ్చట నున్న యాగమునకు వచ్చిన మునులను జంపి వారి నెత్తురులను ద్రాగి తృప్తిఁజెంది పోయెను.)

## —• ఇంద్రాదులు మయూరాదులకు వరములిచ్చుట •—

క. దనుజాధినేత యరిగినఁ, దన తన రూపంబుఁ దాల్చి • దైవతనాథుల్
పెనుముదమునఁ దత్సత్త్వము,లను గని యిట్లనిరి ప్రీతి•లక్షణ మమరన్. ౩౭౮

అర్థములు. దనుజాధినేత = రాక్షసరాజు, తత్సత్త్వములను=ఆ యా జంతువులను.

తాత్పర్యము

రాక్షసరాజు వెడలిపోఁగా దేవతలు తన తన స్వస్వరూపములు ధరించి మిగుల సంతోషించి తామే మృగముల యాకారములు దాల్చిరో యా యా మృగములకు సంతోషముతో నిట్లు వరము లిచ్చిరి.

సీ. నల్లపింఛెముల నె•మిళ్ళను గనుఁగొని, హరిహయుఁ డిట్లని • వరము లిచ్చె
లేదు మీ కింమీఁద • లేలిహానభయంబు, వేయికన్నులపురి • వెలయుఁగాక
నేను వర్షించుచో • నెమ్మి మీ కబ్బుత, మని యన్న నవి యేగ•హర్షమునను
ప్రాగ్వంశమున నున్న•వాయసంబులఁ గని, ప్రాణులకును రోగబాధ లిడుదు
ఆ. నేన కాన మీకు • నేరోగ భయమును, లేదు మృత్యుభయము•లేదు మీకు
జనము లెంతదాఁకఁ • జంపరో మిమ్మంత,దాఁకఁ బ్రాణయుక్తి•దనరు మీకు.

అర్థములు. లేలిహానభయంబు=పాములవలని భయము, నెమ్మి=సంతోషము, ప్రాగ్వంశమున=హవిర్గృహమునకు ముందున్న సభాగృహమందు, వాయసంబులన్=కాకులను, ఇంతకు ముందు నెమలి పింఛెములు నల్లగా, గన్నులు లేనివై యుండెను.

తాత్పర్యము

నల్లపింఛములుగల నెమిళ్ళను జూచి యింద్రుఁ డిట్లు వరము లిచ్చెను. ఇక మీఁదమీకు సర్పభయము లేదు. నాకు వేయికన్నులున్నట్లు మీకు వేయికన్నులు గల పింఛెములు గలుగును. నేను వాన గురియునపుడు మీకు సంతోష మతిశయించును అని చెప్పఁగా నవి సంతోషముతోఁ బోయెను. ఆవల యముఁడు ప్రాగ్వంశముననున్న కాకులను జూచి జీవజంతువులకు రోగములు కలిగించువాఁడను

నేనే. కావునమీకు రోగభయము లేకుండ వరమిచ్చితిని. అదియునుగాక పుట్టిన జీవి యెప్పటికైనఁ జావవలయును కావున మి మ్మెంతవఱకు మనుష్యులు చంపరో యంతవఱను మీకు మృత్యుభయము లేదు. ఎంతకాలమైన బ్రతికి యుందురు. కావుననే కాకులు పదివేలేఁడులు బ్రదుకునని చెప్పుదురు.

క. నాలోకంబున దుర్వ్యథఁ, పాలగునారింద మీరు ♦ భక్షించినఁ జొ
ట్టాలును దారును దృప్తిం, జాలఁగఁ గనువా రటంచు♦సమవర్తియనన్. ౩౦

అర్థములు. దుర్వ్యథ=చెడ్డబాధకు, సమవర్తి=యముఁడు, రాజని, పేద వాఁడని, ధనికుఁడని, యల్పుఁడని యిట్టి భేదము లేక యెవ రెవరి కర్మానుసార ముగ వారికి వారికిఁ దగిన సుఖము దుఃఖము గలిగించు వాఁడు కావున సమవర్తి.

తాత్పర్యము

నాలోకమున నరకబాధ లనుభవించువారు వారి బంధువు లిచ్చిన దానిని మీరింక భక్షించితిరేని వారు తృప్తిగలుగు వారగుదురు అనియముఁడు చెప్పెను.

ఉ. అప్పతి హంసలం గని సు♦ధాంశుసమంబును ఫేనతుల్యమై
యొప్పు మనోహరాకృతి జ♦వోగ్రతయున్ లభియించు నెండి మీ
రప్పుల నాడి నుప్పతిలు ♦ హారివిభాతిశయం బటన్నమై
కప్పు దొలంగి హంసములు ♦ గ్రాలె మనోజ్ఞవళక్షకాంతులన్. ౩౧

అర్థములు. అప్పతి=వరుణుండు, సుధాంశు సమంబును=చంద్రునితో సమానమును. ఫేనతుల్యము=నురుఁగుతో సమము. మనోహరాకృతి=అందమైన యాకారము, జవోగ్రత=అధిక వేగము, అప్పులన్=నీళ్ళయందు, ఆడన్=స్నానము సేయఁగా, ఉప్పతిలున్=కలుగును, హారివిభాతిశయంబు=అధికమైన మనోహర కాంతి, కప్పు=నలుపు, వళక్ష=తెల్లని.

తాత్పర్యము

వరుణుఁడు హంసల కీలాగు వరము లిచ్చెను. ఇఁక మీరు చంద్రునివలె మనోహరమై నురుగువలెఁ గోమలమైన యాకారములు గలవి కండు. మీకు మిగుల వేగముగఁబోవు శక్తి గలుగును. మీరు నీళ్ళలోఁ గ్రీడించితిరా, యెక్కువ కాంతి కలుగును అని చెప్పఁగా హంసలు మునుపటి నల్లని కాంతిపోయినవై తెల్లని కాంతిగలవయ్యెను,

క. రామా! హంసంబులు మును, శ్యామలములు వాని టెక్క♦యంచులు నలుపై
కోమలమై యుండు జల,స్వామివరము పేర్మి శుభ్ర♦వర్ణములయ్యెన్. ౩౨

తాత్పర్యము

రామచంద్రా! పూర్వము హంసలు నలుపువన్నె గలవి. వాని టెక్కల కొనలు నలుపులే, వరుణుని వరముచే తెలుపు లయ్యెను.

క. కృకలాసమ్ములకును గు, హ్యకనాథుఁడు వీఁపు శిరము ♦ హాటకరుచి నై
చకచక మనుచుండు నటుల, నకలంకమనీష నిచ్చి ♦ యలరఁగ నంతన్. ౩౮౩

అర్థములు. కృకలాసమ్ములకును=తొండలకు, గుహ్యకనాథుఁడు=కుబేరుఁడు హాటక రుచి=బంగారుకాంతి, అకలంకమనీష=నిర్మలబుద్ధితో, అలరఁగన్=సంతోషింపఁగా.

తాత్పర్యము

కుబేరుఁడు తొండలను వీఁపులు బంగారుకాంతితోఁ దళతళలాడు చుండు నని వర మిచ్చి సంతోషించెను.

క. నరపతి యజ్ఞముఁ దీరిన సురనాథులు తృప్తిఁ జెంది ♦ శుభమస్తు లగుచున్
ధరణీశ్వరుతో స్వర్గం, బరిగిరి రావణుఁడు సంగ ♦ రాకాంక్ష ధరన్. ౩౮౪

తాత్పర్యము

(రాజు యజ్ఞము సమాప్తమైనంతట దేవతలు తృప్తిపడి నరపతితో స్వర్గమునకుఁ బోయిరి. రావణుఁడు యుద్ధమందలి కోరికచే భూమియందు.)

౧౯వ సర్గము

—* అనరణ్యుఁడు రావణుతో యుద్ధం బొనర్చుట *—

సీ. క్రమ్మఱి రాజుల ♦ ఘోరవిక్రములను, జేరి యుద్ధమున నే ♦ లేరుఁ డొండె
విజితాస్మ యనుఁ డొండె ♦ వెరవొండు లేదు నా, ధాటి సహింపనా ♦ ధరణిపతులు
ప్రాజ్ఞు లభీరులు ♦ బాగుగ యోజించి, యన్యోన్య మతఁడు వ ♦ రాఢ్యుఁ డగుట
దుర్జయుఁడని ♦ యెంచి నిర్జితాస్మ యటంచుఁ, బలికిరి యీరీతిఁ ♦ బలికి పట్టి

తే. వారు సురథుండు గాధి పు ♦ రూరవుండు
గయుఁడు దుష్యంతుఁ డనువారు ♦ కంజనయన
వీర లందఱు నిటు పల్కఁ ♦ వీరవరుఁడు
యుద్ధకాంక్షను వచ్చె న ♦ యోధ్యకపుడు. ౩౮౫

అర్థములు. క్రమ్మరి=తిరిగి, నేలేరుఁడు=రండు, విజితాస్మ=గెలువఁబడితిమి, వెరవు=ఉపాయము, ప్రాజ్ఞులు=అభీరులు, పిఱికివాండ్రు గాకున్నను బుద్ధిమంతులు, వరాఢ్యుఁడు=వరములచే గొప్పవాఁడు, ఇందుఁ జెప్పఁబడినవారు సమకాలికులు గారు. ఒక్కొక్క కాలమున నొక్కొక్కఁడు ప్రసిద్ధుఁడు వినరాఁగా వానిమీఁదికి రావణుఁడు పోవుచుండెను.

తాత్పర్యము

(తిరిగి, భయంకరమగు పరాక్రమముగల రాజుల కడకుఁ బోయి, 'యుద్ధమునకైన రండు, ఓడిపోయితి మనినైన నను. నా ధాటికిఁ దాళి నిలువ వేఱొక యుపాయము లేదు' అని నంతె, పిఱికివాండ్రు కాకున్నను బుద్ధిమంతులు కావున

వార లోకరితో నొకరు బాగుగ యోజించి 'వీఁడు వరబలముగాఁడు- గెలువ శక్యము గా'దని తలఁచి 'గెలువఁబడితి' మని చెప్పిరి. ఈ విధముగాఁ జెప్పినవారు, సురథుఁడు, గాధి, పురూరవుఁడు, గయుఁడు, దుష్యంతుఁడు, రామా! వీ రంద జెట్లు పల్కఁగా రావణుఁడు యుద్ధకాంక్షచే నప్పు డయోధ్యకు వచ్చెను.)

క. ధీరుండు పురందర సమ, వీరుం డనరణ్యుఁ డనెడు ♦ పృథ్వీపతి పా
 కారి దివంబును బోలిక, ధారిణిఁ బాలించుచుండ ♦ దశకంధరుఁడున్. ౩౮౬

అర్థములు. ధీరుఁడు=ధైర్యము గలవాఁడు, పురందర సమవీరుఁడు, ఇంద్రు నితో సమానమైన బలము గలవాఁడు, పాకారి=ఇంద్రుఁడు, దివంబును బోలిక= స్వర్గమును వలె.

తా త్ప ర్య ము

ధైర్యశాలియు, ఇంద్రునంత బలము గలవాఁడగు అనరణ్యుఁడను రాజు ఇంద్రుఁడు స్వర్గమువలె నయోధ్యను బాలించుచుండెను. రావణుఁడు-

ఉ. ఆతనిఁ గాంచి యుద్ధమున ♦ కైనను రమ్ము జితోస్మి యంచు నేన్
 భీతి గలంగినం బలుకు ♦ నీవు మదాజ్ఞ యిదన్న ధారిణీ
 నేతయుఁ గోప వేగమున ♦ నేత్రయుగం బరుణంబు గాఁగ నో
 యాతుఁడ! నిల్వుమీ నిముస ♦ మాహవ మే నొనరింప వచ్చెదన్. ౩౮౭

• అర్థములు. జితోస్మి=జయింపఁబడితిని, ధారిణీనేత=రాజు, యాతుఁడ= రాక్షసుఁడా, ఆహవము=యుద్ధము.

తా త్ప ర్య ము

ఆయనను జూచి యుద్ధమునకై నరమ్ము. భయపడితివా, ఓడితిననుము. ఇది నా యాజ్ఞయని చెప్పఁగా ఆ రాజు కోపించి కన్ను లెఱ్ఱజేసి యోరి రాక్షసుఁడా! క్షణమాత్రము నిలువుము, యుద్ధము చేయ వచ్చెదను.

చ. అని మును వానివృత్తము న ♦ మస్తము విన్కలి సిద్ధ మైనవా
 హినిఁ జతురంగయుక్తము మ♦హీస్థల మెల్లను నావరింపఁగాఁ
 గొని చని దైత్యసేనల న ♦ కుంఠితరీతిని దాఁకి పెక్కు నా
 దినములు పోరు సల్పె నిన ♦ తేజుఁ డనుత్త మవిక్రమంబునన్. ౩౮౮

అర్థములు. వృత్తము=నడవడి, విన్కలిన్=వినియుండుటచే, వాహినిన్= సేనను, అనుత్తమ=ఎక్కుడి గొప్పదగు, విక్రమంబునన్=బలముచే.

తా త్ప ర్య ము

అనిచెప్పి వానిచర్య ముందే విన్నవాఁ డగుటచే యుద్ధమునకుఁ సిద్ధపఱిచి యున్న సేనను దీసికొని భూమి యంతయు నావరించునట్లు పోయి రాక్షససేనలతో మహాబలముగాఁ బెక్కునాళ్ళు యుద్ధము చేసెను.

క. జ్వలనజ్వాలలఁ దాఁకెడి శలభంబులు నాఁగ వహ్ని ♦ సంపతిత హవి
స్సులఁ బోలి తనదు యోధులు, పొలియఁగ వనరణ్యనృపతి♦పురురోషమునన్

అర్థములు. జ్వలన జ్వాలలన్=అగ్నిశిఖలను, శలభంబులు=మిడుతలు, వహ్నిసంపతిత హవిస్సులన్=అగ్ని యందుఁబడిన హవిస్సులను, పురురోషమునన్=మిక్కిలి కోపముతో,

తా త్ప ర్య ము

ఆ యుద్ధమందుఁ దనసేనలు మండుచున్న యగ్నిజ్వాలలందు మిడుతలవలె అగ్నియందు హవిస్సువలెఁ బడి నాశ మగుచుండఁగాఁ జూచి కోపించినవాఁడై.

ఉ. అంబుధిలోఁ గలంగెడి వ ♦ నాపగ లట్లు నశించు నాత్మ సై
న్యంబులఁ గాంచి వాసవశ ♦ రాసనతుల్యము భీమ మైన చా
పంబును గేలఁ బూని దశ ♦ వక్త్రుని దాఁకె మృగేంద్ర మల్పస
త్త్వంబులఁ దోలునట్లుతనుఁ♦దాఁకు ప్రహస్తశుకాది మంత్రులన్. ౩౯౦

అర్థములు. వనాపగలు=అడవినదులు, వాసవశరాసనతుల్యము=ఇంద్ర ధనస్సుతో సమానమైనది, మృగేంద్రము=సింహము, అల్పసత్త్వంబులన్=క్షుద్రజంతువులను.

తా త్ప ర్య ము

అడవినదులు సముద్రములోఁజొచ్చి రూపనామములు లేకపోయినట్లు నశించుచున్న తన సేనలఁ జూచి యింద్రచాపమువంటి చాపము తీసికొని రావణు నెదిరించి తనమీఁదికివచ్చు ప్రహస్తశుకాదిమంత్రులను సింహ మల్పజంతువులఁ దోలునట్లు.

క. పాఱఁగఁ దోలియు నెనిమిది,నూఱులు బాణంబు లామ ♦ నుష్యాదుశిరం
బీఱమ్ముగ నొకట్లు మొగిం, దూఱఁగ నేయుటయుఁ గొండ ♦ తోరపుజడికిన్.

అర్థములు. ఈఱమ్ముగన్=దట్టముగ, తోరపు జడికిన్=విశేషవర్షమునకు.

తా త్ప ర్య ము

(పాఱఁదోలి యంతనిలువక యెనిమిదివందల బాణములా రావణునితల దూఱిపోవునట్లు దట్టముగ నొకటేవిధముగ వేయఁగా, విశేషవర్షమునకుఁగొండ.)

చ. కలఁగని యట్లు రావణుఁడు ♦ కంపము నొందక మీఁద దూఁకి చే
కోలఁదిని మోఁద భూపతియుఁ ♦ గూలె రథంబున నుండి భూమి వి
హ్వలుఁడయి వేపమానుఁ డయి ♦ వజ్రహతిం బడు చెట్టువోలె; ని
ట్లిలఁ బడియున్న పుణ్యునను ♦ రేడుఁడు గాంచి హసించు చిట్లనున్. ౩౯౨

అర్థములు. విహ్వలుఁడు = వెలఁవెలఁబోయినవాఁడు, వేపమానుఁడయి= వణఁకుచున్నవాఁడై, హసించుచున్=నవ్వుచు.

### తా త్ప ర్య ము

(కలఁత చెందనియట్లు రావణుఁడు కంపింపక, మీఁదికిమూఁకి చేతికోలఁది మోఁదఁగా, నిడుగు దెబ్బతినపడు చెట్టువలె రాజును వెలవెలఁబోయి, వణఁకుచు రథమునుండి నేలమీఁదఁ గూలెను. ఈవిధముగా భూమిపైబడియున్న పుణ్యాత్ముని రావణుఁడుచూచి నవ్వుచు నిట్లనెను.

ఉ. ఏమిఫలంబు నొంది తన • నీశ్వర! న న్నెదిరించి? యుద్ధమం
దేమగవాఁడు నన్ జెనకి • యేగు నొకో మెయితోడ? స్త్రీలతోఁ
గామితభోగసక్తుఁడవు • కావుటనో వినవోటు నాబలో
ద్దామత నన్న భూమిపతి • దానవుతో నను నీరెలుంగునన్. ౩౬౩

అర్థములు. మెయితోడన్=దేహముతో, కామిత భోగసక్తుఁడవు=కోరిక భోగములందు మనస్సుగలవాఁడవు, వినవోటు=వినవేమో కదా, బలోద్దామతన్=అధికబలమును, ఈ రెలుంగునన్=సన్నని గొంతుతో.

### తా త్ప ర్య ము

రాజా! నన్నెదిరించి నీవేమి ఫలమనుభవింపఁ గోరితివి? యుద్ధమందు నన్నుదాఁకి దేహముతో నే మగవాఁడు పోఁగలఁడు? స్త్రీలతో నిష్టభోగములనుభవించుచు మూల యింట నున్న కారణమున నా బలపరాక్రమాతిశయము నీవు వినలేదు కాఁబోలు. వినియుండిన నాతో యుద్ధమునకు వత్తువా యనఁగా రాజు సన్నని గొంతుతో నిట్లనియె.

### —• అనరణ్యుఁడు రావణు శపించుట •—

ఉ. ఏల ప్రగల్భభాషణము • లిట్లు వచించెదు రాక్షసేంద్ర! న
న్గాంచఁ లేవు నీ విపుడు గూలితిఁ • గాలముచేత, నెవ్వఁడో
కాలము మీఱఁ జాలెడిని • గారణమాత్రమ వీవు నీనుడుల్
చాలును, ప్రాణ మేగుతఱి • శక్యమె నాకెదియేని చేయఁగన్ ౩౯౮

అర్థములు. ప్రగల్భభాషణములు=పొగరుపోతు మాటలు.

### తా త్ప ర్య ము

రాక్షసరాజా! యేల పొగరుపోతు మాటలాడెదవు. నన్నుఁ జంపినవాఁడవు నీవు కావు; కాలము నన్నుఁ జంపెను. నీవు నిమిత్తమాత్రమే. ఎవ్వఁడు కాలము నతిక్రమింపఁ గలఁడు. నీ మాటలు చాలును. ప్రాణము పోవు సమయంబున నిన్నేమి నేను జేయఁగలను.

ఉ. భీరువఁగాక నే న్నెదిరి • వీరుఁడనై సమరంబొనర్చితిన్
బోరను నన్ను నొంచితివి • పోలును నీ కది; యంతఁ బోక దు
శ్చారుఁడ! నాదువంశము న • సహ్యతరోక్తి నవజ్ఞ చేసెదే
యోరువఁజాల నయ్యది మ • దుక్తిఁ వినుమ్మ పలాశనాధిపా. ౩౯-౫

అర్థములు. భీరువన్=పిఱికివాఁడను, దుశ్చారుఁడ=చెడు నడవడి గల వాఁడా! అసహ్యతరోక్తిన్=సహింపరాని మాటలచే, అవజ్ఞ చేసెదే =అవమాన పఱిచెదవా? పలాశనాధిపా=మాంసభక్షకుల రాజా.

తాత్పర్యము

నేను క్షత్రియుఁడను గావున పిఱికినిగాక వీరుఁడనై యుద్ధము చేసి నాకృత్యము నెఱవేర్చితిని. నీవును యుద్ధమందు నన్ను నొప్పించితివి. అంతవఱకు నీవు చేసినది న్యాయ్యమే అంతతోఁ బోక దుష్ప్రవర్తనము గలవాఁడా! నా క్షత్రియవంశ మును నీవు వినరాని మాటల నవమానించితివి దానిని నేను సహింపఁజాలను కావున నేను జెప్పెడి మాట వినుము.

క. దానము హోమము సుకృతం, బే నొనరించినను జనుల • నేలిన ధర్మా
ధీను డ నైన నా వాక్యము, దానవకులపరివృఢుండ! • తథ్యం బగుతన్. ౩౯-౬

తాత్పర్యము

నేను దానము హోమము పుణ్యము చేసియుండి ప్రజలను ధర్మపద్ధతిని బరి పాలించియుంటి నేని నేను జెప్పఁబోవునది రాక్షసకులశ్రేష్ఠా! సత్యమగును.

ఉ. రాముఁ డనంగ దాశరథి • రావణ! పుట్టి మదన్వయంబునన్
శ్రీమహితుండు నిన్ను రణ • సీమ వధించు నటన్న దుందుభి
స్తోమము మింట మ్రోఁగె సుర • సూనము లాన్నృపుమీఁద వ్రాలె క్షో
ణీమహిళాధవుండును జ • నెన్ దివికిన్; దశకంఠుఁ డంతటన్. ౩౯-౭

అర్థములు. దాశరథి=దశరథుఁడను వాని కుమారుఁడు, మదన్వయంబు నన్=నా వంశమున దుందుభిస్తోమము=నగారాలధ్వని, మింటన్ = ఆకాశమందు, సురసూనములు=దేవతల పుష్పములు.

తాత్పర్యము

నా వంశమున దశరథుఁడను వాని కుమారుఁడై రాముఁ డనువాఁడు పుట్టి నిన్ను యుద్ధమందుఁ జంపును, అని చెప్పఁగా నాకాశమున దేవతలు నగారాలు మ్రోయించిరి. దేవత లాయనమీఁదఁ బుష్పవర్షము గురియించిరి. రాజు స్వర్గ మేగెను. రావణుఁడు ఆసిమ్మట,(ఇది రావణునకు నాలుగవ శాపము. ఇప్పటికి రావణ నాశమునకుఁ గావలసిన సామగ్రి కుదిరినది. ఇఁక కాలము వచ్చుటే తరువాయి)

## ౨౦వ సర్గము

### —♦ నారదుఁడు రావణునకు మనుష్యవధ మాన బోధించుట ♦—

క. భూమీధవభీకరుఁడై, దీమసమున నేగుచోట ♦ దివి తెరువున వీ
ణామౌనిఁ గాంచి మ్రొక్కుచు, నేమము, బ్రశ్నించి కతము ♦ చెప్పుము మౌనీ!

అర్థములు. భూమీధవ భీకరుఁడై=రాజులకు భయంకరుఁడై, దీమసమున= గర్వముతో, దివి తెరువునన్=ఆకాశ మార్గమందు, వీణామౌనిన్=నారదుని, నారదుని వీణకు మహతి యని పేరు, కతము=కారణము.

#### తాత్పర్యము

రాజులకు భయంకరుఁడై గర్వమునఁ బోవుసమయంబున నారదుఁ డాకాశ మార్గమున వానికిఁ గానవచ్చెను. వాఁడును నమస్కరించి సేమ మడిగి మునీంద్రా! కారణ మేమి?

ఉ. నీ విట కేగుదేర నన ♦ నీరదపృష్ఠగతుండు నారదుం
డా విబుధారికిం బలికె ♦ నాశరనాథ! పులస్త్యవంశదీ
పా! విని నీదువిక్రమము ♦ బాధముదంబును గంటి, నిల్వుమీ
నావచియించు నొక్కవచ ♦ నంబును విన్మ వినం దలంచినన్. ౩౯౯

అర్థములు. నీరదపృష్ఠగతుండు=మబ్బుమీఁద నున్నవాఁడు, ఆశరనాథ= రాక్షసరాజా.

#### తాత్పర్యము

నీవిచ్చటికేల వచ్చితివని యడుగఁగా మేఘములమీఁద నున్న నారదుఁడు రావణుతో నిట్లనియె. రాక్షసరాజా! పులస్త్యవంశదీపా! నీ బలము విని మిగుల సంతోషించితిని. నీవు వినఁదలంచితివేని నిలువుము. నే నొకమాట నీకుఁ జెప్పెదను.

క. హరి దైత్యుల వధియింపఁగఁ, బరికించి ముదంబుఁ జెందు ♦ వాఁడను నీ వ
ల్లురగుల గంధర్వాదులఁ, బరిమార్పఁగఁ గాంచి ముదము ♦ పడు చున్నండో. ౪౦౦

#### తాత్పర్యము

విష్ణువు రాక్షసులఁ జంపఁగాఁ జూచి సంతోషించువాఁడను నేను, అట్టిసంతోషము నీవు పన్నగులను గంధర్వాదులను జంపఁగాఁజూచి యొన్నడను భవింతునో కదా!

సీ. అనిమిషగంధర్వ ♦ యక్షరక్షోసుర వరులకు నేని య ♦ వధ్యుఁ డీవు
తండ్రి! యేమని చంపఁ ♦ దలఁచితి మృత్యుచేఁ, జచ్చియు యున్నట్టి ♦ జనులఁ జెపుమ
మే లగుదానిని ♦ మేకొనఁజాలని, మూఢు లనిష్టముల్ ♦ మొగి ఘటించి
వ్యాధులచేతను ♦ వార్ధకంబున నేడ్చు, వారలు క్షుధను బి ♦ పాసచేత

ఆ. నిష్టజనులఁ బాసి • యేడ్చుటచే సుక్కి, దైవనిహతులయి స • దా కృశించు
నరులఁ జంప నీకు • న్యాయమా నాయనా!, యెంచి చూడ వేమొ • యింతదనుక.

అర్థములు. అనిమిష=దేవతలకు, అసురవరులకు = అసురశ్రేష్ఠులకు, అవధ్యుఁడవు=చంప సాధ్యపడనివాఁడవు, వార్ధకంబునన్ = ముసలితనముచే, క్షుధను=ఆఁకలిచే, పిపాసచేన్=దప్పిచేత.

తాత్పర్యము

తండ్రీ! నీవు దేవతలకు, గంధర్వులకు, యక్షులకు, రాక్షసులకు, అసుర ముఖ్యులకుఁ జంపరాని వాఁడవు. వీరు దేవయోనులు-దీర్ఘ కాలము బ్రదుకువారు, ఇఁక మనుష్యులో మృత్యువుచేఁ జచ్చినవారే, అట్లు చావనున్న వారిని జంపుట వలన నీకేమి లాభము? పేరా పెంపా? మనుష్యులు తమ కేది మేలో యది యాలోచించి చేయలేరు. చేయరాని పనులు చేసి రోగముల చేతను ముసలితనము చేతను నేడ్చు చుందురు. ఆఁకలి దప్పులచేతను ఇష్టజనులు వదలిపోవుట చేతను నేడ్చుటచే శుష్కించి దైవముచేఁ గొట్టఁబడి సదా యేడుచుచుండు నరులను జంప నీకు ధర్మమా? నాయనా! యింతవఱకు నీకీ యాలోచన మనస్సునకు రాలేదేమో కదా.

చ. గడియకు నేమి వచ్చునది • కానరు క్షుద్రవిచిత్రవస్తువుల్
గడన యొనర్చు టందె తమ • కాలముఁ బుత్తురు, వాద్యఘోషలన్
గడుముద మందు చుండి జడి • కాఁగ నశ్రువు లర్ధరాత్రమిం
దుడుగక యేడ్చుచుందురు. ర • వో కనుఁగొంటివె మూఢమర్త్యులన్. ౪౦౨

అర్థములు. గడన=సంపాదనము, అశ్రువులు=కన్నీళ్ళు.

తాత్పర్యము

ఇఁక గడియకు నేమి రాఁగలదో మనుష్యు లెఱుఁగరు. అల్పములైనవిచిత్ర వస్తువుల సంపాదించుటయందుఁ దమఁ కాలము గడుపుదురు. పగళ్ళు వాద్యధ్వను లతోఁ గడుపుచుఁ నర్ధరాత్రమందుఁ గన్నీళ్ళు వానవలెఁ గురియుఁగా నయ్యో యని చచ్చినవారికై యేడ్తురు. మనుష్యులెంత మూఢులోఁ చూచితివా?

క. జనని యని జనకుఁ డంచును, దనయుం డని భార్య యనుచుఁ • దమ చుట్టము లం
చును జంజాటం బిడుకొని, వనటం బడువారు స్వకృత • బంధంబులచేన్. ౪౦౩

తాత్పర్యము

తాముగా బంధములు కల్పించుకొని యిది నాతల్లి, యీయన నా తండ్రి వీఁడు నా కొడుకు, ఇది నా భార్య. వీరు నా బంధువులు అని యీప్రకారము జంజాటము తగిలించుకొని దుఃఖపడు చుందురు.

మానిని. కావున మోహనిరాకృతులం గడు • కాఁతియలం బడు మానవులన్
నీవు జయించినవాఁడవె చాల్, యము • నిం గన నేగుదు రెల్లజనుల్
నావచనంబున దండధరుం గద • నంబున గెల్వ నవశ్యము నీ
వా విభుగెల్చిన నందఱ గెల్చిన • యట్ల యగుంజుమి నిక్కముగన్. ౪౦౪

అర్థములు. మోహనిరాకృతులన్=అజ్ఞానముచే స్వరూపము చెడినవారిని కడుకాఁతియలన్=మిగుల బాధలను, కదనంబునన్=యుద్ధమందు.

### తాత్పర్యము

కావున నజ్ఞానముచే స్వరూపము చెడి మిగుల బాధలుపడు మనుష్యులను నీవు జయించినవాఁడవే. రావణుఁడు మనుష్యుల జయింపలేఁడయ్యె నని యెవరు ననరు. కావున నీ ప్రయత్నము చాలింపుము. ఎట్టివారైనను యముని జూడ బోదురు. అందఱను యముఁడు చంపును. కాఁబట్టి నీవు యముని యుద్ధమందు జయించితివా యందఱ జయించినట్టు లగును. ఇది నిజము.

**—• నారదునితో రావణుఁడు తాను యముని జయింపఁ బోయెద ననుట •—**

తరలము. అనిన నవ్వుచు మ్రొక్కి పల్కె మ • హాత్మ! గీతకళాప్రియా!
ఘనవిదారణలాలసా! జయ • కాంక్ష నేను రసాతలం
బునకు నీ వచియించినట్టుల • పోయి గెల్చి జగత్త్రియం
బును సురాహుల నాదునానతి • మోపఁ జేసి బలోద్ధతిన్. ౪౦౫

అర్థములు. గీతకళాప్రియా=సంగీత విద్యయందుఁ బ్రీతిగలవాఁడా, ఘనవిదారణలాలసా=గొప్ప యుద్ధమందుఁ బ్రీతిగలవాఁడా, సురాహులన్=దేవతలను పన్నగములను.

### తాత్పర్యము

అని చెప్పఁగా నవ్వుచు మ్రొక్కి యిట్లనియె. మహాత్మా! సంగీత విద్య యందుఁ బ్రేమగలవాఁడా! యుద్ధములు చూచుటయందుఁ గోరిక గలవాఁడా! నీవు చెప్పినట్లు జయముకొఱకు పాతాళమునకుఁ బోయి మూఁడులోకములను ఊర్ధ్వమున దేవతలను అధోలోకముల సర్పములను గెల్చి బలగర్వముచే నా యాజ్ఞకు లోపడియుండఁ జేసెదను.

క. అమృతార్థము మథియించెద, నమృతనిధానంబు జలధి • నన నారదుఁడున్
యమపురి మార్గము కడుదుర్గమ మెవ్వఁడు పోవు నీవు • కాకసురేంద్రా. ౪౦౬

అర్థములు. అమృతార్థము=అమృతము నిమిత్తమై, అమృతనిధానంబు=అమృతమునకు స్థానమైన, జలధిన్=పాలసముద్రమును.

### తా త్ప ర్య ము

ఇట్లు మూఁడు లోకములు జయించి యమృతము సంపాదించి శ్రావుకొఱకు నమృతస్థానమైన పాలసముద్రమును మథించెదను అనిచెప్పఁగా నారదుఁడు యమ పురమునకుఁ బోవు మార్గము మిగుల గహనము నీవుతప్ప మఱియెవ్వఁడు పోలేఁడు.

ఉ. వావుడు శారదాభ్రనిభు • నారదుఁ బల్కెఁ గృతంబు సర్వమున్
దేవమునీ! యిదో యముని • దేఁకువఁ జంపఁగ దక్షిణాశగాఁ
బోవుచు నున్నవాఁడఁ గిను • పుంగొని బాస యొనర్చినాఁడ నా
శావిభులందు నల్వురను • సంగరభూమి జయింతు నం చొగిన్. ౮౦౭

అర్థములు. శారదాభ్రనిభున్ = శరత్కాల మేఘమువలెఁ దెల్లనైన వానిని, కృతంబు=చేయఁబడినది, దేఁకువన్=ధైర్యముతో, దక్షిణాశగా=దక్షిణ దిక్కుగా, కినుపుంగొని=కోపించి, ఆశావిభులందు=దిక్పాలకులయందు.

### తా త్ప ర్య ము

అని చెప్పఁగా శరత్కాల మేఘమువలెఁ దెల్లని కాంతిగల నారదుతో రావణుఁ డిట్లనియె. సర్వము నెఱవేఱినదే దేవమునీ! యిదిగో యమునిని సాహసించి చంపుటకై దక్షిణదిక్కుగాఁ బోవుచున్నాను. కోపించి నేను నలుగురుదిక్పాలకులను యుద్ధమున జయింతునని ప్రతిజ్ఞ చేసితిని.

ఉ. ఆ నుడిఁ దీర్చుపొంటె నిదె • ప్రాణుల నెల్లర గాసిపెట్టు నా
భానుతనూజ మృత్యువనఁ • బాల్పడఁ జేయఁగఁ బోవువాఁడ నం
చా నియమాత్ము మ్రొక్కి సచి • వాన్వితుఁ డై మదిలోనఁ బొంగుచున్
దానవనాథుఁ డట్టిచనె • దక్షిణదిక్కుగఁ గాలుప్రోలికిన్. ౮౦౮

అర్థములు. భానుతనూజున్=యముని, నియమాత్మున్=నియమము గల మనస్సు గలవానిని, సచివాన్వితుఁ డై = మంత్రులతోఁ గూడినవాఁడై, కాలు ప్రోలికిన్=యమపురమునకు.

### తా త్ప ర్య ము

ఆ మాట నెఱవేర్చుకొనుటకుగాను ప్రాణుల నందఱ బాధపెట్టు యమునిఁ జంపుటకై పోవువాఁడనని యా మునీశ్వరునకు నమస్కరించి మంత్రులతోఁ గూడినవాఁడై, మనస్సులోఁ బొంగుచు రావణుఁడు చక్కఁగా దక్షిణదిక్కుగా యమపురమునకుఁ బోయెను.

తే. రావణుఁడు పోవఁగ విధూమ • పావకాభుఁ
డైన విప్రోత్తముండు బ్ర • హ్మాత్మజుండు
నొక్క మార్గంబు యోజించె • యుద్ధభూమిఁ
గాలు నెట్లు జయించునో • కఱకుటసుర. ౮౦౯

అర్థములు. విధూమ పావకాభుఁడు=పొగలేని యగ్నికి సమానుఁడు, విప్రోత్తముండు=బ్రాహ్మణ శ్రేష్ఠుఁడు బ్రహ్మాత్మజుండు=బ్రహ్మమానసపుత్రుఁడు కాలునిన్=యముని, కఠినటసుర=కఠిన రాక్షసుఁడు.

తాత్పర్యము

(రావణుఁడు పోయిన తర్వాత, పొగలేని నిప్పువంటి వాఁడు బ్రాహ్మణ శ్రేష్ఠుఁడు, బ్రహ్మమానస పుత్రుఁడు కఠిన రాక్షసుఁడు యుద్ధభూమియం దెట్లు యమునిఁ గెలుచునో యని యొక్క రీతిగా నాలోచించెను)

—• నారదుఁడు రావణుఁ డెట్లు జయించు నని యోజించుట •—

సీ. సచరాచరంబులు • శక్రసమేతముల్, ముల్లోకములు చావు • మూఁడు వేళ
ధర్మవిధానంబు • తప్పక యెవనిచేఁ, గారింపఁబడు నట్టి • కాలు నెట్లు
గెలుచువాఁడొకో దశ • గ్రీవుండు మఱియును, దనతన చేసిన • దానవిధికి
సత్క్రియాదులకును • సాక్షియు రెండవ, పావకునట్టుల • వఱలువానిఁ

ఆ. ప్రాప్తసంజ్ఞులే మ • హాత్ము ననుగ్రహ, వశముకలిమిఁ దిరుగు • వారు క్రియల
నెవని కడలు భీతి • నెల్లలోకంబు లా, దండధరుని నెట్లు • దాయు నసుర తగం

అర్థములు. సచరాచరంబులు=కదలునవి కదలనివియగు వానితోఁగూడినవి, శక్రసమేతముల్=ఇంద్రునితో గూడినవి, కారింపఁబడు=బాధింపఁబడు, ప్రాప్తసంజ్ఞులు=జ్ఞానులు.

తాత్పర్యము

స్థావరజంగమంబులుగలిగి యింద్రునితోడి మూఁడు లోకములు మరణించు సమయమందు ధర్మపద్ధతి ప్రకారము వారు వారు చేసిన కర్మముల ప్రకారము ఎవఁడు బాధించునో యటువంటి యముని రావణుఁ డెట్లు గెలువఁగలఁడో అది యునుగాక తాను దాను జేసిన దానాదికార్యములకు సత్క్రియలకు సాక్షి యెవఁడో యెవఁడు రెండవ యగ్నివలెఁ బ్రకాశించునో యెవని యనుగ్రహము వశమున జ్ఞానులు సంచరింతురో యెల్లలోకము లెవనికి భయపడునో యటువంటి దండధరుని వీఁ డెట్లు గెలువఁగలఁడు.

ఆ. పుణ్యపాపములకుఁ • బోలిన పద్ధతి, నింతో యంతో ఫలము • నిచ్చువాఁడు
గెలిచినవాఁడు భువన • ములనెల్ల దాన యా, కడిఁదిబలుఁడు గెలువఁ • బడుట యెట్లో

అర్థములు. ఇంతో=కొంచెమో, అంతో=గొప్పదో.

తాత్పర్యము

(జీవులు చేసిన పుణ్యపాపములకుఁ దగిన విధముఁగా గొంచెమో గొప్పదో ఫలము నిచ్చువాఁడు లోకములన్ని గెలిచిన వాఁడు. అంతటి బలము గలవాఁడు వీని చేత నెట్లు గెలువఁబడునో.)

ఆ. కాల మెల్లపనులఁ • గావింప శక్తంబు, పంక్తికంఠుఁ డన్య•బలము లేనిఁ
బూని గెలుచువాఁడొ • దా నాహవంబున, దక్షిణాధిపతిని • దండధరుని.

తా త్ప ర్య ము

ఎవ్వఁ డేపని చేయుటకుఁ గాలము సాధనము. కాలము తోడుపడకున్న నెవ్వఁడేదియుఁ జేయఁజాలఁడు కాలమే యన్నిపనులు చేయ శక్తి గలది. అట్టి కాలుఁడు యముఁడు అట్టివానిని మఱేయే సాధనముచేత యుద్ధమందు వీఁడు జయింపఁగలఁడో.

క. ఈ యమరాక్షసనాథుల, యాయోధనముం గనంగ • నానద్యోఢి నే
నే యరిగెద వైవస్వతు, దాయఁగ నని యరిగె దండ•ధరు పురమునకున్. ౪౧౩

అర్థములు. ఆయోధనమున్=యుద్ధమును, ఆన=ఆశ.

తా త్ప ర్య ము

(ఈ యమునికి రావణునకు జరుగఁబోవు యుద్ధము చూడ వలెనని యాస పొడముచున్నది. నేను శీఘ్రముగా యమునిదగ్గరకుఁ బోయెదనని యమపట్టనము నకుఁ బోయెను)

౨౧వ సర్గము

—• రావణు నుద్దేశంబు నారదుఁడు యమునితోఁ జెప్పుట * —

చ. చని లఘువిక్రమాఢ్యుఁడు కృ•శానుపురస్కృతుఁ బ్రాణికోటి చే
సినసుకృతాఘపాళులకుఁ • జేకుఱ నర్హఫలంబు లోలి శా
సన మొనరించువానిఁ గనఁ • జయ్యన నాతఁడు ధర్మపద్ధతిన్
మునిజననాథు నర్ఘ్యమునఁ • బూజయొనర్చి సుఖాసనస్థునిన్. ౪౧౪

అర్థములు. లఘువిక్రమాఢ్యుఁడు=వేగముగా బోవఁగలవాఁడు, కృశాను పురస్కృతున్ = అగ్నిహోత్రుని ముందుంచుకొనిన వానిని, సుకృతు+అఘ+ పాళులకున్=పుణ్యాపాపముల సమూహములకు, అర్హ ఫలంబులు=తగిన ఫలములను ఓలిన్=క్రమముగా, సుఖాసనస్థునిన్ = సుఖమైన యాసనమందుఁ గూర్చున్న వానిఁ జేసి.

తా త్ప ర్య ము

అతివేగముగఁ బోఁగల నారదుఁడు పోయి సాక్షిగాన అగ్నిని ముందుంచు కొని ప్రాణులు చేసిన పుణ్యాపాపములకుఁ దగినట్లు పుణ్యములు చేసిన వారికి సుఖము, పాపము చేసిన వానికి కష్టము శాసనము గావించుచు నుండు వానిని జూడఁగా, నాయనయు, త్వరగా ధర్మశాస్త్రప్రకార మర్ఘ్యమునఁ బూజించి సుఖాసనమునఁ గూర్చున్న వానిని జూచి.

తే. క్షేమమా మీకు మునినాథ•ఖిలముగాదు,గాదె ధర్మంబు?గంధర్వ•కాండ దేవ
సేవితా!మీరలిటకు వేం•చేయు కార్య,మెద్ది యానతి యిందునా•బుషివరుండు

అర్థములు. ఖిలముగాదు=చెడదు, గంధర్వకాండ=గంధర్వసమూహముల చేతను, దేవ=దేవతలచేతను, సేవితా=సేవింపఁ బడువాఁడా.

తాత్పర్యము.

(మునీంద్రా! మీకు క్షేమమా? ధర్మము చెడదుగదా! మీరు రిచటకు వేంచేసిన కార్యమేమి? ఆనతింపు. అని యడుగ నా ఋషి శ్రేష్ఠుఁడు.)

ఉ. అంతక! యాలకింపుమ యుదంతము నంతయు నంత యుక్తముం
జింతన సేయుమీ యసుర • శేఖరుఁ డైన దశాస్యుఁ డిప్డు వి
క్రాంతిని నిన్ను దర్జయ! దురంబున గెల్వఁగ వచ్చుచున్న వాఁ
డింత యెఱుంగుటం దెలుప • నేనిటు వచ్చితి మున్న మున్నగన్. ౨౧౮

అర్థములు. అంతక=యముఁడ, ఉదంతము = వృత్తాంతము, విక్రాంతిని= పరాక్రమముచే.

తాత్పర్యము

ధర్మరాజా! వృత్తాంత మంతయు వినుము. ఆవలఁ జేయవలసిన దాలోచింపుము. రాక్షసశ్రేష్ఠుఁడైన రావణుఁడు తన బలముచే నిన్నుఁ జయింపఁగోరి యుద్ధమునకై వచ్చుచున్నవాఁడు. ఇది నాకుఁ దెలియుటచే నీకుఁ దెలుప ముందుగా వచ్చితిని.

తే. కాలదండధరుఁడ వై • క్రాలు నీకు, నేమి యగునో యని • యేగుదెంచి
నాఁడ ననియెడు నీలో, క్షణాటవిభుని, వ్యోమయానంబు దోఁచె దవ్వులను మింట.

తాత్పర్యము

(కాలుఁడా! దండధరుఁడవై యున్న నీ కేమిహానియగునో యని తలఁచివచ్చితిని అనుచున్నంతలో రావణుని విమాన మాకసమున దూరముగాఁగానుపించెను.

—* **రావణుఁడు యమలోకంబున బాధింపఁబడు జీవులఁ జూచుట** *—

ఉ. పుట్టెడు సూర్యుఁ బోలి ప్రభ • పూరటిలం దెసలందుఁ జీఁకటిన్
నెట్టుచు నెల్లచో నసుర • నేత్రవిమానము డాసెఁ బ్రేతరా
ట్పట్టనముం, దశాస్యుఁడును • ప్రాణులు పాపఫలంబుఁ బుణ్యమున్
నెట్టన పొందుచుండఁగఁ గనుం బురబాహ్యతలంబులం దొగిన్. ౨౧౯

అర్థములు. పూరటిలన్=నిండఁగా, అసురనేత్ర = రాక్షసరాజుయొక్క, ప్రేతరాట్ పట్టనమున్=యముని పురమును, సంయమిని యని పేరుగల దానిని, పురబాహ్యతలంబులన్=నగరము వెలుపలి ప్రదేశములందు.

### తాత్పర్యము

ఉదయించుచున్న సూర్యునివలె వెలుతురు దిశలు నించుచు చీఁకటిని పోఁగొట్టుచు రావణుని విమానము యమపురిని సమీపించెను. రావణుఁడును పురము వెలుపల పుణ్యఫలములు పాపఫలములు ననుభవించు ప్రాణులను జూచెను.

సీ. శమనానుచరయుక్త • సైనికులను జూచె, ఘోరరూపుల మహా • క్రూరమతులఁ
గట్టంగఁబడువారిఁ • గొట్టంగఁబడువారి నయ్యోయయ్యోయని • యఱచువారి
బాధ తాళఁగలేక • పలవించువారిని, బురుగులు తొలువంగఁ • బొగులువారి
కెకిదంపుఁగుక్కలు • పీకఁ గండలు నోట, హాహా యటంచును • నఱచువారి
ఆ. వినిన గుండె లగల • విలపించువారిని. రక్తవారి వైత • రణిని లాగఁ
బడెడివారి మఱియుఁ • బడవైచి మండెడు, నిసుక వేఁపఁబడఁగ • నేడ్చువారి. ౨౯

అర్థములు. శమనానుచర=యమకింకరులతోడ, యుక్త=కూడిన, సైనికులను=సేనాభటులను, తొలువంగన్=బొక్కలు పడఁజేయఁగా. పొగులు వారిన్=దుఃఖించువారిని. అగలన్=పగులునట్లు, వైతరణిని=వైతరణి యను నదియందు, లాగఁబడెడి=ఈడువఁబడెడి, వేఁపఁబడఁగన్=వేయింపఁగా.

### తాత్పర్యము

(భయంకర రూపము గలిగి మిగులఁ గ్రూరమైన మనస్సు గలవారిని యమకింకరులతోఁ గూడిన సేనా భటులను జూచెను. కట్టఁబడు వారినిఁ గొట్టఁబడు వారిని, అయ్యో యయ్యో అని యఱచు వారిని, బాధ కోర్చుకొనలేక యేడ్చు వారిని, పురుగులు తొలుచుచుండఁగా రోదనము చేయువారిని, కుక్కలు నోటితోఁ గండలు పీకుచుండ హా హా యని యఱచు వారిని, బాధ కోర్చుకొనలేక యేడ్చు వారిని, రక్తప్రవాహముగల వైతరణి యందు లాగఁబడుచున్న వారిని మండుచున్న యిసుకలోఁ బడవేసి వేయింపగాఁ నేడ్చువారిని.)

క. అసిపత్రవనాంతరమునఁ గసిమసఁగంబడు నధర్మ • కారుల నీరం
బొసఁగరె యని పెనుదప్పిని, గసమసపడువారిఁ గాంచెఁ • గష్టాత్మకులన్. ౩౦

అర్థములు. అసిపత్రవనాంతరమునన్=కత్తులవంటి యాకులుగల వనములందు, కసిమసఁగబడు=ఖండింపఁబడు, అధర్మకారులన్=పాపములు చేసిన వారిని, కసమస=తొట్రుపాటు, కష్టాత్మకులన్=నీచపు మనస్సు గలవారిని.

### తాత్పర్యము

కత్తులవంటి యాకులుగల చెట్లతోఁపులందు ఖండింపఁబడు పాపాత్ములను మిగుల దప్పిగొని నీళ్ళోనీళ్ళోయని తొట్రుపాటు పడెడివారిని పాపాత్ములను జూచెను.

సీ. ఆఁకటిపెల్లున • నటమటించెడివారి, ఘోరరౌరవమునఁ • గూయువారి
నుష్ణవాలుకలలోన • నుమ్మలించెడివారి, మంగలికత్తుల • మలయువారిఁ
బీనుఁగులట్లులై • వెలవెల్లనగువారి, బక్కచిక్కినవారి • స్రుక్కువారి
విరిసిన వెంట్రుకల్ • వ్రేలాడువారిని, నేడ్చి స్రుక్కుచుఁ బరు • విడెడువారి
తే. మన్నుబురదయు మెయినిండి • యున్నవారి వన్నెమారినవారిని • బంక్తిగ బ్రేఁడు
వందలుగ వేలుగను దన • వచ్చుత్రోవఁ, బ్రేతసంఘంబులను గాంచి • వేఁచుచోట.

అర్థములు. అటమటించెడివారిన్=బాధపడు వారిని, ఉమ్మలించు వారిన్=దుఃఖించు వారిని.

తాత్పర్యము

(ఆఁకలి మంటకు బాధపడు వారిని భయంకరమైన రౌరవ నరకమునఁ గూఁతలిడువారిని, నుష్ణవాలుకలలో దుఃఖపడు వారిని, మంగలికత్తులమీఁదనీడ్వఁబడువారిని పీనుఁగులవలె నయి వెలవెలఁ బోవువారిని, బక్క చిక్కిన వారిని, స్రుక్కిన వారిని, విరిసిన వెంట్రుకలు వ్రేలాడువారిని, యేడ్చి సొక్కి పరుగెత్తి పోవు వారిని, మన్ను బురద యొడలనిండఁ గలిగినవారిని, వన్నె మారినవారిని, ప్రేతలను వందలుగ వేలుగఁ దాను వచ్చెడు దారిలో రావణుఁడు చూచెను.

క. సంగీతవాద్యనిస్వన, భంగుల వీనులకు విందు • పచరించుచు ము
త్సంగతి స్వసుకృతఫలముల, భంగంబుగ ననుభవించు • వారలఁ గనియెన్. ౨౨

అర్థములు. పచరించుచున్=కలిగించుచు, ముత్+సంగతి=సంతోషముతో, స్వసుకృతఫలములు=తాము చేసిన పుణ్యముల ఫలములు, అభంగంబుగన్=నిర్విఘ్నముగ, వీరు పుణ్యములు చేసినవారు.

తాత్పర్యము

(సంగీత ధ్వనులు, వాద్యముల ధ్వనులు చెవులకింపు గలిగింపఁ దమ చేసిన పుణ్య ఫలము నవిచ్ఛిన్నముగ సంతోషముతో ననుభవించుచున్న వారిని జూచెను)

సీ. ఆవులదానంబు • నాచరించినవారు గోరసంబులు ద్రావి • క్రాలుచుంట
అన్నదాతలు రుచి • రాన్నంబులను మెక్కి, యామోదమున నడ • యాడుచుంట
గృహదాతలగువారు • మహితగృహంబుల, సంతోషయుక్తులై • సౌఖ్యపడుట
హాటకమణిమౌక్తి • కాభరణోజ్జ్వల, సుందరీతతితోడఁ గొందలుగుట.
తే. వారు వారలొనర్చిన • పరమపుణ్య, ఫలముకోలఁదిని ధార్మిక • వరులు కొంద
ఱమల మగుస్వీయదివ్యతే • జమున వెలుఁగ, వారినెల్లఁ గనుఁగొని • పంక్తిముఖుఁడు

అర్థములు. గోరసంబులు=ఆవులపాలు, ఆమోదమునన్=సంతోషముతో, గృహదాతలు=ఇండ్లు దానము చేసినవారు, మహితగృహంబులన్ = పెద్దయిండ్ల

యందు, హాటక మణిముక్తిక=బంగారు రత్నములు ముత్తెములు ఆభరణ=భూషణములచే, ఉజ్జ్వల=ప్రకాశించు, సుందరీతతితోడన్ = అందకత్తెలసమూహముతో.

తాత్పర్యము

(గోదానము చేసినవారు, ఆవులపాలు ద్రావి హాయిగా నుండుట, అన్నదాతలు రుచిగల యన్నములను భుజించి సంతోషముగా విహరించుట, ఇండ్లు దానము చేసినవారు పెద్దయిండ్లయందు సంతోషము కలిగి సుఖపడుట, బంగారు, మణులు, ముత్యాలతోఁ జేయఁబడిన సొమ్ములు పెట్టుకొనిన సుందరీజనముతోఁ గూడియుండుట, వారు వారు చేసిన పుణ్యాతిశయము కొలఁది ధర్మాత్ములు కొందఱు స్వచ్ఛమగు తమ తేజస్సుతోఁ బ్రకాశించు చుండ వారినందఱను జూచి రావణుఁడు.)

క. తమ తమ దుష్కృతములకున్, శమనభటుల్ బాధపఱుప ♦ సంకటపడు ప్రేతముల బలాత్కారంబుగ, నమితబలుఁడు విడిచి పుచ్చె ♦ హాయిఁ జరింపన్.

అర్థములు. దుష్కృతములకున్=పాపములకుఁగాను, శమనభటుల్=యమకింకరులు, ప్రేతములన్=యాతనా శరీరముగల జీవులను, బలాత్కారంబుగన్=బలవంతముగ, హాయిన్=సౌఖ్యముగ.

తాత్పర్యము

వారు వారు చేసిన పాపములకు యమకింకరులు తమ్ము బాధింపఁగా కష్టపడుచున్న ప్రేతములను రావణుఁడు సుఖపడఁ బొందని వదలిపెట్టెను.

**—♦ యమభటులు రావణుతో బోరుట ♦—**

ఆ. అప్రతర్కితమవిచింత్య♦మైన భంగి, జీవు లిట్లు ముహూర్తంబు♦చెందసుఖము ప్రేతరక్షకు లా దశ♦గ్రీవుఁ గినుక రేఁగి తాఁకిరి మూఁకలు ♦ మూగి సరగ.

అర్థములు. అప్రతర్కితము=ఊహింపరానిది, అవిచింత్యము = ఆలోచింపరానిది, ముహూర్తంబు=అల్పకాలము, ఇట్లనుటచే యమకింకరులు మరల నా జీవులను బట్టుకొని వచ్చిరని యేర్పడు చున్నది, సరగన్=త్వరగా.

తాత్పర్యము

ఇట్లు జరుగునని యూహింపరాని మనస్సునకైనఁ దలపరాని విధముగ జీవులల్పకాల మట్లు సుఖపడఁగా నా జీవరక్షకు లగు కింకరులు కోపించి విజృంభించి గుంపులు గుంపులుగనై రావణు నెదిరించిరి.

క. హాలహాలరవములఁ గోలాహల ముదయింపంగ దెసల ♦ నన్నిట యమయోధులు గూడి యుద్ధమునకున్, జెలియనిజడివానపోలె ♦ వివిధాయుధముల్.

అర్థములు. హాలహాల రవములన్=హాలహాల యను శబ్దములచే, కోలాహలము=కలకలము, వెలియని జడివాన=నిలువని పెద్దవర్షము.

### తాత్పర్యము

హాలహాల ధ్వనులచే నన్ని దెసలఁ గలకల నాదములు పుట్టఁగా యమభటులు గుమిగూడి యుద్ధమునకు బయలుదేఱి యనేక విధములైన యాయుధములు విడువని జడివానవలె,

క. పరిఘములు ప్రాసములు తో,మరశక్తులు ముసలములును • మహితబలాఢ్యుల్
సురవైరి విమానముపై, గురిసిరి యెడ తెఱపి లేక • కోటికొలందుల్. ౮౨౭

అర్థములు. పరిఘములు=ఇనుపకట్ల గుదియలు, ప్రాసములు=ఈటెలు-తోమర-చిల్లకోలలు, శక్తులు, ముసలములు, రోఁకండ్లు, మహితబలాఢ్యుల్=గొప్ప బలసంపదగలవారు.

### తాత్పర్యము

(ఇనుపకట్ల గుదియలు, ఈఁటెలు, చిల్లకోలలు, శక్తులు, ముసలములు గొప్ప బలసంపద గలవారు. రావణుని విమానముమీఁద నెడతెఱపి లేకుండఁ గోట్లకొలందిగఁ గురిసిరి.)

క. వారలు మధుకరములవలెఁ, దోరణములు హర్మ్యములును • దోరపు వేదుల్
మూరుతమునఁబుష్పకమున, వారక భేదించి రసుర • వర్గము బెగడన్. ౮౨౮

అర్థములు. మధుకరములవలెన్=తుమ్మెదలవలె మూఁగి, హర్మ్యములు=మేడలు, తోరపువేదుల్=పెద్దయరుఁగులు, బెగడన్=భయపడఁగా.

### తాత్పర్యము

ఆ కింకరులు తుమ్మెదలవలె ముసురుకొని విమానమునందలి తోరణస్తంభములను మేడలను అరుఁగులను వల్పకాలములో రాక్షసులు భయపడునట్లువిఱిచిరి.

తే. దేవనిష్ఠానభూత మై • తేజరిల్లు నవ్విమానంబు బ్రహ్మమా • హాత్మ్యమునను
బూర్వవిధమునఁబూర్ణమై • పొలుపుదాల్చె భాస్కరాత్మజభటులచే • భగ్నపడియు.

అర్థములు. దేవనిష్ఠానభూతము=దేవాధినిష్ఠానభూతము, భాస్కరాత్మజభటులచే=యమకింకరులచే, భగ్నపడియు=విఱిగియు.

### తాత్పర్యము

బ్రహ్మమహిమచే దేవత లధిష్టించియుండు నవ్విమానము యమకింకరులచే విఱువఁబడియుఁ బూర్వమువలెనే యుండెను.

ఉ. ఆ మహితాత్ము శూరులు స♦హస్రములున్ శతముల్ మహోగ్రసం
గ్రామ మొనర్ప వృక్షముల ♦ గ్రావములన్ మఱి ప్రాససంతతిన్
స్తోమముగాఁగ వైచుచును ♦ దోర్బలధుర్యులు రాక్షసుల్ యథా
కామముగా యథాబలము ♦ గర్వ మెలర్పఁగఁ బోరి రుగ్రులై. ౨౩౦

అర్థములు. ఆమహితాత్ము = ఆగొప్పధైర్యము గల యముని యొక్క. సంగ్రామము=యుద్ధము, గ్రావములన్=కొండలను, ఱాలను = ప్రాససంతతిన్= ఈఁటెల సమూహములను, స్తోమముగా=గుంపుగా, దోర్బలధుర్యులు=అతిశయించిన భుజబలము గలవారు. యథాకాలముగాన్=ఇష్టమువచ్చినట్లు, యథాబలము= బలముకొలఁది, ఉగ్రులై=భయంకరులై

తాత్పర్యము

మిగుల ధీరుఁడైన యముని శూరులు నూఱులు వేలు కొలఁదిగా మహా భయంకరయుద్ధము చేయఁగా బలశాలు లగు రాక్షసులు చెట్లను ఱాలను ఈఁటెలను గుంపులుగా వేయుచు నిష్టము వచ్చినట్లు బలముకొలఁది భయంకరులై యుద్ధము చేసిరి.

సీ. నిఖిలాయుధావళి ♦ నిహతసర్వాంగులై, నెత్తుట జొత్తిల్లి ♦ నెఱిదొరంగి
రావణమంత్రులు ♦ రణ మొనరింపఁగ, వైవస్వతామాత్య♦వరులు గెరలి
వారల నొప్పించి ♦ బడలించి యటఁ బోయి, పంక్తికంఠుని శూల♦వర్షమునను
నొడలెల్లఁ జిల్లులు ♦ పడ మోఁద శోణిత దిగ్ధాంగుఁడై వాఁడు♦తేజరిల్లెఁ

ఆ. పుష్పకాంతరమున ♦ ఫుల్లకింశుకమున, కుద్దియగుచు నాతఁ♦డుగ్రశక్తి
నస్త్రబలముఁ జేసి ♦ యశ్మతోమరగదా, శక్తిశూలవృక్ష♦సాయకముల. ౨౩౧

అర్థములు. నిఖిలాయుధావళిన్=సమస్తాయుధ సమూహములచే, నిహత= కొట్టఁబడిన, సర్వాంగులై =అన్నియవయవములు కలవారై, జొత్తిల్లి=ఎఱ్ఱవాఱి, నెఱి=కాంతి, వైవస్వత=యముని యొక్క, అమాత్యవరులు = మంత్రిశ్రేష్ఠులు, కెరలి=విజృంభించి, శోణితదిగ్ధాంగుఁడై =నెత్తుటఁ బూయబడిన దేహముగలవాఁడై పుష్పకాంతరమునన్=పుష్పకములో, ఫుల=వికసించిన, కింశుకమునకున్= మోదుగునకు అశ్మ=రాయి, తోమర=చిల్లకోలలను, గదా=గదలను, శక్తి= శక్తులను, శూల=శూలములను, వృక్ష=చెట్లను, సాయకములన్—బాణములను.

తాత్పర్యము.

అన్ని యాయుధముల సమూహములచేఁ గొట్టబడిన యవయవములు గల వారై నెత్తుటఁ దడిసి యెఱ్ఱనై కాంతిచెడి రావణు మంత్రులు యుద్ధముచేయఁగా యముని మంత్రులు విజృంభించి వారిని నొప్పించి గాసిపడఁజేసి వారినిదాఁటిపోయి

రావణుని శూల వర్షముచే తూఁటులు పడఁగొట్టగా నెత్తురు క్రమ్మిన దేహము గలవాఁడై పుష్పక విమానమందు పూచిన మోదుగువలెఁ బ్రకాశించుచు భయంకర శక్తి చేతను అస్త్రబలము చేతను శూలుతో మర శక్తి శూలములను చెట్లను బాణములను.

చ. పరఁగఁగ జేయ నయ్యవియు ♦ వర్షము పోలిక శ్రాద్ధదేవు కిం
కరులపయిన్ వడిం గురియఁ ♦ గాలభటాగ్రణులుం దదీయభీ
కరశరవర్ష మాఁపుచును ♦ గ్రావముపై బలు మబ్బులట్టు లా
సురపతిమీఁద వ్రాలి శిత ♦ శూల పరశ్వథ హేతిహేతులన్. ౪౩౨

అర్థములు. శ్రాద్ధదేవు కింకరులపయిన్=యమకింకరులమీఁద, కాల భటాగ్రణులు=యమకింకర శ్రేష్ఠులు, భీకర శరవర్షము = భయంకరమైన బాణ వర్షమును, ఆఁపుచు = అడ్డగించుచు, గ్రావముపై=కొండమీఁద, ఆ సురపతి మీఁదన్=రావణుమీఁద, శిత=పదునైన పరశ్వథ=గండ్రగొడ్డండ్లయు, హేతి= కత్తులయు, హేతులన్=దెబ్బలచే.

తాత్పర్యము

ప్రయోగింపఁగా నవియమకింకరులమీఁద వర్షమువలె బడెను. వారు దానిని వారించి కొండమీఁద మబ్బులు గ్రమ్మినట్లు రావణుమీఁదఁబడి వాఁడి గల శూలములయు గండ్రగొడ్డండ్లయు కత్తులయు దెబ్బలచే.

ఉ. ఊపిరి యాడకుండఁ గడు ♦ నుగ్రత నం దొక యింతయాక యా
పాపచరిత్రుఁ డై పయిని ♦ బాఁదఁ దదాహతి ముక్తవర్ముఁడై
యాపగవోలెఁ గాఱు రుధి ♦ రాంబులఁ దోఁగి సమన్యుచిత్తుఁడై
యాపలలాశినేత సుర ♦ యానము వీడి ధరన్ నిలంబడెన్. ౪౩౩

అర్థములు. తదాహతిన్=ఆ దెబ్బలచే, ముక్తవర్ముఁడై=కవచము వదలిన వాఁడై, ఆపగఁబోలెన్=ఏటివలె, రుధిరాంబులన్=నెత్తురను జలముల, తోఁగి= స్నానముచేసి, సమన్యు చిత్తుఁడై=కోపముతోఁ గూడిన మనస్సుగల వాఁడై, పలలాశినేత=రాక్షసరాజు, సురయానము=విమానము, వీడి=వదలి.

తాత్పర్యము

ఊపిరి తిరుగకుండునట్లు మిగుల భయంకరముగా కొంచెమైన సందీయక పాపపు నడవడిగల యతనిని మీఁద మీఁద బాఁదఁగా ఆ దెబ్బలచేఁ గవచము వదలిన వాఁడై యేఱువలె నెత్తురు కాఱఁగా నెత్తుటి నీటియందు స్నానముచేసి రోషముతోఁ గూడిన మనస్సుగలవాఁడై యా రాక్షసరాజు విమానము విడిచి నేలపై నిలఁబడెను.

—♦ రావణుఁడు పాశుపతాస్త్రంబున యమకింకరుల దహించుట ♦—

చ. నిలఁబడి చాప బాణముల ♦ నిష్ఠురుఁడై కొని లబ్ధసంజ్ఞుఁడై
ప్రళయకృతాంతునట్టు లయి ♦ పాశుపతాస్త్రముఁ గూర్చి మార్వికిన్
నిలు నిలుఁ డంచు నార్చి మును ♦ నీలగళుండు పురత్రయంబుపైఁ
బెలుచన వైచినట్లు దృఢ ♦ విక్రముఁడై చెవి సోఁక నీడ్చుచున్. ౪౩౪

అర్థములు. నిష్ఠురుఁడై=కఠిన చిత్తము గలవాఁడై, లబ్ధసంజ్ఞుఁడై=స్మృతి తెచ్చుకొన్నవాఁడై, ప్రలయకృతాంతు నట్టులు = ప్రలయకాల యమునివలె, మార్వికిన్=అల్లెత్రాటికి, పెలుచనన్=కోపముతో.

తాత్పర్యము

ఇట్లు నిలువఁబడి స్మృతి తెచ్చుకొని విల్లుబాణములు చేతఁ దీసికొని ప్రలయకాల యమునివలెనై పాశుపతాస్త్రమును నారికి సంధించి నిలువఁబడుఁడనియఱచి పూర్వము శివుఁడు పురత్రయముమీఁదఁ గోపముతోఁ బ్రయోగించినట్లు దృఢబలము గలవాఁడై చెవిదాఁక నల్లెత్రా డీడ్చినవాఁడై.

ఉ. నైనవిధూమవహ్నివలె ♦ భర్గునియస్త్రము భూతకోటితో
దావకృపీటజాతుఁడు ని♦దాఘము వేళను శుష్కమౌ నర
ణ్యావళి నేర్చునట్టులు ద్రు♦మాళుల గుల్మములన్ దహించుచున్
వే విలయంబుఁ గూర్చె యమ ♦ వీరభటాళికి జ్వాలమాలియై. ౪౩౫

అర్థములు. విధూమవహ్నివలెన్=పొగలేని యగ్నివలె, భర్గునియస్త్రము=పశుపతి సంబంధమైన యస్త్రము, దావకృపీట జాతుఁడు = కాఱుచిచ్చు, నిదాఘము వేళల=ఎండకాలమందు, శుష్కమౌ=ఎండిన, ఏర్చు=కాలుచు, గుల్మములన్=పొదలను, జ్వాలమాలియై=శిఖలతోఁ గూడినదై.

తాత్పర్యము

ప్రయోగింపఁగా పొగలేని మంటవలెఁ బాశుపతాస్త్రము భూతలముల సమూహముతో నెండకాలమున నెండిన యడవిని గారుచిచ్చు వేగఁ గాల్చునట్లు చెట్లను బొదలను గాల్చుచు మంటలతోఁబోయి యముని వీరభటుల గుంపును నాశము చేసెను.

తే. కారుచిచ్చునఁ గాలిన♦క్ష్మారుహంబు,లట్లు కాలుని సైన్యముల్ ♦హతముగాఁగ
సచివయుక్తుండు రాక్షస♦సత్తముండు, పుడమివడఁకౌడ గర్జలఁ♦బొరి ఘటించె

అర్థములు. క్ష్మారుహంబులు=చెట్లు.

తాత్పర్యము

(కారుచిచ్చునందుఁ గాలిపోయిన చెట్లవలె యముని సేనలు హతమయిపోవఁగామంత్రులతోఁగూడి రావణుఁడు భూమి వడఁకిపోవునట్లుబొబ్బలుపెట్టెను.)

## ౨౨వ సర్గము

### —♦ యముఁడు రావణుతో యుద్ధమునకై వెడలుట ♦—

సీ. ఆ మహానాదంబు ♦ నాలించి యముఁడు ని,జవ్యూహ యోధుల♦సంక్షయంబుఁ
బగతుని విజయంబు ♦ భావించి క్రోధసం, రక్తనేత్రముల సా♦రథిని గాంచి
తెమ్ము తే రన వాఁడు♦నిమ్ముగా సమకూర్చి, తెచ్చిన నదియెక్కెఁ♦దీవ్రగతిని
నవ్యయం బగు భువ♦నావళి దేనిచే, హరియింపఁ బడుచుండ ♦ నట్టిమృత్యు
ఆ. వతని మున్ను నిలిచె♦ హస్తంబునను పాశ ముద్గరములఁదాల్చి♦మూర్తిమంత
మగుచుఁ గాలదండ♦మను యమసాధనం, బతని ప్రక్కనిలిచె♦నగ్నిదీప్తి. ౪౩౭

అర్థములు. నిజవ్యూహయోధుల=తన సేనల యందలి భటుల, సంక్షయంబు=చావు, అవ్యయము=నాశములేని.

### తాత్పర్యము

ఆ గొప్ప ధ్వని విని యముఁడు తనసేన నాశమైన దనియు విరోధి జయించినాఁడనియు గ్రహించి కోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి సారథినిజూచి తేరు సిద్ధముచేసి తెమ్మనఁగా వాఁడును జక్కఁగా సిద్ధముచేసి తెచ్చిన దానిని వేగముగ నెక్కె. ప్రవాహమువలె క్షయింపని భువనములు దేనిచే హరింపఁబడునో యట్టి మృత్యువాయెనముందు పాశముద్గరములఁ దాల్చి నిలిచెను. కాలదండమను యమసాధనము ఆకారము ధరించి యగ్నికాంతి కలదై ప్రక్క నిలిచెను.

ప్రపంచము ప్రలయమున నాశనుగును గదా యదియెట్లు వ్యయమని సందేహింపరాదు. ప్రపంచము నిత్యమైనది-ప్రవాహమువలెనని యొఱుఁగునది. మనకుఁ గానరాకపోఁగానే మఱియొకచోట నది లేదనరాదు. ప్రవాహమునందొక గడ్డి పోఁచ వేసిన నది కొంతసేపటికిఁ గానరాకపోవును. అమాత్రమున దానికి నాశము చెప్పరాదు అట్టులే ప్రపంచము ప్రలయమందుభగవంతునందు లీనమైయుండును. వెలుపల జలప్రలయవేళఁ బ్రపంచము నంతయు భగవంతు గర్భమునందు మార్కండేయుఁడు చూచెఁగదా.

తే. కాలపాశంబులతనిప్ర♦క్కల రహించె,ముద్గరమువహ్నితుల్యమౌ♦మూర్తిదాల్చి
యతని సేవించె లోకంబు ♦ హావళించె, సర్వలోకభయావహా♦కృమునఁజూచి.

### తాత్పర్యము

కాలపాశంబు లతని ప్రక్కనుండెను. ముద్గరము అగ్నిసమానమైనయాకారము ధరించి యతని గొలుచుచుండెను. సమస్త జనులకు భయంకరుఁడైన యమునిఁ జూచి లోక ముపద్రవ పడెను.

ఉ. సారథి చోదితంబు లయి • స్యందన ఘోటకముల్ మనోజవో
దారము లేగి యా హరిహ • యంబుల భంగి, రణంబు చెల్లు త
ద్ధారిఁ జేర మూ ర్తమునఁ • దద్రథముం గని మృత్యుయుక్తమున్
ఘోరవికారరూపమును • గుండెలు వ్రీల దశాస్యమంత్రులు ల్. ౪౩౯

అర్థములు. సారథిచోదితంబులు=సారథిచేఁ దోలఁబడినవి, స్యందన ఘోటకముల్=రథమునకు గట్టిన గుఱ్ఱములు, హరిహయంబుల భంగిన్=సూర్యుని గుఱ్ఱములవలె, మనోజవోదారతన్=మనస్సు వేగమువంటి గొప్ప వేగముతోఁ బోయి అల్పకాలములో యుద్ధము జరుగు ప్రదేశముఁ జేరఁగా మృత్యువుతోఁ గూడి భయంకరమైన వికారరూపముగల యాతేరిని జూచి రావణ మంత్రులు గుండెలు పగులఁగా.

సారథి చోదితంబు- ఇందు 'చో' గాయత్ర్యక్షరము- ఇరువది రెండవ యక్షరము.

క. మనమా యీతనిఁ దొడరఁగ, మనుమార్గము కల్లయనుచు•మదమతి సత్త్వం
బును లేమి భయార్దితులై, చనిరి మదులు సుడివడంగ •సహాసోత్థితులై. ౪౪౦

తాత్పర్యము

ఈయమను మనమా యెదిరించి యుద్ధము చేయుట,ఎదురుఁగా బోయితిమా బ్రదుకుట యబద్ధము అని గర్వముడిగి, బలములేమిని భయముచేఁ బీడింపబడిన వారై తటాలున లేచి మనస్సులో భ్రమించుచుండ బోయిరి.

## —• యమ రావణ యుద్ధము •—

ఉ. అట్టి భయానకాకృతి మ • హారథముం గని పంక్తికంఠుఁడున్
దొట్టనిభీతి నెట్టెదుటఁ • దొ్రిలకుండినఁ దోమరాదులన్
నెట్టనవర్ష ముం బఱపె • నేర్పున గాలుఁడు వానిమీఁద వాఁ
డిట్టుల మైనధీరతఁ బ • రేతపు తేరిపయిన్ శరావళిన్. ౪౪౧

అర్థములు. భయానకాకృతి=భయంకరాకారముగల, తొట్టని భీతి=భీతి లేనివాఁడై.

తాత్పర్యము

అట్టి భయంకరాకారముగల తేరిని జూచి రావణుఁడు భయములేక మెట్ట యెదుట చలింపక నిలువఁగా యముఁడు నేర్పుతో వానిమీఁదఁ దోమరములు మొదలైన యాయుధములను వానవలెఁ గురియించెను. వాఁడును చలింపని దృఢమైన ధైర్యముతో యమునిమీఁద బాణసమూహములను ప్రయోగింపఁగా.

ఉ. అంబుధరంబురీతిఁ గురి • యన్ యముఁడున్ విబుధారిపై న్విశా
లంబగురొమ్ము శక్తులఁ గ • లంబకపంక్తుల వ్రచ్చినన్ మహా
డంబర మూని నొచ్చియుఁ గ • డంకను బోరుచు మారు సేయ లే
కంబరచారివైరి పెనఁ • గాడెను రాత్రు లేడు మానియై. ౪౪౨

అర్థములు. కలంబక పంక్తులన్=బాణముల వరుసలచే, వ్రచ్చినన్=చీల్పఁగా, కడంకను=ప్రయత్నముతో, అంబరచారివైరి=రావణుఁడు, మానియై=పౌరుషము గలవాఁడై.

తాత్పర్యము

మేఘమువలె గురియఁగా యముఁడు రావణాసురుని విశాలమైన రొమ్మును శక్తుల చేతను బాణములచేతను జీల్పఁగా బాధపడియుఁ బ్రయత్నముతో యుద్ధము చేయుచు బదులు జేయలేక పౌరుషమునకై యేడు రాత్రులు యుద్ధము చేసెను.

క. నానాప్రహరణనిహతుల, నానారీతులను నొచ్చి • నరభక్షకుఁడున్
హీనస్మృతియై విముఖుం • డై నెఱిఁ దొలఁగియు జయంబు • నందలి యాశన్. ౪౪౩

అర్థములు. నానాప్రహరణ నిహతులన్=అనేకములైన యాయుధముల దెబ్బలచే, నరభక్షకుఁడు=మనుష్య భక్షకుఁడు, హీనస్మృతియై=తెలివితొలఁగినవాఁడై, విముఖుండై=మాఱుముఖము పెట్టినవాఁడై, నెఱిదొలఁగియు = పరాక్రమము వదలియు.

తాత్పర్యము

అనేకాయుధముల దెబ్బలచే ననేకవిధముల నొచ్చియు రావణుఁడుస్మృతి తప్పి మారుముఖము పెట్టి పరాక్రమము చెడినను జయమునందలి యాశచే.

ఉ. వెండియుఁ దాఁకె దండధరు • వీరవరేణ్యులు గెల్పుఁ గోరి యు
ద్దండపరాక్రమంబునను • దాఱక మాఱుమొగంబు గాక దో
శ్చండత భండనం బిటులు • సల్పఁగ నింట మహర్షులున్ మరు
త్కాండము వచ్చి నిల్చెను వి • ధాత్రుఁడు మున్నుగఁ బోరు చూడగన్. ౪౪౪

అర్థములు. తాఱక=వెనుదీయక, దోశ్చండతన్ = భుజబలము యొక్క దీక్ష్ణతచే, భండనము=యుద్ధము, మరుత్ - కాండము=దేవతాసమూహము.

తాత్పర్యము

మరల యముని నెదిరించెను, వీరశ్రేష్ఠులైన యిరువురు జయముగోరినవారై యధికపరాక్రమమున వెనుదీయక మాఱుమొగము పెట్టక భుజబలాధిక్యముచే యుద్ధముచేయఁగా నాకాశమున బ్రహ్మను ముందుగా నుంచుకొని మహర్షులు దేవతల గుంపు యుద్ధము చూడ నిల్చిరి.

క. సమవర్తికి దశముఖునకు, సమరము వర్తిల్లె నపుడు • జగముల కెల్లన్
సమయుట లభియించెనొ నాఁ, దమిచరుఁ డవ్వేళ వజ్ర•ధరుదంభోళిన్. ౪౪౧

అర్థములు. సమవర్తికి=యమునకు.

తాత్పర్యము

యమునకు రావణునకు జగము లన్నియు నాశమై పోవుకాలము వచ్చినదా యన్నట్లు యుద్ధము జరిగెను. అప్పుడా రాక్షసుఁడు ఇంద్రుని వజ్రాయుధమును.

క. తలఁపించు చాపదండం, బలఘుధ్వను లీన శరచ•యంబులచే ద్యో
తలము నిరంతర మొనరించి, యలుకన్ మృత్యువును నాలు•గంబకములచేన్.

అర్థములు. తలఁపించు=జ్ఞప్తికిఁ దెచ్చు, ద్యోతలము = ఆకాశప్రదేశము, నిరంతరము=ఎడములేనిది, అంబకములచేన్=బాణములచే

తాత్పర్యము

జ్ఞప్తికిఁదెచ్చు విల్లు గొప్ప ధ్వనులు గలిగించుచుండ బాణసమూహముచే నాకాశమున సందు లేకుండునట్లు చేసి కోపమున మృత్యువును నాలుగుబాణముల చేతను

క. సూతుని శరసప్తకమునఁ, బ్రేతపతిన్ నూఱువేల•యిషువుల నేయన్
జాతరుషావేగసము,త్స్ఫీతుం డగు యముని వదన • వివరము వెంటన్. ౪౪౨

అర్థములు. శరసప్తకమునన్=ఏడు బాణములచేతను, ఇషువులన్ = బాణములచేతను, జాత=పుట్టిన, రుషావేగ=కోపాతిశయముచే, సముత్+స్ఫీతుఁడు=మిక్కిలి ప్రకాశించువాఁడు, వదన వివరము=నోటిరంధ్రము.

తాత్పర్యము

సారథిని ఏడు బాణముల చేతను యముని నూఱువేల బాణములచేతను వేయఁగా మిక్కిలి కోపముచే మండుచున్న యముని నోటివెంట.

క. జ్వాలామాలాభీల వి, శాలవిభావసుఁడు ధూమ•సహితుం డగుచున్
గాలుని నిశ్వాసముతోఁ, బోలం జనియించి వెడలె•భువనము వణఁకన్ ౪౪౩.

అర్థములు. జ్వాలా మాలాభీల విభావసుఁడు=జ్వాలల వరుసలచే భయంకరుఁడైన యగ్నిహోత్రుఁడు, ధూమసహితుం డగుచున్ = పొగతోఁ గూడినవాఁడై, కాలుని=యముని, నిశ్వాసముతో=ఊపిరితో.

తాత్పర్యము

జ్వాలల వరుసలచే భయంకరమైన యగ్నిహోత్రుఁడు పొగతోఁ గూడినవాఁడై యముని యూపిరితోఁ బుట్టి ప్రపంచము వణఁక వెడలి వచ్చెను.

తే. ఆ మహాశ్చర్యమును గాంచి♦యమరదాన, వాళిసన్నిధి మృత్యువు♦కాల మధిక
హర్షమును రోషమునుగూరె♦నపుడు క్రుద్ధ,తరముమృత్యువుభాషించు♦దండధరుని.

తా త్ప ర్య ము

ఆ మహాశ్చర్యమును జూచి దేవదానవుల యెదుట మృత్యువు కాలము సంతోషము రోషమును బొందెను. అప్పుడు మిగులఁ గోపించిన మృత్యువు యమునితో నిట్లనియె.

క. అంపుము నన్నిపు డీవు ని,లింపవిరోధిని వధింతు ? లీలగను స్వభా
వంపుదృఢశక్తి నాకిది, తెంపరి పాపాత్ముఁ డితఁడె ♦ దీకొను నిన్నున్. ౨౫౦

అర్థములు. నిలింపవిరోధిని=రాక్షసుని.

తా త్ప ర్య ము

నన్నుఁ బంపుము, ఈ రాక్షసుని నిపుడే సులువుగ చంపెదను. అది నాకు సహజశక్తి, సాహసికుఁడైన యీ పాపాత్ముఁడా నిన్నెదిరించువాఁడు.

సీ. హేమకశిపుఁడును ♦ ధూమకేతుండును, శంబర నముచి వి ♦ సంధిబలులు
శంబుఁడన్ దైత్యరా♦జన్యుండు బాణుండు, శాస్త్రసంవిదులు రా♦జర్షివరులు
దైత్యయక్షాహిగం♦ధర్వాప్సరోజనుల్, ఋషులును లోనగు ♦ నెల్లవారు
సద్రుమ సార్ణవా ♦ సగ్రావ సాపగా, వనిచక్ర మెల్ల సం ♦ వర్తవేళ
తే. మతి దురాసదవిక్రమ♦మహితులెల్ల, వారిపై నాదుచూపులు♦ వ్రాలినంత
నమసిపోవరే యీనిశా♦చారి యెంత, పంపుమీ నన్ను దేవ! శు♦భంబుఁగూర్తు.

అర్థములు. శాస్త్రసంవిదులు=శాస్త్రము నెఱిఁగినవారు, సద్రుమ=చెట్లతో సార్ణవ=సముద్రములతో, సగ్రావ=కొండలతో, సాపగా=నదులతోఁ గూడిన, అవనిచక్రము=భూవలయము, సంవర్తవేళ=ప్రళయకాలమందు, దురాసదవిక్రమ మహితులు=జయింపరాని పరాక్రమము గల గొప్పవారు, నిశాచారి=రేద్రిమ్మరి, రాక్షసుఁడు.

తా త్ప ర్య ము

హిరణ్యకశిపుఁడు, ధూమకేతుఁడు, శంబరుఁడు, నముచి, విసంధి, బలి, శంభుఁడు(దంభుఁడని పాఠాంతరము) బాణుఁడు వేదజ్ఞులు రాజర్షి శ్రేష్ఠులు దైత్యులు యక్షులు గంధర్వులు అప్సరసలు ఋషులు మొదలగు వారందఱు చెట్లు సముద్రములు కొండలు నదులు గల భూచక్ర మంతయుఁ బ్రలయకాలమందు వీరుగాక తక్కిన మహాబలపరాక్రమములు గలవారుకూడ నా చూపులు తమపైఁ బడినంత మాత్రమున నాశమైపోరా? ఈ రాక్షసుఁ డెంతమాత్రము? దేవా నన్నుఁబంపుము, నీకు మేలు చేసెదను.

క. ఎంతబలవంతుఁ డేనియు, నంతక ! నాదృష్టి సోఁక • నవనిని మనఁగా
నంతస్వతంత్రుఁడె? ధర్మ,స్వాంతా! నను విడుము వీని•పాటుం గనుమీ. ౭౯౨

అర్థములు. ధర్మస్వాంతా=ధర్మబుద్ధి గలవాఁడా.

తా త్ప ర్య ము

(అంతకా! ఎంత బలవంతుఁ డయినను నాదృష్టి సోఁకఁగా భూమియందు బ్రదుకఁగలఁడా! స్వామీ! నన్ను వదలుము. తర్వాత వాని పాటు చూచెదవుగాక.)

తే. దేవ! నాశక్తి గాదు స్వ•భావముగనె, గలిగె నాకట్టి బలము నా•కన్నుఁగవకుఁ
గాన వచ్చినవాఁ డొక•గడియ యైన, బ్రదుకఁజాలఁడు నిక్కంబు•శ్రాద్ధదేవ!

అర్థములు, శ్రాద్ధదేవ=యముఁడా.

తా త్ప ర్య ము

(దేవా! నాశక్తిగాదు. నాకాబలము స్వభావముతోనే కలిగినది. నా కంటఁబడినవాఁడు గడియయైన బ్రదుకఁజాలఁడు. ఇది నిజము)

## —• యముఁడు రావణునిపై యమదండము వైవఁ బూనుట •—

చ. అనవుడు ధర్మరాజు నిలు • మా వధియించెద వీనినంచుఁ జె
న్నినుక నమోఘభీతికర • నిష్ఠురదండముఁ గేలఁ బూనె నా
తనికెలనన్ సమీరసఖ•దారుణముద్గర మాత్తరూప మై
దనరెను గాలపాశములు ద•ద్దయు నాల్కఁ గ్రోయుచుండగన్. ౭౯౩

అర్థములు. అమోఘము=వ్యర్థము పోనిది, భీతికరము = భయంకరము, నిష్ఠురము=కఠినమైనది, కాలము రాకున్న మృత్యు వేమియుఁ జేయఁజాలదు. రావణున కింకను కాల మనుకూలించి యున్నది కావున మృత్యువు వానినిజంపఁజాలదని తలఁచి స్వతంత్రించి చంపశక్తిగల దండములు ప్రయోగింప నెంచెను. కెలనన్=పార్శ్వమందు, సమీరసఖ=అగ్నివలె, దారుణ=తీక్ష్ణమైన, ముద్గరము=రోఁకలివంటి యాయుధము, ఆత్తరూపము=ఆకారము పొందినదై, క్రోయు చుండగన్=విషముమగాఁ జూఁచుచుండఁగా, అగ్నిజ్వాలలవలె, పాముకోరలవలె ఋజువుగాఁగాక వంకరటింకరగాఁ జూచుట.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా నీవు నిలుము. వీనిని జంపెదనని మిగులఁ గోపించి వ్యర్థము పోనిదియు దిగులు పుట్టించునదియు కఠినమైనదియు నగు దండమును జేతికిఁ దీసికొనెను. అతని ప్రక్కన అగ్నివలె తీక్ష్ణమైన ముద్గరము స్వరూపము ధరించి నిలిచెను. కాలపాశములు పాములవలె నాలుకలు ఆడించుచుండెను.

తే. దర్శనముచేతఁ బ్రాణికదంబకంబు, ప్రాణము వెలార్చునది ప్రేతరాజు కేలఁ
బూని వెసఁ ద్రిప్పివైవంగఁ బూనినంతఁ, బలుక నేటికి దానిరూపంబురీతి.

అర్థములు. ప్రాణికదంబకంబు=ప్రాణి సమూహము, వెలార్చునది=వెడలఁ దీయునది.

తా త్ప ర్య ము

ప్రాణికోటులు దానిని జూచినంత మాత్రముననే భయపడి ప్రాణములు విడుచును. అట్టి స్వభావభయంకరత్వము గలది యఁక యముఁడు చేతఁ దీసికొని ప్రయోగింపఁ బూనినపుడు దాని యాకారము గుఱించి యేమని చెప్పుదును?

క. జ్వాలలఁ బరివృత మై యవలీలగ రాక్షసునిఁ దునుము లీలలతో నా
భీలమ్ముగ బలవంతుని, కేల మహాసాధనంబు కెరలం గనుచున్. ౪౫౬

అర్థములు. జ్వాలల పరివృతమై=శిఖలతోఁ జుట్టఁబడినదై, ఆభీలమ్ముగన్= భయంకరముగ, కెరలన్=విజృంభించి ప్రకాశింపఁగా.

తా త్ప ర్య ము

(మంటలతోఁ జుట్టఁబడి రాక్షసుని నవలీలగఁ జంపునైఖరితో భయంకరముగ యముని చేతియందు మహాసాధనము విజృంభించి ప్రకాశింపఁగాఁజూచుచు.)

క. అందఱు రణతలము న్విడి, చిందఱవందఱగఁ బాఱఁ జేడ్పడి మింటన్
బృందారకు లుద్యద్దండుం దరణిజుఁ గాంచి కలఁక నూల్కొని రెదలన్. ౪౫౭

అర్థములు. ఉద్యత్=ఎత్తఁబడిన, దండున్=దండము గలవాని, తరణిజున్= సూర్యపుత్రుని, యముని, నూల్కొనిరి=పొందిరి.

తా త్ప ర్య ము

(అందఱు యుద్ధభూమిని విడిచి చిందఱవందఱగఁ బాఱిపోవఁగా, నాకస మున దేవతలు దండమును నెత్తిన యమునిఁజూచి చేష్టలు దక్కి గుండెలు చెదిరిన వారయిరి.)

—దండము వైవవల దని బ్రహ్మ యముని నివారించుట—

క. రావణునిమీఁద దండము, వైవఁగఁ దమకింప యముడు వారిజభవుఁ డా
వైవస్వతుముంగలఁ దా,నే విస విస వచ్చి నిలిచి యిట్లు వచించెన్. ౪౫౮

అర్థములు. తమకింపన్=త్వరపడఁగా.

తా త్ప ర్య ము

రావణునిమీఁద దండము వేయ యముఁడు తొందరపడుచుండఁగా బ్రహ్మ తానే వచ్చి యమునిముందు నిలిచి యిట్లు చెప్పెను.

మ. శమనా! తాళుము తాళు, చంపకుము ర॥క్షశ్శ్రేష్ఠునిన్ నీదు దం
డమునన్, నే వర మిచ్చినాఁడను నిశా॥టస్వామి చావుండఁ గా
న మదీయోక్తి నసత్యముం జలుప నో॥నా నీకు? నెవ్వండు దే
వమనుష్యాదులఁ బొల్లు సేసినను మ॥ద్వాక్యంబు సయ్యాతఁడున్. ౪౯

అర్థములు. శమనా=ధర్మరాజా, నిశాటస్వామి=రాక్షసరాజు.

తాత్పర్యము

ధర్మరాజా! సహింపుము సహింపుము. రాక్షస శ్రేష్ఠుని నీదండముచేఁజంపకుము. వాఁడు దేవతలచేఁ జావకుండునట్లు నేను వరమిచ్చినాను. నామాట నసత్యము చేయవచ్చునా? దేవతలందుఁగాని మనుష్యులందుఁగానీ యెవ్వఁడు నా మాట నసత్యముగఁ జేయునో వాఁడు.

క. అనృతంబుగ ముజ్జగములఁ, బొనరించినవాఁడ యగును ॥ బుధసత్తమ కా
వున విడువకుమీ దండము, ననుఁ గల్లరిఁ జేయ నీ మ॥నంబున లేదేన్. ౫౦

తాత్పర్యము

మూఁడులోకముల నసత్యము చేసినవాఁడేయగును. సత్యమునువదినవించును కావున నన్నసత్యవాదిని జేయ నీకు నిష్టము లేదేని దండమును వేయకుము.

చ. జయ మొదఁ గోరి కోపమునఁ॥సంబున వైచితి వేని దండమున్
ప్రియుఁడును నప్రియుం డనెడి॥భేదము నెంచక లోకపాళికిన్
భయ మొదవించుచున్ దునుమఁ ॥ ప్రాణుల నెల్లను, నేన దాని దు
ర్జయము నమోఘమై వఱలఁ॥జల్పితి మృత్యుపురస్కృతంబుగన్. ౫౧

అర్థములు. మృత్యుపురస్కృతంబుగన్=మృత్యువు ముందుగాఁగలదిగా.

తాత్పర్యము

నీవు యుద్ధమందు జయముగోరి వీనిని జంపి కీర్తిపొందవలయునని కోరిక గలవాఁడవై యీ కఠినదండము వేసితివా యది వీఁడు ప్రియుఁడు వీఁ డప్రియుఁ డను భేదము నెంచక లోకుల కందఱకు భయము గలిగించుచు సమస్త జీవికోటులను జంపును. దానికట్టి యమోఘశక్తి మృత్యువుతోఁ గూడినదానిఁగా నేనేయిచ్చితిని

ఉ. నీ విపు డీ నిశాటుపయి ॥ నిష్ఠురదండము వైచితేనియున్
జావక వీఁడు మూర్తమును ॥ జాలఁడు ప్రాణముతోడ నుండఁగాఁ
జావక యుండెనేనియును ॥ జచ్చిన యేని యసత్యమై చనున్
నావచనంబు రెంట శమ॥నా! నను సత్యవచస్కుఁ జేయుమా. ౫౨

తా త్ప ర్య ము

నీ వీ యమోఘ దండమును రాక్షసునిమీఁద వేసితివా వీఁడు చావక యొక ముహూర్తమాత్రము కాలమైనను ప్రాణముతో నుండ లేఁడు. వీఁడు చచ్చినను జావకుండినను రెంటను నామాట యసత్యమై పోవును. నన్ను సత్యవాదిని నీవు చేయుము.

క. విడువకుమీ దశముఖుపై, బెడిదపుదండం బటన్న • విని ధర్ముఁడున్
విడుచుట మానితి దండము, నొడయుండవు మాకు నీవు•సూక్తు లెయాజ్ఞల్.

తా త్ప ర్య ము

రావణుమీఁద నీ వీ భయంకర దండము వేయకుము అని చెప్పఁగా ధర్ముఁడుఁ నేను దండము వేయను,నీమాటలే మాకు నాజ్ఞలు,నీయాజ్ఞ నేనే యుల్లంఘింతునా?

చ. వరములు గొంట వీఁ డిపు డ•వధ్యుఁ డటంటివి యుద్ధసీమ నో
సరసిజ సంభవా! సలుపఁ • జాలుదు నెయ్యది నిల్చి? కావ నా
శరవరు దృష్టిలో నిలువ • సమ్మతి లేదని సాశ్వశస్త్రుఁడై
యదరముతోడ మాయ మయి • యంతకుఁ డేగెఁ బం క్తికంఠుఁడున్. ౧౮౪

అర్థములు. ఆశరవరుదృష్టిలో = రాక్షసునకుఁ గానవచ్చున ట్లెదుట, సాశ్వశస్త్రుఁడై = గుఱ్ఱములతోను ఆయుధములతోను తేరితోను గానరాక యముఁడు పోయెను. రావణుఁడును—

* దేవతలం దిది సమయము-ఒకరు చెప్పినమాటను మఱియొకరు వ్యర్థము చేయ నొల్లరు.

తా త్ప ర్య ము

నీవు వీనికి వరము లిచ్చితివి. కావున వీనిని జంపవల దంటివి. బ్రహ్మదేవా! యిఁక నేనిచ్చట నిల్చి చేయఁదగిన పని యేమున్నది? పనిలేక రావణుకంటె కెదుట నిలువ నిష్టములేదు అని చెప్పి యముఁడు గుఱ్ఱములతోను ఆయుధములతోను తేరి తోడను నదృశ్యుఁడయ్యెను. ఇట్లు యముఁడు పోఁగా రావణుఁడు.

క. గెలిచితి యముని నటంచుం, బలుకుచు బీరంబు తనవి•మానముపైఁ బే
రెలమిని నారోహించెను, నలకాలునిపురము విడిచి•యరిగెను స్వేచ్ఛన్. ౧౮౫

తా త్ప ర్య ము

(యముని గెలిచితినని బీరములు పలుకుచు మిగుల సంతసమునఁ దన విమానము మీఁద నెక్కి- యమపత్తనమును విడిచి స్వేచ్ఛగాఁ బోయెను.)

క. నమనత్రియు హృష్టుండై, యమరశ్రేష్ఠాన్వితముగ • నరిగెం దివికిన్
సుమనోముని నారదుతో, సమరవిధం బెంచికొనుచు•స్వాంతమునందున్. ౧౮౬

అర్థములు. సమవర్తి యు=యముఁడును, హృష్టుండై = సంతోషించినవాఁడై, అమరశ్యేష్ఠాన్వితముగన్=బ్రహ్మతోడ, సుమనోముని = దేవముని నారదుతో, స్వాంతమునందుక్=యుద్ధమందు.

### తాత్పర్యము

(యముఁడును సంతోషించి బ్రహ్మతో దేవర్షి నారదునితో యుద్ధమును గూర్చి మనసులో యోజించుకొనుచు స్వర్గమునకుఁ బోయెను.

## ౨౩వ సర్గము

### —• రావణుఁడు నివాతకవచులతో సంధి సేసికొనుట •—

సీ. దశకంఠుఁ డనిలోన • ధర్మరాజును గెల్చి, తన సహాయులఁ జూడఁ•దడయకేగ
సాయకసంఘాత•జర్జరీకృతదేహు, రక్తసిక్తాంగుని • రాక్షసేంద్రు
విస్మయపరు లయి • వీక్షించ జయ జయ, వాక్యాలఁ బొగడిరి•వారలెల్ల
మారీచుఁ డాదిగా • వారల నందర, నలరించి పుష్పకం • బెలసి యసుర
తే. యురగదైత్యగణాధ్యుష్ట • వరుణరక్షి తాబ్ధి వాసుకిపాలిత•మైనభోగ
వతిని గన్గొని నాగుల•భంగపఱచిఁ మణిమయాఖ్యపురిం జేరె•రణముఁగోరి.

అర్థములు. తనసహాయులఁజూడఁ దడయకేగ ననుటచే మంత్రులు లోనగువా రందఱు భయపడి దూరముగాఁ దొలఁగిపోయి రనియు, రావణుఁ డొక్కఁడే నిలిచి యుద్ధము చేసెననియు గ్రాహ్యము, సాయక సంఘాత = బాణసమూహములచే, జర్జరీకృతదేహున్=శిథిలముగఁ జేయఁబడిన దేహము గలవానిని, రక్తసిక్తాంగుని=నెత్తుటఁ దడిసినవానిని, ఉరగదైత్యగణాధ్యుష్ట=ఉరగులచేతను దైత్యులచేతను గూడినదై, వరుణ రక్షిత=వరుణునిచే రక్షింపఁ బడినదైన, అబ్ధిన్=సముద్రమందు.

### తాత్పర్యము

రావణుఁడు యుద్ధమందు ధర్మరాజును గెల్చి తన సహాయు లున్నచోటికి వారిని జూడఁబోగా బాణసమూహముల దెబ్బలచే శిథిలమైనదియు నెత్తుట దడిసినదియు నగు దేహముగల రాక్షసరాజును జూచి యాశ్చర్యపడి జయజయ యని మారీచుఁడు లోనగువారు పొగడిరి. వారి నందఱ సంతోషపఱిచి పుష్పక మెక్కి రావణుఁడు నాగులు దైత్యులు గలదై వరుణునిచే రక్షింపఁబడు సముద్రమందుఁ గల భోగవతీపురమునకుఁ బోయి వాసుకి మొదలగు నాగుల జయించి యుద్ధముఁ గోరి మణిమయ మను పురముఁ జేరెను.

ఆ. పంక్తికంఠుఁ డనికి•నచ్చట యాలించి, ప్రాప్తవరులు నౌని•వాతకవచు
లనెడిదైత్యవర్యు•లాహవకాంక్షను, వెడలి తాఁకి రోలిఁ•గడిమి మెఱసి ౨౬-౨౮
అర్థములు. ప్రాప్తవరులు=బ్రహ్మచే వరము పొందినవారు.

తాత్పర్యము

(రావణుఁడు యుద్ధమునకు వచ్చుట విని బ్రహ్మచే వరముపొందిన నివాత కవచు లనెడి రాక్షసులు సమరముచేయవలె ననెడి కోరికతో బయలుదేఱి పరాక్రమముతోఁ దాఁకిరి.)

క. దైతేయులకును రక్షో, వ్రాతంబున కయ్యె భీక♦రం బగు నభిసం
పాతంబు శూల శర పరి,ఘాతనపట్టసకుఠార♦కరవాలములన్. ౪౬౯

అర్థములు. అభిసంపాతంబు=యుద్ధము.

తాత్పర్యము

(దైత్యులగు నివాత కవచులకును రాక్షసులకును శూలములు, బాణములు, పరిఘములు పట్టసము కుఠారములతో భయంకరమగు యుద్ధముజరిగెను.)

క. ఒండొరులను భేదించుచు, భండన మొకయేఁడు సాగ♦ వారలలోనన్
బెండువడద యేపక్షము, గండున విజయంబు నెదియుఁ♦గాపద యంతన్. ౪౭౦

అర్థములు. బెండువడద=నిస్సారముకాలేదు, గండునన్=బలమునందు.

తాత్పర్యము

ఒకరినొకరు కొట్టుచు నొకసంవత్సరము రాక్షసులు నివాతకవచులుయుద్ధము చేసిరి. కాని వారిలో బల ముడిగి ఓడినవాఁడు. గెలిచినవాఁడు లేఁడు.

చ. ద్రుతిగతి దేవయానమునఁ♦ దోయజసంభవుఁ డేగుదెంచి యా
దితిజులఁ బోరునిల్పఁగ వి♦ధించి వచించెను దైత్యులార! నా
మతిఁ జనుఁ డీస రావణుఁడు♦ మద్వరలాభముఁ జేసి దేవతా
తతులకు దానవాళులకుఁ♦ దక్క మజయ్యుఁడు మీ విధంబునన్. ౪౭౧

అర్థములు. ద్రుతగతిన్=శీఘ్రగమనమున, దేవయానమునన్=విమానము మీఁద, తోయజసంభవుఁడు=బ్రహ్మ, దితిజుల=నివాతకవచుల.

తాత్పర్యము

బ్రహ్మదేవుఁడు శీఘ్రముగ విమానమునఁ గూర్చుండివచ్చి నివాతకవచులతో నిట్లనియె. దైత్యులారా! నేను జెప్పిన ప్రకారము పొండు. రావణుఁడు మీవలెనే నావలన వరములు పొందినవాఁడగుటచే దేవతలకు దానవులకు నజయ్యుఁడు. వానిని మీరు జయింపలేరు. వాఁడు మిమ్ము జయింపలేఁడు. కలహమే మీకిష్టమయ్యెనా కలకాల మిట్లు కలహించుచుండవలయును.

క. కావున మీలో మీకే,లా వలవనిపోరు మీర♦లందఱు నొకమన్
కేవ నెనంగుఁడు నెయ్యుర, చేవస్తువులైన భోజ్య♦మితరేతరమున్. ౪౭౨

అర్థములు. ఒరిమన్=ఒద్దికతో, సెయ్యర=మిత్రులయొక్క, ఇతరేతరమున్=ఒకరిది మఱొకరు, అన్యోన్యము.

తాత్పర్యము

(కావున మీలో మీకుఁ బనిలేని యుద్ధమెందుకు? మీరందఱు నొద్దికతోఁ గలసిమెలసి చేవగలిగియుండుఁడు. మిత్రులయొక్క వస్తువు లొకరిది మఱొకరనుభవింపఁ దగియుండును.)

అ. అట్టిఫలము గలుగు • నైకమత్యంబున, ననుచు నేగ దశము • ఖాసురుండు
వహ్నిసాక్షికముగ • వారితో స్నేహంబు, సలిపి ప్రీతుఁడగుచు • సంతసమున. ౪౭౩

తాత్పర్యము

(ఐకమత్యమువలన నట్టి ఫలముగలుగును. అనిచెప్పి పోవఁగా, రావణుఁడు వారితో నగ్నిసాక్షికముగా స్నేహముచేసి ప్రీతిగలిగి సంతోషముతో.)

చ. తనపురియందుఁబోలె నమి • తప్రియసౌఖ్యము లాపురంబునం
దనివి సనంగ నొందుచును • దా నొకయేఁడు వసించి వారిచే
దనుజులమాయలం బొకశ • తంబును నేరిచి కంధిరాజుప
ట్టనము రసాతలంబున దృ • ఢం బగు యత్నముతోడ రోయుచున్. ౪౭౪

అర్థములు. తనివి=తృప్తి, కంధిరాజు=వరుణుని, రసాతలంబునన్=పాతాళమందు, మాయలు=వంచించు విద్యలు.

తాత్పర్యము

(తన పట్టనమునందువలె నాపురమున నమితమైన యిష్టసౌఖ్యములు తనివి తీఱ ననుభవించుచు, నొకసంవత్సరముండి, దనుజుల మాయలలో నొకనూఱు నేర్చుకొని వరుణుని పట్టనమును పాతాళమునందుఁ బనిపూని వెదకుచు)

## — • రావణుఁడు కాలకేయుల జయించుట • —

సీ. కాలకేయగణంబు • లేలెడు నశ్మన, గరమును గనుఁగొని • కలహమునకు
వారలఁ బిల్చి దు • ర్వారబలాఢ్యుల, వధియించెఁ బెక్కుర • బలము పేర్మి
శూర్పణఖాభర్త • శూరుని మఱఁదిని, దనవారి మ్రింగెడి • దనుజవర్యు
బలియు విద్యుజ్జిహ్వుఁ • బటుశక్తిఁ దరవారి, ఖండించి శీర్షమా • క్షణమునంద
తే. నాల్గునూఱులదైత్యుల • నాము మణఁచి, జయముఁ జేకొని పాండుర • జలధరాభ
మగుచుఁ గైలాసశైలంబు • నగడిదానిఁ బూర్ణచంద్రప్రభాయుక్తిఁ • బోలుచుదాని

అర్థములు. తరవారిన్=కత్తిచే, పాండుర=తెల్లని, జలధరాభము = మేఘముతో సమానము, పూర్ణచంద్రప్రభాయుక్తిన్=నిండుచంద్రుని కాంతితో.

తాత్పర్యము

కాలకేయు లనువారు పాలించు నశ్మనగరమును జూచి వారిని యుద్ధమునకు బిలిచి మహాబలవంతులగు వారిని ననేకుల బలాతిశయమునఁ జంపెను. శూర్పణఖ భర్తయగు విద్యుజ్జిహ్వుఁడు (తన మఱఁది) తన వారిని మ్రింగుచుండఁగాఁ గత్తిచే వానితల నఱికి యాక్షణమునందే నాలుగునూర్ల దైత్యులను జంపెను. ఇట్లు జయించి తెల్లని మేఘమువలెఁ బూర్ణచంద్రకాంతితోఁ బోలుచును కైలాస పర్వతమువలె నున్న దానిని.

—• రావణుఁడు వరుణనగరంబుపై బోవుట •—

తే. వరుణపట్టనముం గాంచి• పాలధారఁ, గార్చు సురభిని వర్యోద్ధ• గాంచెనసుర
వర్యుఁ డా యావ తనపాల• నఱలఁ జేసి,రామ! యుదధిని క్షీరోద• నామకంబు

అర్థములు. సురభి=కామధేనువును, క్షీరోదనామకంబు = పాలసముద్రమను పేరుగలదానిని.

తాత్పర్యము

(వరుణుని పట్టణమును జూచి యందుఁ బాలధారను గార్చుచున్న కామ ధేనువును రావణుఁడు జూచెను. ఆయావే తన పాలచేత సముద్రమును బాల సముద్రమను బేరుగలదానిఁగాఁ జేసెను.)

ఆ. అంబ వృషభేంద్రునంబయు• హారిశీత, కరుని యుత్పత్తి హేతునై• క్రాలుదాని
నురువు ద్రావియ జీవించు• నుత్తమర్షి, వితతులకు జీవగఱ్ఱనై• వెలయుదాని. ౪౭౭

అర్థములు. వృషభేంద్రుఁ=శివుని వాహనమైన నందీశ్వరునకు. అంబ=కన్న తల్లి, హారి శీతకరుని=మనోహరమైన చల్లని కిరణములు గల చంద్రుని, జీవగఱ్ఱ= జీవనౌషధము, బ్రదికించు మూలిక, జీవగఱ్ఱ, ఇది యనింద్య గ్రామ్యము, ఆంధ్ర మున సమాసములందు సంస్కృతపదము మొదటిదిగాను రెండవది యాంధ్ర శబ్దముగానుండు సమాసములు లేవు. దినవెచ్చము, జీవగఱ్ఱ ప్రాణగొడ్డము ఇవి ప్రయోగము లందుఁ గానఁబడుచున్నవి. ఇవి యనింద్య గ్రామ్యము లని చెప్పఁ బడెను. ఇట్టివి 'అనేకమంది' లోనైనవి కల్పింపరాదు.

తాత్పర్యము

(దానియందు, శివునివాహనమైన నందీశ్వరునకు గన్నతల్లియు, మనోహర మైన చల్లని కిరణములుగల చంద్రుని యుత్పత్తికిఁ గారణమైనదానిని, నురువు ద్రావియే జీవించు ఋషిశ్రేష్ఠులకు జీవనౌషధమై ప్రకాశించుదానిని)

తే. దేవతాళికి సుధ నిత్య• దేవతలకు, స్వధయు నొసఁగెడిదానిని • జనములెల్ల
సురభి యని పిల్చుదానిని • బరమచిత్ర, మైనదానిని గని పల• లాశనుండు. ౪౭౮

తా త్ప ర్య ము

దేవతల యాహారమగు సుధను (హవ్యము) పితృదేవతల కాధారమైన స్వధ (కవ్యము) నొసఁగెడిదానిని (అవుపాలే రెండువిధముల నుపయోగింపఁబడును) లోకులు సురభియని పిలుచుదానిని మిగుల నాశ్చర్యకరమైన దానిని రాక్షసుఁడు-మనుష్యులందరును రాక్షసులుకూడ నావులను గౌరవింతురు.

చ. వలగొని మ్రొక్కి పోఁగి బల ♦ వర్గముచే బహుధాసురక్షితం
బలఘుశరద్ఘనాభము భ ♦ యంకరమున్ జలపూరకీర్ణమున్
లలితము నిత్యహృష్టము జ ♦ లప్రభుగేహవరంబుఁ జూచి కా
వలిభటులన్ వధించి బల ♦ వర్గము చేతను దాడితాంగుఁడై. ౪౨౯

అర్థములు. వలగొని=మ్రొక్కి, ప్రదక్షిణముచేసి నమస్కరించి, బహుధా సురక్షితంబు=అనేకవిధముల రక్షింపఁబడునది, అలఘు=గొప్పదగు, శరత్ + ఘనాభము=గొప్ప శరత్కాల మేఘముతో సమానమైనది, జలపూర కీర్ణమున్= నీటి ప్రవాహముచే గప్పఁబడినది, లలితము = అందమైనది, నిత్యహృష్టము= సర్వదా సంతోషముతోఁ గూడినది, జలప్రభు=వరుణుని, గేహవరంబున్= ఉత్తమ గృహమును, బలవర్గముచేతను=సేనా సమూహముచే, తాడితాంగుఁడై= కొట్టఁబడిన దేహముగలవాఁడై.

తా త్ప ర్య ము

ప్రదక్షిణ నమస్కారములు చేసి పోయి సేనా సమూహముచే ననేకవిధ ముల గాపాడఁబడుచు గొప్పశరత్కాల మేఘముతో సరిపోలి భయంకరమై నీటి ప్రవాహముచేఁ జుట్టఁబడి మనోహరమై నిత్యసంతోషకారణమై వరుణునియుత్తమ గృహముఁ జూచి కావలిభటుల వధించి వారిచేఁ గొట్టఁబడి.

ఉ. యోధులతోడ నిట్టులను ♦ యుద్ధముసేయఁగఁ గోరి వచ్చె దు
స్సాధపరాక్రముండు సుర ♦ శాత్రవుఁ డా దశకంఠుఁ డంచు మీ
రేధితవేగ మేఁగి వచి ♦ యింపుఁడు జేనికిఁ బోర సాహసో
త్సేధము లేద యేనియును ♦ జేతులుమోడ్చి జితోస్మి యంచనన్. ౪౩౦

అర్థములు. దుస్సాధపరాక్రముండు=సాధింపరాని పరాక్రమము గలవాఁడు సురశాత్రవుఁడు=దేవవిరోధి, ఏధిత=వృద్ధియైన, వేగముగ = సాహసోత్సేధము= మిగుల సాహసము, జితోస్మి=ఓడితిని.

తా త్ప ర్య ము

యుద్ధము చేయువారితో నిట్లనియెను. సాధింపరాని పరాక్రమముగలరావణా సురుఁడు యుద్ధము చేయఁగోరి వచ్చియున్నాఁడని వేగముపఁబోయి మీరాజునకుఁ దెలుపుఁడు. యుద్ధము చేయుఁ దెంపులేదేని యోడితినని చెప్పినఁ జాలును.

## —* వరుణతనయులు రావణునితోఁ బోరి యోడిపోవుట *—

క. చనియెద నని వచియింపుం, డని రావణుఁ డాడుచుండ ♦ నాలోఁ గినుకన్
వననిధినాయకుమనుమలు, తనయులు గోపుష్కరాఖ్య♦దళపతియుతులై. ౪౮౧

అర్థములు. వననిధినాయకు మనుమలు=వరుణుని మనుమలు, గోపుష్కరాఖ్య=గోపుష్కరులను పేరుగల, దళపతి = సేనానాయకులతోడ, యుతులై= కూడికొనినవారై, గోపుష్కరులు, వీరిరువురు సేనానాయకు లని కొందఱ యభిప్రాయము. గో అనువాఁడు సేనానాయకుఁడనియు, పుష్కరుఁడనువాఁడు వరుణుని పెద్దకొడుకనియు గొంకఱ యభిప్రాయము. భారతము ఉద్యోగపర్వమందు మాతలి వరాన్వేషణ ఘట్టంబున "ఏషోస్య పుత్రోభిమతః పుష్కరః పుష్కరేక్షణః, రూపవాన్ దర్శనీయశ్చ సోమపుత్ర్యా వృతః పతిః! జ్యోత్స్నాకాళీతి యాం ప్రాహు ర్ద్వితీయాం రూపతః శ్రియమ్॥

### తాత్పర్యము

పోయెదనని చెప్పుఁడని రావణుఁడు చెప్పుచుండ నంతలో వరుణుని కొడుకులు మనుమలు గోపుష్కరుఁ డను సేనానాయకులతోడఁ గూడినవారై.

చ. బలధృతి విక్రమాన్వితులు ♦ వారి యనీకిను లెల్లఁ గొల్వఁగాఁ
జలమునఁ గామగంబు లగు ♦ స్యందనపాళుల నెక్కి పోరికిన్
వెలువడివచ్చి రంత భృశ ♦ భీతిదసంఖ్యము చెల్లె రెండువాఁ
గులభటకోటి కం దసుర ♦ కుంజరసాధనమర్దితంబులై. ౪౮౨

అర్థములు. అనీకములు=సేనలు, కామగములు=కోరినట్లు పోఁగలవి, స్యందనపాళులన్=తేర్లసమూహములను, భృశభీతిద=మిగుల భయంకరమైన సంఖ్యము= యుద్ధము, అసురకుంజర=రాక్షసశ్రేష్ఠుఁడైన రావణుని, సాధన=ఆయుధములచే, మర్దితంబులై =కొట్టఁబడినవై.

### తాత్పర్యము

బలము ధైర్యము పరాక్రమముతోఁ గూడినవారు వారి సేనలనెల్ల దీసికొని చలమునఁ గోరినట్లు పోఁగల రథములనెక్కి యుద్ధమునకు బయలుదేఱివచ్చిరి అంత రెండు పక్షముల వారికి మిగుల భయంకరమైన యుద్ధము చెల్లెను. అందు రావణునాయుధములచేఁ గొట్టఁబడి

ఉ. వారుణసైన్యముల్ చెడిన ♦ వారుణు లాత్మచమూవిధంబుఁ గ్రా
రారియుఁ బుష్పకంబున న ♦ భోంతరవీథిని నుంటఁ గాంచి దు
ర్వారరణోత్థితంబు లగు ♦ భాస్వరభీమశతాంగపాళితో
వీథులు మింటికై యెగసి ♦ వ్రేసిరి రావణు నారసంబులన్. ౪౮౩

అర్థములు. వారుణ=వరుణ సంబంధములైన, వారుణులు=వరుణుకొడుకులు ఆత్మచమూవిధంబు=తమ సేనయుండు విధము. నభోంతరవీథిని=ఆకాశమార్గమున, దుర్వార=వారింపరాని, రయోత్థితంబులు=వేగముచే నెగసినవి. భాస్వర=ప్రకాశించు, భీమ=భయంకరమైన, శతాంగపాళితో = రథసమూహములతో, నారసంబులన్=బాణములచే.

## తాత్పర్యము

వరుణుని కొడుకులు తమ సేనయున్న విధమును క్రూరశత్రువు ఆకాశమున పుష్పకమునుండి యుద్ధము సేయుటయుఁ జూచి మిగుల వేగముచే నెగసినతేరులందుండి యాకాశమునకు నెగసి బాణములచే రావణు నేసిరి.

క. పావకసన్నిభశరముల, రావణు విముఖునిఁగఁ జేసి • రంజలి వివిధా
రావంబుల నించిన తమ భూవిభుదుస్స్థితియు వరుణ•పుత్రులయుదుటున్. ౪౭౪

అర్థములు. పావకసన్నిభశరములన్=అగ్నిసమానములైన బాణములచే, విముఖునిఁగన్=యుద్ధమునుండి మరలిపోయిన వానిఁగా, రంజలి = సంతోషించి, వివిధారావంబులన్=పలువిధముల ధ్వనులను, ఉదుటున్=గర్వము.

## తాత్పర్యము

అగ్నితో సమానములైన బాణములచేఁ గొట్టి సంతోషించి రావణుని యుద్ధమునుండి మరలినవానిఁ జేసి నానావిధములఁ గేకలువేయఁగాఁ దమరాజు నీచస్థితియు వరుణుని కొడుకుల గర్వము.

చ. కనుచు మహోదరుండు రణ•కాంక్షను మృత్యుభయంబు వీడి చ
య్యన గదఁ గేలఁ బూని సొదు•రై చనివారల ఘోటకాళి స్యం
దనముల నేలఁ గూల్చినను • దద్వరుణాత్మజు లుర్విఁ గూల స్యం
దనరహితాఘలం గని ము•దంబున నార్భటి నించె నాతఁడున్. ౪౭౫

అర్థములు. ఘోటకాళిన్=గుఱ్ఱముల వరుసలను, స్యందనములన్=తేరులను, స్యందనరహితారులన్=రథములులేని శత్రువులను.

## తాత్పర్యము

చూచి మహోదరుఁడు యుద్ధమందలి కోరికచే చత్తునేమో యను భయము వదలి శీఘ్రముగ గద చేతఁ దీసికొని వారి గుఱ్ఱముల నెల్ల వరుసగఁ జంపి రథముల విఱుగఁదన్ని నేలఁ గూలుపఁగా ఆవరుణుకొడుకులు నేలగూలగా రథములు లేని శత్రువులఁ జూచి మహోదరుఁడు సింహనాదము చేసెను,

క. హతతురగస్యందనులై, క్షితి దొరఁగియు వరుణసుతులు • స్వీయమహిమచే
నతి గూర నెగసి మింటికిఁ, గృతహస్తు లధిజ్యచాప•భృతిభీమలై. ౪౭౬

అర్థములు. హత తురగస్యందనులై=కొట్టఁ బడిన గుఱ్ఱములు తేరులు గలవారై, వెతగూరక=బాధపడ, కృతహస్తులు = చక్కఁగా గుఱికొట్టఁ గల వారు, అధిజ్య=ఎక్కు-పెట్టఁ బడిన, చాప=విండ్లయొక్క, ధృతి=ధరించుటచే, భీషణులై=భయంకరులై.

### తా త్ప ర్య ము

వరుణసుతులు రథములు గుఱ్ఱములు నేలఁ బడుటచే వారును నేలఁబడియు తమ మహిమచే గాసిలేక యాకాశమున కెగసి యా గుఱికాండ్రు ఎక్కు-పెట్టఁ బడిన విండ్లతో భయంకరులై.

చ. ఉరుతరబాణవృష్టిని మ♦హోదరు దారితగాత్రుఁ జేసి భా
స్వరపరమాయుధంబులను ♦ శైలము నబ్దము గప్పురీతి నా
శరపతిఁ గప్పి రావణుఁడు ♦ జాజ్వలదుగ్రలయాగ్నితుల్యుఁడై
శరముల వారిమర్మములఁ జక్కఁడిచెన్ నిపుణత్వమేర్పడన్. ౪౪౭

అర్థములు. ఉరుతరబాణవృష్టిని=మిగుల గొప్పదగు బాణవర్షముచేత, దారితగాత్రున్=చీల్పఁబడిన దేహముగలవానిని, అబ్దము=మేఘము, ఆశరపతిన్=రావణుని, జాజ్వలత్=మండుచున్న, ఉగ్ర=భయంకర, లయాగ్ని=ప్రలయకాల వహ్నికి, తుల్యుఁడై=సమానుఁడై. చక్కఁడిచెన్=కొట్టెను, నఱకెను.

### తా త్ప ర్య ము.

మిగుల గొప్పదగు బాణవర్షముచే మహోదరుని దేహముఁజీల్చి ప్రకాశించు గొప్ప యాయుధములచేఁ గొండను మబ్బుకప్పినట్లు రావణునిఁ గప్పగావాఁడును మండుచున్న ప్రలయవహ్నికి సమానుఁడై వాఁడి బాణములచే వారి యాయువు పట్టులపై నేర్పుతోఁ గొట్టెను.

చ. ముసలవిచిత్రభల్లశత ♦ ముల్ శితతోమరశక్తికుంతప
ట్టిసములు భీషణంబులు ప ♦ టిష్ఠము లైన శతఘ్నిసంతతుల్
కసరున నొక్కరీతి నవి ♦ కారిత దొప్పలు దోర లేయఁగా
నసలున షష్టిహాయన గ ♦ జావళి మున్గినరీతి వారలున్. ౪౪౮

అర్థములు. భల్లశతముల్=అనేకబాణములు, భీషణంబులు = భయంకర కరములు, పటిష్ఠములు=దృఢములైనవి, కసరున=కోపమున, అవికారిత = వికారములేక, మార్పులేక, దొప్పలు దోరలు=కుప్పలు కుప్పలు, అసలున=బురద యందు, షష్టిహాయన=అఱువదియేండ్లుగల, గజావళి=ఏనుఁగుల గుంపు.

### తా త్ప ర్య ము

రోఁకండ్లు, నానావిధములైన యనేక బాణములు, పదునుగల తోమరములు శక్తులు, కుంతములు, పట్టిసములు, భయంకరములు దృఢములు నగు శతఘ్నులు

కోపముచే నొక్క విధముగ మార్పులేక కుప్పలుకుప్పలుగా వేయఁగా బురదలో పడిపడియేండ్ల యేనుఁగులవలె మునిఁగిరి.

చ. ఇలఁ బడి లేవ లేక తపి ♦ యింపఁగ వారలఁ జూచి రావణుం
డెలమి మహాంబుదం బనఁగ ♦ నేర్చి ధ్వనించి యనేకసాధనం
బుల దళితాంగులం జలుపఁ ♦ బోరుదొఱంగి స్వకీయు లెత్తికొం
చలఘుగతిం జనంగ నిల ♦ యాళికి, వారలతో దశాస్యుఁడున్. ౪౯

అర్థములు. అలఘుగతిన్=వేగముగ, నిలయాళికిన్=ఇండ్లకు.

తాత్పర్యము

నేలఁబడి లేవలేక బాధపడుచుండఁగా వారలఁ జూచి రావణుఁడు సంతోషించి పెద్దమేఘ మురిమినట్లు ధ్వనించి నానాసాధనములవారి దేహముల జీలుపఁగా వారు యుద్ధము విడిచి తమవా రెత్తుకొని వేగముగ వారి వారి యిండ్ల కెత్తుకొని పోఁగా వారితో రావణుఁ డిట్లనెను.

క. నారాక ప్రచేతసునకు, మీా రెఱిఁగింపుఁడ యనం ద ♦ మీాచరవిభుతో
వారుణుఁడైన ప్రభాసుం, డోరాజా! లేఁడు పీట ♦ నుదధీశుండున్. ౫౦

అర్థములు. ప్రచేతసునకు=వరుణునకు, తమీాచరవిభుతో = రేద్రిమ్మరి రాజుతో, రావణుతో, ఉదధీశుఁడు=వరుణుఁడు, ప్రభాసునకు ప్రహాసుఁడనియు రూపాంతరము కానవచ్చెడిని.

తాత్పర్యము

వరుణునకు నేను వచ్చినవార్త యెఱింగింపుఁడు అనఁగా రావణునితో ప్రభాసుం డను వరుణుని మంత్రి, రాజా! వరుణుఁ డూర లేఁడు.

తే. ధాతృలోకంబునందు గాం♦ధర్వ మొలయ, నాలకింపఁగ నరిగినాఁ♦డయ్యపాశి
రాజ లేనప్పు డీ వృథా♦శ్రమము తగునె?, జితులు నీచేత నాతని♦సుతులువీరు.

అర్థములు. ధాతృలోకంబునందున్ = బ్రహ్మలోకమందు, గాంధర్వము= సంగీతము వినుటకు, పాశి=వరుణుఁడు, జితులు=జయింపఁబడినవారు, గాంధర్వ మాలకింపఁగ=గీతములు వినఁగ, కొందఱు తాము పాడలేకున్నను చక్కఁగా నెవరైనఁ బాడిన విని సంతోషించుటకై పాడెడివారి యొద్దకుఁ బోవుచుందురు. వరుణుఁడు దేవుఁ డయ్యెనే, ఆయనకుఁ బాడరాదా యనిన నాయనకుఁ కంఠము సరిగాలేదు. బొంగురుగొంతువాఁడు. 'కింతేన కంఠం వినా' యన్నట్లు కంఠము సుస్వరము గాదేని యాపాటయేల? వరుణుఁడు విస్వరుఁడని "అపధ్వాంతం వరుణస్య వరుణస్యతు విస్వర" అని ఛాందోగ్యోపనిషద్భాష్యమందుఁ గలదు–నిక్కముగాఁ

ద్రాగువారికి గొంతురాపు గలదు. అట్లుండ నెప్పుడు నీళ్ళలో నేనానువానికి గొంతు సుస్వరము గలదెట్లగు నని యుక్తియుక్తముగ గ్రహింపనగు ॥స॥

తాత్పర్యము

(వరుణుఁడిప్పుడిచట లేఁడు బ్రహ్మలోకమందు సంగీతము వినుటకుఁబోయి యున్నాఁడు. రాజు లేనప్పుడీ వ్యర్థమైన శ్రమ యెందుకు? ఆయన కొడుకులు నీచే జయింపఁబడినవారు.)

చ. అనవుడు గెల్చె రావణుఁ డటంచును జాటఁగఁబంచి హృష్టుఁడై
ఘనగళనాదముల్ నిగిచి ♦ క్రచ్చఱఁ దత్పురి వీడి తాను వ
చ్చినసరణిన్ విమానమున ♦ శీఘ్రము లంకకుఁ బోవుచుండెఁ జు
ట్టును సచివాళిగొల్చుచుఁ గడుంగడుఁ బ్రస్తుతి సల్పుచుండఁగన్. ౮౯-౨

అర్థములు. ఘనగళనాదముల్=పెద్దకంఠధ్వనులు, క్రచ్చఱన్=త్వరగా, తానువచ్చిన సరణిన్=అంతయు జలమయమై పేఱుత్రోవ లేకుండుట చేతను ప్రయోజనానంతరము లేకుండుటచేతను పోయిన త్రోవనే వ్యర్థముగ మరలి వచ్చె నని సూచితము.

తాత్పర్యము

(అని చెప్పఁగా రావణుఁడు గెలిచినాఁడని చాటించి సంతసించి బిగ్గఱగా నఱచుచు వెంటనే యావరుణుని పత్తనము వదలి, తాను వచ్చినదారిని విమానముమీఁద నెక్కి చుట్టు మంత్రులు గొలచి పొగడుచుండ శీఘ్రముగా లంకకుఁ బోవుచుండెను.)

౨౮వ సర్గము

**—* రావణుఁడు నానాస్త్రీలఁ జెరబట్టుట *—**

చ. చనుచును రావణుండు బల ♦ సంపద పొంపిరి పోవుచుండఁ ద్రో
వ్వునఁ దనమార్గమందు నృప ♦ పుష్కరనేత్రల మౌనికన్యలన్
దనుజకులాంగనామణుల ♦ దైవతకాంతల వీరు వారటం
చన కగపడ్డసుందరుల ♦ యౌవతముం గులకన్యకాతతిన్. ౮౯-౩

అర్థములు. నృపపుష్కరనేత్రలన్=రాజస్త్రీలను, దనుజకులాంగనామణులన్=దానవ కుటుంబినులను, దైవతకాంతలన్=దేవతాస్త్రీలను, యౌవతమున్=యువతుల సమూహమును, యౌవనమందుండు స్త్రీ యువతి, కులకన్యకాతతిన్ గొప్పకులములఁ బుట్టిన కన్యకల సమూహము.

తాత్పర్యము

(రావణుఁడు పోవుచు బలగర్వమునఁ దనత్రోవలో రాజస్త్రీలను, ముని కన్యలను, దానవకుటుంబినులను, దేవతాస్త్రీలను, వీర వారనక కంటికగపడిన సుందరులను, యువతుల సమూహమును, గొప్ప కులములందుఁ బుట్టిన కన్యకల సమూహమును.)

చ. బలిమిని ముట్టి యడ్డపడు • బంధువులం బడఁగొట్టి కేలుఁ గొ
ప్పులు బిగఁబట్టి యచ్చెలులు • బ్రుయ్యఁగఁ దిట్టఁగ మొత్తుకోఁగ నీ
డ్గిలఁబడ నీడ్చికొంచరిగి • ఒక్కువ పెక్కువఁ బుష్పకంబునన్
దలరక పాప మంచనక • దానవుఁ డుండఁగ నుంచె మోహియై. ౮౯౪

అర్థములు. బలిమిని=బలవంతముగ, ముట్టి=తాకి, బ్రుయ్యఁగన్=నాశము కమ్మని, ఒక్కువ పెక్కువన్=గర్వముయొక్క యతిశయముచే.

తాత్పర్యము

బలాత్కారముగఁ దాఁకి యడ్డపడుచున్న బంధులఁ నేలఁ బడఁగొట్టి వారు చేతులు విదిల్చికొని పోవ వారిచేతులనుబట్టి నేలఁ బడఁగాఁ గొప్పులు పట్టి లాగి యా స్త్రీలు నీవు నాశమైపోవ నని తిట్టఁగా లబలబ మొత్తుకోఁగా విడువక యీడ్చి గిలఁబడినను నీడ్చికొనిపోయి గర్వాతిశయముచే చలింపక పాప కార్యమని తలంపక మోహవశమున నందఱను పుష్పకముమీఁద నుంచెను.

క. ఈనెఱి బన్నగకన్యల, మానవభామలను నసుర•మానినులన్ ర
క్షోనారుల యక్షసతుల, దానవయోషల విమాన•తలముం జేర్చెన్. ౮౯౫

అర్థములు. ఈనెఱిన్ = ఈ విధముగ.

తాత్పర్యము

(ఈ విధముగ నాగ కన్యలను, మనుష్యస్త్రీలను, నసుర కాంతలను, రాక్షస వనితలను, యక్షసతులను, దానవాంగనలను విమానమునఁ జేర్చెను.)

సీ. వారలు శోకాగ్ని•భయసంభవంబులౌ, బాష్పంబులను వహ్ని•భాస్వరముల
గార్చిరి వారల•కన్నీరు మున్నీటి, నేర్పునాఁ బుష్పకం•బెల్ల నించె
నిడువెండ్రుకలచెలు • లుడురాజవదనలు, పీనపయోధరల్ • వేదిమధ్య
లతిహృద్యగాత్రలు • హాటకవర్ణలు రథకూబరకటులు • ప్రాయవతులు

తే. కన్యలును స్త్రీలు దేవతా•కాంతలట్టి, వారు శోకంబు దుఃఖంబు•భయము పెర్మి
విహ్వలాత్మికలై చెల•వెల్లఁ బాసి, దీనలై తపియించిరి•దిక్కులేక. ౮౯౬

అర్థములు. శోకాగ్ని భయసంభవంబులు=తమవారిని బాయుటచే గలిగిన శోకాగ్నిచేతను తమ్మేమిచేయునో యను భయముచేతను కలిగిన, వహ్నిభాస్వరములన్=అగ్నివలె వేఁడిమిచే నొప్పునవి, మున్నీటిన్ = సముద్రమును, ఉడురాజ వదనలు = చంద్రునివంటి ముఖములు గలవారు, పీనపయోధరల్ = బలసిన చన్నులు గలవారు, వేదిమధ్యలు=సన్నని నడుములు గలవారు, వేదియనఁగా

వేలి యుంగరమనియు నర్థము గలదు. "వేది రంగుళీముద్రాయాం" అని విశ్వ నిఘంటు, 'మధ్యేన సా వేదివిలగ్నమధ్యా'యని కుమార-౧-౩౯.

▽ రెండు త్రికోణములు ఒక కోణము మఱియొక దాని కోణముతో కలియు
△
నట్లుగా నేర్పఱచిన తిన్నెకు వేది యని పేరు గలదు. రెండు కోణములు కలసిన ప్రదేశము సన్నగా నుండును, హృద్యగాత్రలు=మనోహరమైన దేహములు గలవారు, హాటకవర్ణలు=బంగారు ఛాయ గలవారు, రథకూబరకటులు=తేరి నొగల వంటి మొలలు గలవారు, ప్రాయవతులు=నడిమి వయస్సునం దుండువారు, విహ్వలాత్మికలై=విరవిరఁబోవు మనస్సుగలవారై, దిక్కు-లేక=రక్షించువారు లేక.

తాత్పర్యము

(వారు, తమవారిని బాయుటచేఁ గలిగిన శోకాగ్నిచేతను, తమ్మేమి చేయునో యను భయముచేతను, పొడమిన వేఁడి కన్నీటిని గార్చిరి. సముద్రమును నదులవలెఁ బుష్పకమంతయు నిండించెను. నిడుపైన వెండ్రుకలు గల స్త్రీలు చంద్రునివంటి ముఖముగల స్త్రీలు, బలిసిన చన్నులు గలవారు, సన్నని నడుములు గలవారు. మనోహరమైన దేహములు గలవారు, బంగారు ఛాయగలవారు, తేరి నొగలవంటి మొలలు గలవారు, నడిమి వయస్సునం దుండువారు. కన్యలును, స్త్రీలును దేవతా స్త్రీలవంటి వారు శోకము, దుఃఖము, భయము నధిక మగుటచే విరవిరఁ బోవు మనస్సు గలవారై వెలవెలఁ బోయి దీనురాండ్రయి రక్షించువారు లేక తపించిరి.)

క. వారలయూరుపుగాడుపు, వారిగ సందీప్త మగుచుఁ • బర్వినలుగడన్
ఘోరజ్వలనజ్వాలా, పూరితకుండం బనంగఁ • బుష్పక మొప్పెన్. ౮౯౭

అర్థములు. ఊరుపు గాడుపు=వెలుపల విడిచిన నిశ్వాసము, ఘోర=భయంకరమైన, జ్వలన జ్వాలా=అగ్ని శిఖలచే, పూరిత=నిండిన, కుండము=హోమముచేయు గుంత.

తాత్పర్యము

వారు విడిచిన వేఁడియూర్పుగాలులు దండిగ నుండునట్టి నాలుగుప్రక్కల వ్యాపింపఁగా నుండుచున్న యగ్ని జ్వాలలచే నిండిన గుండమువలెఁ బుష్పక ముండెను. కన్యలును స్త్రీలు నగుటచే బ్రాహ్మణ వసిష్ఠ న్యాయమున పెండ్లికాని స్త్రీలు, పెండ్లి యయిన స్త్రీలని గ్రహింపవలయును.

క. దశకంఠాసురపతికిన్, వశపడి రా శ్యామలెల్ల • వనిఁ గేసరికిన్
వశపడిన కరిణులట్లు వి,వశలై దీనంబులైన • వదనాబ్జములతోన్. ౮౯౮

అర్థములు, శ్యామలు=నడిమివయస్సుస్త్రీలు, పదునాఱు సంవత్సరముల వయస్సుగల స్త్రీకిని శ్యామయనియే పేరు. "శ్యామా యౌవనమధ్యస్థా" "శ్యామా షోడశ వర్షా స్త్రీ" నానా. ర దీనివలన పదునాఱు మొదలు ఇరువదియైదు సంవత్సరముల ప్రాయము వఱకు శ్యామ శబ్ద మన్వయించును. ముప్పది సంవత్సరము లది తరుణి యనఁబడును. ఇట్లు చెప్పుటచే "వృద్ధస్త్రీం కన్యకాం. త్యజేత్" అనునట్లు, సమర్థాడని పిల్లలను ముసలి స్త్రీలను వదలిపెట్టెనని యేర్పడుచున్నది. కేసరికిన్=సింహమునకు, కరిణులు=ఆఁడేనుగులు, వివశలై=స్మృతిదప్పినవారై, వదనాక్షుల తోన్=ముఖములతో, కనులతో, దీనంబులు=దుఃఖముతో నిండినవి.

తా త్ప ర్య ము

(రావణునకు వశపడి యాభామలందఱు వనములో సింహము బారి పడిన యాఁడేనుఁగులవలె స్మృతిదప్పి దుఃఖముతో నిండిన ముఖములతోఁ గన్నులతో)

## —♦ చెఱబడిన స్త్రీలు విలపించుట ♦—

ఉ. అక్కట! నన్ను నీ యసురుఁ ♦ డాగ్రహ మెత్తి భుజించు నేమొ యం
చొక్కతె యేడ్వ నీ ఖలజ♦నోత్కరశేఖరుఁ డయ్యొ నన్నుఁ దా
ముక్కలు సేయునో యనుచు ♦ మొత్తులు కొట్టఁగఁ దోడ బుట్టులన్
మ్రుక్కువ ప్రాణవల్లభుల ♦ మాతల దండ్రుల నెంచఁ గొందఱున్. ౪౯౯

అర్థములు. ఖలజనోత్కరశేఖరుఁడు=దుష్టజన సమూహములందు శ్రేష్ఠుఁడు

తా త్ప ర్య ము

(అయ్యో! ఈ రాక్షసుఁ డాగ్రహముతో నన్నుఁ దినునేమో యని కొందఱె యేడ్వఁగా, నీదుర్మార్గుఁడు నన్ను ముక్కలు చేయునేమో యని మొత్తులు కొట్టఁగా గొందఱు తోఁబుట్టువులను మక్కువగల భర్తలను దల్లిదండ్రులను దలచుచుండ.)

చ. *అనయముఁ గూర్మిమీఱఁ దన♦ప్రాణము నెత్తుగ బుజ్జగించుచున్
ననుఁ గులదీపమా! యని గుణ♦ప్రతిమా! యని మెచ్చి పిల్చునో
జనకుఁడ! యిప్పు డెట్లయితో ♦ సంకట మెట్లు సహింతో కూఁతు ర
య్యును సుతు నట్టి దంచుఁ గడు♦ నుబ్బుదు నే గతిఁ బట్టినాఁడవో! ౫౦౦

తా త్ప ర్య ము

(నన్నెల్లప్పుడు ప్రాణముతో సమముగా బుజ్జగించుచు కులదీపమా! గుణముల కుప్పా! యని మెచ్చి పిలుచునట్టి ఓ తండ్రీ! యిప్పుడేమైతివో! ఈ సంకట మెట్టు లోర్చితివో! కూఁతురయ్యును కొడుకువంటి దని సంతోషపడెదవే, యేగతి పట్టితివో.)

ఉ. ఒక్కతె నాకుఁ గూఁతురు గు•ణోదధి రూపసి యర్హకాంతుతో
మక్కువఁ గూర్చువాఁడ నని • మానుగఁ జేసితి పెండ్లి యత్నమున్
దిక్కఱినట్లు కర్కశమ•తిన్ హరియించెను రక్కసుండు న
న్నెక్కరణిన్ సహింతునొ గ•దే యిఁక దండ్రి దురంతతాపమున్. ౫౦౧

అర్థములు. గుణోదధి=మంచిగుణము లను రత్నములకు సముద్రము' రూపసి=అందగత్తె, దిక్కఱినట్లు = దిక్కులేనిదానివలె, కర్కశమతిన్=కఠిన మనస్సుతో, దురంతతాపమున్=అంతములేని దుఃఖతాపము, ఇది పెండ్లికాఁబోవు పిల్ల యేడ్పు.

తాత్పర్యము

(ఒక్కతెయే నాకుఁ గూఁతురు-రూపసి గుణవంతురాలు-తగిన వరుని కిచ్చి ఘనముగఁ బెండిలి చేసెదనని యత్నము చేసితివి. దిక్కులేని దానివలెఁ గఠినుఁడయి నన్ను హరించెను. అంతులేని యీ దుఃఖము నెట్లు సహించితివో-)

సీ. కన్నతల్లీ! నన్ను • గర్భంబునను మోచి, పడరానిపాటులు • పడుటలెల్ల
గంట నత్తిడికొని • కంటికి ఱెప్పనా, నను సాకి పెంచిన•యనువు లెల్ల
దెలిసి తెలియక నేను • జలిపినదోషముల్, క్షమియించి బుద్ధులు•గఱపుటెల్లఁ
గులము శీలంబును • గుణము యోగ్యతయును, నలవరింపఁగ నీతు•లాడుటెల్ల
తే. నడుగు లిలమీఁద నుంచిన•నఱిగిపోదు,నంచు నఱచేత నిడి పెంచు•నవధులెల్ల
దుదకు వ్యర్థంబు లైపోయె • దుష్టుఁడైన, కఱకుటసురకు నేఁజిక్కి•గాసిపడుట

తాత్పర్యము

(అమ్మా! నన్ను పదినెలలు గర్భమున మోచి పడరాని పాటులు పడితివి-కంటవత్తిడుకొని కంటికి ఱెప్పవలె సాగి పెంచితివి. తెలిసీ తెలియక నేను చేసిన తప్పులు మన్నించి, బుద్ధులు గఱపితివి- కులము శీలము గుణము యోగ్యత యలవడుటకు నీతులు బోధించితివి. నేలమీఁద నడుగు పెట్టిన నఱిగిపోదునని యఱచేతిలో నుంచుకొని పెంచితివి. దుష్టుఁడైన క్రూర రాక్షసుని చేతిలోఁ జిక్కి నేను గష్టపడుటచే నీశ్రమ మంతయు వ్యర్థమయ్యెనుగదా.)

ఉ. ఆటలకేను బోవఁ ద్రుటి•యైనను గానకయున్న నత్తవే
మాటికి మాటికిన్ వెదకి • మక్కువఁ గూర్చుచు లాలకింప నా
మాటలు తేనెమూట లని • మాత యిఁ కెవ్వరిపల్కు విందువే
పాటిగఁ గూఁతురా యనుచు • వావిడి యొంతగ నేడ్తు తల్లిరో! ౫౦౩

అర్థములు. వావిడి=నోరువిడిచి.

తా త్ప ర్య ము

(తల్లీ! నేనాడుకొనఁబోయి యొక నిమిషము గానరాకున్న నన్ను వెదకుటకుఁ బలుమాఱు దిరిగెదవు. నా మాటలు తేనెమాటలని విన నెంతో మక్కువ పడెదవు. ఇఁక నెవ్వరిమాటలు విందువమ్మా! నావిడిచి, కూఁతురా యని యెంతగా నేడ్చెదవో?)

చ. *కటకట! యెంతదుర్దినమొ ♦ గాడ్పడి పోయెఁ గులంబు మానమున్
బటుతరసద్వ్రతంబు, పరి♦వారలలో నగుఁబాటు కూరె, నీ
కుటిల చరిత్రు రాయుడిని ♦ కూర్చితిఁ దండ్రికిఁ బ్రాణభర్తకున్
స్ఫుటముగ హీనభాగ్య నయి ♦ భూమిపయిం దలవంపు లయ్యయో. ౫౦౪

అర్థములు. ఇది పెండ్లియయిన స్త్రీ దుఃఖము, తలవంపులు=అవమానము.

తా త్ప ర్య ము

(అయ్యయ్యో! ఎంత పాపిష్టిదినమో-కులము మానము శీలము నాశమై పోయెను. సాటివారిలో నగుఁబాటయ్యెను. కుటిలాత్ముని యుపద్రవముచేఁదండ్రికిఁ బ్రాణభర్తకు భూమిమీఁదఁ దలవంపు కలిగించితిని-ఎంతటి భాగ్యహీనను!)

ఉ. *మానివి నీవు నాథ! యవ ♦ మానము గూరెను మన్నిమిత్తమై
యే నెటు సైఁచెదో? వ్యసన ♦ మేగతి నాఁగెదో? యెట్టు లయ్యెదో?
దానవుచేతఁ జిక్కి యిటు ♦ తత్తఱ లాడుచు నున్నదాన నీ
యానన మెట్లు నేఁ గనఁగ ♦ నౌనొ కదే హృదయేశ! వల్లభా! ౫౦౫

అర్థములు. మానివి=మానమునం దభిమానము గలవాఁడవు!

తా త్ప ర్య ము

(నాథా! మానమునం దభిమానము గలవాఁడవు. నానిమిత్తముగా నీకవమానము చేకూరెను దుఃఖమెట్లు సహించెదవో. ఏమయ్యెదవో? రాక్షసునిచేతికిఁ జిక్కి తత్తఱ లాడుచున్నదాన-నీ మొగమెట్లు చూడఁ గలనో కదా.)

క. *మనమున నెంతటిశోకము, పెనఁగొను చున్నను మదాస్య♦బింబముఁ గనినన్
వనజుల్లఁ బోలఁగ నలరెద, వనయము నింకెట్లు దుఃఖ♦మందెదొ నాథా! ౫౦౬

అర్థములు. వసట=దుఃఖము, అలరెదవు=సంతోషించెదవు.

తా త్ప ర్య ము

(ప్రాణనాథా? మనస్సులో నెంత శోకముండినను నా మొగము చూడఁగానే దుఃఖమంతయు మాని సంతోషించెదవు ఇఁక నెల్లప్పుడెట్లు దుఃఖపడెదవో.)

క. *బాలా! యని నూతనశశి, ఫాలా! యని నన్ను నొంటి♦పాటున నేమే
మో లీలలఁ దేల్చెదు గద, బాళిన్ నీ వెట్టు లాదొ♦ప్రాణేశ యికన్. ౫౦౭

అర్థములు. నూతన శశిఫాలా=క్రొత్త చంద్రుని రేకవంటి నొసలుగలదానా!

తాత్పర్యము

(ప్రాణేశ్వరా! నే నొంటిపాటున నున్నప్పుడు నన్నుఁజూచి! బాలా! నూతన శశిఫాలా! యని యేమేమో లీలలు చేసెడివాఁడవు. నాయందలి వలపుచే నిఁక నెట్టులయ్యెదవో!)

సీ. *అందఱిలోఁ బని♦సందడి నే నుండ, మందు నిగతి దప్పి♦నంద యుండి
గార్యంబుపైఁ గేలు♦కడకన్ను నాపయి, నెం దెందొ యంచుచు ♦ సందు వేచి
నర్మగర్భంపుస♦న్నలఁ జేసి నవ్వింతు, పెద్దలు గన్నను ♦బిడియపడెదు
నీ తహతహకును ♦ నే నవ్వ నది యేమి, యన్నవారికి బొంకు♦లాడు చుందు

ఆ. నీకు నెలమిఁ గూర్ప ♦ నేఁ దఱి♦ గల్పించి, వచ్చి పోవుచుందుఁ♦బ్రాణనాథ!
నీదు వలపు పెంపు♦నీదు కూరిమియుంపు, నప్పు డెఱుఁగనైతి♦నవదనైతి. ౫౦౮

అర్థములు. ఇది మగని యింటికిఁ గ్రొత్తగా వచ్చిన లజ్జావతి యేడుపు.

తాత్పర్యము

(అందఱిలో నేను పనిసందడిలో నుండఁగా నేమియుఁ దెలియని వానివలె దూరమందే యుండి, పనిమీఁదఁ జేయి, నా మీఁదఁ గన్నునుంచుచు సందు చూచుకొని పరిహాస సూచకపు సన్నలు చేసి నవ్వించెదవు. పెద్దలు చూచిన బిడియపడెదవు. నీ తహతహకు నేనవ్విన, 'నది యేమియని యడిగిన వారికేమియు లేదు' అని బొంకెదవు. నీకు సంతోషము గలిగింప నవకాశము గల్పించుకొని నీ దగ్గఱకు వచ్చి పోవుచుండెడిదానను. నీ వలపు, నీకూరిమి యెట్టిదో యప్పు డెఱుఁగఁ జాలనైతిని- ఇప్పు డనాథ నయితిని.)

క. *వనవాళుల జలకేళుల, మనము చరింపంగ నాదు♦మనసుం దాఁకన్
గనఁబఱిచి గుచ్ఛఫలతతు, లనిమెడి నర్మోక్తిఁ దలఁచి♦యడలెదనాథా! ౫౦౯

అర్థములు. గుచ్ఛ=ఇది స్తనసూచన, ఫలము=మధురోక్తి, అధరామృత సూచన.

తాత్పర్యము

(ప్రాణవల్లభా! ఉద్యానవన విహారమప్పుడు, జలక్రీడ లాడునప్పుడు నా మనస్సునకుఁ దాఁకునట్లు పూల గుత్తులను పండ్లను గనఁబఱచి యనెడిహాస్యోక్తులను దలఁచుకొని యడలుచున్న దానను.)

ఆ. *ఆఁడుబిడ్డ ననుచు • న త్తగారింటికి, నేగుదాన గాని • యింటనుండ
ననుచుమీరు నన్ను • నధికమౌ కూరిమి, నాదరింత్రు గాదె • యన్నలార! ౯౧౦

తాత్పర్యము

(అన్నలారా! ఆఁడు బిడ్డ, యత్తగారింటికిఁ బోవును. ఇంటిలో నుండునది కాదుగదా యని నన్నధికమగు ప్రేమతో నాదరించెడి వారుగదా!

ఉ. *అక్కట! యే యపూర్వపుఁ బ • దార్థము మీకు లభించె నేని యిం
పెక్కఁగ నేమిగైకొనక • యింటికిఁ దెచ్చియు, జెల్లెలా! యటం
చక్క! యటంచుఁ బిల్చి చన • వారఁగ మీర లొసంగు చుందు రే
యెక్కృతిఁ దోడులార! తపి • యింతువొ నాగతి యిట్టు లౌటకున్. ౯౧౧

అర్థములు. అపూర్వపు=అపురూపు=క్రొత్తది.

తాత్పర్యము

(అయ్యో! మీకే క్రొత్తవస్తువు దొరికినను, దానిని మీరు తీసికొనక యింటికిఁ దెచ్చి, చెల్లెలా! అక్కా యని పిల్చి చనవుతో నిచ్చుచుండెడి వారలే- నాగతి యీ విధముగా నయినందు కేరీతిగాఁ దపించెదరో.)

ఆ. *పతులతోడ మీరు • సంసార మొనరింప, భర్తతోడ నేను • వచ్చి యటకు
నాఁడుబిడ్డతనము • నమరించుకొందుగా. కనుచు నుబ్బుదాన • నన్నలార! ౯౧౨

తాత్పర్యము

(మీరు మీ భార్యలతోఁ గాఁపురములు చేయుచుండ, నా భర్తతోఁగూడ వచ్చి యాఁడు బిడ్డతనము చేయుదునుగదా యని యుబ్బిపోవు చుండెడిదానను.)

ఆ. *చన్ను గుడుచుచున్న • చిన్నారి తొలిచూలు, నీడ్చి వైచి బిగ్గ • యేడ్చుచుండ
నన్ను లాగి తెచ్చె • నిన్నిచుఁ డయ్యయో, కన్నముద్దుబిడ్డ • గతియదేమొ ౯౧౩

తాత్పర్యము

(తొలికానుపు నాముద్దుబిడ్డ చన్ను గుడుచుచుండ బలవంతముగానీడ్చి వైచి యది బిగ్గరగ నేడ్చుచుండఁగా నన్నులాగి యీ నీచుండు తీసికొనివచ్చినాఁడు. అయ్యయ్యో! నాకన్న ముద్దుబిడ్డగతి యేమయినదో కదా.)

సీ. *నాకన్నబిడ్డకు • నే కరుణావతి, చన్నిచ్చి జననియై • సాఁకు నొక్కొ?
నో రెఱుంగనిబిడ్డ • కేరామ దయ యుంచి, వేళకు నన్నంబుఁ • బెట్టు నొక్కొ
మంచి చెడ్డెఱుంగఁడు • మూర్ఖ్యంబు మానఁడే, గతి బట్టునో కసు • గందు నేఁడు
ఆటల మరగుచు • నాఁకలి యెఱుంగఁడు, పిలిచి యెవ్వరొక్కింత • పిసుచనిడుదు

తే. కటకటా! పుత్ర! నాయనా! • హా కుమార!, యేలరా పుట్టితివి తండ్రి • యిట్టి హీన
భాగ్య కడుపున నేగతి • బ్రతుకఁగలవో, తల్లి లేనట్టిబిడ్డవై • తనయకుట్ట. ౫౧౮

అర్థములు. కసుగందు=లేఁతబిడ్డ.

తా త్ప ర్య ము

(నాకన్న పాపనిఁగని జాలిపడి యే తల్లి చన్నిచ్చి సాఁకునో! నోరెఱుఁగని బిడ్డ కాఁకలి తెలిసి వేళకింత యే యింతి యన్నము పెట్టునో, మంచి చెడ్డ తెలిసిన వాఁడు కాఁడు మూర్ఖపుఁబట్టు వదలఁడు. నాకసుగందు నేఁడేగతి పట్టునో ఆటలను మరగుచు నాఁకలి యెఱుఁగఁడు, పిలిచి యింత పిడుచ యెవరు పెట్టఁగలరో అయ్యో! కొడుకా! నాయనా! కుమారా! యిట్టి దౌర్భాగ్యురాలికడుపున నేల పుట్టితివిరా! తల్లి లేనిబిడ్డవై యెట్లు బ్రదుకఁగలవో!)

చ. "అలరుదుఁ జీర చిక్కనది • యాదిగ ముద్దుఁగుమారుఁ గందు నా
లలితమనోజ్ఞ మూర్తిఁ గడు • లాలనఁ జేయుదు ముద్దులాడుదున్
గలకల నవ్వఁజేసి పని • కారణ మంచును దండ్రి చేతికిన్
దెలుపుగ నిచ్చి యా నెపము • చేఁ బతి హృష్టు నొనర్తు నం చెదన్. ౫౧౯

అర్థములు. చీరచిక్కనది=ముట్టు నిలిచినది.

తా త్ప ర్య ము.

(నెల మసలినది మొదలు మగబిడ్డను గందును, నా చక్కనయ్యను లాలన చేసి కిల కిల నవ్వించి ముద్దులాడెదను. పనియున్నదని చెప్పి బిడ్డ నెత్తికొనవచ్చి యానెపముననభర్తను సంతోషింపఁజేసెదనని మనస్సులో మురియుచుండెడిదానను.)

ఉ. "అన్న! కుమార! నిన్నుఁగడు • పారఁగ గాంచుట కాక బాల్యపుం
జిన్నెలు వన్నెలుం గొమరుఁ • జేతలుఁ దేనియ లొల్కుమాటలుం
జెన్నగు నాటలుం గనఁగఁ • జేయని పుణ్యము, పూర్వజన్మమం
దెన్నవలాని హీన్ సుతవి • హీనను జేసితినో కుమారకా! ౫౨౦

తా త్ప ర్య ము

(నాయనా! కుమారా! పదినెలలు మోచి నిన్నుఁగడుపారఁ గనుటొక్కటే కాని పసితనపుఁ జిన్నెలూ, వన్నెలూ, ముద్దుమాటలూ, యాటలూ యే యొద్దుముద్దు చూచుపుణ్యము చేయనైతిని. పూర్వజన్మము నేతల్లి బిడ్డలకెడఁబాటుగల్పించితినో.)

చ. కటకట! పూర్వ మెంతటి య • ఘంబుల నే నొనరించి యుంటినో
యిటు సహియింపరానిగతిఁ • గృత్రిమమాయ మెంబునిని మున్గఁగ నై, నిం
కెటు దరిఁ జేరుదాన నోకో • మృత్యువ! నీకు నమస్కరించెదం
దటుకునఁ గొంచుఁబొమ్ము వ్యస • నత్రుటి తాల్మికి నన్నుఁ బుణ్యవా. ౫౨౧

అర్థములు. అఘంబులన్=పాపములను, కృచ్ఛ్రమహాంబుధి=కష్టసముద్ర మందు. దరి=ఒడ్డు, వ్యసన=శోకముచే, త్రుటిత=ఖండింపఁబడిన. ఆత్మికన్= మనస్సు గలదానిని.

తా త్ప ర్య ము

(ఎంత కష్ట మెంతకష్టము. పూర్వమున నెంతటి మహాఘోరపాపములు చేసి యుంటినో యిప్పుడిట్లు భరింపరాని కష్టసముద్రమున మునుఁగవలసిన దాననైతిని. ఏగతి దరిఁజేరఁగలనో! మృత్యుదేవతా! నీకు నమస్కారము చేసెదను. దుఃఖముచే గుండె పగిలియున్న నన్నుఁ దక్షణము తీసికొనిపొమ్ము నీకు బుణ్యమువచ్చును.)

ఆ. ఏల మనుజలోక ♦ మిస్సీ యంతకు, నధమ మెుందుగలదె ♦ యరుణుఁడుదయ
కాలమందు జుక్క ♦ గమిరూపు మాపు న,ట్లితఁడు చంపెఁ బతుల ♦ హీనబలుల.

అర్థములు. చుక్కగమిన్=నక్షత్రసమూహమును.

తా త్ప ర్య ము

(ఛీఛీ! యీమనుష్యలోకమేల? ఇంతకుమించిన యధమమింకొకటి గలదా? సూర్యుఁడుదయకాలమున చుక్కలను గనఁబడకుండఁ జేయునట్లు లీరాక్షసుఁడుబల హీనులగు మాభర్తలను జంపెను.

శా. వ్యాపాదప్రణయుండు నూతనవధో ♦ పాయంబులన్ సక్తుఁడై
పాపంబుల్ ఘటియించు చుండెడు జుగు ♦ ప్సాహీనుఁడై యెయ్యెడో
పాపాత్ముండు పరాక్రమంబునను దు ♦ ర్వ్యాపారపారీణతా
లేపంబం దసముండు వీనిఁ దునుమన్ ♦ లేఁడే విభుం డొక్కఁడున్. ౩౯

అర్థములు. వ్యాపాద ప్రణయుండు = హింసయందుఁ బ్రీతిఁ గలవాఁడు, నూతన వధోపాయంబులన్=చంపులకు క్రొత్తయుపాయంబులందు, సక్తుఁడై= మనస్సుంచిన వాఁడై, జుగుప్సాహీనుఁడై=దయలేనివాఁడై, దుర్వ్యాపారపారీణతా లేపంబందు=చెడుకార్యములు చేయుటయందు సంపూర్ణ సామర్థ్యముగల వాఁడని గర్వమునందు. అసముఁడు=అసమానుఁడు.

తా త్ప ర్య ము

వీఁడు ద్రోహచింతనచే నొకరిని హింసించుటయందుఁ బ్రీతిగలవాఁడు. వధించు టకుఁగాను క్రొత్త క్రొత్త యుపాయములందు మనస్సుంచినవాఁడై దయలేక పాప ములు చేయుచుండును. పరాక్రమమందును చెడుకార్యములుచేయు సామర్థ్య గర్వంబునందు నసమానుఁడు, వీనిని జంపఁగల ప్రభువులేఁడా?

—• చెఱఁబడిన స్త్రీలు రావణు శపించుట •—

చ. అతులితపాపహేతువు ప•రాంగనలం దమిసేఁత, వీఁడు దు
ర్మతి పరకాంతలైన మము • రాగమునం జెఱఁబట్టఁగోరెడిన్
హతుఁడగుగాక యీచెనఁటి • యన్యతలోదరికారణంబుగా
సతులము మేని మే మిదియె • సత్యము గావుత మంచుఁ దిట్టినన్. ౫ ౨౦

అర్థములు. పరాంగనలన్=పరస్త్రీలను, తన భార్యలుగాని వారిని, తమి సేఁత=భార్యలుగాఁ జేసికొనఁ గోరుట, అతులిత పాపహేతువు = అసమానమైన పాపమునకు గారణము, దుర్మతి=చెడుమనస్సుగలవాఁడై, పరకాంతలైన మమున్= ఇతరస్త్రీలైన మమ్ము, రాగమునన్=కామముచే, చెనఁటి=దుష్టుఁడు, అన్యతలో దరి=ఇతర స్త్రీ సతులము యేని=మేము పతివ్రతలమైన పక్షమున.

తాత్పర్యము

తన భార్యలు గాని స్త్రీలను దన భార్యలుగాఁ జేసికొనఁ దలచుటకంటెఁ బాపకార్యము లేదు. వీఁడు పరస్త్రీలమైన మమ్ము చెడ్డ మనస్సుతో కామవశమునఁ జెఱఁబట్టఁగోరుచున్నాఁడు. మేము పతివ్రతలమేయైన పక్షమున నిజముగా వీఁడు పరస్త్రీ కారణముగనే చంపఁబడునుగాక యని దిట్టఁగా.

క. మ్రోసెను దివి దుందుభులున్, గురిసెన్ సుమవృష్టి యంతఁ•బ్రాఁకుసత్యు
త్కర శాపనిహతిఁ బ్రభ చెడెఁ, బరమపతివ్రతలు దిట్టఁ•బ్రభ చెడు టరుదే? ౫ ౨౧

అర్థములు. మ్రోసెను=ధ్వనించెను, దివిన్=ఆకాశమందు, దుందుభులు= నగారాలు, సుమవృష్టి=పూలవాన, సతీ+ఉత్కర=పతివ్రతల సమూహముల, శాపనిహతిన్=శాపము దెబ్బచే ప్రభ చెడెన్=కాంతిహీనుఁడయ్యెను, పరమపతి వ్రతలు దిట్టఁగాఁ గాంతి నాశ మగుట వింతయా? అర్థాంతరన్యాసాలంకారము. మగఁడైనను పతివ్రతయగు తన భార్య కంటనీరుగాఱఁ జేసినేని వాఁడనేగతుల పాలయి నాశమగుట సత్యమని శాస్త్రములు చెప్పుచున్నవి. ఇఁక నితర పురుషుల గతి చెప్పనేల? ఎవఁడు పతివ్రతల కంట నీరు గాఱఁజేయునో వాఁడు వంశ నాశమై పోవును. అంకాడ కుండుట మాత్రమే పతివ్రతాలక్షణమని తలఁపరాదు. నందీశ్వరుఁడు లోనగువారు శపించినపుడును రావణుని కాంతి మాయలేదు. ఇప్పుడిందఱు పతివ్రత లేకవాక్యముగాఁ దిట్టఁగా వాఁడు తేజస్సు గోలుపోయెను. వాఁడు తపస్సుచే సంపాదించిన తేజస్సు వీరి శాపముచే నశించెను

శా. ఆ సాధ్వీజనకోపభావ విమనుం • డై యాత్మలో రాక్షసా
లీసంపూజితుఁ డౌచు లంకకును హా•ళిం బోయెనో లేదో యా
లో సంభావితచిత్తశూర్పణఖ జా•లుంబాఱఁ గన్నీరు బా
ష్పాసారంబునఁ బాదముల్ కడుగుచున్•హా యంచు వ్రాలెన్ ధరన్. ౫ ౨౨

అర్థములు. ఆ సాధ్వీజన రోషభాష=ఆ పతివ్రతల కోపముతోఁడి మాట, అందఱు వేఱువేఱుగా జెప్పినను భాషయొక్కటే కావున భాషయని యేకవచనము ప్రయోగింపఁబడెను. విమనస్కుండై=దుఃఖముతోఁ గూడిన మనస్సు గలవాఁడై. 'దుర్మనా విమనా అంతర్మనా స్యాత్' అని యమరము, హాళిన్ = ఆసక్తితో, సంతాపిత చిత్త=సంతాపము కలుగఁజేయఁబడిన మనస్సుగలది, దాని మగనిని జంపుటచే నని భావము, చాలుంబాఱన్=కాలువఁగాఁ బాఱఁగా, బాష్పాసారం బునన్=కన్నీటి వర్షముచే.

## తాత్పర్యము

ఆ పతివ్రతలు కోపముతోఁ జెప్పినమాటవిని శోకముతోఁ గూడినమనస్సు గలవాఁడై రాక్షసులచేతఁ బూజింపఁబడినవాఁడౌచు నాసక్తితో లంకకుఁబోయి పోకయుండే యొకపాదము కడపకు నావల, నొక పాద మీవల నుండఁగానే యింతలో మగఁడు చచ్చుటచే దుఃఖించు శూర్పణఖ కన్నీళ్ళు కాల్వలుగఁ బాఱఁగాగన్నీళ్ళ చేతనే యన్న పాదములు కడుగుచు పోయని భూమిపైఁబడెను.

## —♦ శూర్పణఖ రావణు నిష్ఠురంబు లాడుట ♦—

క. వ్రాలినభగినిన్ రక్షః, పాలుఁడు లేవంగ నెత్తి ♦ పరిసాంత్వోక్తిన్
గోలా! యేలా యేడ్చెదు? నీలోఁగలకోర్కి తెలుప ♦ నెఱయొనరింతున్. ౨౧

అర్థములు. భగినిన్=చెల్లెలిని, రక్షఃపాలుఁడు=రాక్షసరాజు, రావణుఁడు—పరిసాంత్వోక్తిన్=ఊఱట మాటలతో, నెఱ=చక్కఁగా, రావణునకు వాని మత్తతచే దానే శూర్పణఖను విధవను జేసిన విషయముకూడ మనస్సున నాటినది గాదు. అది చెప్పువఱకు వానికి స్ఫురింపలేదు.

## తాత్పర్యము

(పాదములమీఁదఁ బడిన చెల్లెలిని రావణుఁడు లేవఁదీసి. 'పిచ్చిదానా! యెందు కేడ్చెదవు? నీ మనస్సులోనున్న కోర్కి తెల్పుము—చక్కఁగాఁ జేసెద'నని యూఱట మాటలాడెను.)

చ. అనవుడు రక్తనేత్రనయ♦నాంబులు పాయఁగ ద్రోచి పల్కె నే
మని వచియించు దానను బ♦లాఢ్యుఁడ నీవు భవద్బలంబు చే
ననుఁ బతిహీనఁ జేసితివి ♦ న్యాయమె నీకులఁ గాలకేయులం
దనుముచు మత్ప్రియుం బతిని ♦ ద్రుంచితి నీ వసిం చేతులారగన్. ౨౨

అర్థములు. ఇప్పుడు శూర్పణఖకుఁ దన మగఁడు చచ్చెనని యేడువవలయునో యన్నమత్తతకేడువవలయునో తెలిసినదికాదు, రక్తనేత్ర=(౧)ఏడ్పుటచేఁ

గన్నులెఱ్ఱనైన దని కాని (౨) రావణు నౌదాసీన్యమునకుఁ గోపించుటచేఁ గాని కన్నులెఱ్ఱనయ్యెను. నయనాంబులు=కన్నీరు, బలాఢ్యుఁడవు=బలసంపన్నుఁడవు.

తాత్పర్యము

అని యడుగఁగా నెఱ్ఱని కన్నుల శూర్పణఖ కన్నీరు దుడిచికొని యిట్లనెను. ఏల యేడ్చుచున్నావని యడిగిన నీకు నే నేమని చెప్పఁగలను? నీవు మహాబలవంతుఁడవు, నీ బలము నామగనిఁ జంపి నన్ను విధవను జేయుటయం దుపయోగించితివి. ఇది నీకు న్యాయమా? నీకు లగు కాలకేయులఁ జంపుచు నాకుఁ బ్రియుఁడును మగఁడునైన వానిని నీ చేతులార నీవే చంపితివి.

క. ఈవిధి స్వబంధుచేతను, తా విధి మూఁడెన్ మదాత్మ • ధవుఁ డస్మత్ప్రా
ణావళికన్నను బ్రియుఁ డో, రావణ! నాసౌఖ్య మెల్ల • రహిఁ జెడె నీచేన్. ౨౯

తాత్పర్యము

ఈవిధముగఁ దన బంధువుచేతనే నామగఁడు మరణించెను. వాఁడు నాప్రాణములకంటెఁ బ్రియుఁడు, నా సౌఖ్య మెల్ల నీచే నాశమయ్యెను.

క. అన్నవె నా పాలికి నీ, విన్నాళ్ళ విధవనుగఁ జేసి • హింసించితి ని
న్నెన్నన్న నేమి ఫల మిఁక, నన్నలు నీవంటివార • లవనిం గలరే? ౩౦

తాత్పర్యము

(రావణా! నీవు నాపాలికి నన్నవా? నన్నివిధముగా విధవనుజేసి హింసించితివి. ఇఁక నిన్నని యేమి ఫలము? నీవంటి యన్నలు భూమిలో నున్నారా?)

శా. *చెన్నౌభూషలు వస్త్రముల్ ధనములుం • జెల్లెండ్రకై యిచ్చుచుం
గన్నం బ్రీతిఁ జరించు చుందు రవనిం • గాకున్న సంప్రీతిచే
మన్నింపన్ మృదుభాషలాడఁ దగదా • మానంబు మేలే కదా
యన్నా! నీవలెఁ జెల్లెలి న్విధవఁ జే•యం జాలిరే యెవ్వరున్? ౩౧

తాత్పర్యము

(ప్రపంచమున మేలి నగలో, నాణెములో, చీరెలో, సారెలో చెల్లెండ్రకిచ్చి ప్రేమతోఁ జూచెదరు కాకపోయిన మంచి మాటలాడరాదా! పోనీ! మాట్లాడుట మానివేయ కూడదా! నీవలెఁ జెల్లెలిని విధవను జేయఁజాలిన వారెవరున్నారు?)

*ఈపద్య మీగ్రంథకర్త తాను దొలుత వ్రాసిన శ్రీ కుమారాభ్యుదయంబునఁ బ్రథమాశ్వాసంబున వ్రాసియున్నాఁడు. దానినే యిందు ననువదించెను. రెండు గ్రంథము లేక కవికృతము లని తెలుపుటయే యుద్దేశము.

చ. దురముల నేని యల్లురను ♦ ద్రుంపగ రాదు గదయ్య యేరి? సం
గరమున నీవె ద్రుంచితివి ♦ కాదె మఱందిని? నట్లొనర్చియున్
దురితము లజ్జయుం గనవు ♦ తోరపుదుఃఖము నీకతంబునన్
ధర మనినన్నినాళ్ళెదనెఁ ♦ దాల్చితి నే విధవాఖ్య నయ్యయో. ౫. ౨౮

అర్థములు. దురముల నేని=యుద్ధములందైనను అల్లురను=ఇంటికి నల్లుండ్రగువారిని.

తాత్పర్యము

యుద్ధము నందైనను తమ యింటికి నల్లుఁడగు వానిని పుత్రికా నిమిత్తముననఁ జంపరాదు గదా నీతి. యిట్లుండ నీవో నీ మఱఁదినే నీ చేతులారఁ జంపితివి. అట్లు చేసియు పాపమని తలఁపవు, ఇటువంటి చేయరానిపని చేసితినే యని సిగ్గుపడవు. నీ నిమిత్తముగ నేను భూమిమీఁద బ్రతికినన్ని దినాలు దుఃఖ మనుభవించవలసి వచ్చెను. అయ్యో! విధవయను పేరు సంపాదించి యిచ్చితివి. రాక్షసులందును విధవావివాహములు లేవు. అవి యుండిన నాకు మఱియొక మగని సంపాదించి యిమ్మని యడిగి యుండును. మొదటి మగఁడు పోవానే యని యేడ్చి యుండను.

—♦ రావణుఁడు శూర్పణఖ నూరార్చుట ♦—

సీ. అని యేడ్చు చెల్లెలి ♦ నాదట నూరార్చి, యమ్మా! యిదేమిటి ♦ కమ్మ నీవు
పరితపించెద వేరి ♦ వలన భీతిల్లకు, నెందేని నీయిచ్చ ♦ నెలమి నుండు
నీకోరినవి యెల్ల ♦ నిమ్మనే నిచ్చెద, గారవించెద నేను ♦ కడమపడక
సంగరమత్తత ♦ జయము నాకాంక్షించి, శరములఁ జిమ్మితి ♦ సాంద్రముగను
గీ. నెవరు మనవారో శత్రువు ♦ లెవ్వరో యెఱుంగనైతిని సంగర♦రంగమునను
సందడిని నీదు భర్తను♦జంపినాఁడ, గతమునకు నేడ్చుచుండినఁ♦గలదె ఫలము. ౫. ౨౯

అర్థములు. ఆదటన్=ప్రేమతో, కడమపడక=కొఱతలేక, సంగరమత్తతన్=యుద్ధమునందు దేహము తెలియక, ఆకాంక్షించి=కోరి, సాంద్రముగను=దట్టముగను, గతమునకున్=గడచి పోయినదానికై.

తాత్పర్యము

అని యేడ్చుచున్న చెల్లెలిని ప్రేమతో సమాధానపఱచి యేలమ్మా! నీ విటు దుఃఖించెదవు! ఎవరివలనను నీకే భయము లేదు. నీయిష్టము వచ్చినట్లు నీ వెచ్చటనైన సంచరించుచుండుము. ఒకరి యాజ్ఞకు నీవు లోబడి యుండవలసిన పనిలేదు. నీవు దేనిని గోరినను నేను నీకు నిచ్చుచుండెదను. కొఱఁత లేక గారవించెదను. జయము గోరినవాఁడనై యుద్ధమదమున దేహము తెలియక బాణములను దట్టముగ

ప్రయోగించితిని. శత్రువులలోనయిన వాఁ డెవ్వఁడో, కాని వాఁ డెవ్వఁడో, యుద్ధ భూమియందు సందడిలో నేను తెలిసికొనలేక పోయి నిమగని జంపితిని. మించి పోయిన దానికి నేడ్చిన రాఁగల లాభ మేమి?

సీ. ఇప్పుడు కార్యంబుఁ ♦ జెప్పెద వినవమ్మ, తల్లితోఁ బుట్టిన ♦ దానికొడుకు ఖరుఁడు నీ తోఁబుట్టు♦కలిమియుఁ గలవాఁడు, దండకాటవిఁ జతు♦ర్దశసహస్ర ములు రాక్షసులుగొల్వ♦బలియుఁడై వసియించుఁ జరియించునీయాజ్ఞ♦సమ్మతమున దానప్రయాణస♦మ్మానకార్యములెల్ల, నాతఁడ కూర్చెడు ♦ నడలవలదు

తే. వీరి దండక కనిపెద ♦ వేగ దూషణుండు దళవాయిగాఁగ ♦ నీ వుండు మతని యొద్ద నాతండె మనరాక్ష♦సోత్కరమున, కెల్లకై యుండు నాయాజ్ఞ నేలుచుండు.

తాత్పర్యము

ఇఁక జరగవలసినది చెప్పెద వినుము. మన తల్లితోఁ బుట్టినదాని కొడుకు ఖరుఁడు కావున నీకును దోడబుట్టినవాఁడేకదా! వాఁడు కావలసిన ఐశ్వర్యముగల వాఁడు. పదునాలుగువేల రాక్షసులతో నాయాజ్ఞప్రకారము దండకాటవియందు వసించును. అతఁడు నీయాజ్ఞప్రకారము నడచుకొనును. నీకు దానము చేయుటకు ప్రయాణమునకు గౌరమునకుఁ గావలసినవన్నియు నతఁడే యిచ్చుచుండును. వీరిని దండకకుఁ బంపెదను. దూషణుఁడు సేనానాయకుఁడగుచు నీవాతనియొద్దనుండుము. వాఁడు అందలి రాక్షససమూహమునకుఁ బ్రభువై నాయాజ్ఞ చొప్పున నేలు చుండును. నీ యొద్దనే యేల యుంచుకొనరాదందువేమో. నేను దిగ్విజయార్థము సంచారము పోవుచుండువాఁడను. బహు కార్యాంతరాసక్తుఁడను. కావున నిన్ను విచారించుకొనుట యందు లోపములు జరుగును.

క. అని పదునాలుగువేవురు, ఘనశూరులతోడ ననిచె ♦ ఖరు దండక కం దున దాఁ డుండఁగా శూర్పణఖయు వసియించె నతని♦పజ్జనుసుఖితన్. ౩౪

తాత్పర్యము

(అని పదునాలుగు వేలమంది గొప్ప శూరులతో ఖరుని దండకాటవికిఁ బంపెను. అందతఁడుండఁగా నాతని యొద్ద శూర్పణఖ కూడ సుఖముగానుండెను.)

౨౫వ సర్గము

—♦ రావణుఁ డింద్రజిత్తుఁ జూడ నికుంభిలకుఁ బోవుట ♦—

తే. పంక్తివదనుండు దండకా♦వనము నేల, ఖరుని నియమించి భగినికిఁ♦గరము ముదముఁ గూర్చి స్వస్థచిత్తుఁడై♦కొడుకుఁ జూడఁ, జనె నికుంభిలయను న ప♦వనమునకును.

తాత్పర్యము

(రావణుఁడు దండకారణ్యము నేలుటకు ఖరుని నియమించి చెల్లెలికి మిగుల సంతోషము గలుగఁజేసి 'పీడ వదలినదిరా' యనుచు సుఖముగ నుండుటకుఁ బడిన వాఁడయి, నికుంభిలయను తోఁటయందున్న కొడుకును జూచుటకుఁ బోయెను.)

తే. అచట యూపశతాకీర్ణ • మగుచుఁ జైత్య
శోభితం బయి కాంతిచే • సొంపుఁ గూర్చు
యజ్ఞమును జూచి యందు ని • జాత్మసుతుఁ గ
మండలు శిఖాధ్వజునిని మా • ర్తాండతేజు. ౯౩౩

అర్థములు. యూపశతాకీర్ణము=నూఱు యూప స్తంభములతో వ్యాపించినది. చైత్యశోభితంబయి=దేవాలయములతోఁ బ్రకాశించినదై, కమండలు శిఖాధ్వజునిని=కమండలువు శిఖయు దండము ధ్వజము గలవానిని, మార్తాండతేజున్=సూర్యునివంటి కాంతిగలవానిని, నికుంభిల యనునది లంకానగరమునకుఁ బశ్చిమ భాగముననుండు వనము. ఇంద్రజిత్తు దండకమండలుశిఖాధ్వజుఁ డనుటచే బ్రహ్మచర్యదీక్ష సూచితమేకాని యతఁడు బ్రహ్మచర్యాశ్రమమం దున్నాఁడని భావము గాదు. అగ్నిష్టోమాదియాగములందు బ్రహ్మచర్య ముపదిష్టము కావున దానిని స్మరించి చెప్పఁబడెను.

తాత్పర్యము

(అచట నూఱు యూప స్తంభములు గలిగి, దేవాలయములతోఁ బ్రకాశించు యజ్ఞమును జూచి యందు బ్రహ్మచర్య దీక్షబూని మిగులఁ దేజున వెలుగుఁచున్న కొడుకును.)

క. హరిణాజినధరుదిన్ భీకరునిం గని మేఘనాదుఁ • గౌఁగిట నిడి నా
వరతనయా! చెప్పుమ సమాచరితం బగు కార్య మేది • సకలంబనినన్. ౯౩౪

అర్థములు. హరిణాజినధరునిన్=జింక చర్మము ధరించినవానిని, భీకరునిన్=భయంకర కార్యము చేయువానిని, సమాచరితంబు=చేయఁబడునది.

తాత్పర్యము

(జింక చర్మము ధరించి భయంకర కార్యము చేయుచున్న మేఘనాదునిఁ జూచి కౌగిలించుకొని నయనా! నీవు చేయుచున్న కార్యమేమి, యంతయు వివరముగాఁ జెప్పుము అని యడుగఁగా.)

సీ. శుక్రుండు పలికె నీ•సుతుఁడు రాక్షసరాజ!, జన్నముల్ పెక్కింటిఁ•జలిపినాఁడు
కైగలి గోమిధ మగ్నిష్టోమ వైష్ణవ, రాజసూయంబులు • వాజమేధ
మునదక్షిణాలతోడఁ•బొవరించినాఁడు దుష్కరముమహేశ్వరా•ధ్వర మొనర్చి
ప్రత్యక్షమైన శ్రీ•భవుచేత నీ సుతుం, డద్భుతవరముల • నందినాఁడు
ఆ. గగనచరము కామ•గంబు గ్రనునం బగు, దివ్యరథ మొకండు • భవ్యమైన
తామసీసమాఖ్య•దారుణమాయయుఁ, గాంచినాఁడు తేజ•మించినాఁడు. ౯౩౫

అర్థములు. జన్నముల్=యజ్ఞములు, దుష్కరము=చేయంగష్టమైనది, శ్రీభవుచేత=ఈశ్వరుచే, గగనచరము=ఆకాశమున దిరుగునది, కామగంబు=

కోరినట్లు పోఁగలది, ధ్రువంబు=దృఢమైనది, తామసీసమాఖ్య=తామసి యను పేరు గలది, దారుణ మాయ=భయంకరమైన శక్తియు, ఈ తామసీ విద్యచేతనే కానరాకుండ యుద్ధము చేయఁగలుగుట, తామసి=చీఁకటికి సంబంధించినది, ఈ విద్య తన్ను సాధించిన వానిని, చీఁకటిలో నుండు వానిని వెలుతురులో నుండు వానికిఁ గానరాకుండునట్లును తనలో నుండు వానికి, వెలుతురులో నుండు వారందఱు గానవచ్చునట్లును జేయునట్లు చేయఁగలదు. కావునఁ దామసి యనిపేరు,

తాత్పర్యము

ఇంద్రజిత్తు మౌనము వహించియుండుటచే శుక్రుఁ డిట్లు చెప్పెను. రాక్షసరాజా! నీకొడుకు పెక్కు యజ్ఞములు చేసినాఁడు. గోమేధము, అగ్నిష్టోమము, వైష్ణవము, రాజసూయము, అశ్వమేధము మొదలగునవి దక్షిణలతోడఁ జేసినాఁడు. ఎవరికిని సాధ్యముగాని మహేశ్వర యాగము చేసి శివుఁడు ప్రత్యక్షము కాఁగా నాయనచే నాశ్చర్యకరమైన వరములఁ బొందినాఁడు. ఆకాశమునఁ దన యిష్టప్రకారము తిరుగఁగల దృఢమైన రథమును తామసి యను విద్యను సంపాదించినాఁడు. అధిక తేజస్సు గలవాఁడైనాఁడు.

క. ఆ మాయాబలమున సం ◆ గ్రామంబున నితఁడు దిరిగి ◆ గగనచరుండై
శ్రీశుహిత సురాసురులకు, నేమాడ్కిని గానరాక ◆ యేఁచుం బరులన్. ౫౩౬

తాత్పర్యము.

ఆ విద్యాశక్తిచే యుద్ధమందు దేవదానవులకైనఁ గానరాక యాకాశమునఁ దిరుగుచు యుద్ధమున శత్రువులఁ బీడింపఁగలఁడు.

క. తూణంబు లక్షయము లగు, బాణంబులఁ బూర్ణములు న ◆ పరభేద్యం బో
బాణాసన మస్త్రం బరి, ప్రాణంబుల నపహరింపఁ బటుశక్తం బౌ ౫౩౭

తాత్పర్యము

ఎన్నితీసినను తరిగిపోని బాణములుగల పొదులును, ఇతరులకు భేదింపరాని విల్లు అస్త్రము శత్రువులఁ జంప శక్తిగల దగును.

క. ఈవరముల నన్నిటి నో, రావణ! సుతుఁడు గాంచెఁ ◆ గ్రతువును బూర్ణం
బై వెలసి నీవు వచ్చుట,కై వేచియున్నవాఁడ ◆ ననుడు నతండున్.

తాత్పర్యము

(రావణా! యీ వరముల నన్నిటిని నీకొడుకు పొందెను. యజ్ఞముకూడఁ బూర్తి యైనది. మీ కొఱకు వేచి యున్నాఁడని చెప్పఁగా నతఁడు.)

ఉ. దీనను మేలు లేదు మన ♦ ద్వేషుల నింద్రముఖామరాదులన్
మానితరీతి భక్తిని స♦మంచితవస్తువులన్ యజింతురే?
మైనది యేమొ యయ్యో నది ♦ యైనను మేలె నిజంబు పోదమా
మానిలయంబుఁ జేర బుధ ♦ మండలమండన రండు తోడుతన్. ౫౩౯

అర్థములు. ఇట్లు శుక్రాచార్యుఁడు చెప్పఁగా రావణుఁ డిట్లనుచున్నాఁడు. ద్వేషులన్ = విరోధులను, ఇంద్రముఖామరాదులన్ = ఇంద్రుఁడు మొదలగు దేవతలను.

తాత్పర్యము

ఈ యజ్ఞములవలన మేలు నాకేమియుఁ గనఁబడదు. మనము తపస్సుచేసి బ్రహ్మాదుల మెప్పించి యిష్టసిద్ధులు పొందవలయును గాని మన విరోధులగు నింద్రుఁడు మొదలగు దేవతలను భక్తి గౌరవములతో మంచి పదార్థములచేఁ బూజింపవచ్చునా? కడచినదేమో కడచినది. అదియు నొకవిధమున మేలే. ఇఁక నింటికిఁ బోదము, మీరును వచ్చెదరా!

తే. అనుచు దశకంఠుఁడు విభీష ♦ ణాత్మజాత
సహితుఁడై పోయి బాష్పముల్ ♦ జాలువాఱు
కనులవారిని నాసీత ♦ కంజముఖులఁ
బుష్పకమునుండి దింప న ♦ వ్వావ్వఁబోండ్లు. ౫౪౦

అర్థములు. విభీషణాత్మజాతసహితుఁడై = విభీషణునితోడను కొడుకుతోడను, జాలువారు = ప్రవహించు, ఆసీత = తేఁబడిన, కంజముఖులన్ = స్త్రీలను, పువ్వుబోండ్లు = స్త్రీలను.

తాత్పర్యము

(అనుచు రావణుఁడు విభీషణునితోడను, కొడుకుతోడను, పోయి కన్నీళ్ళు కాలువలు గట్ట దుఃఖించుచున్నవారిని, దాను బలవంతముగాఁ దెచ్చిన స్త్రీలను విమానమునుండి క్రిందికి దింపఁగా, నా స్త్రీలు.)

**విభీషణుఁడు రావణునకు మధువు కుంభీనసి నపహరించిన వార్తఁ దెలుపుట**

చ. కనుఁగొని వారిపట్ల దశ ♦ కంఠుని కాంక్ష నెఱింగి ధర్మధీ
ఖని యగు నవ్విభీషణుఁడు ♦ కార్య మటయ్య యశోర్థవంశనా
శనకర కార్యముం జలుప ♦ జ్ఞాతులఁ జంపి యతెచ్చు మీ పరాం
గనలను వార లశ్రులను ♦ గార్పఁగఁ దేఁ దగు నయ్య నీ కిటుల్? ౫౪౧

అర్థములు. కాంక్ష = కోరిక, ధర్మధీఖని = ధర్మబుద్ధికి గని, యశ = కీర్తిని, అర్థ = ధనమును, వంశ = వంశమును, నాశనకర = నాశముచేయు, కార్యమున్ = పనిని,

జ్ఞాతులన్=ఈ స్త్రీల బంధువులను, యథేచ్ఛము=ఇష్టప్రకారము, వరాంగనలను=ఇతర స్త్రీలను, అశ్రులను గార్పఁగన్=ఏడుచుచుండఁగా.

తాత్పర్యము

ఆ స్త్రీలనుజూచి వారిని జెఱుచుటకై రావణుఁడు తెచ్చెనని వాని యభిప్రాయముఁ దెలిసికొని ధర్మబుద్ధికి స్థానమైన విభీషణుఁ డిట్లనియె. ఈ స్త్రీలుకన్నీరు గాఱ నేడుచుచుండఁగా వీరి బంధువులఁ జంపి నీ యిష్టమువచ్చిన ట్లీల తెచ్చితివి. కీర్తిని ధనమును వంశమును నాశముచేయు నిట్టిపనివి నీవు చేయవచ్చునా?

ఉ. ఈ నవలాల చుట్టముల ♦ నీవు వధించి హరించి నట్లు నిన్
మానసమందుఁ గైకొనక ♦ మత్తుఁడు బల్మి హరించి యేగెఁ గుం
భీనసి నా మధుం డనిన ♦ వింశతిలోచనుఁ డిద్ది యేదియో
నే నెఱుఁగన్ మధుం డెవఁడు ♦ నీవ వచింపు మటన్నఁ గ్రుద్ధుఁడై. ౫౮౨

అర్థములు. నవలాల=స్త్రీలయొక్క, క్రుద్ధుడై=కోపించినవాఁడై.

తాత్పర్యము

ఈస్త్రీల బంధువులఁ జంపి హరించి వీరిని నీవు తెచ్చినట్లు నిన్ను మనస్సున లక్ష్యముసేయక మదించినవాఁడు మధు డనువాఁడు బలాత్కారముగ మన కుంభీనసిని హరించికొని పోయెను. అనిన, గుంభీనసి యెవతె, నే నెఱుఁగను. మధుఁ డెవ్వఁడు? వీ రెవ్వరో నీవే చెప్పు మనన విభీషణుఁడు కోపించినవాఁడై.

క. నీనలువుపాపము ఫలము, చేనేతన దాపరించెఁ ♦ జెప్పెద వినుమా
యాసురవర్యుఁడు ప్రాజ్ఞుఁడు, భాసురచరితుండు మాల్య♦వంతుం డనఁగన్. ౫౮౩

అర్థములు. చేనేతన=ఈచేతఁజేసిన నాచేతన, వెంటనే=దాపరించెన్=కలిగెను, ఆసురవర్యుఁడు=రాక్షస సమూహములందు శ్రేష్ఠుఁడు, ప్రాజ్ఞుఁడు=బుద్ధిమంతుఁడు, భాసురచరితుండు=కీర్తిచేఁ బ్రకాశించు నడవడి గలవాఁడు.

తాత్పర్యము

నీవు చేసిన పాపముల ఫలము వెంటనే కలిగెను ఎట్లనుచేని చెప్పెద వినుము. రాక్షసులందు శ్రేష్ఠుఁడును బుద్ధిమంతుఁడును కీర్తిచేఁ బ్రకాశించువాఁ డగు మాల్యవంతుఁ డొకఁడు కలఁడు.

సీ. అన్న మాతామహుఁ ♦ డైన సుమాలికి, మనతల్లికిని శ్యేష్ఠ♦జనకుఁ డతఁడు
కావున మనతాత ♦ యావీరు పుత్రిక, యనల యా యమకుఁ బ్రి♦యాత్మజాత
కుంభీనసీనామ్ని ♦ కూఁతురు మనచెల్లి, చెల్లెలికిని మన♦చెల్లెలె కద
నన్నలికి వచ్చెను యిప్పు ♦ డేనియు నవ్వాలి?, పెండ్లికి నెదిగిన♦చిన్న పడుచు

తే. యజ్ఞ మొనరించు చుండె నీ • తనూజుండు, నీళ్ళలోపల నుంటి నే • నియతిఁ బూని
కుంభకర్ణుండు నిద్దురఁ • గూరి యుండెఁ, గాన నీమంత్రివరుల రా • క్షసులఁ ద్రుంచి.

అర్థములు. మాతామహుఁడు=తల్లికిఁ దండ్రి.

తా త్ప ర్య ము

ఆ మాల్యవంతుఁ డెవఁ డనఁగా మన తల్లిదండ్రియగు సుమాలికి నన్న, మన తల్లికిఁ బెదతండ్రి కావున మనకుఁ దాత, ఆయన కూఁతురి పేరనల, కావున మన తల్లికిఁ జెల్లెలు, ఆమెకూఁతురు కుంభీనసి యను పేరుగలది, కావున మనతల్లి చెల్లెలి కూఁతురు (చూ.వ.౯౩) అట్లగుటచే మనకును జెల్లెలే కద. ఇప్పుడైన బంధుత్వము నీ మనస్సునకు వచ్చెనా? ఆ చిన్నది పెండ్లికి నెదిగిన వయస్సుగలది. నీమంత్రుల రాక్షసులఁ జంపి దానిని మధుఁడు బలవంతముగా నెత్తికొనిపోయెను. అప్పుడు ఇంద్రజిత్తు యజ్ఞదీక్ష వహించి యుండెను. కుంభకర్ణుఁడు నిద్రపోవు చుండెను. నేను నీళ్ళలో మునిఁగి జపము చేయుచుంటిని.

క. నీ యంతఃపురమున ని • ద్రాయుతలై యుండుదాని • రమణిని మధుఁడ
త్యాయతమదమునఁ గొని చనె, ధీయుత మే మతనిఁ జంప • దివురము శాంతిన్.

అర్థములు. నిద్రాయుతలై=నిద్దురగూడినదియై, అత్యాయతమదమునన్=విస్తారమైన గర్వముచే,ధీయుత=బుద్ధిమంతుఁడా! శాంతి వహించి మే మతని జంప యత్నించిన వారముగాము.

తా త్ప ర్య ము

నీ యంతఃపురమందే నిద్రించుచున్న సుందరిని కుంభీనసిని మధుఁడు మిగులఁ బొగరునఁ దీసికొనిపోయెను. తరువాతనైన మీ రేల పోయి యతని జంపరైరందు వేమో. వాఁడు దానిని జెఱచిన పిమ్మట వానిని జంపిన లాఁగల లాభమేమి? దానిని మరియొకఁడు కోరఁడు విధవయై యుండవలసి వచ్చును. ఒక యాఁడబిడ్డ విధవను నీవు చేసితివి. మేము దీనిని నట్లులే చేయవలయునా యని శాంతివహించి వానిని జంపిన వారముగాము.

ఉ. కన్నియ నర్థిఁ దైన యొక • కాంతున కిచ్చుట యోగ్యకార్య మా
కన్నియతోడఁ బుట్టులకుఁ • గాని యయో! యటువంటియావి నా
పున్నెము గల్గుభాగ్య మది • పొల్లువడెం జుమి, త్వత్కృతాఘమే
యిన్నటి దాపరించె నిపు • డే, వృథ పోవునె ఘోరపాపముల్. ౫౮

అర్థములు. పొల్లువడెన్=వ్యర్థమైపోయెను. త్వత్కృతాఘమే = నీవు చేసిన పాపమే, ఇన్నటిన్ = ఈవిధముగా.

తాత్పర్యము

కన్నియను నగిన వరునకిచ్చుట యీ చిన్నదాని తోడఁబుట్టిన వారికిఁ దగిన కార్యము. దానివలన కన్యాదాన ఫలము లభించును గాని నీవు చేయు పాపమువలన నట్టి పుణ్యము లభింపక పోయెను. అట్టి దానకార్యము లభింపక పోయెను. నీవు చేసిన పాపములు ఫలము వెంటనే లభించెను. ఘోరపాపములు దుష్టఫలములఁ జూపకపోవునా?

— *రావణుఁడు మధునిమీఁదికి దండయాత్ర పోవుట* —

సీ. అనుచు నాత్మీయమ•హాఘంబునను, బీడి తుండయి సంత ప్త•తోయధిగతి
 నై న్యేశుతోడ నా•స్యదనం బిప్పుడ, సిద్ధంబు సేయింపు•సేన లతి ర
 యంబున నాలుగు వే•లక్షౌహిణుల నిప్డ, కదలింపుమీ కుంభ•కర్ణుఁడాది
 గాఁగల రక్షః ప్ర•కాండముల్ యానాళి,పై నెక్కి వా రిప్డు•పంక్తికంఠ

తే. నిర్భయుని మధు వధయించి•నిర్జరాల, యంబు గెలువంగ నరిగెద•ననుచుఁ గ్రోధ
 దీప్తుఁడై పల్కి మంత్రియుఁ•దీవరించి, నిఖిలసేనలతోడఁ దా•నిర్గమించె. ౫౪౭

అర్థములు. ఆత్మీయ=తనయొక్క, మహాఘంబునను = గొప్పపాపముచే, పీడితుండయి=బాధింపఁబడినవాఁడై, సంతప్తతోయధిగతిన్=తపించిన సముద్రమువలె, స్యందనము=రథము, పంక్తికంఠనిర్భయునిన్ = రావణుని వలన భయములేనివానిని, రావణుఁడనిన భయములేని వానిని, నిర్జరాలయంబు=స్వర్గము క్రోధదీప్తుఁడై=కోపముచే మండుచున్న వాఁడై, తీవరించి=వేగిరపడి,నిర్గమించె= బయలువెడలెను.

తాత్పర్యము

అని చెప్పఁగా బడబానలముచేఁ దపించు సముద్రమువలెఁ దన మహాపాపంబుచేఁ బీడితుండై సేనానాయకునితో నిట్లనియె. నీవిప్పుడే నాతేరు సిద్ధము సేయుము. నాల్గువేల యక్షౌహిణీసేనలను వేగముగాఁ బ్రయాణము సేయింపుము. కుంభకర్ణుఁడు మొదలగు రాక్షస శ్రేష్ఠులు వాహనములపై వత్తురు, ఇప్పుడే రావణుఁడనిన భయములేని మధుని సంహరించి స్వర్గము జయింపఁబోయెదనని కోపముచే మండుచు బలుకఁగా మంత్రియుఁ ద్వరపడి సమస్త సేనలతో బయలుదేఱెను.

చ. చనియెను మేఘనాదుఁడు వె•సన్ బలఁగంబులమున్న మధ్యమం
 దును దశకంఠుఁడుం జనియె•దోర్బలఘూర్ణుఁడు కుంభకర్ణుఁడున్
 వెనుదెసఁ గాచె సేనల,వి•భీషణుఁ డుండెను లంకయందు తోఁ
 చినఘనధర్మకార్యములు•సేయుచుఁ, బోయిరి తక్కి రెల్లరున్. ౫౪౮